ఈనాడు

విజయవాడ 10-5-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 270
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


ALLEN NEET (UG) 2024 Results validated by
Official result validator
EY
Shape the future with confidence
ALLEN
One Year, One Goal, Victory in NEET
PRE-MEDICAL
13 AIR 1
In last 15 years in pre-medical entrance
AIIMS (MBBS)
660
ALLENites out of 2207 in AIIMS (2024)
GMCs (MBBS)
10450+
ALLENites secured their seat in Govt. Medical Colleges (2024)
ALLEN
ALLEN Made it Possible - South India Students Now in Govt. Medical Colleges - NEET UG 2024
Shailaja S 2-Year Classroom Student 715/720 JIPMER Puducherry
Shravan Y P 2-Year Classroom Student 710/720 AIIMS Bhubaneswar
Tarun v 2-Year Classroom Student 705/720 AIIMS Bhubaneswar
Tahira Kutub 2-Year Classroom Student 705/720 AIIMS Bhopal
Pranati J 4-Year Classroom Student 705/720 AIIMS Raipur
Vishwajit R P 2-Year Classroom Student 705/720 JIPMER Puducherry
Mithil Bafna 2-year Classroom Student 705/720 SETH GS Medical College
Aayush S 6-Year Classroom Student 705/720 AIIMS Raipur
Shankar K S 1-Year Classroom Student 702/720 Madras Medical College
Shrijith S 5-Year Classroom Student 701/720 AIIMS Raipur
Aayushka Lodha 2-Year Classroom Student 700/720 Bangalore Medical College
Badri Prakash 2-Year Classroom Student 700/720 Madras Medical College
Aadhil Ahmed 1-Year Classroom Student 700/720 Madras Medical College
Sneha E 4-Year Classroom Student 700/720 AIIMS Mangalagiri
Nishchal Jha 7-Year Classroom Student 700/720 AIIMS Bhubaneswar
Vishaal P R 2-Year Classroom Student 700/720 Madras Medical College
Vrinda Nayak 4-Year Classroom Student 700/720 Bengaluru Medical College
C M Menakshi P 4-Year Classroom Student 699/720 AIIMS Mangalagiri
Akanksha V 4-Year Classroom Student 696/720 Bengaluru Medical College
Navya S 2-Year Classroom Student 695/720 Madras Medical College
Chaitanya L K 4-Year Classroom Student 695/720 Bengaluru Medical College
Shrivanth R S R 4-Year Classroom Student 695/720 Madras Medical College
K Surya 2-Year Classroom Student 695/720 Madras Medical College
Sashi Kiran R R 2-Year Classroom Student 695/720 Bengaluru Medical College
and many more...
NEET UG 2024 - 1025 MBBS SELECTIONS
ADMISSIONS OPEN 2025-26
NEET (UG) | JEE (Main+Adv.) | Olympiads | Class 6th to 12th & 12th Pass
NEET UG REPEATER BATCHES : 15 MAY ONWARDS
For test dates & course start dates visit website or nearest center.
Special Fee Benefit on Walk-In
Separate Hostel Facility for Boys and Girls
Breakthrough Stories of Comeback with ALLEN Classroom Students.
140 680 2023 2024 MARKS Aswath D Stanley Medical College
170 688 2023 2024 MARKS Anirudh K P R Stanley Medical College
486 695 2023 2024 MARKS Jeevanadham K Madras Medical College
514 700 2023 2024 MARKS Aadhil Ahmed Madras Medical College
*Subject to the scholarship rules and the T&Cs.
ALLEN
Hyderabad Center
99029 01234
allen.ac.in/hyderabad
Vijayawada Center
99125 14555, 83413 77828
ALLEN Kota Center
0744-3556677
allen.ac.in
Disclaimer: We provide an academic ecosystem and environment to prepare students for their target examinations. Studying in a coaching institute does not guarantee selection for the examination. Selection depends on preparation, admission seats in competitive exam and the number of applicants appearing. All the students mentioned are part of paid courses.



ఈనాడు



విజయవాడ 10-5-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 270
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పాక్‌కు మళ్లీ భంగపాటు

26 ప్రాంతాల్లో డ్రోన్ దాడుల్ని తిప్పికొట్టిన భారత్


దిల్లీలో శుక్రవారం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠీ, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్‌లతో సమావేశమైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ

- విమానాశ్రయాలు, సైనిక కేంద్రాలపై ప్రయోగించినవి నిర్వీర్యం
- శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్, అవంతీపొరా ఎయిర్‌బేస్ సురక్షితం
- మూడోరోజూ దద్దరిల్లిన సరిహద్దు
- పంజాబ్, కశ్మీర్‌లలోని నగరాల్లో బ్లాకౌట్
- చొరబాట్లకు యత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల హతం
- ప్రాదేశిక సైన్యం సేవల వినియోగానికి అనుమతి
- త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ
- భద్రతపై అమిత్ షా, రాజ్‌నాథ్ సమీక్షలు
- సరిహద్దు గ్రామాల జనం ఇళ్లలోనే ఉండాలని ఆదేశాలు
- పాక్ మనపైకి పంపిన 300-400 డ్రోన్లు తుర్కియే దేశానివే
- పౌర విమానాలే రక్షణ కవచంగా పాక్ దుశ్చర్యలు

సరిహద్దు ఉద్రిక్తతలపై కథనాలు 6, 7 పేజీల్లో

జమ్మూ/శ్రీనగర్, దిల్లీ

దాయాది దేశం పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో శుక్రవారం పగటిపూట కాస్త ప్రశాంతత నెలకొన్నా చీకటి చిక్కబడిన తర్వాత మరోసారి భారత్‌పై దుస్సాహసానికి ఒడిగట్టింది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపైకి వరసగా డ్రోన్లు పంపింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని పంపిన డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా నిర్వీర్యం చేసి సత్తా చాటుకుంది. డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడాలనే ప్రయత్నాన్ని గురువారమే సైన్యం తిప్పికొట్టగా ఏమాత్రం బుద్ధి మారని పాక్ మరోసారి విఫలయత్నం చేసి, చేతులు కాల్చుకుంది. జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించింది. బారాముల్లా జిల్లాలో పాక్ డ్రోన్లను సైన్యం పేల్చివేస్తుంటే ఆకాశమంతా వెలుగులు కనిపించాయి. సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబు పేలుళ్లు వినిపించడంతో అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. ఆ మేరకు ప్రజలకు సూచనలు జారీ అయ్యాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్మూ, సాంబ జిల్లాల్లో ఫిరంగులతో భారీగా శత్రుమూకలు విరుచుకుపడ్డాయి. వాటితోపాటు పఠాన్‌కోట్, ఉధంపుర్, నగ్రోటా, జైసల్మేర్, అఖ్నూర్ ప్రాంతాలపైకి పాక్ పంపిన 50 డ్రోన్లను భారత ఆర్మీ కూల్చేసింది. శ్రీనగర్ ప్రజలకు ముందు జాగ్రత్తలు చెప్పడానికి మసీదుల్లోని లౌడ్ స్పీకర్లను వాడాల్సి వచ్చింది. జమ్మూ డివిజన్ ఉధంపుర్‌లో పూర్తిగా బ్లాక్ అవుట్ పాటించారు. ఆ ప్రాంతంలో భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. జమ్మూ, అఖ్నూర్, జైసల్మేర్, హరియాణాలోని అంబాలా, పంచ్‌కుల, పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్, అమృత్‌సర్, హోశియార్‌పుర్, మోగా, జలంధర్, ఫజిల్కా సహా పలు సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

అటువైపు భారీ నష్టం?

పూంఛ్, రాజౌరీ, ఉరీ సెక్టార్లలో దాడుల్ని భారత సైన్యం తిప్పికొట్టినప్పుడు పాక్‌కు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని (మిగతా 2లో)


భారత గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో శుక్రవారం రాత్రి జమ్మూ గగనతలంలో పేలిపోతున్న పాకిస్థాన్ డ్రోన్లు

అగ్నివీరుడా వందనం

యుద్ధ క్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ



ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై పోరాటం

జమ్మూ కశ్మీర్‌లో అమరుడైన మురళీనాయక్

శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాలో విషాదం

3లో





లోపలి పేజీల్లో


తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదుట ఆక్టోపస్ పహరా


అధికారులతో కలిసి హంద్రీ నీవా కాలువ విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

జులైలోగా

హంద్రీ నీవా విస్తరణ

- ఆ నెల 10న నేనే వచ్చి నీరు విడుదల చేస్తా
- ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమలో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు
- సీఎం చంద్రబాబు వెల్లడి
- వైకాపా ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని ధ్వజం
- ఉరవకొండ నియోజకవర్గంలో పనుల పరిశీలన

ఈనాడు - అనంతపురం, న్యూస్‌టుడే- ఉరవకొండ: హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు సాకారమైతే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విస్తరణ పనులను జులైలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. 770 కిలోమీటర్ల పొడవుతో ఆసియాలోనే అతి పెద్దదైన హంద్రీ నీవాకు ఎన్టీఆర్ శ్రీకారం చుడితే.. తాను ముందుకు తీసుకెళ్లానన్నారు. గతంలో బచావత్ అవార్డు కింద కేటాయింపు ఉన్న ప్రాంతానికి మాత్రమే నీరు అందించేవారని.. మిగులు జలాలు వాడుకునే హక్కును గుర్తించి హంద్రీ నీవా, గాలేరు-నగరి పథకాలకు శ్రీకారం చుట్టింది తెదేపానే అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి శుక్రవారం (మిగతా 2లో)

ఇదీ సంగతి!



సోషల్‌మీడియా సైనికులు బాగా పోరాడుతున్నారు సార్. మనదే గెలుపు.. నిశ్చింతగా ఉండండి!!



3 కొత్త విమాన సర్వీసులు

- విశాఖపట్నం-అబుదాబి, విశాఖ-భువనేశ్వర్, విజయవాడ-బెంగళూరులకు
- పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం: రాష్ట్రం నుంచి మూడు కొత్త విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కల అయిన 'కనెక్టెడ్ ఆంధ్రప్రదేశ్'ను సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జూన్ 2 నుంచి విజయవాడ-బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తాయని తెలిపారు. వాటి ద్వారా ఏపీ రాజధాని నుంచి ఐటీ హబ్ బెంగళూరుకు సులువుగా చేరుకోవచ్చన్నారు. జూన్ 12 నుంచి విశాఖ-భువనేశ్వర్ సర్వీసు ప్రారంభం కానుందని ప్రకటించారు. రెండు తూర్పు తీర నగరాల మధ్య వాణిజ్య, పర్యాటక, సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి ఈ సర్వీసు దోహదపడుతుందని స్పష్టం చేశారు.



విశాఖపట్నం - అబుదాబి అంతర్జాతీయ సర్వీసు జూన్ 13 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇండిగో సంస్థ ద్వారా వారానికి నాలుగు రోజుల పాటు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దీనిద్వారా యూఏఈతో పాటు ఇతర దేశాల్లోని ప్రవాసాంధ్రులకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు.



డ్రగ్స్‌కు బానిసగా యువ వైద్యురాలు

ముంబయి డీలర్లతో నేరుగా లావాదేవీలు

ఏడాదిలో రూ.70 లక్షల కొకైన్ ఆర్డర్

వైద్యురాలు, డెలివరీ చేసిన వ్యక్తి అరెస్టు

ఈనాడు, హైదరాబాద్- రాయదుర్గం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు బానిసగా మారిన ఓ యువ వైద్యురాలు.. ముంబయిలోని డీలర్లతోనే నేరుగా లావాదేవీలు నిర్వహించింది. వాట్సప్‌లో ఆర్డర్ పెట్టి తెప్పించుకుంటోంది. ఇలా ఏడాదికాలంలో ఏకంగా రూ.70 లక్షల విలువైన కొకైన్ తెప్పించింది. ఈసారి రూ.5 లక్షల విలువైన 53 గ్రాముల కొకైన్ ఆర్డర్ పెట్టి తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీజీఎన్‌ఏబీ), రాయదుర్గం పోలీసులకు దొరికి పోయింది. ఆమెతోపాటు డ్రగ్స్ తీసుకొచ్చిన నిందితుడు చిక్కాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న శుక్రవారం ఈ వివరాలు వెల్లడించారు. నగరంలోని షేక్‌పేటలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న వైద్యురాలు(34) తరచూ ధానేకు వెళ్లేవారు. అక్కడే ఒక పబ్బులో డీజే పరిచయమయ్యాడు. అతడి ద్వారా వైద్యురాలు క్రమంగా మాదకద్రవ్యాలకు అలవాటుపడింది. ప్రముఖ కుటుంబానికి చెందిన ఆమె.. డీజే ద్వారా ముంబయికి చెందిన డ్రగ్స్ దందా చేసే వంశ్ ఠక్కర్‌తో పరిచయం పెంచుకుంది. అతడికి వాట్సప్ ద్వారా ఆర్డర్ చేసి తెప్పించుకుంటోంది. ఇటీవల రూ.5 లక్షల విలువైన కొకైన్‌ను వంశ్ తన అనుచరుడు, డెలివరీ బాయ్‌గా పనిచేసే బాలకృష్ణ రామ్ ప్యార్(38) ద్వారా నగరానికి పంపించాడు. సమాచారం అందుకున్న టీజీ న్యాబ్ పోలీసులు నిఘా పెట్టారు. గురువారం సాయంత్రం రాయదుర్గం చౌరస్తా వద్ద.. కారులో ఉన్న ఆమెకు సరకును అందజేస్తుండగా టీన్యాబ్, రాయదుర్గం పోలీసులు వారిని అరెస్టు చేశారు. 53 గ్రాముల కొకైన్, రెండు ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వాట్సప్ గ్రూపులో ప్రముఖులు, వ్యాపారవేత్తల పిల్లలు కూడా..

వంశ్‌తో సంప్రదింపులు జరిపేందుకు ఒక వాట్సప్ గ్రూపు ఉంది. ఈ గ్రూపులో ప్రముఖులు, వ్యాపారవేత్తల పిల్లలు కూడా ఉన్నారు. డ్రగ్స్ అవసరమున్నప్పుడు గ్రూపులో వంశ్‌కు ఆర్డర్ పెడతారు. అతడు... తన అనుచరుడు బాలకృష్ణను హైదరాబాద్ పంపించి వారి నుంచి డబ్బు వసూలు చేయిస్తాడు. తిరిగి ముంబయికి వెళ్లి వంశ్‌కి డబ్బులు ఇచ్చి.. డ్రగ్స్‌ను తీసుకుని హైదరాబాద్‌లో డెలివరీ చేస్తాడు. ఈ వాట్సప్ గ్రూపులో ఎవరెవరు ఉన్నారు.. ఎంతకాలంగా ఈ దందా సాగుతుందో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పెడ్లర్ వంశ్‌ని నిందితుడిగా చేర్చారు. మాదకద్రవ్యాలకు విపరీతంగా అలవాటుపడిన యువ వైద్యురాలి పరిస్థితి దారుణంగా ఉందని.. రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపాలని పోలీసులు నిర్ణయించారు.

వాషింగ్టన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్‌లో 'మండవ'కు జీవితకాల గౌరవ సభ్యత్వం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ మండవ బసవేశ్వరరావుకు వాషింగ్టన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్‌లో జీవితకాల గౌరవ సభ్యత్వం దక్కింది. గురువారం బాల్టిమోర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అకడమిక్ ప్రెసిడెంట్ ఫ్రెడ్రిక్ చేతుల మీదుగా ఆయన ఈ సభ్యత్వాన్ని అందుకున్నారు. మండవ రాసిన 481 పరిశోధన పత్రాలు ప్రపంచ ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ గౌరవ సభ్యత్వం మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తికి లభించడంతో కృష్ణా వర్సిటీ ప్రొఫెసర్లు పలువురు బసవేశ్వరరావును అభినందించారు.



సభ్యత్వ పత్రాన్ని అందుకుంటున్న మండవ బసవేశ్వరరావు

ఏపీపీఎస్సీ కార్యాలయంలో గ్రూప్-1 మూల్యాంకనం

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2023 నోటిఫికేషన్) ప్రధాన జవాబుపత్రాల మూల్యాంకనం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో చేపట్టారు. విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల జాబితా నుంచి ఎంపిక చేసిన వారు ఈ విధులకు హాజరవుతున్నారు. పకడ్బందీగా ఈ మూల్యాంకనం జరిగేలా ఏపీపీఎస్సీ చర్యలు తీసుకుంది. 45 రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తిచేయాలని కమిషన్ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా.. ఈ నెల 3న మొదలైన ఈ పరీక్షలు శుక్రవారంతో సజావుగా ముగిశాయని ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

పాక్‌కు మళ్లీ భంగపాటు



పాకిస్థాన్ సైన్యం శతఘ్నులు, మోర్టార్లతో కాల్పులు జరపడంతో ఉరీ సెక్టార్‌లో ధ్వంసమైన ఇల్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. మరో సరిహద్దు రాష్ట్రమైన రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో గగనతల దాడులకు పలుమార్లు హెచ్చరికలు జారీ అయ్యాయి. పాక్ నుంచి వస్తున్న డ్రోన్లను గాల్లోనే మన వ్యవస్థలు పేల్చేశాయి. పోఖ్రాన్‌లోనూ సైరన్లు మోగించి విద్యుత్తు నిలిపేశారు. జోధ్‌పుర్, బాడ్‌మేడ్, శ్రీగంగానగర్ వంటిచోట్ల పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. ఈ రాష్ట్రంలోని ఐదు సైనిక స్థావరాలపై పాక్ దృష్టి పడటంతో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. కశ్మీర్ లోయలోనూ బ్లాకౌట్ పాటించారు. ఇళ్లలోనే ఉండాలని, లైట్లు ఆపేయాలని పోలీసులు సూచించారు. జమ్మూలో, దక్షిణ కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. జమ్మూ, సాంబా, పఠాన్‌కోట్ జిల్లాల్లో డ్రోన్లను గుర్తించి కూల్చివేసినట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉధంపుర్, నగ్రోటాల్లోనూ డ్రోన్లకు ఇదే గతి పట్టించారు.

దీటుగా బదులిచ్చాం

చీకట్లో దొంగదెబ్బ కొట్టడానికి పాకిస్థాన్ గురువారం రాత్రి వేర్వేరు రూపాల్లో చేసిన అన్ని ప్రయత్నాలకు దీటుగా జవాబిచ్చినట్లు భారత సైన్యం ప్రకటించింది. పశ్చిమ సరిహద్దులో డ్రోన్లు, మందుగుండు సామగ్రితో విరుచుకుపడిన పాక్‌కు తగిన రీతిలో సమాధానం లభించిందని తెలిపింది. జమ్మూలో పాక్ సరిహద్దు ద్వారా మన దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల్ని సైన్యం మట్టుబెట్టింది. పాక్ ప్రయోగించిన ఫిరంగి గుళ్ల వల్ల పుంఛ్ జిల్లాలో ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. పెద్దశబ్దాలతో పేలుళ్లు సంభవించగా వెంటనే సైరన్లు మోగించి, విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. విమానాశ్రయాలు, కీలకమైన ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచారు. అత్యవసర వ్యవస్థల పనితీరును కేంద్రం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. అవసరమైతే ప్రాదేశిక సైన్యం (టీఏ) సేవల్ని వినియోగించుకునేందుకు కేంద్ర సర్కారు అనుమతి మంజూరు చేసింది. రాష్ట్రాల్లో, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఆస్తులకు, ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా మరిన్ని చర్యలు తీసుకున్నారు. ప్రజలు తమ ఇళ్లలోనే ఉండాలని, బాల్కనీల్లోకి రావద్దని చండీగఢ్‌లో సైరన్లు మోగించారు. దిల్లీలో పలుచోట్ల సైరన్లతో హెచ్చరించే వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో కనీసం 24 విమానాశ్రయాల్లో ఈ నెల 15 వరకు పౌర విమాన సర్వీసుల రాకపోకలను నిలిపివేశారు. చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లుధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, బఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బీకానేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేసినట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘా పెంచారు. బాంబు నిర్వీర్యక దళాలతో తనిఖీలు కొనసాగుతున్నాయి.



పాకిస్థాన్ సైన్యం శతఘ్నులు, మోర్టార్లతో కాల్పులు జరపడంతో బారాముల్లా జిల్లాలో ధ్వంసమైన దుకాణం

సీనియర్ అధికారులతో సమాలోచనలు

జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్), కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరళ్లు, హోంశాఖ సీనియర్ అధికారులతో అమిత్‌షా భేటీ అయ్యారు. సరిహద్దులో, విమానాశ్రయాల్లో భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు యత్నించిన పాక్ ఉగ్రవాదుల్ని గురువారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తించి వారిలో కనీసం ఏడుగురిని మట్టుపెట్టినట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని పేర్కొంది. వారి చొరబాటుకు వీలుగా పాక్ రేంజర్లు ధన్‌ధార్‌లోని గస్తీ శిబిరం నుంచి కాల్పులు జరుపుతుండటంతో దానినీ, అక్కడి ఒక బంకర్‌ను మన దళాలు ధ్వంసం చేశాయి. సరిహద్దుల్లో శత్రు దేశానికి చెందిన పలు సైనిక శిబిరాలను మన దళాలు ధ్వంసం చేశాయి. దానికి సంబంధించిన వీడియోను భారత సైన్యం విడుదల చేసింది. ట్యాంకు విధ్వంసక క్షిపణులతో వీటిని ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

త్రివిధ దళాధిపతులతో మోదీ సమావేశం

సైనిక ఘర్షణల వేళ ప్రధాని నరేంద్ర మోదీ త్రివిధ దళాల అధిపతులతో శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. దీనిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ పాల్గొన్నారు. సరిహద్దులోని తాజా పరిస్థితిని సమీక్షించారు. సరిహద్దు రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, పంజాబ్ ముఖ్యమంత్రులతో ఫోన్‌లో మోదీ మాట్లాడారు. త్రివిధ దళాల మాజీ అధిపతులతో సహా పలువురితో ఆయన మాట్లాడారు. అంతకుముందు రాజ్‌నాథ్ సింగ్ సైనిక ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. వీరిలో త్రిదళాధిపతి అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాల అధిపతులు ఉన్నారు. ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ముందస్తు చర్యలు చేపట్టాయి.

గగనతలాన్ని మూసివేయని దాయాది దేశం

"పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్-పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు. పాక్ దాడులకు స్పందనగా ఆ దేశానికి చెందిన నాలుగు గగనతల రక్షణ వ్యవస్థలపై మన సైన్యం సాయుధ డ్రోన్లతో దాడి జరిపిందని, వాటిలో ఒకటి ఎయిర్ డిఫెన్స్ రాడార్‌ను నాశనం చేసిందని వివరించారు. కాంధాన్, ఉరీ, పుంఛ్, మెంధర్, రాజౌరీ, ఉధంపూర్‌లలో పాక్ శతఘ్నుల దాడుల్లో మన సైనికులకు కొంత నష్టం వాటిల్లిందని, మన ఎదురుదాడిలో పాక్‌కు ఎక్కువ నష్టం కలిగిందని చెప్పారు.

చండీగఢ్‌లో సైరన్లు

చండీగఢ్‌లో ఉదయం మళ్లీ ఎయిర్ సైరన్ శబ్దాలు వినిపించాయి. పాక్ నుంచి దాడులు జరిగే అవకాశం ఉందంటూ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ హెచ్చరించింది. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని, బాల్కనీల్లోకి కూడా రావొద్దని తెలిపింది. పంచ్‌కుల, మొహాలీ, పటియాలా, అంబాలాలోనూ ఇదే విధమైన హెచ్చరికలు చేశారు. జమ్మూలోనూ సైరన్లు మోగాయి. తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో పేలుడు శబ్దాలు వినిపించడంతో నగరాన్ని బ్లాకౌట్ చేశారు. జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతాల్లో పాక్ దాడులన్నింటినీ భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది.

■ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) నుంచి పాక్‌కు రుణ మంజూరును భారత్ గట్టిగా వ్యతిరేకించింది. ఆ నిధుల్ని పాకిస్థాన్ తీవ్రవాదుల కోసం వాడొచ్చని అభ్యంతరం పెట్టింది. ఆ తర్వాత ఐఎంఎఫ్ 100 కోట్ల డాలర్ల రుణం ఇవ్వడానికి అంగీకరించిందని పాక్ ప్రధాని కార్యాలయం ప్రకటించింది.



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హవేలీ కహుతా జిల్లాలో దాడుల్లో ధ్వంసమైన తమ నివాసాన్ని చూసుకుంటున్న స్థానికులు

డ్రోన్ దాడుల్లో పాత్రలేదు: పాక్

ఇస్లామాబాద్: భారత్‌లోని పఠాన్‌కోట్, జైసల్మేర్, శ్రీనగర్ సహా పలు ప్రాంతాల్లోకి తమ డ్రోన్లు వెళ్లి దాడి చేశాయన్న వార్తల్ని పాకిస్థాన్ ఖండించింది. ఇదంతా బాధ్యతారాహిత్యమైన ప్రచారమని, ఇది ప్రాంతీయ శాంతికి ప్రమాదకరమని పాక్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. "భారత 'ప్రమాదకర తీరు'ను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా పరిగణించాలి. సంయమనం పాటించాల్సిందిగా, బాధ్యతతో మెలగాల్సిందిగా భారత్‌కు చెప్పాలి. సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. కవ్వింపులు, బెదిరింపులు, తప్పుదోవ పట్టించే సమాచారానికి బెదిరిపోయేది లేదు. వీటిపై స్పందించే హక్కు మాకు ఉంది. భారత్ జరిపిన దాడికి తగురీతిలో సమాధానం ఇచ్చేదాకా ఉద్రిక్తతల నివారణ సాధ్యంకాదు" అని చెప్పింది.

■ పాక్ దళాల కాల్పుల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఇటీవలి కాలంలో ఇలా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 18కి చేరింది.

పలుమార్లు పాక్ చొరబాటు



విక్రం మిస్రీ

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. పాక్ ప్రయత్నాలను మన దళాలు వమ్ము చేశాయని మిస్రీ చెప్పారు. ప్రార్థన స్థలాలపై దాడులు చేసి దానికి భారత సైన్యంపై నిందలు మోపడం పాక్ దుష్టపన్నాగానికి నిదర్శనమన్నారు. ప్రస్తుత పరిస్థితికి మతం రంగు పులిమేందుకు పొరుగుదేశం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నంకానా సాహిబ్ గురుద్వారాపై డ్రోన్ దాడికి భారత్ గురిపెట్టిందన్న ఆరోపణలు పచ్చి అబద్ధమని తోసిపుచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కర్తార్‌పుర్ సాహిబ్ నడవాను మూసివేశామని చెప్పారు. మన సైనిక స్థావరాలే లక్ష్యంగా పశ్చిమ సరిహద్దుప్రాంతంలో పాకిస్థాన్ సైన్యం భారత గగనతలాన్ని అనేకమార్లు ఉల్లంఘించినట్లు వ్యోమికా సింగ్ తెలిపారు. నియంత్రణ రేఖతోపాటు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీ ఆయుధాలతో దాడులకు పాల్పడ్డారని చెప్పారు. 36 ప్రాంతాల్లో చొరబాటుయత్నాల కోసం 300-400 డ్రోన్లు ఉపయోగించారని, మన సైన్యం అనేక డ్రోన్లను కూల్చిందని చెప్పారు. డ్రోన్ శిథిలాలపై ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. తుర్కియేకు చెందిన 'అసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలిసిందన్నారు.



వ్యోమికా సింగ్



సోఫియా ఖురేషీ

ఏపీఎండీసీ అదనపు జీఎం జోసెఫ్ బదిలీ

గతంలో తెదేపా నేతలపై పోస్టులు పెట్టిన వ్యక్తికి పోస్టింగే కారణం!

ఈనాడు, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)లో మానవ వనరుల విభాగం అదనపు జనరల్ మేనేజర్ డి.జోసెఫ్‌ను విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి మధ్యప్రదేశ్‌లోని సులియారీ బొగ్గు ప్రాజెక్టుకు బదిలీ చేశారు. ఈ మేరకు సంస్థ ఎండీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం జోసెఫ్.. ప్రధాన కార్యాలయంలో మానవ వనరులతో పాటు, లీగల్, ఐటీ విభాగాలు కూడా చూస్తున్నారు. వాటన్నింటి నుంచి తప్పించి బదిలీ చేశారు. గత ప్రభుత్వంలో మైన్స్ విభాగం మేనేజర్‌గా వెన్నపూస అశోక్‌రెడ్డి ఒప్పంద ప్రాతిపదికన ఏపీఎండీసీలో చేరారు. ఉద్యోగం చేస్తూనే ఆయన గతంలో వైకాపాకు మద్దతుగా, తెదేపా అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ తదితరులపై సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంగా అనేక పోస్టులు పెట్టారు. కొద్ది నెలల కిందట అశోక్‌రెడ్డి ఉద్యోగ ఒప్పంద గడువు ముగియగా పునరుద్ధరించలేదు. మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఆ పోస్టుకు ఇంటర్వ్యూ జరపలేదు. దీనిపై అశోక్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టులో ఏపీఎండీసీ తరపున న్యాయపరమైన అంశాలను పర్యవేక్షించాల్సిన జోసెఫ్.. అశోక్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. అందుకే అశోక్‌రెడ్డికి నెల రోజుల కిందట మళ్లీ పోస్టింగ్ ఇవ్వాల్సి వచ్చింది. ఈ విషయాలు ఉన్నతాధికారులు, సీఎం కార్యాలయం దాకా వెళ్లడంతో జోసెఫ్‌ను బదిలీ చేసినట్లు సమాచారం.

జులైలోగా హంద్రీనీవా విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద హంద్రీ నీవా విస్తరణ పనులను పరిశీలించారు. అక్కడే ప్రజావేదికపై మాట్లాడారు. 'ఒకప్పుడు అనంతపురం జిల్లాలో వేరుసెనగ తప్ప మరో పంట కనిపించేది కాదు. 10 సార్లు పంట పెడితే రెండుసార్లే చేతికొచ్చేది. అలాంటి పరిస్థితుల్లో మొట్టమొదటగా తెదేపా ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించింది. డ్రిప్ విధానం తీసుకొచ్చాక చాలామంది రైతులు ఉద్యాన పంటల సాగులో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు. ఇక్కడి రైతులకు నీరందిస్తే బంగారం పండించగలరు. అందుకే హంద్రీ నీవాకు అత్యంత ప్రాధాన్యమిచ్చి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాం. మొదటి ఫేజ్‌లో 10 మీటర్ల నుంచి 16.5 మీటర్లకు వెడల్పు చేయడంతో పాటు రెండో ఫేజ్‌లో లైనింగ్ చేపట్టాం. వెడల్పు, విస్తరణ కారణంగా కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరుగుతుంది. 5 నెలల్లో పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. వచ్చే నెలాఖరుకు మొదటి దశ పనులు పూర్తి చేస్తాం. జులై 10న మళ్లీ నేనే వచ్చి నీరు విడుదల చేస్తా. దీంతోపాటు సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి నీటిని రాయలసీమకు తరలించేందుకు పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు చేపడతాం. దీనికి రూ.81 వేల కోట్లు అవసరం. అయినా వెనకడుగు వేయకుండా ముందుకెళ్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

రూ.3,873 కోట్లతో పనులు

హంద్రీ నీవాలో 554 కి.మీ. మేర లైనింగ్, వెడల్పు పనులకు మొత్తం రూ.3,873 కోట్లు కేటాయించినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫేజ్-1లో రూ.696 కోట్లు, ఫేజ్-2లో రూ.1,256 కోట్లతో పనులు చేపట్టామన్నారు. పుంగనూరు బ్రాంచ్ కాలువకు రూ.480 కోట్లు, కుప్పం బ్రాంచ్ కాలువకు రూ.197 కోట్లు కేటాయించి పనులు చేపట్టామన్నారు. పనులు పూర్తయితే ఫేజ్-1లో కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, నంద్యాలలో 2,906 ఎకరాలు, అనంతపురంలో 1.18 లక్షల ఎకరాలు, ఫేజ్-2లో అనంతపురం జిల్లాలో 33,617 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 1.93 లక్షల ఎకరాలు, వైఎస్సార్ జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరులో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. మొత్తంగా 6.02 లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో హంద్రీ నీవాకు రూపాయి కూడా ఖర్చు చేయలేదని సీఎం విమర్శించారు. అభివృద్ధితో పాటు పెద్దఎత్తున సంక్షేమం అందిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. 63 లక్షల మందికి రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. పింఛన్లకే ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. దీపం పథకం కింద 3 సిలిండర్లు ఇస్తున్నామని. . సిలిండర్లకు బదులుగా ఖాతాలో నగదు జమ చేసే ఆలోచనలో ఉన్నామని చంద్రబాబు వెల్లడించారు.



హంద్రీ నీవా కాలువ విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, తదితరులు

ప్రకటించిన గంటలోనే జీవో తెచ్చారు: పయ్యావుల

హంద్రీ నీవా విస్తరణ పనులు సీఎం చంద్రబాబు పుణ్యమే అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయిన తర్వాత పామిడి వచ్చారని.. అక్కడే హంద్రీ నీవా విస్తరణ చేపడుతున్నట్లు ప్రకటించారన్నారు. సమావేశం ముగిసిన గంటలోనే జీవో విడుదల చేసిన ఘనత ఆయనదేనన్నారు. అప్పట్లోనే 37 శాతం పనులు పూర్తి చేశామన్నారు. అధికారంలోకి వస్తే మూడు నెలల్లోనే పనులు మొదలుపెడతామని ఉరవకొండలో జలదీక్ష చేసిన జగన్.. సీఎం అయ్యాక గంపెడు మట్టి కూడా తీయలేదని ధ్వజమెత్తారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో జలవనరుల రంగాన్ని విధ్వంసం చేసిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. రాయలసీమలో సాగునీటి పథకాలకు తెదేపా ప్రభుత్వం రూ.12,441 కోట్లు వెచ్చిస్తే. . వైకాపా ప్రభుత్వం రూ.2,011 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. హంద్రీనీవా పథకం విద్యుత్తు బిల్లులను కూడా చెల్లించకుండా బకాయి పెట్టిందని మండిపడ్డారు.

దేశాన్ని రక్షించే శక్తి మోదీకే ఉంది

పాకిస్థాన్ తీరుతో దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని చంద్రబాబు పేర్కొన్నారు. ఉగ్రవాదులు భార్యాబిడ్డల ఎదుటే పౌరులను చంపారని.. అందుకు ప్రతి చర్యగా ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత ఆర్మీ ఉగ్ర స్థావరాలపై దాడి చేసి ఉగ్రవాదులను హతమార్చిందన్నారు. దేశాన్ని రక్షించే శక్తి ప్రధాని మోదీకి తప్ప ఇంకొకరికి లేదని స్పష్టం చేశారు. అంతకుముందు కశ్మీర్‌లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్ ఆత్మ శాంతించాలని సీఎం, మంత్రులు, సభకు హాజరైన వారందరూ మౌనం పాటించారు.

గ్రహం అనుగ్రహం

10–5–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, శుక్లపక్షం
త్రయోదశి: సా. 4-59 తదుపరి చతుర్దశి
చిత్త: రా. 2-51 తదుపరి స్వాతి
వర్జ్యం: ఉ. 9-11 నుంచి 10-57 వరకు
అమృత ఘడియలు: రా. 7-47 నుంచి 9-33 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-33 నుంచి 7-15 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.34; సూర్యాస్తమయం: సా.6.17
స్మార్త నృసింహ జయంతి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	42.0	28.0
సూర్యాపేట	41.0	30.5
రాజమహేంద్రవరం	40.5	26.0
ఆదిలాబాద్	40.3	25.7
నిజామాబాద్	40.2	26.3
కర్నూలు	40.1	27.2
నెల్లూరు	39.7	26.7
అనంతపురం	39.2	23.6
విజయనగరం	39.0	27.0
విజయవాడ	38.3	26.4
తిరుపతి	38.0	29.0
గుంటూరు	38.0	28.0
తాడేపల్లిగూడెం	37.5	27.0
ఒంగోలు	37.5	24.5
విశాఖపట్నం	37.4	25.8
శ్రీకాకుళం	36.0	26.0
నరసాపురం	36.0	25.4

అగ్నివీరుడా వందనం..

• యుద్ధ క్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ

గోరంట్ల, న్యూస్‌టుడే: 'ఆపరేషన్ సిందూర్'లో తెలుగుబిడ్డ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో దేశమాత కోసం పోరాడుతూ నేలకొరిగాడు. మారుమూల తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మురళీ నాయక్ (25)కు చిన్నతనం నుంచి సైన్యంలో చేరాలని కోరిక. అదే మక్కువతో కష్టపడి ఆర్మీలో చేరారు. కొద్ది రోజులుగా జమ్మూ కశ్మీర్ సరిహద్దులో సేవలు అందిస్తూ గురువారం అర్ధరాత్రి పాక్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. మురళి స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండా. తండ్రి శ్రీరాంనాయక్, తల్లి జ్యోతిబాయి. మురళికి చిన్నతనం నుంచి దేశభక్తి ఎక్కువని.. అందుకే రైల్వేలో వచ్చిన ఉద్యోగాన్ని కూడా వదిలి ఆర్మీలో చేరారని గ్రామస్థులు, బంధువులు తెలిపారు. 2022 డిసెంబరులో గుంటూరులో జరిగిన ఎంపిక ప్రక్రియలో అగ్నివీర్‌గా సెలెక్ట్ అయ్యారు. తొలుత పంజాబ్, అస్సాంలలో పనిచేసినట్లు తండ్రి శ్రీరాంనాయక్ చెప్పారు రెండున్నరేళ్ల సర్వీసు పూర్తికావడంతో మరో ఏడాదిన్నరలో అగ్రిమెంట్ పూర్తి చేసుకుని వస్తాడని కలలుకంటున్న తల్లిదండ్రులు.. మురళి వీరమరణం గురించి తెలిసి దుఃఖసాగరంలో మునిగిపోయారు. తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏకైక సంతానం..

మురళి తల్లిదండ్రులు తమ ఏకైక కుమారుడిని ఉన్నత స్థాయిలో చూడాలని ఆశించారు. ఇందుకోసం ఎన్ని కష్టాలకైనా సిద్ధమై పనుల కోసం ముంబయికి వెళ్లారు. అక్కడ తండ్రి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి ఇళ్లలో పనులు చేస్తున్నారు. మురళిని నాగినాయని చెరువు తండాలో అమ్మమ్మ దగ్గర ఉంచి చదివించారు. మురళి పదో తరగతి వరకు సోమందేపల్లిలో, ఇంటర్మీడియట్, డిగ్రీ అనంతపురంలో పూర్తి చేశారు. శ్రీరాంనాయక్, జ్యోతిబాయి దంపతులు తండాలో మంగళవారం జరిగిన జాతరలో పాల్గొనడానికి ముంబయి నుంచి వచ్చారు. బంధువులు, సన్నిహితులతో ఆనందంగా గడిపారు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చిందని రోదిస్తున్నారు. 'పంజాబ్‌లో పని చేస్తున్నట్లు చెప్పాడే తప్ప జమ్మూ కశ్మీర్‌లో డ్యూటీ అని మాకు చెప్పనేలేదు' అని మురళి తండ్రి శ్రీరాంనాయక్ తెలిపారు. 'గురువారం ఉదయం మాతో వీడియో కాల్ మాట్లాడాడు. తాను బాగున్నానని చెప్పాడు. మేం ఎలా ఉన్నామని అడిగాడు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది' అంటూ బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు.




తల్లిదండ్రులతో ఆర్మీ దుస్తుల్లో మురళి ★ వీరజవాన్ తల్లిదండ్రులను ఓదార్చుతున్న మంత్రి సవిత

అగ్నివీర్: మురళీనాయక్
స్వగ్రామం: కళ్లితండా, గోరంట్ల మండలం, శ్రీసత్యసాయి జిల్లా
సైన్యంలో చేరింది: 2022 డిసెంబరు 29
పనిచేస్తున్న యూనిట్: 851 లైట్ రెజిమెంట్
తల్లిదండ్రులు: శ్రీరాంనాయక్, జ్యోతిబాయి
వృత్తి: దినసరి కూలీలు.

పెళ్లి చేయాలని.. ఇల్లు కట్టుకుని..

గారాబంగా పెంచుకుంటున్న కుమారుడికి పెళ్లి చేయాలనే యోచనతో తండాలో ఇటీవలే కొత్తగా ఇల్లు కట్టుకున్నారు. అతడి మరణవార్తతో ఇక తామెవరి కోసం బతకాలంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మురళీనాయక్ భౌతిక కాయం శనివారం కళ్లితండాకు చేరనుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అదేరోజు ప్రభుత్వ అధికార లాంఛనాలతో స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మంత్రి సవిత రూ. 5 లక్షల సాయం

మురళీనాయక్ వీరమరణం గురించి తెలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత శుక్రవారం తండాకు చేరుకుని ఆయన తల్లిదండ్రులను ఓదార్చారు. తనవంతు సాయంగా రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పకుండా ఆదుకుంటాయని భరోసా ఇచ్చారు. తండ్రి శ్రీరాంనాయక్ కోరిక మేరకు యువతకు స్ఫూర్తినిచ్చేలా తండాలోని వారి సొంత పొలంలో విగ్రహం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

రక్షణ సిబ్బంది గృహాలకు పంచాయతీల్లో ఆస్తిపన్ను మినహాయింపు

• మాజీ సైనికులు, ఆర్మీ సిబ్బందికే ఇప్పటివరకు రాయితీ
• పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో కూటమి ప్రభుత్వ నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పంచాయతీల్లో దేశ రక్షణ సిబ్బందికి చెందిన ఇళ్లకు ఆస్తిపన్ను మినహాయింపునిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ నిర్ణయం ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు మాజీ సైనికులు, విధుల్లో ఉన్న ఆర్మీ సిబ్బందికి మాత్రమే ఈ సౌలభ్యం ఉండేది. తాజా నిర్ణయం ప్రకారం.. మాజీ సైనికులతోపాటు విధుల్లో ఉన్న రక్షణ (డిఫెన్స్) సిబ్బంది, వారి జీవిత భాగస్వాముల పేర్లతో ఉన్న ఇళ్లకు ఆస్తిపన్ను మినహాయింపు వర్తించనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మాజీ సైనికులు, ఆర్మీ సిబ్బందికే ఆస్తిపన్ను మినహాయింపును పరిమితం చేయడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సంచాలకుని కార్యాలయం ప్రభుత్వానికి 2021 ఏప్రిల్ 15న లేఖ రాసింది. దాన్ని పరిశీలించిన ప్రభుత్వం.. 2003 నవంబరు 10న జారీచేసిన ఉత్తర్వులకు సవరణ చేసింది. ఆర్మీ స్థానంలో డిఫెన్స్ పదాన్ని చేర్చింది.

నిబంధనలివి..: ★ మాజీ సైనికులు, విధుల్లో ఉన్న రక్షణ సిబ్బంది, వారి జీవిత భాగస్వాముల్లో ఎవరైనా ఒకరికే ఆస్తిపన్ను మినహాయింపు లభిస్తుంది. భర్త, భార్య పేర్లతో రెండు ఇళ్లున్నా.. ఒకదానికే ఈ సౌకర్యం వర్తిస్తుంది. ★ ఒక గృహం ఎన్ని అంతస్తుల్లో ఉన్నా.. ఒకే డోర్ నంబరు ఉంటే పన్ను రాయితీ వర్తిస్తుంది. అందులో రక్షణ సిబ్బంది కుటుంబ సభ్యులు నివసిస్తూ ఉండాలి. అద్దెకు ఇవ్వకూడదు. ★ ఒక పంచాయతీలోని మొత్తం ఇళ్లలో 10 శాతానికిపైగా రక్షణ సిబ్బందికి చెందినవైతే.. అలాంటిచోట్ల ఆస్తిపన్నులో 50 శాతమే మినహాయింపు ఇస్తారు. 10% కంటే తక్కువ ఇళ్లున్న పంచాయతీల్లో 100% వర్తిస్తుంది.

మీ ఆవేదన తీర్చలేనిది.. ధైర్యంగా ఉండండి

• మురళీనాయక్ కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశ రక్షణలో అమరుడైన జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాంనాయక్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఫోన్‌లో పరామర్శించారు. 25 ఏళ్ల వయసులో మాతృభూమి కోసం ప్రాణాలర్పించి అమరుడైన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని వారితో అన్నారు. "మీ ఆవేదన తీర్చలేనిది. అయినా ధైర్యంగా ఉండండి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా అండగా ఉంటాం" అని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. అంతకుముందు మురళీ మృతిపై ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

మురళి మృతి కలచివేసింది: గవర్నర్ అబ్దుల్ నజీర్

జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న ఆపరేషన్ సిందూర్‌లో జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందడంపై గవర్నర్ అబ్దుల్ నజీర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి తీవ్రంగా బాధించిందన్నారు.

జాతి మరిచిపోదు: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని భారత జాతి ఎన్నటికీ మరిచిపోదు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. వీరజవాన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది.



శ్రీసత్యసాయి జిల్లా పర్యటన ముగించుకొని తిరుగుప్రయాణంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయంలో వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

అండగా నిలుస్తాం: మంత్రి లోకేశ్

మురళీనాయక్ చూపిన ధైర్యసాహసాలు అందరికీ గర్వకారణం. ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తాం. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తాం.

తీవ్రంగా బాధించింది: మాజీ సీఎం జగన్

మురళీనాయక్ వీరమరణం తీవ్రంగా బాధించింది. యుద్ధ భూమిలో దేశం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం మనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. ఈ దుఃఖ సమయంలో ఆయన కుటుంబానికి తోడుగా నిలుస్తాం.

ఆవేదన తీర్చలేనిది: భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

మురళీనాయక్ త్యాగాన్ని దేశం మొత్తం గుర్తుపెట్టుకుంటుంది. వీరజవాన్ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిది.

మురళి త్యాగం చిరస్మరణీయం: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మురళీనాయక్ వీరమరణం తీవ్రంగా కలచివేసింది. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన మురళీలాంటి వీరజవాన్ల త్యాగం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

దిగ్భ్రాంతి చెందా: తెలంగాణ సీఎం రేవంత్

దేశ సరిహద్దులో చొరబాటుదారుల కాల్పుల్లో ఏపీకి చెందిన జవాను మురళీనాయక్ వీర మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బాధిత కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుంది: కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

పాకిస్థాన్‌తో పోరాడే క్రమంలో తెలుగుబిడ్డ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవానుకు నివాళులర్పిస్తున్నాం. ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుంది.

విచారకరం: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

యుద్ధ భూమిలో మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం విచారకరం. దేశం కోసం వీర మరణం పొందారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

ఈనాడు

పాక్ తప్పుడు సమాచార యుద్ధం!

యుద్ధభూమిలో మొదట హత్యకు గురయ్యేది సత్యమే. ముఖ్యంగా మాటల్లో వదరుబోతుతనమే తప్ప ప్రత్యక్ష పోరులో గెలిచేంత సత్తా లేని అసమర్థులకు అబద్ధాలూ అభూతకల్పనలే ఆయుధాలవుతాయి. తమకు గిట్టని దేశవాసుల ఐక్యతను దెబ్బతీసే విద్వేషాగ్నులను రాజేయడం, నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి వైరిపక్షాన్ని బలహీనపరచడం వంటి కుతంత్రాల అమలులో ధూర్తులకు అవాస్తవాలే ప్రధాన పనిముట్లవుతాయి. ఆర్థిక బలసంపన్నతలో, సాయుధ బలగాల సాధన సంపత్తిలో ఇండియాతో పోటీపడలేని పాకిస్థాన్ ఇప్పుడు ఇలాగే అసత్యాలను వండివార్చడంలో తలమునకలైంది. పహల్గాం పాశవిక దాడికి ప్రతిస్పందనగా 'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్రవాద శిబిరాలను ఇండియా నేలమట్టం చేయడంతో దాయాది దేశం కుతకుతలాడిపోతోంది. వాస్తవాధీన రేఖకు సమీపంలో సామాన్య ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులకు తెగబడుతూనే సామాజిక మాధ్యమాల్లో గుప్పలకొద్దీ అబద్ధాలను ఎత్తిపోస్తోంది. భారత యుద్ధ విమానాలను కూల్చేశామని, సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నామని బొంకుతూ పాకిస్థాన్ చేస్తున్న సిగ్గుమాలిన సమాచార యుద్ధం పట్ల దేశవాసులందరూ అప్రమత్తంగా ఉండాలి!

ఉగ్రవాదులను ఉసిగొల్పి ఇండియాలో నెత్తుటేళ్లు పారించడం, ఆ కుట్రలను ఇండియా బయటపెట్టగానే తాను అమాయకురాలినంటూ గుండెలు బాదుకోవడం, పాశ్చాత్య దేశాల ముందు పంచాయతీ పెట్టి కశ్మీర్‌ను వివాదాస్పద ప్రాంతంగా చూపించడం... ఇవన్నీ పాకిస్థాన్ వెన్నతో పెట్టిన విద్యలు. పహల్గాం దారుణం తరవాత కూడా ఇస్లామాబాద్ ఇలాంటి వేషాలే వేసింది. కానీ- చైనా వంటి స్వార్థపరులు తప్ప మిగిలిన అంతర్జాతీయ సమాజమంతా దాన్ని ఛీకొట్టింది. ఆ ఉక్రోషంతో ఉడికిపోతున్న పాకిస్థాన్‌కు 'ఆపరేషన్ సిందూర్' పిడుగుపాటైంది. దాంతో పాకిస్థాన్ నేతాగణాలు, సైన్యం మద్దతు కలిగిన చాందసమూకలన్నీ కలిసి ఇండియాపై వ్యవస్థాగత విషప్రచారానికి దిగాయి. భారతదేశ నాయకత్వంపై, త్రివిధ దళాలపై కారుకూతలు కూస్తూ అవి వికృతానందం పొందుతున్నాయి. భారత విశ్రాంత సైనికాధికారుల పేర్లతో సోషల్ మీడియా ఖాతాలను తెరచి తప్పుడు సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తిలోకి తెస్తున్నాయి. పాకిస్థాన్ ప్రాయోజిత కట్టుకథలను కళ్లకద్దుకుని ప్రచురిస్తున్న చైనా, మరికొన్ని దేశాల మీడియా సంస్థలు- ప్రపంచం కళ్లకు గంతలు కట్టడానికి తమవంతు చిల్లర ప్రయత్నాలు చేస్తున్నాయి!

పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో కానీ పోవన్నది సామెత. పాపిష్టి పాకిస్థాన్‌కు ఇది నూటికి నూరుశాతం వర్తిస్తుంది. మూర్ఖ మతఛాందస భావజాలంతో కూడిన 'ద్విజాతి సిద్ధాంతం'లోంచి పుట్టుకొచ్చిన పాకిస్థాన్- ఆది నుంచే కుటిల కపట నాటకాలకు తెరతీసింది. జమ్మూకశ్మీర్‌ను కబళించేందుకు 1947లోనే అనాగరిక ముష్కర తండాలను ఎగదోసి, ఐరాస ముందు మాత్రం తెగ అమాయకత్వాన్ని ఒలకబోసింది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తాజాగా అదే విషయాన్ని ప్రస్తావిస్తూ, పచ్చిఅబద్ధాలాడటం పాకిస్థాన్‌కు కొత్తేమీ కాదని దీటుగా ఎండగట్టారు. ఇండియాను వ్యతిరేకించే నకిలీవార్తలను గుమ్మరించడానికి పాక్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆ దేశంలో పెద్ద వ్యవస్థే నడుస్తోందని అంతర్జాతీయ పరిశోధకులు ఏనాడో హెచ్చరించారు. భారతీయులను తప్పుదారి పట్టించే సమాచారాన్నే కాదు ఏకంగా ఫేక్‌ఫొటోలు, వీడియోలను సైతం పాక్ ఉన్మాదులు కోకొల్లలుగా సృష్టిస్తున్నారు. భారతావని అఖండతను చిన్నాభిన్నం చేసే కల్లబొల్లి కబుర్లను కావాలని వ్యాప్తి చేసే పాక్ అనుకూలశక్తులను గుర్తించి కటకటాల్లోకి పంపడం ప్రభుత్వాల వంతు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే సమాచారమంతటినీ నమ్మేయకుండా యుక్తాయుక్త విచక్షణను పాటిస్తూ ప్రజాభారతం పరిణతితో వ్యవహరించాల్సిన సందర్భమిది!



మనం ఉగ్రవాదులను మాత్రమే మట్టుబెట్టాలి. సామాన్య ప్రజలను కాదు. ఆ విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సైనిక ఆపరేషన్లకు వ్యూహరచన చేస్తారు. అందుకే వాటికి కొంచెం సమయం పడుతుంది.

– యోగేంద్ర సింగ్ యాదవ్

'పరమవీరచక్ర' పురస్కార గ్రహీత

తిరుమలేశుడికి అక్షరార్చన

సప్తగిరీశుడికి సారస్వత సమర్పణ చేసిన పరమ యోగిని- మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. మధుర భక్తిని, యోగతత్వాన్ని సమ్మిళితం చేసి, సరళ సుందరమైన ఆధ్యాత్మిక భావ పరంపరను వెంగమాంబ ఆవిష్కరించారు. వెంగమాంబ రచనల్లో వైవిధ్యం, వైరుధ్యం, వైశిష్ట్యం కన్పిస్తాయి. ప్రబోధాత్మకంగా, ఆత్మజ్ఞాన సమన్వితంగా సృజించిన భక్తి సాహిత్యం ఆమెది.

చిత్తూరు జిల్లా వాయల్పాడు సమీపంలోని తరిగొండలో 1730లో వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు కానల కృష్ణయామాత్యుడు, మంగమాంబ దంపతులకు వెంగమాంబ జన్మించారు. తరిగొండలోని లక్ష్మీ నృసింహస్వామి కటాక్షంతో తనకు కవిత్వం చెప్పడం అలవడిందని ఆమె సభక్తికంగా ప్రకటించారు. మదనపల్లెకు చెందిన రూపావతారం సుబ్రహ్మణ్య యోగి దగ్గర బ్రహ్మవిద్యను, యోగవిద్యను అభ్యసించారు. గురువు ప్రోత్సాహంతో వెంగమాంబ పద్దెనిమిది కృతుల్ని రచించారు. ఇందులో పద్యకావ్యాలు, ద్విపదలు, శతకాలు, యక్షగానాలు, సంకీర్తనలు, స్తోత్రాలు ఉన్నాయి. వరాహ, భవిష్యోత్తర, పద్మ పురాణాలలో ప్రస్తావించిన తిరుమల వైభవాన్ని శ్రీవేంకటాచల మహాత్మ్యం పద్యకావ్యంగా రచించారు. పదహారు వందల గద్య పద్యాలతో ఆరు ఆశ్వాసాలుగా ఈ గ్రంథం మధుర మనోజ్ఞంగా తిరుమల క్షేత్ర ప్రాశస్త్యాన్ని అభివర్ణించింది. కోటివరాల వేలుపు కోనేటిరాయుడి అవతారగాథను ఈ గ్రంథం లోకానికి విస్తృతంగా ప్రచారం చేసింది. రాజయోగామృత సారం పేరిట వెంగమాంబ రచించిన తాత్త్విక విషయాలు ఎంతో విశిష్టమైనవి.




అంతర్యామి

తరిగొండ వెంగమాంబ నాటి సమాజంలో ప్రబలంగా ఉన్న దురాచారాల్ని, నిబంధనల్ని ధిక్కరించారు. మహిళా సాధికారతకు, ఆత్మగౌరవానికి ఆమె సమున్నత ప్రతీక. ఆత్మ వివేచనతో, స్వయంశక్తి యుక్తులతో స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఎన్నో ప్రతికూలతలు ఎదురైనా, వాటిని అధిగమించి తిరుమల శ్రీవారి సేవలో తన జీవితాన్ని చరితార్థం చేసుకున్నారు. తరిగొండ నృసింహుడికి, తిరుమల శ్రీనివాసుడికి అభేదాన్ని పాటించారు వెంగమాంబ. తిరుమలలో నృసింహ నవరాత్రోత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసుడి దర్శనంకోసం తరలివచ్చిన భక్తులకు తానే అన్నదానం చేస్తూ... నిరతాన్నదాతగా ఖ్యాతిగాంచారు. అందుకే తిరుమలలో అన్నప్రసాద సత్రానికి వెంగమాంబ పేరు పెట్టారు.

తిరుమలేశుడికి ముత్యాల హారతి ప్రతినిత్యం సమర్పించే చివరి సేవ. ఈ సేవా కైంకర్యాన్ని తరిగొండ వెంగమాంబ ప్రారంభించారు. దశావతారాల స్వరూపాలను ఆణిముత్యాలతో పళ్లెరంలో పేర్చి, అలిమేలు మంగపతికి ఆమె మహా మంగళ నీరాజనాన్ని సమర్పించేది. ఆ సంప్రదాయమే తరిగొండ వెంగమాంబ ముత్యాల హారతిగా వర్ధిల్లుతోంది. 1817 ఈశ్వరనామ సంవత్సర శ్రావణ శుద్ధ నవమి నాడు తిరుమలలో పరమపదాన్ని అలంకరించారు వెంగమాంబ. ఆత్మజ్ఞానం, భక్తి చైతన్యం, సగుణోపాసనం- ఈ మూడింటి సమ్మేళనం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవన ప్రస్థానం!

– డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ

విశ్వంలో ఒంటరులం కాదా?



అంతులేని రహస్యాలు, అడుగడుగునా అద్భుతాల మయమైన విశాల విశ్వంలో మనం ఒంటరులమేమీ కాదని తేలిపోయే రోజు రానుందా? మన పాల పుంతలో మరే నక్షత్ర మండలంలోనైనా భూమి లాంటి గ్రహం మరొకటి ఉండకపోతుందా? అక్కడ జీవం లేకుండాపోతుందా? అని సాగిస్తున్న అన్వేషణలో శుభపరిణామమొకటి ఇటీవల చోటుచేసుకుంది.

సరిగ్గా ఏడాది కిందట నాసాకు చెందిన జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్ భూగోళానికి 124 కాంతి సంవత్సరాల దూరంలో, అంటే సుమారు ఏడు కోట్ల మైళ్ల దూరంలోని 'కే2-18బీ' గ్రహంపై దృష్టి సారించింది. అది నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్న తీరును తదేకంగా గమనించింది. దాని మీద ప్రసరించే కాంతిని విశ్లేషించడం ద్వారా అక్కడి వాతావరణంలోని కీలకమైన మూలకాల గుట్టు తెలుసుకుంది. వాటిని లోతుగా విశ్లేషించిన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు- 'కే2-18బీ' నివాస యోగ్యమైన గ్రహమని, అక్కడ జీవం ఉందనేందుకు గట్టి ఆధారాలు లభించాయంటూ ఇటీవల సంచలన ప్రకటన చేశారు. భూమ్మీద జీవులు మాత్రమే విడుదలచేసే వాయువుల జాడను అక్కడ గుర్తించడం చాలా ఆసక్తి రేకెత్తిస్తోంది. అదెంతవరకు నిజమయ్యే అవకాశముంది? దీని గురించి ఖగోళ శాస్త్రవేత్తలు ఏమంటున్నారు?

ఆసక్తి రేపుతున్న 'డీఎంఎస్'...

మన పాలపుంతలో సూర్యుడి లాంటి నక్షత్రాలు చాలానే ఉన్నాయి. వాటి చుట్టూ అనేక గ్రహాలు, ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యల్లో నిత్యం పరిభ్రమిస్తూనే ఉంటాయి. సౌర కుటుంబం ఆవల... ఇతర నక్షత్రాల చుట్టూ తిరిగే భూమి లాంటి ఆవాసయోగ్యమైన గ్రహాల అన్వేషణ కోసం 'నాసా' కెప్లర్ మిషన్‌ను చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద 2009లో పదో సిరీస్ ప్లానెట్ హంటర్ కెప్లర్(కే2) పని ప్రారంభించింది. అది కనుగొన్న 18వ గ్రహవ్యవస్థలో... ఎర్రటి మరుగుజ్జు నక్షత్రం చుట్టూ తిరుగుతున్న మొదటి గ్రహం ఖగోళ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. దీన్ని 'కే2-18బీ'గా పిలుస్తున్నారు. ఆ గ్రహంపై నీటి ఆవిరి ఉన్నట్లు హబుల్ స్పేస్ టెలిస్కోప్ 2019లో తొలిసారి గుర్తించింది! దాంతో అక్కడ నివాస యోగ్యమైన పరిస్థితులు ఉండొచ్చనే ఆశలు మొలకెత్తాయి. మరోవైపు, జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్ సైతం కే2-18బీ గురించి తీక్షణంగా శోధించసాగింది. శాస్త్రవేత్తలు ఇలాంటి గ్రహాల దగ్గరి వాతావరణాన్ని పరిశీలించేటప్పుడు, కీలకమైన 20 రకాల అణువులు అక్కడేమైనా ఉన్నాయేమో పరిశీలిస్తారు. అలా కే2-18బీ దగ్గర మీథేన్, కార్బన్ డై-ఆక్సైడ్ వాయువులు ఉన్నట్లు కనుగొన్నారు. ఈ పరంపరలో, భారత సంతతి బ్రిటిష్ శాస్త్రవేత్త నిక్కు మధుసూదన్ చేసిన తాజాప్రతిపాదన తీవ్ర సంచలనం సృష్టించింది. ఆయన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఆస్ట్రోఫిజిక్స్, ఎక్సోప్లానెటరీ ప్రొఫెసర్. మధుసూదన్ కే2-18బీని 'హైషియన్' గ్రహమని పేర్కొన్నారు. సముద్రంపై దట్టమైన హైడ్రోజన్ కలిగిన (హైడ్రోజన్+ఓషన్) గ్రహమని దీని అర్థం. ఇలాంటి గ్రహాల్లో భూమిపై కంటే లోతైన సాగరాలు, ఉపరితలంపై కిలోమీటర్లకొద్దీ హైడ్రోజన్ వాతావరణం ఉంటుంది. కే2-18బీ భూమి కంటే పరిమాణంలో 2.6 రెట్లు, ద్రవ్యరాశిలో 8.6 రెట్లు పెద్దది. అక్కడ చాలా వరకు నీరే ఉండి ఉంటుందనే అభిప్రాయాలు పరిశోధకుల్లో వ్యక్తమవుతున్నాయి. అది మన సౌర వ్యవస్థలోని నెప్ట్యూన్ లేదా యురేనస్‌ను పోలి పూర్తి శీతలంగా ఉండొచ్చని కొందరు... మొత్తం రాతి గ్రహమైనా కావచ్చని మరికొందరు విశ్లేషిస్తున్నారు. అయితే, ఇక్కడ ఆసక్తి కలిగిస్తున్న అంశం- జీవుల మనుగడకు అనువైన హైషియన్ వాతావరణం. ఈ వాదనను బలపరుస్తూ మధుసూదన్ బృందం రెండు కీలక వాయు మూలకాలను ప్రస్తావిస్తోంది. అందులో ఒకటి- డీఎంఎస్(డీమిథైల్ సల్ఫైడ్). రెండోది డీఎండీఎస్(డీమిథైల్ డైసల్ఫైడ్). ఇంతవరకు మానవాళికి తెలిసిన విజ్ఞానం ప్రకారం, ఈ రెండు వాయువులూ జీవసంబంధ ప్రక్రియల ద్వారానే విడుదలవుతాయి. భూ వాతావరణంలోకి సముద్ర బ్యాక్టీరియా, ఇతర జలచర జీవుల(మెరైన్ ఫైటోప్లాంక్టన్) నుంచి అధికంగా డీఎంఎస్ విడుదలవుతోంది. కే2-18బీపై ఈ వాయు సంకేతాలు కనిపిస్తున్నాయి కాబట్టి, అక్కడ సముద్రం, జీవుల ఆవాసానికి అనువైన వాతావరణం ఉండే ఉంటాయని కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కానీ, దీన్ని ధ్రువీకరించే ఆధారాలైతే ప్రస్తుతానికి లేవు.

జవాబు వెతకాల్సిన ప్రశ్నలెన్నో...

డీఎంఎస్ ఉత్పత్తి భూమ్మీద జరుగుతున్నట్టే సుదూర గ్రహంపైనా జరుగుతోందని ఎలా నిర్ధారణకు రాగలం? అక్కడి వాతావరణంలోని వివిధ వాయువుల మిశ్రమం వల్ల కూడా డీఎంఎస్ ఉత్పత్తి కావచ్చు కదా? అలాంటప్పుడు కేవలం వాయు సంకేతాల ఆధారంగానే కే2-18బీ మీద జీవం ఉందని ఎలా ధ్రువీకరించగలం?- అనే కీలక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అక్కడ డీఎంఎస్ ఉన్నట్లు మరింత కచ్చితంగా కనుగొనాల్సి ఉందని, పైగా హైడ్రోజన్ నిలకడగా ఉంటుందనే అంశాన్ని ఇప్పుడే చెప్పలేమనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. మధుసూదన్ బృందం మాత్రం జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్‌ను చాలాకాలం పాటు కే2-18బీ మీద కేంద్రీకరించామని, అక్కడ భూమ్మీద కంటే అధిక మొత్తంలో డీమిథైల్ సల్ఫైడ్ ఉండే అవకాశముందని గట్టిగా చెబుతోంది.

జీవం ఉనికి తెలుసుకోవడమెలా?

కే2-18బీ నివాస యోగ్యమైన గ్రహమనే సంకేతాలు ప్రాథమికంగా వెలువడుతున్నా, అనుమానాలూ అంతే స్థాయిలో వ్యక్తమవుతున్నాయి. అసలు అక్కడ సముద్రం ఉందని మొదట నిర్ధారించుకోవాలి. డీమిథైల్ సల్ఫైడ్ కచ్చితత్వంతోపాటు అది ఎక్కడి నుంచి వస్తోందో కనుగొనాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతలు అందుకు సరిపోవు. కాబట్టి, ఇప్పుడు శాస్త్రవేత్తలు లేబొరేటరీల్లో నెప్ట్యూన్ వంటి గ్రహ పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి, అందులో డీమిథైల్ సల్ఫైడ్ భూమ్మీద లాగే ప్రవర్తిస్తోందా అనేది తెలుసుకోవడానికి ప్రయత్నాలు ఆరంభిస్తున్నారు. ఇంకోవైపు, జీవుల నుంచి కాకుండా మరే విధంగానైనా డీఎంఎస్ తయారయ్యే అవకాశముందా అనేదీ కనుగొంటారట. ఒకట్రెండు సంవత్సరాల్లోనే ఈ సందేహాలన్నీ నివృత్తి అవుతాయని మధుసూదన్ అంటున్నారు. ఒకవేళ కే2-18బీ మీద జీవం ఉనికి నిజమేనని తేలితే- మానవుడి ఖగోళ శోధనలో అది మహాద్భుతమే అవుతుంది. గ్రహాంతర జీవుల అన్వేషణలో కీలక మైలురాయిగా నిలిచిపోతుంది.

– తమ్మిశెట్టి రఘుబాబు

కాసేపు తలెత్తితే...

ఉదయించే సూర్యుణ్ని చూసి ఎన్నాళ్లయింది. పోనీ నిండు చందమామని..? చిన్నప్పుడు ఏ చెరువులోనో, కోనేటి నీటిలోనో చిన్న రాయి విసిరి చందమామ ప్రతిబింబాన్ని చెల్లాచెదురు చేసిన జ్ఞాపకం ఉందా? ఎగిరే పక్షుల వంక చూస్తున్నారా? పిట్టల అరుపులు వింటున్నారా? మీ పాదాలకు మట్టి అంటుకుని ఎన్నేళ్లయింది? ఇక్కడ చెప్పిన ఏ పనులకూ డబ్బు అవసరం లేదు. అన్నీ ఉచితంగా లభించేవే. చేయాల్సిందల్లా కాస్త సమయం తీసుకుని ఆస్వాదించడమే. రెండు రోజులు పనిగట్టుకుని అవి చేసి చూడండి. అంతే కాదు, పనిలో పనిగా ఇరుగుపొరుగు వాళ్లను పలకరించండి. ఎన్ని కొత్త విషయాలు తెలుస్తాయో చూడండి. అయ్యో... ఇన్నాళ్లూ ఈ ఆనందాలన్నీ కోల్పోయామే... అనిపించకపోతే చెప్పండి. ఆ ఆనందాల్ని మనకి దూరం చేస్తోందెవరు?

చేతుల్లో మొబైల్ ఫోన్ పట్టుకుని, దాంట్లో తలదూర్చి బతుకుతున్న మనకి, మన తరవాతి తరానికి కూడా ఉచితంగా లభించే వాటి విలువ తెలుసుకోవాల్సిన సమయమిది. టీనేజ్‌లోనే ప్రేమాదోమా అంటూ ఏ ఇన్‌స్టాలోనో ఎవరినో ఏడిపిస్తున్న కుర్రాడు మన ఇంట్లోనే ఉండవచ్చు. ఆటను చూస్తూ ఆస్వాదించడం మర్చిపోయి, పందేల రాయుళ్లుగా మారి బతుకుల్ని, కుటుంబాల్ని నాశనం చేసుకుంటున్న కుర్రాళ్లు మన కాలనీలోనే ఉండవచ్చు. వాళ్లందరినీ వర్చువల్ ప్రపంచంలోంచి వాస్తవంలోకి తీసుకురావాలి. పొలాల్లో తమ చెమటచుక్కల్ని మెతుకులుగా మారుస్తున్న రైతులను చూపించాలి. ఎర్రటి ఎండని లెక్కచేయకుండా పనులు చేస్తున్న కార్మికులను



పరిచయం చేయాలి. ఒక్కసారి చూడగానే మార్పు రాదు. కానీ ఆలోచన మొగ్గ తొడుగుతుంది. దాన్ని కాపాడుతూ మన ప్రయత్నాల్ని కొనసాగించాలి. మొబైల్ వాడే సమయాన్ని మెల్లమెల్లగా కుదించుకుంటూ పోవాలి. ఫోను పక్కనపెట్టమంటే కోపం వస్తుంది. అలా కాకుండా ఆసక్తి కలిగించే ఒక ఆటో, వ్యాపకమో మొదలెడితే ఆటోమేటిగ్గా వాళ్లే ఫోన్ పక్కనపెట్టి వస్తారు. వీధిలో పదిమంది పిల్లలుంటే అందరినీ ఒకచోట చేర్చి ఆడించవచ్చు. గెలుపోటములను కాకుండా ఆటను ఎంజాయ్ చేస్తూ ఆడటం నేర్పాలి. ఆటలు ఆడాక ఆడిన అనుభూతిని నెమరేసుకుంటూ, ఎవరెలా ఆడారో మాట్లాడుకుంటూ పిల్లలు కొంత సమయం గడపడం గమనించారా? కావాల్సిందీ, జరగాల్సిందీ అదే. ఏకాంతం నుంచి సమూహం వైపు, తలదించి బతకడంలో నుంచి తల ఎత్తుకుని బతకడం వైపు ఈ తరాన్ని తీసుకొని వెళ్లడానికి అదొక మంచి ప్రయత్నం కాదూ!

అపార్ట్‌మెంట్లలో ఉండే పిల్లల్ని వాళ్లంతట వాళ్లే ఒక టీమ్‌గా సంఘటితమయ్యేలా ప్రోత్సహించాలి. పెద్దలు రోజుకొకరు వీలు కల్పించుకుని వారికి రకరకాల పోటీలు పెట్టవచ్చు. నృత్య సంగీత ప్రదర్శనలు ఇవ్వమనవచ్చు. సెలవులు అయిపోయేసరికి చెప్పుకోవడానికి వాళ్లకెన్నో చక్కటి అనుభూతులను కల్పించగల అవకాశాన్ని వృథా చేయకండి... లేవండి... పిల్లలతో జట్టు కట్టండి. కొత్త అనుభవాలను సొంతం చేసుకోండి. వాళ్లకు నేర్పుతూ మీరూ నేర్చుకోండి!

– డాక్టర్ సుంకర గోపాలయ్య

భారత్‌కు తిరుగులేదు!



పాకిస్థాన్ ఒక దుష్టదేశం. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న ఇస్లామాబాద్‌ను దీటుగా తిప్పికొట్టే శక్తిసామర్థ్యాలు మనకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచే పాక్‌కు సరైన గుణపాఠం చెప్పడానికి ఇండియా సిద్ధమవుతూ వచ్చింది. సమరాంగణంలో మన సత్తా తిరుగులేనిది. శక్తియుక్తులను పారించి యుద్ధంలో విజయం సాధించడంలో మనది అందె వేసిన చేయి. అలాగని పాకిస్థాన్ మౌనంగా ఉంటుందని అనుకోకూడదు. తన ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టని దేశమది. లేకపోతే అది తెలిసితెలిసి ఉగ్రనాగులను ఎందుకు పెంచి పోషిస్తుంది?

మేము సర్వీసులో చేరింది మొదలు పదవీ విరమణ పొందేవరకు సమర్థ ప్రణాళికలను, పటిష్ఠ వ్యూహాలను రూపొందించడంలో శిక్షణ పొందుతాం. ప్రతిదానికీ ప్లాన్- ఎ, బీ, సీ ఉంటాయి. అత్యవసర ప్రణాళికలు, మెరుపు దాడుల వంటివీ ఉంటాయి. అయితే, వీటిని అమలు చేయడానికి ఎందుకు సమయం పడుతుందో అందరికీ అర్థం కాదు. వాతావరణం అనుకూలించనప్పుడు విమానం ఎయిర్‌పోర్టులో దిగదు. ఈ విషయం ప్రయాణికులకు వెంటనే బోధపడదు కానీ, పైలట్‌కూ విమానయాన అధికారులకూ అర్థమవుతుంది. దాడుల విషయమూ అంతే. కాబట్టి, పౌరులంతా మన వ్యూహకర్తల మీద విశ్వాసం ఉంచాలి. సుశిక్షిత ప్రణాళికావేత్తల చేతుల్లో భారతదేశం సురక్షితంగా ఉంది.

వందల కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్న ప్రాంతాల్లోకి ఏకకాలంలో చొచ్చుకుపోవడం అంత సులభమేమీ కాదు. అయితే, దాడులకు అవసరమైన మేటి ప్రణాళికలు రూపొందించడానికి సమర్థవంతమైన సాఫ్ట్‌వేర్, ఏఐ టూల్స్ మన దగ్గర ఉన్నాయి. యుద్ధానికి అత్యుత్తమంగా సిద్ధమయ్యే అతికొద్ది దేశాల్లో మనమూ ఉన్నాం. రణరంగంలో విజయం సాధించడానికి మన దళాలు సిద్ధంగా ఉన్నాయి.



– దిలీప్ పట్నాయక్, విశ్రాంత ఎయిర్ మార్షల్

గేమింగ్ ఉచ్చులో యువత విలవిల

ఇటీవలి కాలంలో బ్యాంకింగ్ సేవల డిజిటలైజేషన్, గేమింగ్ రంగంలో ఎంతో వృద్ధి చోటుచేసుకుంది. ఫిన్‌టెక్ కంపెనీలు ఆన్‌లైన్‌లో తేలికగా అప్పులిస్తుంటే, గేమింగ్ యాప్‌లు రివార్డుల పేరుతో యువతను ఆకర్షిస్తున్నాయి. వీటిబారిన పడినవారు ఆర్థికంగా చితికిపోతున్నారు. రుణభారంతో విలవిలలాడుతున్నారు.



మన దేశంలో బ్యాంకింగ్ రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. అధునాతన సాంకేతికతలు అందుబాటులోకి రావడంతో డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలు గణనీయంగా పెరుగుతున్నాయి. మరోవైపు, ఇంటర్నెట్ వినియోగదారులు అధికమవుతున్నారు. ఫిన్‌టెక్ కంపెనీలు సులభ రీతిలో యువతకు డిజిటల్ రుణాలు అందజేస్తున్నాయి. 'బై నౌ-పే లేటర్' వంటి పథకాలతో ఆకట్టుకుని, అడిగిన వెంటనే డబ్బులు ఇచ్చేస్తున్నాయి. అయితే, ఈ రుణాల వెనకనున్న మతలబు ఏంటో చాలామందికి తెలియదు. రుణాలపై వడ్డీ రేట్లు, రకాల ఛార్జీలు, తిరిగి చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్ మీద పడే ప్రభావం వంటి విషయాలను వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

నేటి వినోదమే... రేపటి రుణ వలయం!

రిజర్వ్ బ్యాంకు నివేదికల ప్రకారం, డిజిటల్ రుణ యాప్‌లు శరవేగంగా వృద్ధి చెందుతున్నాయి. దేశంలో డిజిటల్ రుణ మార్కెట్ ఈ ఏడాది 35వేల కోట్ల డాలర్లకు పెరిగే అవకాశముందని రిజర్వ్ బ్యాంకు అంచనా! దేశంలో గత డిసెంబరులో యూపీఐ ద్వారా 1673 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. త్వరలోనే నెలకు సగటున 2500 కోట్ల లావాదేవీలు జరుగుతాయని అంచనా. ఈ డిజిటల్ చెల్లింపులను మూడురెట్లు పెంచాలని, తద్వారా ఇండియాను గ్లోబల్ డిజిటల్ చెల్లింపుల శక్తిగా మార్చాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ 'పేమెంట్స్ విజన్-2025'ను తీసుకొచ్చింది. దేశంలో సుమారు 59 కోట్ల మంది గేమింగ్ యాప్‌లను ఉపయోగిస్తున్నారని అంచనా. మొబైల్ ఫోన్లలో 1,120 కోట్లకు పైగా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ రంగం ఏటా సగటున 19.6శాతం వృద్ధిని నమోదుచేసి, 2029 నాటికి 80వేల కోట్ల వరకు చేరుతుందని 'ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్మెంట్ ఇన్నోవేషన్ కౌన్సిల్' నివేదిక విశ్లేషించింది. గేమింగ్ సంస్థలు యువత మరింత ఎక్కువ సమయం తమ యాప్‌లలో గడిపేలా ప్రేరేపిస్తున్నాయి. రివార్డులు, లాయల్టీ పాయింట్లు వంటివి అందిస్తుండటంతో అవసరం లేకపోయినా యువత వాటికి వృథాగా డబ్బు వెచ్చిస్తున్నారు. కొన్ని ఫిన్‌టెక్ కంపెనీలు గేమింగ్ కోసం ప్రత్యేకంగా అప్పులిస్తున్నాయి. అధిక వడ్డీ వసూలు చేస్తున్నాయి. పైకి కనిపించని ఖర్చులంటూ భారీగా దండుకుంటున్నాయి. చాలామంది విద్యార్థులు, యువకులు గేమింగ్ యాప్‌ల ద్వారా డబ్బులు సంపాదించవచ్చనే మాయలో పడి, అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఈ రుణాలను తిరిగి చెల్లించకపోతే తమ భవిష్యత్తు ఎలా ఉంటుందనే కనీస అవగాహన వారికి ఉండటంలేదు. డిజిటల్ రుణభారం యువతను మానసికంగా కుంగదీయడమే కాకుండా- చదువుల్లోనూ, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలోనూ వారిని వెనకబాట పట్టిస్తోంది.

బయటపడటం ఎలా?

డిజిటల్ రుణాలు ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయో యువతకు అవగాహన కల్పించడం చాలా అవసరం. అందుకోసం ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలి. పట్టణ, గ్రామీణ యువతకు రుణాలు, వడ్డీ రేట్లు, క్రెడిట్ స్కోర్ వంటి అంశాలపై సరైన అవగాహన కల్పించాలి. కళాశాలలు, పాఠశాలల్లో సదస్సులను ఏర్పాటుచేసి గేమింగ్ యాప్‌లు, డిజిటల్ రుణాలు, వాటి ద్వారా వాటిల్లే కష్టనష్టాల గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలి. తల్లిదండ్రులు సైతం డిజిటల్ లావాదేవీల విషయంలో జాగ్రత్త వహించేలా పిల్లలను అప్రమత్తం చేయాలి. ఆర్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు గేమింగ్ రుణాలపై కఠిన నియంత్రణలు విధించాలి. ముఖ్యంగా గేమింగ్ యాప్‌లను ఉపయోగించేటప్పుడు ఖర్చుకు, సమయానికి తగిన పరిమితి విధించాలి. రుణాలకు సంబంధించి వినియోగదారులకు పూర్తి సమాచారం అందేలా చూడాలి. అప్పుల్లో ఇరుక్కుపోయిన వారికి ఆర్థిక సలహా కేంద్రాలు, హెల్ప్‌లైన్లను అందుబాటులో ఉంచాలి. బాధితులకు వాటి నుంచి బయటపడే మార్గాలను సూచించాలి. డిజిటల్ సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటేనే యువతరం కొత్త అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతుంది. అవగాహన లేకుండా గేమింగ్, సులభ రుణాల వెంటపడితే మాత్రం భవిష్యత్తు అంధకారమవుతుంది!



డాక్టర్ మైలవరం చంద్రశేఖర్

శాస్త్ర, సాంకేతిక విషయ విశ్లేషకులు

హాయ్! బుజ్జీ!!

నక్కకు తెలిసొచ్చింది!

సుందరవనంలో చాలా జంతువులు ఉండేవి. ఒకరోజు నక్కతో.. 'మిత్రమా! ఆ చిలుకను చూడు. కుందేలు గొప్పతనాన్ని తన చిట్టి చిట్టి మాటలతో భలేగా చెబుతోంది' అంది తోడేలు. 'ఆ మాటలన్నీ కుందేలే నేర్పి ఉంటుంది. నేనూ ఒక చిలుకను పట్టుకుని మాటలు నేర్పించి అలాగే పొగిడించుకుంటాను' అంది నక్క. ఇంతలోనే ఒక చిలుక వచ్చి నేల మీద తిరుగుతూ ఉంది. దాన్ని పట్టుకుని 'చిలుకమ్మా! నేను చెప్పినట్లుగా నక్కే చాలా గొప్పది.. చాలా మంచిది. అని అంటే నీకు బోలెడు జామపండ్లు ఇస్తాను!' అంది నక్క. అది విన్న చిలుక.. 'నక్క తప్పు చెబుతోంది.. తప్పు చెబుతోంది' అంటూ అరవసాగింది. దాంతో నక్క.. 'నేను చెప్పిందేంటి? నువ్వు అంటుందేంటి?' అని గద్దించింది. అయినా చిలుక అలాగే అరవసాగింది. నక్కకి కోపం ఎక్కువై.. 'నేను చెప్పినట్లు చెప్పకపోయావో వేటగాళ్లకు పట్టిస్తాను' అంది. అప్పుడు చిలుక.. 'అయ్యో.. నక్కమామా! నేనేం చేసేది. నాకు కొన్ని మాటలు పలకడం రాదు. అందుకే నువ్వు చెప్పినట్లు అనలేకపోతున్నాను. కావాలంటే అదిగో ఆ గోరింకను అడుగు' అంది. 'అవును! ఆ చిలుక కొన్ని పదాలు పలకలేదు' చెప్పిందది. 'అయితే ఇక్కడి నుంచి వెళ్లిపో' అని కోపంగా అంది నక్క. ఆ చిలుక తుర్రున ఎగిరి చెట్టు కొమ్మ మీద వాలి.. 'ఓ టక్కరి నక్కమామా! నువ్వేం మంచి పనులు చేశావని నీ గురించి గొప్పగా చెప్పమంటావు. పైగా మిగతా జంతువులను ఇబ్బంది పెడతావు' అంటూ ఎగిరిపోయింది.



ఇదంతా చాటుగా విన్న మృగరాజు నవ్వుకుంటూ వచ్చి.. 'మనం ఎదుటివాళ్ల నుంచి పొందే.. ప్రేమ, అభిమానం, ప్రశంస.. ఇలా ఏదైనా వాళ్ల మనసులో నుంచి రావాలి. అంతేగాని బలవంతంగా పొందాలనుకుంటే.. ఇలాగే అవుతుంది' అని చెప్పింది. అప్పుడు నక్క.. 'అయితే ఇప్పటి నుంచి ఎవరినీ కావాలని ఇబ్బంది పెట్టను. అప్పుడు నన్నూ అందరూ ఇష్టపడతారు కదా!' అని నవ్వుతూ అంది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

నేనెవర్ని?

1. అయిదక్షరాల పదాన్ని నేను. 'అన్నం'లో ఉంటాను కానీ 'సున్నం'లో లేను. 'గానం'లో ఉంటాను కానీ 'గాయం'లో లేను. 'తలుపు'లో ఉంటాను కానీ 'మలుపు'లో లేను. 'పుత్తడి'లో ఉంటాను కానీ 'ఇత్తడి'లో లేను. 'హారం'లో ఉంటాను కానీ 'హాని'లో లేను. నేనెవర్ని?
2. నేనో నాలుగు అక్షరాల పదాన్ని. 'రణం'లో ఉంటాను కానీ 'కణం'లో లేను. 'హరి'లో ఉంటాను కానీ 'గిరి'లో లేను. 'దారం'లో ఉంటాను కానీ 'కారం'లో లేను. 'వరి'లో ఉంటాను కానీ 'వల'లో లేను. నేనెవరినో తెలిసిందా?

జవాబు: 1. అనంతపురం 2. రహదారి


ఎమ్మెల్సీగా ప్రమాణం అనంతరం సంతకం చేస్తున్న కావలి గ్రీష్మ

ఎమ్మెల్సీగా కావలి గ్రీష్మ ప్రమాణ స్వీకారం

ఈనాడు, అమరావతి: శాసనమండలి సభ్యురాలిగా ఎన్నికైన కావలి గ్రీష్మ శుక్రవారం పదవీ ప్రమాణం చేశారు. వెలగపూడిలోని అసెంబ్లీ ఆవరణలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తన కార్యాలయంలో ఆమెతో ఎమ్మెల్సీగా ప్రమాణం చేయించారు. గ్రీష్మ తల్లి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి కావలి ప్రతిభాభారతి, వారి కుటుంబ సభ్యులు, అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ పాల ధరల పెంపు

విశాఖపట్నం (అక్కిరెడ్డిపాలెం), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యం పాల ధరలను పెంచింది. ఈ ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. అర లీటరు ప్యాకెట్‌పై రూ.1, లీటరుకు రూ. 2 చొప్పున పెంచింది. ఇదే విధంగా గంగా పాల ధరలూ పెరగనున్నాయి. డెయిరీ నుంచి నిత్యం 4.5 లక్షల లీటర్ల పాల ప్యాకెట్ల అమ్మకాలు జరుగుతాయి. కొన్ని రకాల టెట్రా ప్యాకెట్ పాల ధరలను సైతం పెంచడంతో ప్రజలపై నెలకు సుమారు రూ.మూడు కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉంది. పాల సేకరణ సహా ఇతరత్రా ఖర్చులు అధికం కావడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని యాజమాన్యం ప్రకటించింది.

సైన్యాన్ని విమర్శించిన ప్రొఫెసర్ సస్పెన్షన్


ప్రొఫెసర్ లోరా

మహాబలిపురం, న్యూస్‌టుడే: ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న భారత సైన్యాన్ని విమర్శిస్తున్న చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కొళత్తూర్ సమీపంలోని ఓ ప్రముఖ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న లోరా అనే ప్రొఫెసర్ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఇందుకు ఆమెను సస్పెండ్ చేస్తూ వర్సిటీ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

బుగ్గమఠం భూముల వ్యవహారం.. నోటీసులకు పెద్దిరెడ్డి న్యాయవాది సమాధానం

తిరుపతి (తిలక్), న్యూస్‌టుడే: తిరుపతి బుగ్గమఠం భూముల ఆక్రమణ వ్యవహారంలో అందిన నోటీసులకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించారు. శుక్రవారం ఆయన తరఫున న్యాయవాది కలెక్టరేట్‌లోని దేవాదాయశాఖ అధికారి, బుగ్గమఠం పరిపాలన అధికారికి సమాధాన పత్రాలు అందించారు. అందులోని వివరాలను కలెక్టర్‌తో చర్చించిన అనంతరం న్యాయస్థానానికి సమర్పిస్తామని సదరు అధికారులు చెప్పినట్లు తెలిసింది.

సెలవుల్లో సరదాగా!

అలా.. ఎలా?

క్రిట్టు ఒక బంతిని ఆరు మీటర్ల దూరం విసిరాడు. క్షణాల్లో అది మొదటి స్థానానికి వచ్చేసింది. ఆ తర్వాత మూడున్నర మీటర్లు విసిరాడు. కానీ మళ్లీ అది తొలి స్థానానికే వచ్చేసింది.



అవతలివైపు పట్టుకుని తిరిగి విసిరేవారు ఎవరూ లేకపోయినా.. బంతి తన తొలి స్థానానికి ఎలా వస్తోంది?

చిన్నూ గదిలో ఫ్యాను వేసుకుని ఆడుకుంటున్నాడు. అమ్మ అన్నం తినడానికి పిలిచిందని వెళ్లాడు. కానీ ఫ్యాను ఆపకుండానే వెళ్లిపోయాడు.

హనీకి ఏదైనా తినాలని అనిపించింది. ఏం ఉన్నాయబ్బా అని ఫ్రిడ్జ్ తెరిచింది. ఎంతసేపు చూసినా ఏం తినాలో తనకు అర్థం కాలేదు. అలా ఫ్రిడ్జ్ డోర్ తెరిచే ఉంచి ఆలోచనలో పడింది.



పైన మన ఫ్రెండ్స్‌ను చూస్తే మీకు అర్థం అయ్యే ఉంటుంది. ఇద్దరూ కరెంటును వృథా చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు కదా.. మరి ఈ సమ్మర్‌లో మనం పవర్ సేవింగ్ ఎందుకు, ఎలా చేయాలో తెలుసుకుందామా!



అందరికోసం.. ఆదా చేద్దాం!

- కరెంటు తయారుచేయడానికి చాలా కష్టపడాలి. బొగ్గు, నీరు వంటివి అధిక మొత్తంలో అవసరం. బోలెడంత ఖర్చు కూడా. దీన్ని ఎక్కువగా వాడటం, వృథా చేయడం మన భూమి ఆరోగ్యం మీద చాలా చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే వెంటనే మనం పద్ధతి మార్చుకోవాలి. ఇందుకోసం అసలు కరెంటు ఎలా తయారు చేస్తారు, మన ఇంటికి ఎలా పంపిస్తారు.. అనే విషయాలను అమ్మానాన్నలను అడిగి తెలుసుకోండి. మీ ఇంటికి నెలనెలా ఎంత బిల్ వస్తుందో చూడండి. ఏ ఎలక్ట్రానిక్ వస్తువు ఎంత పవర్ ఉపయోగించుకుంటుందో లెక్క రాయండి. దాంతోపాటు..
- అవసరం లేని చోట ఫ్యాను, లైటు, టీవీ, కంప్యూటర్, ఏసీ వంటివి స్విచ్ ఆపేయండి.
- పవర్‌ను పొదుపుగా వాడండి. టీవీ ఆన్ చేసి మొబైల్ చూడటం, కంప్యూటర్‌లో గేమ్ ఆడటం చేయొద్దు. ఛార్జ్ పూర్తికాగానే ఫోన్, ల్యాప్‌టాప్‌ను కేబుల్ నుంచి తీసేయండి.
- కిటికీ నుంచి గాలి, వెలుతురు వస్తున్నప్పుడు లైట్లు, ఫ్యాన్ల వాడకం తగ్గించండి.
- ఫ్రిడ్జ్‌లో నుంచి ఏం తీయాలి అనుకుంటున్నారో ముందే అనుకుని అప్పుడు డోర్ తీయండి.

ఇవన్నీ చేసి.. ఈ సెలవుల్లో ఎలా పవర్ సేవింగ్ చేశారో స్కూలు మొదలయ్యాక టీచర్‌కు, ఫ్రెండ్స్‌కు చెప్పండి. చేద్దామా మరి!

డాన్స్ చేద్దామా..!

మనందరికీ డాన్స్ అంటే చాలా ఇష్టం. కానీ చేయడానికి భయం. ఎవరైనా ఉన్నప్పుడు... అందులోనూ స్కూల్‌లో స్టేజ్ ఎక్కి చేయాలంటే ఇంకా భయపడుతూ, సిగ్గుపడుతూ ఉంటాం.

కానీ డాన్స్ చేయడంలో ఎంత సరదా ఉంటుందో కదా! నచ్చిన పాటకు వచ్చినట్టు గంతులు వేస్తుంటే ఆ ఫన్‌ను చెప్పగలమా? అందుకోసం మనం ఈసారి చేయాల్సింది 'డాన్స్ లైక్ నోబడీ వాచింగ్'.

ఇందుకోసం గదిలోకి వెళ్లి తలుపులు మూసేయండి. మీకు నచ్చిన పాట పెట్టండి. పిచ్చి పిచ్చిగా ఇష్టమైన డాన్స్ చేసేయండి. అలసట వచ్చేంత వరకూ చేస్తూనే ఉండండి. కుదిరితే అద్దంలో చూసుకుంటూ చేయండి.



ఆ తర్వాత ఏవైనా కొన్ని స్టెప్పులు అనుకుని వాటినే ప్రాక్టీస్ చేయండి. మొదటిసారి చేసినదానికి, తర్వాతకు ఎలాంటి మార్పు వచ్చిందో గమనించండి.

ఇది మన సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను పెంచడమే కాదు.. మనసుకు చాలా సంతోషాన్ని, హాయిని ఇస్తుంది. నెమ్మదిగా స్టేజ్ ఫియర్‌ను తగ్గిస్తుంది. ఇంకెందుకు ఆలస్యం.. మొదలు పెట్టండి!

చెప్పండి చూద్దాం




సూరజ్ వాళ్ల ఇంట్లో మొత్తం అయిదుగురు సభ్యులు ఉన్నారు. వాళ్ల నాన్నగారు పేపర్ చదువుతున్నారు. తమ్ముడు చదరంగం ఆడుతున్నాడు. సూరజ్ టీవీ చూస్తున్నాడు. చెల్లి ఐస్‌క్రీమ్ తింటోంది. ఇంతకీ సూరజ్ వాళ్ల అమ్మగారు ఏం చేస్తున్నారో చెప్పండి చూద్దాం!

మనకు అడ్వెంచర్ సినిమాలంటే భలే ఇష్టం కదూ.. వాటిని చూసి, అందులో మనమే ఉన్నట్టు ఫీలైపోయి సరదా పడిపోతూ ఉంటాం. మనలాగే ఈ చిన్నారులు కూడా ఫీలై కొన్ని సాహసాలు చేశారు.. ఎక్కడో తెలుసా? 'ఫైవ్ ఆన్ ఎ ట్రెజర్ ఐలాండ్' అనే పుస్తకంలో! మరి దీని గురించి తెలుసుకుందామా..

ఐదుగురు స్నేహితులు.. అద్భుత సాహసాలు!

జూలియన్, డిక్, ఆన్.. ముగ్గురూ అన్నాచెల్లెళ్లు. ఓ వేసవి సెలవుల్లో చుట్టాల ఇంటికి వెళ్తారు. అక్కడ వీళ్ల కజిన్ జార్జ్, అతడి పప్పీ టిమ్మీ వీళ్లకు ఫ్రెండ్స్ అవుతారు. ఈ అయిదుగురూ కలిసి చేసిన సాహసాలే 'ది ఫేమస్ ఫైవ్' సిరీస్. వీరంతా పిక్నిక్‌లో ట్రెక్కింగ్, క్యాంపింగ్‌తో బాగా ఎంజాయ్ చేస్తారు. వెళ్లిన ప్రతిచోటా ఏదో ఒక కొత్త విషయం కనిపెడుతూ పోలీసులకు దొంగలను పట్టించేస్తారు. ఇలా వీరు చేసే సమ్మర్ సాహసాలు మనల్ని పూర్తిగా మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాయి!



★ పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటున్న ఈ పుస్తకాన్ని ఎనిడ్ బ్లైటెన్ అనే రచయిత రాశారు. ఇప్పటికి 'ఫేమస్ ఫైవ్' సిరీస్‌లో 21 పుస్తకాలు, వాటి తర్వాత 'సీక్రెట్ సెవెన్' సిరీస్‌లో మరో 15 పుస్తకాలు వచ్చాయి. ఇవి మనలాంటి పిల్లలకు ఎంత నచ్చేశాయి అంటే 70 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా కోట్ల కాపీలు అమ్ముడుపోయాయి.

ఈ పుస్తకం చదివారా?

★ ఈ సెలవుల్లో దీన్ని చదివితే మనం సరదాగా ఎంజాయ్ చేయడమే కాదు, బోలెడన్ని వింతలు తెలుసుకునే వీలుంటుంది. మరి నాన్నను అడిగి ఒక పుస్తకం వెంటనే తెప్పించుకోండి.

గురుకుల ప్రవేశాల ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న డా. శ్రీబాల వీరాంజనేయస్వామి

తాడేపల్లి, న్యూస్‌టుడే: గురుకులాలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల నిర్వహించిన బీఆర్ ఏజీసెట్-2025 ఫలితాలను శుక్రవారం ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లిలో విడుదల చేశారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో కర్నూలు జిల్లాకు చెందిన కడవల సుమతి, అనకాపల్లికి చెందిన వియ్యపు శరత్, కర్నూలు జిల్లాకు చెందిన బోయ దివ్య వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారని చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో విశాఖ జిల్లాకు చెందిన రమేష్ గీతిక, కర్నూలు జిల్లాకు చెందిన ఈపూరి సుహృతి, అదే జిల్లాకు చెందిన పెంజని హసినాలీ మొదటి మూడు స్థానాలు పొందారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన అభినందించారు.

భారత సైన్యానికి రూ.5 లక్షల విరాళం


ఎన్‌సీసీ అధికారులకు చెక్కు అందజేస్తున్న జ్యోతికృష్ణ, ఆయన కుటుంబసభ్యులు

తిరుపతి (నగర పాలక), న్యూస్‌టుడే: పాకిస్థాన్‌తో పోరాడుతున్న భారత సైన్యం సంక్షేమం కోసం తిరుపతికి చెందిన దేశభక్తుడు కె.జ్యోతికృష్ణ రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. తిరుపతిలోని ఎన్‌సీసీ గ్రూప్ క్వార్టర్స్ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దాహియాకు శుక్రవారం విరాళం చెక్కును అందజేశారు. దేశం కోసం పోరాడుతున్న సైనికుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడం కోసం తన వంతుగా తన వ్యాపారాల ద్వారా కష్టపడి ఆర్జించిన సొమ్ము నుంచి ఈ విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతికృష్ణ, ఆయన భార్యాపిల్లలు, తండ్రి శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి కేసులో సిట్ ఛార్జిషీట్

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే- తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన కేసులో రెండు రోజుల కిందట సిట్ నెల్లూరు ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో నిందితులను అరెస్టు చేసిన సందర్భంలో ఏ15గా ఆశిష్ అగర్వాల్‌ను పేర్కొన్నారు. అయితే ఛార్జిషీట్‌లో 14 మందిని నిందితులుగా చేర్చినట్లు తెలిసింది. ఏ1గా ఏఆర్ డెయిరీ, ఏ2గా ఆ సంస్థ ఎండీ రాజురాజశేఖరన్, ఏ3, ఏ4, ఏ5గా పొమిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ చావడా, ఏ6, ఏ7గా భోలేబాబా, వైష్ణవి డెయిరీ, ఏ8గా వైష్ణవి డెయిరీ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షబీల్ కలీ ముల్లాఖాన్ ఉన్నారు. తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగంలో పనిచేసే నాగేందర్, శేఖర్, భోలేబాబా డెయిరీ సీజీఎం హరిమోహన్, నెయ్యి తయారీకి ముడిపదార్థాలు సరఫరా చేసే ఆశిష్ అగర్వాల్‌లనూ నిందితుల జాబితాలో చేర్చారు.

ఆరుగురి అరెస్టు: ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురిని సిట్ అరెస్టు చేసింది. కలీముల్లాఖాన్ పరారీలోనే ఉన్నారు. తితిదే ఉద్యోగులను అరెస్టు చేయలేదు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని గతేడాది జులై 16, 23వ తేదీల్లో గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ కాఫ్ ల్యాబ్ నివేదిక అందజేసింది. ఈ మేరకు ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ ఫిర్యాదుతో తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. సుప్రీంకోర్టు సీబీఐ జేడీ వీరేష్ ప్రభు నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్‌ను) నియమించింది. తితిదేకు నెయ్యి సరఫరాకు టెండర్ దక్కించుకున్న తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ నెయ్యి పంపలేదు. ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలోని భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి తీసుకొచ్చి తిరుపతి జిల్లాలోని వైష్ణవి డెయిరీకి సరఫరా చేశారు. ఇక్కడి నుంచే నేరుగా తితిదేకు పంపించారు. ఏఆర్ డెయిరీలోనే నెయ్యి తయారు చేసినట్టు సీళ్లు అతికించారని సిట్ నిర్ధారించింది.

◆ కల్తీ నెయ్యి కేసులో పాత్రధారులతో మొదటి ఛార్జిషీట్ వేశారు. ఇప్పటి వరకు సేకరించిన వివరాలతో మలి దశ విచారణను సిట్ కొనసాగించనున్నట్లు సమాచారం. ఈ కేసులో సూత్రధారులు, ఘోరం జరుగుతున్నా పట్టించుకోని అధికారులతో మరికొన్ని ఛార్జిషీట్లు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఉగ్రదాడుల వెనుక ఐఎస్ఐ

టెర్రరిస్టులకు శిక్షణ సహా అనేకం పాకిస్థాన్ సైన్యం కనుసన్నల్లోనే

- అక్కడి ఆర్మీ తిరుగుబాటు స్వభావం కలిగినది
- ఎలా ఎదుర్కోవాలో భారత్‌కు తెలుసు
- ఈనాడు ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ క్రిస్టినా ఫెయిర్

ఎం.ఎల్. నరసింహారెడ్డి
ఈనాడు - హైదరాబాద్

పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో తమ ప్రమేయం లేదని, తమ దేశంలో టెర్రరిస్టు క్యాంపులే లేవని పాకిస్థాన్ చెప్తున్నా, ఆ దేశ ఆర్మీ... ఐఎస్ఐలది ఇలాంటి సంఘటనల వెనక మాస్టర్ మైండ్ అని ప్రొఫెసర్ క్రిస్టినా ఫెయిర్ అభిప్రాయపడ్డారు. టెర్రరిస్టులకు శిక్షణ సహా అనేకం ఈ రెండింటి కనుసన్నల్లోనే జరుగుతాయని పేర్కొన్నారు. క్రిస్టినా అమెరికాలోని జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ స్టడీస్ విభాగం ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ అసిస్టెంట్ మిషన్ తరఫున అఫ్గానిస్థాన్‌లో పొలిటికల్ ఆఫీసర్‌గా, దిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ ఎనాలిస్‌లో సీనియర్ రెసిడెంట్ ఫెలోగా పని చేయడంతో పాటు అనేక అంతర్జాతీయ సంస్థల్లో విధులు నిర్వహించారు. దక్షిణాసియాలో రాజకీయ, మిలటరీ వ్యవహారాలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. 2014లో ఫైటింగ్ టు ది ఎండ్: ది పాకిస్థాన్ ఆర్మీస్ వే ఆఫ్ వార్ పేరుతో పుస్తకం రాశారు. పహల్గాంలో టెర్రరిస్టుల దుశ్చర్య, పాకిస్థాన్‌లోని టెర్రరిస్టు క్యాంపుల్ని భారత్ ధ్వంసం చేసిన తర్వాత నెలకొన్న యుద్ధ వాతావరణం లాంటి పరిస్థితుల నేపథ్యంలో తన అభిప్రాయాలను 'ఈనాడు ప్రత్యేక ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

? ప్రస్తుతం భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం లాంటి పరిస్థితి, ఆపరేషన్ సిందూర్‌పై మీ అభిప్రాయం ఏంటి?

జవాబు: ఆపరేషన్ సిందూర్ పేరుతో టెర్రరిస్టు క్యాంపులను ధ్వంసం చేయడం చాలా ప్రాముఖ్యత కలిగిన అంశం. పాకిస్థాన్ ఆర్మీకి చాలా ముఖ్యమైన ప్రాంతాల్లో భారత్ ఈ దాడులు చేసింది. పాకిస్థాన్ ఎదురుదాడికి ప్రయత్నించడం ద్వారా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ఆ దిశగా చర్యలు ఉన్నట్లు కనిపించడం లేదు. పాకిస్థాన్ ఆర్మీ తిరుగుబాటు (ఇన్‌సర్జెన్సీ) స్వభావం కలిగినది. వారి లక్ష్యమేంటో, దాన్ని ఎలా అడ్డుకోవాలో భారత్‌కు తెలుసు. మరోవైపు పాకిస్థాన్ ఆర్మీ తమ దేశంలోనే వివిధ వర్గాల మద్దతును కోల్పోతోంది. పహల్గాం ఘటన నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్తతల నుంచి అందరి మద్దతు పొందేందుకు మళ్లీ ప్రయత్నిస్తోంది.

? టెర్రరిస్టు క్యాంపులే లేవని పాకిస్థాన్ అంటోంది కదా?

జ: తమ దేశంలో టెర్రరిస్టు క్యాంపులే లేవని పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా చెపుతోంది... కానీ ఆ దేశ ఆర్మీ ఈ విషయాన్ని చెప్పడం లేదు. లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ లాంటివి టెర్రరిస్టు సంస్థలుగా గుర్తింపు పొందాయి. ఎవరు అవునన్నా కాదన్నా ఇవి అంతర్జాతీయంగా అందరూ గుర్తించిన టెర్రరిస్టు సంస్థలే.

? భారతదేశంలో జరిగిన అనేక ముఖ్య ఉగ్రదాడుల వెనక పాకిస్థాన్ పాత్రపై మీ విశ్లేషణ ఏమిటి?

జ: భారతదేశంలో జరిగిన పహల్గాం సహా అనేక ముఖ్య ఉగ్రదాడుల వెనక పాకిస్థాన్ ఆర్మీ... ప్రత్యేకించి ఐఎస్ఐ చీఫ్ మాస్టర్ మైండ్ ఉంటుంది. కశ్మీర్‌లో కొన్ని సంఘటనలు అసంతృప్తితో జరగవచ్చు... ప్రధానమైన దాడులు మాత్రం వాటి కనుసన్నల్లోనే జరుగుతాయి. వాటి ప్రమేయం లేకుండా దాడులు చేయడం అసాధ్యం. కొన్ని సంఘటనల్లో ప్రమేయం లేకున్నా, వారికి ఆయుధ శిక్షణ అంతా పాకిస్థాన్ ఆర్మీ మద్దతుతోనే జరుగుతుంది.

? పాకిస్థాన్‌లోని ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడం ద్వారా టెర్రరిస్టు కార్యకలాపాలను నియంత్రించడం భారత్‌కు సాధ్యమవుతుందా?

జ: పూర్తిగా నియంత్రించే సామర్థ్యం భారత్‌కు ఉందనుకోను. సెక్యూరిటీ బలగాలను జమ్మూకశ్మీర్‌లో పెద్ద ఎత్తున దింపినా, ఎంత సమర్థులను నియమించినా ప్రతి టెర్రరిస్టు దాడిని నియంత్రించడం వీలు కాదు. సమస్య ఏంటంటే భారతదేశానికి నిర్మాణాత్మక, వ్యూహాత్మక పరిష్కారాలు ప్రస్తుత సమయంలో అందుబాటులో లేవు. ముఖ్యమైన అంశం ఏంటంటే పాకిస్థాన్ తన ప్రవర్తనను మార్చుకోవాలి. మార్చుకోకపోతే జరిగే నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని భరించే శక్తి తమకు లేదన్న విషయం పాకిస్థాన్ గుర్తుంచుకొనేలా చేయాలి. అయితే పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించేలా చేయాలంటే... అంతర్జాతీయ సమూహం(ఇంటర్నేషనల్ కమ్యూనిటీ) ఈ పని చేయాలి. అయితే అంతర్జాతీయ సమూహం ప్రస్తుతానికి సిద్ధంగా లేదు.

? టెర్రరిస్టు క్యాంపులను భారత్ ధ్వంసం చేసిన అనంతర పరిస్థితులను ఎలా విశ్లేషిస్తారు?

జ: అవి మళ్లీ పునర్నిర్మాణం అవుతాయి. దురదృష్టవశాత్తు అవి వ్యూహాత్మకమైనవి కాదు. అయితే రెండు దశాబ్దాల క్రితం ఇలాంటి దాడులు చేయడానికి భారత్‌కు సామర్థ్యం ఉండేది కాదు. ఇప్పుడు ఇండియన్ ఆర్మీ ఆధునికీకరణతోపాటు భారీగా ఆయుధ సంపత్తి కలిగి ఉంది. పాకిస్థాన్ వైపు కూడా కొంతమేర పెరిగింది. అయితే దీర్ఘకాలిక యుద్ధం సవాళ్లతో కూడుకున్నది. రెండు వైపులా అణ్వాయుధాలు ఉన్నాయి. భారత్ సైన్యాన్ని, ఆయుధ సంపత్తిని ఎదుర్కొని విజయం సాధించలేం అని పాకిస్థాన్‌కు తెలుసు. అందుకే పుల్వామా, కొన్ని సంవత్సరాల తర్వాత పహల్గాం లాంటివాటితో ఓ రకమైన భయానక వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తోంది.

? ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా, చైనా లాంటి పెద్ద దేశాల పాత్ర ఎలా ఉండబోతోంది?

జ: అమెరికాలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ప్రస్తుత యంత్రాంగంలో అనుభవజ్ఞులైన వారు లేరు. ఈ కారణంగా అమెరికా తగిన పాత్ర పోషిస్తుందని ఆశించలేం. అమెరికా ప్రభుత్వం చొరవ తీసుకొన్నా దాన్ని పటిష్ఠంగా అమలు చేయడానికి అనుభవం కలిగిన వారు లేరు. తగిన పాత్ర పోషించడానికి చైనాకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ దేశ వైఖరిని పరిశీలించినప్పుడు యుద్ధం పూర్తి స్థాయిలో జరగాలని కోరుకుంటున్నట్లుగా కనిపించడం లేదు. అయితే ఈ ఉద్రిక్తతలు తమ ఆయుధాలను యూరోపియన్ ఆయుధాలతో పరీక్షించుకోవడానికి ఉపయోగపడతాయని చైనా అనుకోవచ్చు.

? టెర్రరిస్టు కార్యకలాపాల వల్ల తాము కూడా తీవ్రంగా నష్టపోయామంటున్న పాకిస్థాన్ ఆ సంస్థలకు ఎందుకు మద్దతు ఇస్తున్నట్లు?

జ: అవి పాకిస్థాన్ వైఖరికి మద్దతు తెలుపుతున్నాయి కాబట్టి. కశ్మీర్ అంశం ఇప్పటికీ పూర్తి కాలేదని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ సమస్య పరిష్కారం కానిదిగా భావించినంత కాలం వారికి మద్దతు పలుకుతూనే ఉంటుంది.

మధుసూదన్‌రావు కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి

రూ.5 లక్షల ఆర్థిక సాయమందిస్తామని ప్రకటన


మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

కావలి, న్యూస్‌టుడే: జమ్మూ కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలివాసి సోమిశెట్టి మధుసూదన్‌రావు కుటుంబాన్ని కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శుక్రవారం పరామర్శించారు. తన తండ్రి భూపతిరాజు సూర్యనారాయణరాజు పేరిట ఉన్న ట్రస్టు ద్వారా రూ.5 లక్షల సాయమందిస్తామని ప్రకటించారు. మధుసూదన్‌రావు కుమార్తె ఇంజినీరింగ్ విద్యాభ్యాసం బాధ్యతను భాజపా తరఫున చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పామని పేర్కొన్నారు.

మాచర్ల మున్సిపల్ ఛైర్మన్‌గా మదార్ సాహెబ్ ఎన్నిక


మదార్ సాహెబ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి. చిత్రంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ నరసింహారావు

మాచర్ల(కారంపూడి), న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ ఛైర్మన్‌గా తెదేపా కౌన్సిలర్ షేక్ మదార్ సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ఇప్పటి వరకు ఒకటో వైస్ ఛైర్మన్‌గా ఉన్న మదార్ సాహెబ్‌ను ఛైర్మన్‌గా తెదేపాకు చెందిన 17 మంది సభ్యులు ప్రతిపాదించారు. వారితోపాటు మరో నలుగురు సభ్యులు ఆమోదం తెలపడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. మున్సిపాలిటీ పరిధిలో 31 మంది కౌన్సిలర్లు ఉండగా, 10 మంది గైర్హాజరయ్యారు. అనంతరం ఛైర్మన్‌గా మదార్ సాహెబ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కొత్త ఛైర్మన్‌ను అభినందించారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటున్నాం

సుప్రీంకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలకు ఉపక్రమించినట్లు ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలపై దండా నాగేంద్రకుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఎన్‌జీటీ తమకు రూ.18 కోట్ల జరిమానా విధిస్తూ ఇచ్చిన తీర్పుపై జైప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ వేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని చెప్పింది. శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓక, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ముందు కేసు విచారణకు వచ్చినప్పుడు ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మది వాదనలు వినిపిస్తూ.. అధికారులు అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు, ఈ వ్యవహారాన్ని అవినీతి నిరోధక శాఖకూ అప్పగిస్తున్నట్లు చెప్పారు. నాలుగు వారాల సమయం ఇస్తే వివరాలన్నీ అఫిడవిట్ రూపంలో దాఖలు చేస్తామని చెప్పారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు ఒకటికి వాయిదా వేసింది.


ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘీభావ ర్యాలీ

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సచివాలయ ఉద్యోగుల ప్రదర్శన

ఈనాడు, అమరావతి: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు జాతీయ జెండాను ప్రదర్శిస్తూ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం విధులు ముగిసిన తర్వాత ఉద్యోగులు, అధికారులు భారీ ప్రదర్శన తీశారు. సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు. అమరుడైన అగ్నివీర్ మురళీ నాయక్‌కు నివాళులర్పించారు.

ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు


ఈనాడు, దిల్లీ: పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఆంధ్రప్రదేశ్ వాసులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం దిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటుచేసింది. పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో నివాసం ఉంటున్న, పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్‌వాసులకు ఏదైనా సహాయం అవసరమైతే ఈ కంట్రోల్‌రూంకి ఫోన్ చేయవచ్చని రెసిడెంట్ కమిషనర్ తెలిపారు. సాయం అవసరమైనవారు 011-23387089, 9871999430, 9871999053 నంబర్లలో ఎప్పుడైనా సంప్రదించవచ్చని సూచించారు. అదనపు సాయం కావాల్సిన వారు డిప్యూటీ కమిషనర్ ఎంవీఎస్ రామారావు (9871990081), లైజన్ ఆఫీసర్ సురేష్ (9818395787)లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సైన్యానికి మద్దతుగా విజయవాడలో భారీ ప్రదర్శన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: భారత సైన్యానికి సంఘీభావంగా లయోలా వాకర్స్, అమరావతి రన్నర్స్, లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి విజయవాడ బెంజి సర్కిల్ నుంచి డీవీ మేనర్ హోటల్ వరకు, తిరిగి అక్కడినుంచి బెంజిసర్కిల్ వరకు జాతీయ జెండాలు, కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థినులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు.



ప్రదర్శనలో లయోలా వాకర్స్, అమరావతి రన్నర్స్, లారీ యజమానుల సంఘం ప్రతినిధులు, మహిళలు, యువత



డెస్కు శుభ్రంగా ఉంటే.. ఆలోచనల్లో స్పష్టత

మీరు పనిచేస్తున్న డెస్కు/ప్రదేశం చిందరవందరగా ఉంటే.. మీ మెదడు కూడా గందరగోళంగా ఉంటుంది. పని ప్రదేశం శుభ్రంగా ఉంటే ఆలోచనాతీరు స్పష్టంగా ఉంటుంది. అనవసర వస్తువులేవీ మీ డెస్కుపై పెట్టుకోకండి. దాన్ని చెత్తబుట్టగా మార్చకండి. కంప్యూటర్‌లోనూ ట్యాబ్‌లను తక్కువ సంఖ్యలోనే తెరిచి ఉంచుకోండి. ఏకాగ్రత పెరుగుదలకు ఈ చిన్న చిన్న చర్యలు దోహదపడతాయి.

– ఎల్లా లూయిస్, హై పర్ఫార్మెన్స్ కోచ్

భారత్ కన్నెర్ర

సైన్యం ఆపరేషన్ల కవరేజీలో జాగ్రత్త

మీడియా సంస్థలకు రక్షణశాఖ సూచన

దేశ భద్రతకు సంబంధించిన ఆపరేషన్ వార్తలు, దళాల కదలికల కవరేజీల విషయంలో మీడియా సంయమనం పాటించాలని రక్షణశాఖ ఓ ప్రకటనలో సూచించింది. 'భద్రతా దళాల ఆపరేషన్ల ఫలితాలను ప్రభావితం చేసే సమాచారాన్ని వెల్లడిస్తే.. వారి ప్రాణాలకు ముప్పు రావచ్చు. గతంలో కార్గిల్ యుద్ధం, 26/11 దాడులు, కాందహార్ హైజాక్ ఘటనలు అత్యుత్సాహపు రిపోర్టింగ్‌కు నిదర్శనంగా నిలిచాయి. కేబుల్ టెలివిజన్ చట్టం ప్రకారం.. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల సమయంలో కేవలం అర్హత ఉన్న అధికారి సమయానుసారం బ్రీఫింగ్స్ ఇస్తారు. ఈ క్రమంలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించి.. సున్నితంగా, బాధ్యతాయుతంగా కవర్ చేయాలి" అని పేర్కొంది.

వైద్య సదుపాయాలను సమీక్షించిన జేపీ నడ్డా



దిల్లీ: పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో దేశంలోని ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలను, సన్నద్ధతను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం సమీక్షించారు. వైద్య సదుపాయాల సన్నద్ధతకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఈ సమావేశంలో ఆయనకు వివరించారు. జాతీయ భద్రత, ముందస్తు చర్యల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ గురువారం సూచించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.

ప్రభుత్వ చర్యలు అభినందనీయం: భాగవత్



దిల్లీ: పాకిస్థాన్ ఉగ్రవాద వ్యవస్థకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాత్మక చర్యలపై భారత ప్రభుత్వాన్ని, భద్రతా బలగాలను శుక్రవారం ఆరెస్సెస్ అభినందించింది. దేశ భద్రతకు ఈ చర్యలు అనివార్యమని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ పేరిట చేపట్టిన చర్యలు పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయడంతో పాటు భారతదేశ ఆత్మాభిమానాన్ని, మనోబలాన్ని పెంపొందిస్తాయని తెలిపింది. 'ఈ చర్యల పట్ల మేము కేంద్ర ప్రభుత్వ నాయకత్వాన్ని, మన భద్రతా బలగాలను అభినందిస్తున్నాం, మద్దతిస్తున్నాం' అని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, సర్కార్యవాహ దత్తాత్రేయ హోసబలే ఓ ప్రకటనలో తెలిపారు.

మేం ఉగ్రవాదులతో పోరాడుతున్నాం: వినయ్ క్వాత్రా



న్యూయార్క్: పహల్గాం బాధితులకు న్యాయం చేసేందుకు.. ఆ దాడికి కారకులైన మానవాతీత రాక్షసులను జవాబుదారీగా ఉంచేందుకు భారతదేశం ఉగ్రవాదులతో యుద్ధంలో ఉందని అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా తెలిపారు. ఈ ఉగ్రవాదులు స్వేచ్ఛగా ఉండడానికి ఏ ప్రపంచంలోనూ అనుమతి లేదన్నారు. సీఎన్ఎన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమైనది. ఈ ఉగ్రవాదులపై వారి స్థావరాలపై ప్రతిస్పందన తెలియజేశాం. ఆపరేషన్ సిందూర్‌తో మా దృక్కోణం నుంచి ఒక ముగింపు తీసుకొచ్చాం. కానీ పాకిస్థాన్ ముగింపు తీసుకొచ్చిందా లేదా అనేది దానిపై ఆధారపడి ఉంటుంది. అది ఇంకా తీవ్రతరం చేయాలి అనుకుంది.. దానికి ప్రతిస్పందించడం మా బాధ్యత' అని క్వాత్రా అన్నారు.

పంజాబ్‌లో పాక్ క్షిపణి శకలాలు

- జైసల్మేర్‌లో బాంబు?



జైసల్మేర్ సమీపంలోని కిషన్ ఘాట్‌లో శుక్రవారం కనిపించిన బాంబు లాంటి వస్తువు



పంజాబ్‌లోని బఠిండా జిల్లా బుర్జ్ మెహమా గ్రామంలో పడిన రాకెట్ శకలం

హోశియార్‌పుర్ (పంజాబ్): సరిహద్దు రాష్ట్రాలపై గురువారం రాత్రి పాకిస్థాన్ భారీగా డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. వీటిని భారత్ గగనతల రక్షణ వ్యవస్థలు దీటుగా అడ్డుకున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో పాక్ క్షిపణులు, డ్రోన్లకు సంబంధించిన శకలాలు వ్యవసాయక్షేత్రాల్లో పడ్డాయి. పంజాబ్‌లోని హోశియార్‌పుర్, బఠిండా జిల్లాల్లో క్షిపణి, లోహ శకలాలు కనిపించాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వాయుసేన అధికారులూ రంగంలోకి దిగారు. వీటిని పరీక్షించారు. బఠిండాలోని రెండు వేర్వేరు ప్రదేశాల్లో గుర్తు తెలియని వస్తువులకు సంబంధించిన లోహ శకలాలను గుర్తించారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో బాంబులా కనిపిస్తున్న ఓ వస్తువును స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాంబు నిర్వీర్య దళాలు రంగంలోకి దిగాయి.

- గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో శుక్రవారం ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణ జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర సన్నద్ధతను మోదీ సమీక్షించారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఐఏఎస్, ఇతర అధికారుల సెలవులను పంజాబ్ ప్రభుత్వం రద్దు చేసింది. ఆరోగ్య, విపత్తు నిర్వహణ, ఇతర కీలక విభాగాలకు సంబంధించిన అధికారుల సెలవులను మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.
- చండీగఢ్‌లో శుక్రవారం సైరన్లు మోగాయి. గగనతల దాడి జరగనుందని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ప్రజలను ఇళ్లల్లోనే ఉండమని, బాల్కనీలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ సైరన్లు మోగించామని స్థానిక అధికారులు తెలిపారు.
- దేశ రాజధాని దిల్లీలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కీలక స్థావరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘాను పెంచారు. నగర వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా సైరన్లను ఏర్పాటు చేస్తున్నారు.
- ఉరి సెక్టార్‌లో పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా నష్టపోయిన పౌరప్రాంతాలను జమ్మూకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా సందర్శించారు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు.
- భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల కారణంగా కశ్మీర్‌లోని చాలా పాఠశాలలను మూసివేశారు. ఇందులో కొన్ని పాఠశాలలు ఆన్‌లైన్‌లో తరగతులు ప్రారంభించాయి. విద్యార్థులు నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ మాధ్యమంలో పాఠాలు బోధిస్తున్నట్లు ఆయా పాఠశాలలు తెలిపాయి.

ఉద్రిక్తతల వేళ పౌరుల రక్షణపై రాష్ట్రాలకు కేంద్రం లేఖ

దిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ)ను కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. సివిల్ డిఫెన్స్ చట్టం -1968 ప్రకారం పౌర రక్షణ చర్యలను పెంచాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు, యూటీలకు కేంద్రం లేఖలు రాసింది. 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని సెక్షన్ 11ను ఉపయోగించాలని సూచించింది. ఈ సెక్షన్ ప్రకారం అత్యవసర సామగ్రిని కొనేందుకు పౌర రక్షణ అధికారులకు అత్యవసర సేకరణ అధికారాన్ని ఇవ్వాలని పేర్కొంది. "రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పౌర రక్షణ చర్యలను పెంచాలి. శత్రువుల దాడుల సమయంలో ప్రజలు, వారి ఆస్తుల రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టడానికి, కీలకమైన సేవల పనితీరును నిర్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉంది. రాష్ట్రాలు, యూటీలు సెక్షన్ 11ని అమలు చేయాలి" అని కేంద్ర హోంశాఖ లేఖలో పేర్కొంది.

సివిల్ డిఫెన్స్ చట్టంలో ఏముందంటే?

సివిల్ డిఫెన్స్ చట్టంలోని సెక్షన్ 11 ప్రకారం స్థానిక అధికారులు నిధులను అత్యవసర సమయంలో ఉపయోగించుకునే అధికారం ఉంటుంది. ఈ అధికారాల వల్ల ప్రజలు, ఆస్తులను రక్షించడానికి అవసరమైన ఏవైనా అత్యవసర చర్యలు తీసుకోవచ్చు. శత్రువుల నుంచి ముప్పు, దాడుల సమయంలో ఈ ఆదేశంతో అధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి, అత్యవసర కొనుగోళ్లు చేయడానికి వీలు పడుతుంది.

మా ప్రధానే పిరికివాడు: పాకిస్థాన్ ఎంపీ

ఇస్లామాబాద్: భారత్‌తో నెలకొన్న యుద్ధ పరిణామాలతో పలువురు పాకిస్థాన్ ప్రజలు, రాజకీయ నాయకులు అక్కడి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాక్‌కు చెందిన తెహ్రీక్ -ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ ఎంపీ షాహిద్ అహ్మద్.. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ.. తమ ప్రధాని పిరికివాడని, భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు పలకడానికి కూడా ఆయన భయపడుతున్నారని అన్నారు. దేశ ప్రధానికే ధైర్యం లేనప్పుడు సైనికులు ముందడుగు ఎలా వేయగలరని ప్రశ్నించారు.



భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పంజాబ్‌లోని పటియాలాలో ఓ కళాశాల నుంచి శుక్రవారం ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

పాక్ బంకర్ల పాలిట మృత్యువు.. ఏటీజీఎం



సరిహద్దుల వద్ద భారత సైన్యం పాక్ స్థావరాలపై విరుచుకుపడుతోంది. వారి బంకర్లను ధ్వంసం చేయడానికి భారత్ అమ్ములపొదిలో ఉన్న ఓ ప్రత్యేక ఆయుధమే ఏటీజీఎం



భారత సరిహద్దుల్లో పాక్ సైన్యం నిర్విరామంగా పెద్దఎత్తున శతఘ్నులు, భారీ మెషిన్‌గన్స్‌తో షెల్లింగ్ చేస్తోంది. ఆ దేశ సైనికులు నక్కేందుకు ప్రత్యేకంగా బంకర్లు నిర్మించుకొన్నారు. వీటిని ఇప్పుడు భారత సైన్యం ధ్వంసం చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకమైన ఆయుధాన్ని వాడుతోంది. దానిని ఏటీజీఎం (యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్)గా వ్యవహరిస్తారు.

ఏమిటీ మిసైల్..

భారీగా సాయుధ కవచాలతో డిజైన్ చేసిన వాహనాలను ధ్వంసం చేయడానికి దీనిని వాడతారు. ఒక్కసారి దీనిలో టార్గెట్ లాక్ చేస్తే.. దానంతట అదే లక్ష్యాన్ని వెంటాడి ఛేదిస్తుంది. దీనిని భుజం పైనుంచి లేదా.. ట్రైపోడ్, వాహనాలపై అమర్చి ప్రయోగించవచ్చు. సురక్షితమైన దూరం నుంచి సాయుధ బలగాలను ఎదుర్కోవడానికి ఇది సరైన ఆయుధం.

ఎలా పనిచేస్తుంది..?

చాలావరకు ఏటీజీఎంల్లో షేప్డ్ ఛార్జి అనే దానిని వినియోగిస్తారు. ఈ పేలుడు పదార్థాల్లోని శక్తి మొత్తం ఒకే దిశలో కేంద్రీకృతమై ప్రయాణిస్తుంది. దీంతో మందపాటి సాయుధ కవచాన్ని కూడా ఛేదించేంత శక్తి ఇది విడుదల చేస్తుంది. కొన్ని అత్యాధునిక ఏటీజీఎంల్లో రెండుసార్లు పేలుళ్లు జరిగేలా ప్రత్యేకమైన వార్‌హెడ్లను వినియోగిస్తారు. తొలి పేలుడుకు ట్యాంక్‌కు బయట ఉన్న కవచం ధ్వంసం అవుతుంది. ఈ కవచాన్ని ఎక్స్‌ప్లోజివ్ రియాక్టివ్ ఆర్మర్ అంటారు. ప్రత్యర్థులు ప్రయోగించే క్షిపణుల వార్ హెడ్ దీనికి తగిలి మొదటే పేలిపోవాలన్న లక్ష్యంతో తయారుచేస్తారు. ఇలాంటివాటిని తట్టుకొని ట్యాంక్‌ను నాశనం చేయడానికి రెండో పేలుడు జరిగేలా తయారుచేస్తారు.

అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేసేలా వీటిని తయారుచేశారు. వీటిల్లో కొన్నింటికి టాప్ అటాక్ మోడ్ ఉంటుంది. ప్రయోగించాక గాల్లోకి ఎత్తుకు ఎగిరి.. ట్యాంక్ టాప్‌పై పడుతుంది. డ్యూయల్ మోడ్ సీకర్ అనే ప్రత్యామ్నాయం కూడా ఉంది. ఇది లక్ష్యాన్ని గుర్తించి.. దానిని అనుసరించేలా చేస్తుంది.

ఏటీజీఎంను ఆపగలరా..?

కొన్ని ట్యాంకులు రియాక్టివ్ ఆర్మర్ అనే కవచాన్ని వాడతాయి. వీటిపై కొన్నిరకాల ప్రత్యేకమైన ప్లేట్లు ఉంటాయి. ఏటీజీఎం తాకగానే బయటవైపునకు పేలుడు జరుపుతాయి. మరికొన్ని దేశాలు లోహపు పంజరం వంటి వాటిని ట్యాంకులపై అమరుస్తున్నాయి. ఏటీజీఎం వీటిని తాకి ముందే పేలిపోతాయి. ఇక క్షిపణుల సిగ్నల్స్‌ను జామ్ చేసే వ్యవస్థలు వాడటం.. లేదా డికాయ్‌లను ప్రయోగించి క్షిపణిని గందరగోళానికి గురిచేయడం చేయవచ్చు. ఇజ్రాయెల్ వద్ద ట్రోఫీ అనే ప్రత్యేక వ్యవస్థ ఉంది. అవి ట్యాంకర్ పైకి వచ్చే క్షిపణులను ముందే గుర్తించి పేల్చేస్తుంది. ఈ వ్యవస్థలు చాలా తేలిగ్గా.. వేగంగా.. స్మార్ట్‌గా పనిచేస్తాయి.



ప్రపంచవ్యాప్తంగా దాదాపు 130కి పైగా దేశాలు ఏటీజీఎంలను వినియోగిస్తున్నాయి. ఇక ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ కూడా వీటిని వినియోగిస్తోంది. ప్రస్తుతం భారత్ వద్ద నాగ్, ధ్రువాస్త్ర వంటివి ఉన్నాయి.

- ఇంటర్నెట్‌డెస్క్

సైనిక మాజీ ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ భేటీ

దిల్లీ: సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీ శుక్రవారం దిల్లీలో త్రివిధ దళాలకు చెందిన మాజీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. వీరిలో వాయుసేన, ఆర్మీ, నేవీ మాజీ అధిపతులు కూడా ఉన్నారు. వీరందరికీ భారత సైన్యంలోని వివిధ విభాగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత ప్రతిస్పందన, సరిహద్దుల్లోని పౌర నివాసంపై పాక్ సైన్యం కాల్పులు, డ్రోన్లతో దాడికి యత్నం తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఘర్షణ తీవ్ర రూపందాల్చుతున్న పరిస్థితుల్లో ప్రధాని మోదీ వివిధ అంశాలపై మాజీ ఉన్నతాధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నట్లు సమాచారం.

జమ్మూ నుంచి మూడు ప్రత్యేక రైళ్లు!

ఇంటర్నెట్‌డెస్క్: భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలోనే భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. జమ్మూ, ఉధంపుర్ నుంచి దిల్లీకి మూడు ప్రత్యేక రైళ్లను నడిపే యోచనలో ఉన్నట్లు ప్రకటించింది. దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితులు, ప్రయాణికుల డిమాండ్ మేరకే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

ఉద్రిక్తతల్ని రూపుమాపండి: హురియత్ నేత మీర్వాయిజ్

శ్రీనగర్: భారత్, పాకిస్థాన్‌లు ఉద్రిక్తతల్ని సడలించి వినాశనాన్ని నిరోధించాలని హురియత్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ మీర్వాయిజ్ ఉమర్ ఫారూఖ్ శుక్రవారం పేర్కొన్నారు. "ఉద్రిక్తతల్ని తక్షణం తగ్గించాలని ఇరుదేశాలనూ అభ్యర్థిస్తున్నాను. వినాశనానికి దారితీసే ప్రమాదకర మార్గంలో వెళ్లవద్దని కోరుతున్నాను" అని సోషల్ మీడియా పోస్టులో ఆయన పేర్కొన్నారు. ఈ ఉద్రిక్తతల మూలంగా జమ్మూకశ్మీర్ ప్రజలు నలిగిపోతున్నారని ఆయన అన్నారు.

దేశంలో సమృద్ధిగా ఆహార నిల్వలు

- ఇంధనానికీ కొరత లేదు
- ఆందోళన చెందొద్దు
- సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలను నమ్మొద్దు
- కేంద్రం, చమురు సంస్థల ప్రకటన

దిల్లీ: దేశీయ అవసరాలకు తగినంత ఆహార నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నిత్యావసర ఆహార వస్తువులను నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని తెలిపింది. భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రభుత్వం ఈ హెచ్చరిక జారీ చేసింది. ఇంధన నిల్వలు కూడా తగినంత ఉన్నాయని చమురు సంస్థలు ప్రకటించాయి. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ (ఎల్‌పీజీ)కు కొరత లేదని స్పష్టంచేశాయి. ప్రజలు ఆందోళన చెంది కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని తెలిపాయి. ఈ మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. పెట్రోల్ బంకుల దగ్గర జనాలు వరస కట్టిన వీడియోలు, పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తడంతో చమురు సంస్థలు ఈ వివరణిచ్చాయి. "దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయి. మా సరఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఎల్‌పీజీ మా అన్ని అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతంగా ఉండి, అనవసరమైన రద్దీని నివారించి మెరుగైన సేవలు అందించడంలో మాకు సహాయపడండి" అని 'ఎక్స్' వేదికగా ఐఓసీ పేర్కొంది.



అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు: కేంద్ర మంత్రి

నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వచేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హెచ్చరించారు. "దేశంలో ఆహార నిల్వలకు సంబంధించిన ప్రచార సందేశాలను నమ్మకండి. అవసరానికి మించి తగినంత ఆహార నిల్వలు దేశంలో ఉన్నాయి. నిత్యావసర వస్తువులతో వ్యాపారం చేసే వర్తకులు, హోల్ సేలర్లు, రిటైలర్లు చట్టబద్ధ సంస్థలతో సహకరించాలి. ఏ వ్యక్తైనా అక్రమంగా నిల్వ చేస్తే నిత్యావసర వస్తువుల చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని మంత్రి పేర్కొన్నారు.

తెర వెనక నవాజ్ దౌత్యం!

- భారత్-పాక్ ఉద్రిక్తతలు తగ్గించేందుకు రంగంలోకి పాక్ మాజీ ప్రధాని

లాహోర్: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన న్యూదిల్లీతో తెర వెనక చర్చలు ప్రారంభించినట్లు పాకిస్థాన్ పత్రిక శుక్రవారం తెలిపింది. షరీఫ్.. పాకిస్థాన్ అధికార పార్టీ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) అధ్యక్షుడు. ప్రస్తుత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు సోదరుడు. "రెండు అణ్వాయుధ దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అన్ని దౌత్యపరమైన వనరులను పాక్ ప్రభుత్వం ఉపయోగించాలని షరీఫ్ భావిస్తున్నారు" అని పాక్ పత్రిక 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పేర్కొంది. "భారత్‌కు వ్యతిరేకంగా దూకుడు నిర్ణయాలు తీసుకోవడానికి నేను సానుకూలంగా లేను" అని షరీఫ్ చెప్పినట్లు ఆ పత్రిక పేర్కొంది. "రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి లండన్ నుంచి పాకిస్థాన్‌కు నవాజ్ తిరిగి వచ్చారు. ఆయన తెర వెనక పనిచేస్తున్నారు" అని తెలిపింది. 1999లో కార్గిల్ యుద్ధం జరిగిన సమయంలో షరీఫ్ పాక్ ప్రధానిగా ఉన్నారు.

పాక్ మిత్రదేశాలకు 'ట్రావెల్' సంస్థల బుకింగ్‌లు బంద్

ఇంటర్నెట్ డెస్క్: పాక్‌కు మద్దతుగా నిలుస్తున్న తుర్కియే, అజర్‌బైజాన్ వంటి దేశాలకు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు అంతర్జాతీయ ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు ప్రకటించాయి. తుర్కియే, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్‌లకు నూతన బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపేయాలని నిర్ణయించినట్లు పర్యాటక సేవల బ్రాండ్ 'కాక్స్ అండ్ కింగ్స్' వెల్లడించింది. ఈ దేశాలకు అనవసరమైన ప్రయాణాలు మానుకోవాలని భారత ప్రయాణికులకు కాక్స్ అండ్ కింగ్స్ డైరెక్టర్ కరణ్ అగర్వాల్ సూచన చేశారు. ట్రిప్ ప్లానింగ్‌కు ముందు ట్రావెల్ అడ్వైజరీలను పరిగణనలోకి తీసుకోవాలని ఈజ్‌మైట్రిప్ వ్యవస్థాపకుడు నిశాంత్ ట్వీట్ చేశారు. తుర్కియే, అజర్‌బైజాన్‌లకు అన్ని ప్రయాణ ప్యాకేజీలను నిలిపివేసినట్లు ట్రావోమింట్ తెలిపింది. ఈ దేశాలకు ఇప్పటికే చేసుకున్న బుకింగ్‌లపై క్యాన్సలేషన్ ఫీజు వసూలు చేయబోమని వెల్లడించింది. అయితే.. అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ ఫ్లైట్ బుకింగ్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పింది. మరోవైపు.. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో హోటల్ బుకింగ్‌లు రద్దవుతున్నట్లు సంబంధిత ప్రతినిధులు తెలిపారు.

భారత్-పాక్ యుద్ధంలో జోక్యం చేసుకోం

స్పష్టం చేసిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



న్యూయార్క్: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఆ దేశాల నడుమ జరిగే యుద్ధంలో తాము జోక్యం చేసుకోబోమని అమెరికా స్పష్టం చేసింది. ప్రాథమికంగా అది తమకు సంబంధంలేని విషయమని తేల్చి చెప్పింది. ఆ ఇరు దేశాలను అమెరికా నియంత్రించలేదని, అయితే అణ్వాయుధ దేశాలైన వాటి మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించేందుకు ప్రోత్సహిస్తామని తెలిపింది. ఈ మేరకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ గురువారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

"భారత్, పాక్ ఆయుధాలు వదిలేయాలని అమెరికా చెప్పదు. కానీ, దీనికి ఉన్న ఏకైక మార్గం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే. మేము దౌత్య మార్గాల ద్వారా ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నిస్తాం. ఇరుదేశాల మధ్య ఘర్షణలు అణు సంఘర్షణగా మారకూడదని మా ఆశ. యుద్ధం వినాశకరమైంది. అందుకే రెండు దేశాలు సంయమనం పాటించాలి" అని జేడీ వాన్స్ స్పష్టం చేశారు.

త్వరగా ఉద్రిక్తతలు తగ్గించుకోండి: ట్రంప్



వాషింగ్టన్: పహల్గాం దాడి అనంతరం రోజు రోజుకీ పెరిగిపోతున్న ఉద్రిక్తతలను సాధ్యమైనంత త్వరగా తగ్గించుకోవాలని భారత్, పాకిస్థాన్‌లకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. ఈ విషయాన్ని శ్వేత సౌధం ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ శుక్రవారం వెల్లడించారు. 'భారత్, పాకిస్థాన్ మధ్య కొన్ని దశాబ్దాలుగా వివిధ అంశాలపై వివాదాలున్నాయి. పహల్గాం దాడి అనంతరం అధికమవుతున్న ఉద్రిక్తతలను సాధ్యమైనంత త్వరగా ఆ రెండు దేశాలు తగ్గించుకోవాలని ట్రంప్ కోరుకుంటున్నారు' అని కరోలిన్ తెలిపారు. శాంతి పునరుద్ధరణ కోసం తమ విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు కృషి చేస్తున్నారని వెల్లడించారు. భారత్, పాక్ నేతలతో ట్రంప్‌నకు సత్సంబంధాలున్నాయని, విదేశాంగ మంత్రి మార్కో రూబియో నిరంతరంగా ఇరు దేశాల నేతలతో మాట్లాడుతున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

పాక్‌కు గుణపాఠం చెప్పాల్సిందే

– యోగి ఆదిత్యనాథ్



ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పడం ప్రతి భారతీయుడి సంకల్పమని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. తాజాగా లఖ్‌నవూలో జరిగిన మహారాణా ప్రతాప్ జయంతి కార్యక్రమంలో మాట్లాడిన ఆయన శత్రుదేశంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ - పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు.



జమ్మూ-కశ్మీర్‌లో తాత్కాలిక శిబిరంలో తలదాచుకున్న నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు సమీప గ్రామాల ప్రజలను శుక్రవారం పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

భారత్ కన్నెర్ర



సింధూ జలాల ఒప్పందంలో జోక్యం చేసుకోం

● ప్రపంచ బ్యాంకు స్పష్టీకరణ

ఇంటర్నెట్‌డెస్క్: పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ పక్కన పెట్టిన సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో జోక్యం చేసుకునే ప్రసక్తేలేదని ప్రపంచబ్యాంకు స్పష్టం చేసింది. ఈ ఒప్పందం కుదిరే సమయంలో ప్రపంచ బ్యాంకు ఒక సహాయకుని పాత్ర మాత్రమే పోషించింది. ప్రస్తుత వివాదాన్ని పరిష్కరించేందుకు జోక్యం చేసుకోబోం అని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా అన్నారు. ఈ మేరకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. 1960లో కుదిరిన సింధూ నదీ జలాల ఒప్పందంలో ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వం వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుత పర్యటనలో భాగంగా అజయ్ బంగా ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ఆయన భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



బహుళ అంచెల కవచం.. భారత గగనతలం!

భారత్ ఎంతో వ్యయప్రయాసలకోర్చి సిద్ధం చేసుకున్న సమీకృత గగనతల రక్షణ గ్రిడ్.. అగ్నిపరీక్షను తట్టుకొని నిలబడింది. దేశానికి ఎదురయ్యే ముప్పులను సమర్థంగా కాచుకోవడంలో సత్తాను రుజువు చేసుకుంది. గురు, శుక్రవారం పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులను మన గగనతల వ్యవస్థ మార్గమధ్యంలోనే కూల్చేసింది. తోడేళ్ల మందలా విరుచుకుపడ్డ డ్రోన్లలో చాలావాటిని పేల్చేసింది. ఇలా పెద్దసంఖ్యలో అస్త్రాలను ప్రయోగించడం ద్వారా మన గగనతల రక్షణ వ్యవస్థను గందరగోళంలో పడేయాలన్న పాక్ కుట్ర బెడిసికొట్టింది.

ఏమిటీ గ్రిడ్?

భారత గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మలిచేందుకు బహుళ అంచెలతో ఒక క్షిపణి రక్షణ కవచాన్ని భారత్ అభివృద్ధి చేసింది. దీర్ఘశ్రేణి క్షిపణులు, డ్రోన్లు, గాల్లోనే కొన్నిగంటలు నిలిచి ఉండి, అదునుచూసి దెబ్బకొట్టే లాయిటరింగ్ మ్యునిషన్ల బారి నుంచి రక్షణ కల్పించేలా దీన్ని తీర్చిదిద్దింది. భిన్న శ్రేణుల్లో, భిన్న ఎత్తుల్లో శత్రు అస్త్రాలను అడ్డుకునేలా దీన్ని తయారుచేసింది. ఈ వ్యవస్థను భారత వైమానిక దళంలోని సమీకృత గగనతల ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ (ఐఏసీసీఎస్) సమన్వయం చేస్తుంటుంది. ఇందులో రాడార్లు, సెన్సర్లు, ఆదేశిక పోస్టులను హైస్పీడ్ ఆప్టిక్ ఫైబర్‌తో అనుసంధానం చేశారు. ఫలితంగా ఇందులోని అన్ని ఆయుధాలూ సమన్వయంతో పనిచేస్తాయి. శత్రువుల అస్త్రాల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించడానికి, వేగంగా స్పందించడానికి వీలవుతుంది.

సమీపం నుంచి..

స్పైడర్: ఇజ్రాయెలీ 8-10 కిలోమీటర్లు
తుంగుస్కా: 2.5- 10 కిలోమీటర్లు
జడ్‌యూ–23–2: 2.5 కిలోమీటర్లు
షిల్కా: 2.5 కిలోమీటర్లు
వెరీ షార్ట్‌రేంజ్ ఎయిర్ డిఫెన్స్ (వీఎస్‌హెచ్‌ఓఆర్‌ఏడీ) వ్యవస్థ: 6 కిలోమీటర్లు
పాత్ర: ముఖ్యమైన సైనిక శిబిరాలను డ్రోన్లు, తక్కువ ఎత్తులోని విమానాలు, ప్రిసిషన్ గైడెడ్ మ్యునిషన్‌ల బారి నుంచి రక్షణ.



వెలుపలి పొర: ఎస్-400

తయారీదారు: రష్యా
పరిధి: 400 కిలోమీటర్ల పరిధిలోని అస్త్రాలను నేలకూల్చగలదు. 600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను గుర్తించగలదు.
పాత్ర: భారత దీర్ఘశ్రేణి గగనతల రక్షణలో ఎస్-400 వెన్నెముకగా ఉంది. ఇది కీలక లక్ష్యాలను తాకడానికి ముందే శత్రువుల స్టెల్త్ యుద్ధవిమానాలు, క్రూజ్ క్షిపణులు, డ్రోన్లు, చిన్నపాటి బాలిస్టిక్ క్షిపణులను నేలకూల్చగలదు.



బాలిస్టిక్ క్షిపణి రక్షణ (బీఎండీ) వ్యవస్థ:

స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ వీటిని అభివృద్ధి చేసింది. ఇందులో రెండు వ్యవస్థలు ఉన్నాయి.

1. పృథ్వీ ఎయిర్ డిఫెన్స్ (పీఏడీ):
● ఇది భూవాతావరణానికి వెలుపల, 50 నుంచి 80 కిలోమీటర్ల ఎత్తులోని లక్ష్యాలపై పనిచేస్తుంది.
● 2వేల కిలోమీటర్ల పరిధి కలిగిన, ధ్వని వేగంతో పోలిస్తే 5 రెట్లు వేగం (మ్యాక్ 5) దూసుకెళ్లే క్షిపణులను ఇవి లక్ష్యంగా చేసుకోగలవు.
2. అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ (ఏఏడీ): ఇది తక్కువ ఎత్తులో, భూ వాతావరణంలో.. నేల నుంచి 30 కిలోమీటర్ల ఎత్తులో లక్ష్యాలను ఛేదించగలదు.
● ఏఏడీ ప్రధానంగా 2వేల కిలోమీటర్ల లోపు పరిధి గల స్వల్ప, మధ్య శ్రేణి క్షిపణులను పేల్చేస్తుంది.



స్వల్ప నుంచి మధ్యశ్రేణి వరకూ

ఇందులో ఆకాశ్, ఆకాశ్-ఎన్‌జీ, క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్యూఆర్‌శామ్) వ్యవస్థ ఉంటాయి.
● **తయారీదారు:** భారత్
పరిధి...
ఆకాశ్: 30-50 కిలోమీటర్లు,
ఆకాశ్–ఎన్‌జీ: 70 కిలోమీటర్ల వరకూ,
క్యూఆర్‌శామ్: 30 కిలోమీటర్లు
పాత్ర: తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లను వేగంగా పేల్చేయడం.

- ఈనాడు ప్రత్యేక విభాగం





మధ్యపొర

ఇందులో ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే మధ్యంతరశ్రేణి క్షిపణి (ఎంఆర్‌శామ్)/ బరాక్-8 వ్యవస్థ ఉంటాయి.
తయారీదారు: భారత్-ఇజ్రాయెల్ భాగస్వామ్యం
పరిధి: 70-100 కిలోమీటర్లు
పాత్ర: వేగంగా ప్రయాణించే యుద్ధవిమానాలు, క్రూజ్ క్షిపణులు, డ్రోన్లపై దాడి చేయగలదు.

సి-యూఏఎస్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు:

సమీకృత మానవరహిత విమాన విధ్వంసక (సీ-యూఏఎస్) గ్రిడ్. ఇందులో జామర్లు, స్పూఫర్లు, డైరెక్టెడ్ ఎనర్జీ ఆయుధాలు ఉంటాయి.
పాత్ర: శత్రు డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్లను రాడార్లు, ఆర్ఎఫ్ సెన్సర్ల సాయంతో గుర్తిస్తుంది. తుపాకులు లేదా ఎలక్ట్రానిక్ వ్యవస్థల సాయంతో వాటిని నిర్వీర్యం చేస్తుంది.

అవసరమైతే రంగంలోకి ప్రాదేశిక సైన్యం

● **సైనిక చీఫ్‌కు అధికారాలు**

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ పన్నాగాలకు చెక్ పెట్టేందుకు భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారాలిచ్చింది. అవసరమైతే పార్ట్‌టైం వాలంటీర్లతో కూడుకున్న ప్రాదేశిక సైన్యం (టెరిటోరియల్ ఆర్మీ)ని కూడా రంగంలోకి దించాలని పేర్కొంటూ కేంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాదేశిక సైన్యంలోని అధికారులను, సిబ్బందిని సైన్యానికి సేవలందించేందుకు రావాల్సిందిగా ఆదేశించేందుకు ఆర్మీ చీఫ్‌కు అధికారం కల్పించింది. సాధారణ సైన్యంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని ప్రాదేశిక సైన్యానికి సూచించింది.

ప్రాదేశిక సైన్యం సిబ్బంది 1962, 1965, 1971ల్లో జరిగిన యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలు చేశారు. ఇటీవల కేరళలో వరదలు వచ్చినప్పుడు సేవలు అందించిన మలయాళ ప్రముఖ నటుడు మోహన్ లాల్ కూడా టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారి.

టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, భారత క్రికెట్ మాజీ దిగ్గజం కపిల్ దేవ్, భాజపా నేత అనురాగ్ ఠాకుర్, అథ్లెట్ అభినవ్ బింద్రా సహా పలువురు సెలబ్రిటీలు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయిలో ఉన్నారు. ఈ బలగంలో కనీస సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు క్యాంటీన్, మెడికల్, ఎల్‌టీ అలవెన్సులు లభిస్తాయి.

దాదాపు 50 వేల మంది!

ఒక్క మాటలో చెప్పాలంటే టెరిటోరియల్ ఆర్మీని ఒక సైనిక రిజర్వ్ బలగం అని చెప్పవచ్చు. ఇందులోని వారికి సాధారణ సైనికుల మాదిరిగానే శిక్షణ ఉంటుంది. వారంతా బయట తమ పనులు చేసుకుంటూనే స్వచ్ఛందంగా సైన్యంతో పనిచేస్తుంటారు. ప్రస్తుతం దాదాపు 50 వేల మంది వరకు టెరిటోరియల్ ఆర్మీ సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ఈ బలగంలో పనిచేసిన అధికారుల్లో పలువురు శౌర్య, విశిష్ట సేవా పురస్కారాలను కూడా అందుకున్నారు.

ఆడలేక ఫేక్ లోడు!

● **పాత ఫొటోలు, నకిలీ వీడియోలతో పాక్ ప్రచారం**
● **ఆధారాలతో నిగ్గుతేల్చిన భారత్**



ఈటీవీ భారత్: భారత సైన్యం పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడం, అటు నుంచి ప్రయోగించిన డ్రోన్లను కూల్చివేయడంతో పాకిస్థాన్ ఫేక్ న్యూస్ ప్రసారానికి తెర లేపింది. పాత వీడియోలు, ఫొటోలతో అంతర్జాతీయ సమాజాన్ని ఏమార్చే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా పాక్ అనుకూల సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ఈ ప్రచారం ఉద్ధృతంగా జరుగుతోంది. ఆఖరికి వీడియో గేమ్స్‌లోని వీడియోలను కూడా పాక్ వదలడం లేదు. గుజరాత్ పోర్టుపై దాడి, భారత సైనికుల మృతి.. ఇలా నకిలీ వార్తలు ప్రచారం చేస్తున్న పాకిస్థాన్ ఫేక్ వీడియోలపై ఫ్యాక్ట్ చెక్‌తో పీఐబీ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) నిజాల నిగ్గుతేల్చింది. శత్రుదేశం చేస్తున్న ఈ తప్పుడు ప్రచారాన్ని 16 ఆధారాలతో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఎండగట్టింది. గుజరాత్‌లోని సూరత్ సమీప హజీరా పోర్టుపై దాడి జరిగిందంటూ వైరల్ అవుతున్న వీడియో 2021 నాటి ఓ ఆయిల్ ట్యాంకరు పేలుడుకు సంబంధించినది. జలంధర్‌లో డ్రోన్ దాడి అంటూ ప్రచారంలో ఉన్న దృశ్యాలు వేరే అగ్నిప్రమాదం జరిగినప్పటివని పీఐబీ వెల్లడించింది. అమృత్‌సర్‌లోని సైనిక స్థావరంపై పాకిస్థాన్ దాడులు జరిపిందని మరో వీడియోను వైరల్ చేశారు. ఇది కుట్రపూరితంగా సృష్టించిన ఫేక్ వీడియో అని తేలింది. మరోవైపు.. పాక్‌లోని గుజ్రాన్‌వాలాలో భారత్ ప్రయోగించిన యూఏవీ డ్రోన్‌ను పాకిస్థాన్ ఆర్మీ కూల్చినట్లు వైరల్ అవుతున్న వీడియో కూడా నకిలీదేనని వెల్లడైంది. జమ్మూకశ్మీర్ ఎయిర్‌బేస్ మీద పాకిస్థాన్ దాడులు జరిపిందంటూ పాక్ అనుకూల 'ఎక్స్' ఖాతాల్లో కొన్ని పోస్టులు కనిపించాయి. అఫ్గానిస్థాన్‌లోని కాబూల్ విమానాశ్రయంలో 2021 ఆగస్టులో జరిగిన పేలుడు ఫొటోను ఇందుకు వినియోగించినట్లు పీఐబీ నిరూపించింది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీలో భారత సైన్యంపై జరిగిన ఆత్మాహుతి దాడిగా వ్యాప్తిలోకి వచ్చిన వీడియో నిజానికి గతంలో ఓ పొలంలో చెలరేగిన మంటలుగా స్పష్టమైంది. భారత సైనికుల శిబిరాన్ని పాక్ దళాలు ధ్వంసం చేశాయనే వీడియోలోనూ వాస్తవం లేదు. భారత సైన్యంలో '20, రాజ్ బెటాలియన్' అన్నదే లేదు.

● 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్న భారత విమానం కుప్పకూలిందని పాకిస్థాన్ వైరల్ చేస్తున్న వీడియో కూడా నకిలీయేనని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్‌లో తేలింది. అది 2019లో జమ్మూకశ్మీర్‌లో భారత వైమానిక దళానికి చెందిన ఎంఐ17 వీ5 హెలికాప్టరు కూలినప్పటి వీడియో అని స్పష్టం చేసింది. అలాగే జమ్మూకశ్మీర్‌లో ఉన్న బట్టల్ సెక్టారులోని ఆర్మీ పోస్టులపై పాక్ సైన్యం దాడులు జరపడంతో 12 మంది భారత సైనికులు మరణించారని ఓ వీడియోను వైరల్ చేశారు. ఇది 2011 నాటిదని వెల్లడైంది. ఆర్మీ చీఫ్ పేరిట వైరల్ చేసిన ఓ నకిలీ లేఖలో ఆర్మీ చీఫ్ పేరే తప్పుగా ఉంది. భారత్‌పై పాకిస్థాన్ క్షిపణి దాడి చేసిందని ఓ వీడియోను పోస్టు చేశారు. అది 2020లో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించినది.

పాకిస్థాన్ సైనికుడిని భారత్ అదుపులోకి తీసుకున్నట్లుగా కొన్ని ఫొటోలు గురువారం ప్రసార మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొట్టాయి. అవి నకిలీ ఫొటోలని తర్వాత తేలింది. అనేక పత్రికల్లో ప్రచురితమైన, టెలివిజన్ మాధ్యమాల్లో ప్రసారమైన ఈ ఫొటో కూడా అలాంటిదే. ఇది 2016లో తుర్కియేలో యుద్ధ విమానం కూలినప్పటి ఫొటో.



విషసర్పం.. తుర్కియే

● **ఆ దేశం డ్రోన్లనే భారత్‌పై ప్రయోగిస్తున్న పాకిస్థాన్**
● **ధ్రువీకరించిన ఫోరెన్సిక్ నిపుణులు**

చేసిన సాయానికి కృతజ్ఞత చూపకపోయినా పర్వాలేదు. ద్రోహం చేస్తే..! ఇప్పుడదే పని తుర్కియే చేస్తోంది. 2023లో ఆ దేశంలో భారీ భూకంపం సంభవించినప్పుడు సాయం ప్రకటించిన తొలి దేశం భారత్. 'ఆపరేషన్ దోస్త్' పేరిట భారీగా మానవతా సాయాన్ని అందించింది. బాధితులకు ఆహారం, మందులు సరఫరా చేయడానికి ప్రత్యేకంగా కిసాన్ డ్రోన్లను మోదీ ప్రభుత్వం పంపింది. అప్పుడు మనం మానవత్వాన్ని చూపితే దాన్ని మరిచి ఇప్పుడు భారత్‌పై దాడికి పాకిస్థాన్‌కు డ్రోన్లను పంపింది.



తొలి నుంచీ ద్వేషమే..!

పాకిస్థాన్ గురువారం భారీస్థాయిలో భారత్‌పై డ్రోన్ దాడులు చేసింది. దాదాపు 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించింది. వాటిని భారత్ కూల్చివేసింది. ఆ శకలాలను ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షించారు. అవన్నీ తుర్కియేకు చెందిన 'అసిస్ గార్డ్ సోనగర్' డ్రోన్లుగా ధ్రువీకరించారు. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు తొలి నుంచీ భారత్ అంటే విపరీతమైన ద్వేషం. ఆ విషయాన్ని అనేక సందర్భాల్లో ఆయన బహిరంగంగా వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డోగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఆయన ఇష్టపడలేదు.

ఓ ప్రణాళిక ప్రకారం..

పహల్గాం ఉగ్రదాడి జరగగానే పాకిస్థాన్‌పై భారత్ దాడి చేస్తుందని తుర్కియే ముందుగానే ఊహించింది. ప్రపంచమంతా భారత్‌కు సంఘీభావం తెలుపుతున్న సమయంలో ఆరు సైనిక విమానాల్లో పాక్‌కు ఆయుధాలను ఎర్డోగాన్ ప్రభుత్వం పంపింది. తుర్కియే సి-130ఈ హెర్క్యులస్ విమానం గత నెల 28న పాకిస్థాన్‌లో దిగిన విషయాన్ని అంతర్జాతీయ గగనతల నిఘా సంస్థలు కూడా గుర్తించాయి. అయితే ఇంధనం నింపుకొనేందుకు తమ యుద్ధ విమానం దిగిందని ప్రకటనిచ్చి తుర్కియే తప్పించుకొనే ప్రయత్నం చేసింది. తర్వాత ఓ యుద్ధనౌకను కూడా కరాచీ నౌకాశ్రయానికి పంపింది. ఇప్పుడు ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోంది. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్‌బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కళ్లముందు ఆటలాడిన కవలలు కాసేపటికే శవాలయ్యారు


● **పాక్ కాల్పుల్లో అమాయకుల మరణాలపై ముఫ్తీ ఆవేదన**

శ్రీనగర్: భారత్-పాకిస్థాన్ సైనిక చర్యల కారణంగా సరిహద్దుల్లో తరచూ మహిళలు, చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. "కళ్లముందే ఆటలాడిన కవల చిన్నారులు అంతలోనే రక్తపు మడుగులో కనిపించారు. ఇలా ఎదురుకాల్పుల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు, మహిళలు చేసిన తప్పేంటి..? జమ్మూకశ్మీర్ ప్రజలు, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల వారు ఇంకా ఎంతకాలం బాధపడాలి..? తల్లులకు ఎంతకాలం ఈ కడుపుకోత..?" అని ప్రశ్నిస్తూ ఆమె కంటతడి పెట్టారు. భారత్, పాక్ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాజకీయ జోక్యమే శ్రేయస్కరమని, ప్రాంతీయ శాంతి సుస్థిరతల స్థాపనకు సైనిక చర్య పరిష్కారం కాదని ముఫ్తీ అన్నారు. ఇరుదేశాల నాయకులూ సంయమనం పాటించి తక్షణం పరస్పర దాడులకు స్వస్తి పలకాలని పేర్కొన్నారు.

ఘనంగా రష్యా విజయోత్సవాలు

● **హాజరైన 27 దేశాల నేతలు**

మాస్కో: రెండో ప్రపంచ యుద్ధంలో నాజీలను చిత్తుగా ఓడించి 80 ఏళ్లు అయిన సందర్భంగా రష్యా శుక్రవారం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించింది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో భారీ సైనిక కవాతు జరిగింది. ప్రపంచ రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని చాటుకునేలా వివిధ రకాల ఆధునిక ఆయుధాలను ప్రదర్శించింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయీ ఇనాసియో లులా డా సిల్వా సహా 27 దేశాల నేతలు అతిథులుగా హాజరయ్యారు. భారత దేశ ప్రతినిధిగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ పాల్గొన్నారు. రెడ్‌స్క్వేర్‌లో నిర్వహించిన కవాతులో చైనా, ఈజిప్టు, మంగోలియా, మయన్మార్, వియత్నాం సహా 13 దేశాలకు చెందిన సైనిక దళాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ... ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొంటున్న తమ దేశ సైనికుల ధైర్య సాహసాలను ప్రశంసించారు.



విజయోత్సవాల్లో పుతిన్‌తో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తదితరులు

కేంద్ర వైద్య సిబ్బంది సెలవులు రద్దు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ వైద్య శాఖ, కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఎయిమ్స్, సఫ్దర్ గంజ్, రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రులు కూడా తమ సిబ్బంది సెలవులను రద్దు చేశాయి. భారత పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని ఆస్పత్రుల సన్నద్ధతపై కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రి జె.పి.నడ్డా సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఎలాంటి సెలవులూ మంజూరు చేయం అని వైద్యశాఖ స్పష్టం చేసింది. మరోవైపు గుజరాత్ ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సెలవుల్ని రద్దు చేసింది. అనివార్యమైనవి తప్ప మిగిలిన అన్ని రకాల సెలవుల్నీ రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

● **శాశ్వత కమిషన్ కోరుతున్న మహిళా సైనికాధికారుల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య**

దిల్లీ: సైన్యంలో శాశ్వత కమిషన్ (పీసీ) హోదాను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మహిళా సైనికాధికారుల కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) పదవీ కాలం ముగిసిన ఈ మహిళా సైనికాధికారులను తదుపరి విచారణ వరకు వారి విధుల్లో కొనసాగనివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్మీలోని ఆ మహిళా సైనికాధికారుల నైతిక స్థైర్యం సడలిపోయేలా నిర్ణయాలు తీసుకోవడం సముచితం కాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం అభిప్రాయపడింది. 69 మంది మహిళా సైనికాధికారుల పిటిషన్లపై విచారణను ఆగస్టుకు వాయిదా వేసింది. 'ప్రస్తుత పరిస్థితుల్లో వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. దేశానికి ఉత్తమ సేవలందించే సర్వీసులో ఉన్నారు. ప్రతిభావంతులైన వారి సేవలను సైన్యంలో వినియోగించుకోవచ్చు. సుప్రీంకోర్టు చుట్టూ తిరగాలని తెలిపే సమయంకాదిది' అని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు.

సిస్టీన్ చర్చిలో పోప్ లియో–14 తొలి ప్రార్థన



వాటికన్ సిటీ: ఉత్తర అమెరికా వాస్తవ్యుడైన తొలి పోప్‌గా ప్రత్యేకత చాటుకున్న నూతన పోప్ లియో-14(రాబర్ట్ ప్రివోస్ట్) శుక్రవారం వాటికన్ నగరంలోని సిస్టీన్ చాపెల్ చర్చిలో నిర్వహించిన సామూహిక ప్రార్థనా కార్యక్రమానికి మొదటిసారిగా అధ్యక్షత వహించారు. ఆయనను ఎన్నుకోవడానికి ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మత గురువులైన కార్డినళ్లు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోప్ కార్యక్రమంలో పాల్గొన్న కార్డినళ్లను ఆశీర్వదిస్తూ ప్రార్థనా వేదికను చేరుకున్నారు. క్రీస్తు పట్ల ఆనందంతో కూడుకున్న విశ్వాసానికి మనందరం సాక్షులుగా నిలవాలని పిలుపునిచ్చారు. "శిలువను మోయడానికి, తద్వారా ఆశీర్వాదం పొందడానికి మీరందరూ నన్ను ఈ వేదికపై నిలబెట్టారు. సమున్నతమైన ఈ పయనంలో ఒక చర్చి వ్యవస్థగా, ఒక సమాజంగా, క్రీస్తు స్నేహితులుగా, విశ్వాసులుగా మీరందరూ సువార్తను వ్యాపింపజేయడానికి నాతో కలిసి వస్తారని నాకు తెలుసు" అని పోప్ లియో-14 పేర్కొన్నారు. అమెరికాలోని షికాగోకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ గురువారం క్యాథలిక్కుల అత్యున్నత గురువైన పోప్‌గా ఎన్నికైన విషయం విదితమే. పోప్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఆయన తన పేరును లియో-14గా మార్చుకున్నారు.

18న లాంఛనంగా బాధ్యతలు

పోప్ లియో-14 ఈనెల 18న లాంఛనంగా బాధ్యతలు స్వీకరిస్తారని వాటికన్ ప్రకటించింది. పోప్ హోదాలో ఆయన ఈనెల 21న ప్రజా దర్శనానికి అందుబాటులో ఉంటారు.

మోదీ అభినందనలు

దిల్లీ: క్యాథలిక్కుల ఆధ్యాత్మిక జగతికి, వాటికన్ నగర రాజ్యానికి నూతన అధినేతగా ఎన్నికైన పోప్ లియో-14కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సామరస్యం, సంఘీభావం, సేవల వంటి ఉన్నతాశయాలను పెంపొందించాల్సిన సమయంలో పోప్ లియో ప్రపంచ యవనికపైకి వచ్చారని మోదీ తన సోషల్ మీడియా సందేశంలో పేర్కొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రాలపై రుద్దలేం సుప్రీంకోర్టు

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపీ) కచ్చితంగా అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. విద్యా విధానాన్ని అమలు చేయాలని ఏ రాష్ట్రాన్నీ బలవంతం చేయలేమని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉంటే మాత్రం ఆ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది.

దేశవ్యాప్తంగా విద్యలో ఏకరూపకతను నెలకొల్పడానికి కేంద్రం ఎన్ఈపీని రూపొందించిందని, పలు రాష్ట్రాలు దీనిని రాజకీయ సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని పిటిషనర్ ఆరోపించారు. ఎన్ఈపీ అమలును నిరాకరించడం ద్వారా పాఠశాల పిల్లలకు ఆ హక్కును దూరం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అంశంతో సంబంధం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించగా....తాను తమిళనాడుకు చెందిన వ్యక్తినని, దిల్లీలో స్థిరపడ్డానని పిటిషనర్ తెలిపారు. దేశ రాజధానిలో స్థిరపడినప్పుడు వివిధ రాష్ట్రాల్లో జాతీయ విద్యావిధానం అమలు గురించి పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం ఏముందని నిలదీసింది. వ్యాజ్యాన్ని కొట్టేసింది.

ప్రధాన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత

తిరుమలను ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు


శ్రీవారి ఆలయం ఎదుట తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

ఈనాడు, విశాఖపట్నం; తిరుమల, గన్నవరం గ్రామీణం, చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో తిరుమలను మొత్తం పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని (ఏరియా డామినేషన్) తనిఖీలు చేపట్టారు. తిరుమలలో ఇలా చేయడం ఇదే మొదటిసారి అని స్థానిక డీఎస్పీ విజయ్‌శేఖర్ తెలిపారు. డీఎస్పీ, తితిదే వీజీఓ సురేంద్ర, ఆక్టోపస్ విభాగం ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి శ్రీవారి ఆలయం, నందకం అతిథి గృహం, ఆర్టీసీ బస్టాండ్లు, వసతి సముదాయాల్లో తనిఖీలు చేశారు. ప్రతి బృందంలో పోలీసు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏఆర్ పోలీసులు, తితిదే విజిలెన్స్, ఆక్టోపస్ సభ్యులు ఉన్నారు. ఆయా ప్రదేశాల్లో అనుమానాస్పద వస్తువులు, బ్యాగులను సోదా చేసి, అనుమానితుల వివరాలు సేకరించారు. డీజీపీ హరీష్ గుప్తా ఆదేశాల మేరకు 'ఏరియా డామినేషన్ గస్తీ' ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

■ తిరుపతి జిల్లాలోని నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగృహం వద్ద భద్రత పెంచారు. విజయవాడలో ముఖ్యమంత్రి నివాసం వద్ద ఉన్న 11 బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్, సిబ్బంది శుక్రవారం రాత్రి నారావారిపల్లెకు చేరుకున్నారు. చంద్రగిరి సీఐకి భద్రతపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

గన్నవరం విమానాశ్రయంలో..


గన్నవరం విమానాశ్రయం ప్రధాన ద్వారం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

గన్నవరం విమానాశ్రయం పరిసరాల్లో శుక్రవారం భద్రతను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయ ప్రధాన ద్వారం వద్ద వాహనాలను నిలిపివేసి.. విమాన ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బందిని మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. శనివారం షార్జా సర్వీస్ ఉండడంతో పాత టెర్మినల్ వద్ద భద్రతను మరింత పెంచారు. భద్రతా సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆదివారం రాత్రి నుంచి సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు రావొచ్చని అధికారులు వెల్లడించారు.


'ఆర్నాలా' నౌకను అప్పగించే కార్యక్రమంలో నేవీ, గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ సంస్థ ప్రతినిధులు

'ఆర్నాలా' నౌక నేవీకి అప్పగింత

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే : సముద్ర అంతర్భాగంలో నౌకాదళ అవసరాల నిమిత్తం నిర్మించిన 'యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్-వాటర్ క్రాఫ్ట్' నౌక 'ఆర్నాలా'ను శుక్రవారం ఇండియన్ నేవీకి అప్పగించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. మొత్తం ఎనిమిది నౌకా నిర్మాణ ఆర్డర్లను దక్కించుకున్న గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ సంస్థ తొలి నౌక నిర్మాణం పూర్తి చేయడంతో నేవీ కార్యకలాపాలకు వినియోగించనున్నారు. కార్యక్రమంలో జీఆర్ఎస్ఈ, నేవీ, ఎల్.అండ్.టి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు భద్రత పెంపు

ఇప్పటికే హై సెక్యూరిటీ జోన్‌లో ఉన్న విశాఖ పోర్టులో భద్రతను ఇంకా పెంచారు. గంగవరం పోర్టు వద్దా భద్రత పెంచినట్లు సమాచారం. తూర్పు తీరంలో గస్తీలో ఉండే విమాన వాహక నౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్'ను పశ్చిమ తీరంలో మోహరించినట్లు తెలిసింది. హెచ్‌పీసీఎల్, ఐటీసీ, బీపీసీఎల్‌లకు చెందిన టెర్మినళ్ల వద్ద భద్రత, తనిఖీల వ్యవస్థలను ముమ్మరం చేశారు. హెచ్‌పీసీఎల్ పెట్రోపార్కు, వైట్ ఆయిల్, బ్లాక్ ఆయిల్, ఎల్పీజీ టెర్మినళ్లు, ఐవోసీ, బీపీసీ టెర్మినళ్లు, రైల్వే ఇంధన రవాణా ట్యాంకుల వద్ద, చమురు నిల్వల ట్యాంకుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.



బాలు, పార్వతిల కుటుంబానికి చెక్ అందజేస్తున్న చంద్రబాబు, సిప్లాన్ సంస్థ ఎండీ అనంతయ్య ★ బాలు, పార్వతిల కుమారుణ్ని ఎత్తుకున్న సీఎం

పీ4తో 20 లక్షల పేద కుటుంబాల దత్తత

- చేయూత అందించేందుకు మార్గదర్శులను తీసుకొస్తాం
- సీఎం చంద్రబాబు

ఈనాడు - అనంతపురం, న్యూస్‌టుడే- ఉరవకొండ: ఆంధ్రప్రదేశ్‌ను పేదరికం లేని రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల పేద కుటుంబాల బాధ్యత తీసుకునేలా మార్గదర్శకులను తీసుకొస్తామని ప్రకటించారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద ప్రజావేదికలో ఆయన ప్రసంగించారు. ఆగస్టు 15న పీ4ను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామన్నారు. 'పేదవారిలో చాలామంది అవకాశాలు లేకపోవడం వల్లే వెనుకబడిపోతున్నారు. అందుకే అసమానతలు తగ్గడం లేదు. అంబేడ్కర్‌కు బరోడా మహారాజు సాయం చేసినట్లు సమాజంలోని సంపన్నులు పేదలకు చేయూతనందించాలి. ఇందుకోసమే ప్రభుత్వం అనుసంధానకర్తగా ఉండేలా పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలోని 10 శాతం మంది ధనికులు 20 శాతం మంది పేదలను దత్తత తీసుకుని వారికి అన్నిరకాలుగా తోడ్పాటు అందించాలి. బంగారు కుటుంబం- మార్గదర్శి విధానంలో ఇప్పటికే రాష్ట్రంలో 15 వేల కుటుంబాలను దత్తత తీసుకున్నారు' అని వివరించారు. దీంతోపాటు ఎస్సీలకు ఉచితంగా సోలార్ ప్యానళ్లు అందిస్తామన్నారు.

బంగారు కుటుంబానికి చేయూత

ఛాయాపురం గ్రామానికి చెందిన పార్వతి, బాలు దంపతుల కుటుంబాన్ని చంద్రబాబు వేదికపైకి పిలిచి మాట్లాడించారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులిద్దరూ రోజూ పనులకు వెళ్తేనే ఇల్లు గడుస్తుంది. బాలు రెండేళ్ల కిందట విద్యుదాఘాతానికి గురై పనికి వెళ్లలేకపోతున్నాడు. భార్య ఒక్కరే కూలికి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తోంది. పార్వతి తన కష్టాలు చెప్పుకోవడంతో సీఎం స్పందించి వారి కుటుంబానికి చేయూతనివ్వడానికి ఎవరైనా మార్గదర్శిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన సిప్లాన్ డ్రగ్స్ అధినేత రాళ్లపల్లి అనంతయ్య ఆ కుటుంబాన్ని ఆదుకుంటానన్నారు. ఆ దంపతులకు ఉపాధి చూపించడంతో పాటు పిల్లల చదువుకు సహకారం అందిస్తానని ప్రకటించారు. నలుగురు పిల్లల పేరుతో రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు బ్యాంకులో వేస్తామని చెక్ ఇచ్చారు. ప్రభుత్వం తరపున ఆ కుటుంబానికి ఇల్లు కట్టించి ఇస్తామని సీఎం ప్రకటించారు. సుజలాన్ పవన విద్యుదుత్పత్తి సంస్థ 15 బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చింది.

జెత్వానీ కేసులో పీఎస్ఆర్‌కు చుక్కెదురు

బెయిల్ తిరస్కరించిన విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు

ఈనాడు, అమరావతి: బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీని వేధింపులకు గురి చేసిన కేసులో ఐపీఎస్ అధికారి, నాటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులుకు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగిశాయి. ఈ మేరకు న్యాయాధికారి రాజేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పీఎస్ఆర్‌ను గత నెలలో సీఐడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కేసులో ఇంకా దర్యాప్తు పూర్తి కాలేదనీ, ఈ దశలో నిందితుడికి బెయిల్ ఇస్తే విచారణపై ప్రభావం పడుతుందని వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వాదనలు వినిపించారు. ఈ కేసుతో నిందితుడికి ఎటువంటి సంబంధం లేదని, కక్షపూరితంగా పేరు చేర్చారని పీఎస్ఆర్ తరపు న్యాయవాది వాదించారు.

కారు డ్రైవరు భార్యతోనూ గ్రూప్-I పత్రాలు దిద్దించారు!

నందిగామ, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్ష పత్రాల మూల్యాంకనం విషయంలో విస్తుపోయే వాస్తవాలెన్నో వెలుగు చూస్తున్నాయి. ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలతో కమిషన్ కార్యాలయం నుంచి మెయిన్స్ జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించి అక్కడ మూల్యాంకనం చేయించారు. అనామకులు, అర్హత లేని వారితో జవాబు పత్రాలను దిద్దించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంతో సిట్ అధికారులు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడైన ఓ అధికారి తన కారు డ్రైవరు భార్యతో కూడా మూల్యాంకనం చేయించినట్లు వారు గుర్తించారు. ఇటీవల వారి వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు తెలిసింది.

విశ్రాంత ఐఏఎస్ ధనుంజయరెడ్డికి నోటీసులు

- జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్పకు కూడా
- వీరు ముగ్గురూ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులు
- ముడుపులు వీరి ద్వారా జగన్‌కు చేరినట్లు రిమాండ్ రిపోర్టుల్లో ప్రస్తావన
- వెంటనే ఈ ముఠా పరార్.. 15 రోజులుగా అజ్ఞాతంలోనే


కృష్ణమోహన్‌రెడ్డి కుమారుడు రోహిత్‌రెడ్డికి (నల్ల టీషర్టు ధరించిన వ్యక్తి) నోటీసులు అందజేస్తున్న సిట్ అధికారులు


గోవిందప్ప బాలాజీ కుటుంబసభ్యులకు నోటీసులు అందజేస్తున్న సిట్ అధికారులు

ఈనాడు-అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులైన సీఎంవో మాజీ కార్యదర్శి విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీకి సిట్ నోటీసులు జారీ చేసింది. ఈనెల 11న విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. 'వైకాపా ప్రభుత్వ హయాంలో ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా మద్యం విధానాన్ని రూపొందించటమే కాక, ఆ కుట్ర అమలు చేసేందుకు అనుకూల అధికారుల నియామకంలో నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డిది ప్రధాన పాత్ర. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయటం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించటంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పతో పాటు ధనుంజయరెడ్డి పాత్ర ఉంది. ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనే దానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారు' అని సిట్ ఇప్పటికే తేల్చింది. మద్యం ముడుపుల సొత్తంతా రాజ్ కెసిరెడ్డి వీరికి చేరవేస్తే.. వీరు దాన్ని జగన్‌కు చేర్చేవారని ఇప్పటివరకూ అరెస్టయిన నిందితుల రిమాండ్ రిపోర్టుల్లో ప్రస్తావించింది.

'అంతిమ లబ్ధిదారు'ను తేల్చటమే లక్ష్యం..

జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలన్నీ చూసే గోవిందప్ప చార్టర్డ్ అకౌంటెంట్. మద్యం కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపుల సొమ్మును డొల్ల కంపెనీల ద్వారా మళ్లించడంలో ఆయనదే ప్రధాన పాత్ర. అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తే.. ఆ సొమ్ము అంతిమంగా ఎవరికి, ఎలా చేరింది? ఈ కుంభకోణంలో 'అంతిమ లబ్ధిదారు' ఎవరనేది ఆధారాలతో సహా తెలుతుందని సిట్ భావిస్తోంది. కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలకు ముడుపులు ఇచ్చినట్లు డిస్టిలరీల యజమానులు వాంగ్మూలాలిచ్చారు. వాటి ఆధారంగా సిట్ ఈ ముగ్గుర్ని ప్రశ్నించనుంది.

కుటుంబ సభ్యులకు నోటీసుల అందజేత

రిమాండ్ రిపోర్టుల్లో తమ ప్రస్తావన ఉందని తెలిసిన వెంటనే ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. సుప్రీంకోర్టులో కూడా అరెస్టు నుంచి వీరికి ఎలాంటి మధ్యంతర రక్షణ లభించలేదు. దీంతో ఏ క్షణమైనా తమను అరెస్టు చేసే అవకాశముందని భావించి వీరు ముగ్గురూ పరారైపోయారు. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసేసి.. రహస్య స్థావరాల్లో గడుపుతున్నారు. వీరి కోసం గత మూడు రోజులుగా సిట్ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. అందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్, బెంగళూరుల్లోని 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. వీరి నివాసాలు, కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టాయి. వారెక్కడా అందుబాటులో లేకపోవటంతో ఈ నెల 11న వారు విచారణకు రావాలని ఆదేశిస్తూ.. కుటుంబ సభ్యులకు సిట్ అధికారులు నోటీసులిచ్చారు.

■ హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఫార్ట్యూన్ వన్ టౌన్‌షిప్‌లోని ధనుంజయరెడ్డి నివాసంలో తనిఖీలు చేశారు.

■ అత్తాపూర్ దగ్గర ఉప్పరపల్లి సన్‌రైజ్ వ్యాలీలోని పి.కృష్ణమోహన్‌రెడ్డి నివాసంలో, ఆయన కుమారుడు రోహిత్‌రెడ్డి కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

■ హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బుర్రి రెసిడెన్సీలోని గోవిందప్ప నివాసం, రఘురామ్ సిమెంట్స్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు.

■ బెంగళూరులోని భారతి సిమెంట్స్ అతిథిగృహం, కార్యాలయాల్లోనూ ఈ తనిఖీలు జరిగాయి. ఈ నిందితులు అక్కడ ఉండే అవకాశముందనే ఉద్దేశంతో సోదాలు చేపట్టారు.

సైనికులకు, ప్రధానికి దైవబలం కోసం ఆలయాల్లో పూజలు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయం

ఈనాడు, అమరావతి: 'పాకిస్థాన్‌పై చేస్తున్న ధర్మయుద్ధం ఆపరేషన్ సిందూర్‌కు ప్రతి ఒక్కరి నైతిక మద్దతు అవసరం. శత్రుమూకలపై పోరాడుతున్న సైన్యానికి, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని మోదీకి దైవబలం, ఆశీస్సులు ఉండేలా భగవంతుణ్ని ప్రార్థించాలి' అని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం పిలుపునిచ్చారు. జనసేన పార్టీ పక్షాన మంగళవారం ఉదయం షణ్ముఖ క్షేత్రాలు తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరంకుంద్రమ్, స్వామిమలై, పలముదిరచోళై క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేయించాలని ఆయన నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి ఆలయానికి ఒక పార్టీ ఎమ్మెల్యే, జనసైనికులను పంపించి పూజలు చేయిస్తారు. కర్ణాటకలోని కుక్కే, ఘాటి సుబ్రహ్మణ్య క్షేత్రాలు, మన రాష్ట్రంలోని మోపిదేవి, బిక్కవోలులోని సుబ్రహ్మణ్య ఆలయాలు, ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం పురూహూతిక దేవి ఆలయంలో పూజలు చేయించాలని నిర్ణయించారు. సైన్యానికి సూర్యశక్తి తోడుండేలా వచ్చే ఆదివారం శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలోనూ పూజలు చేయిస్తారు. వీటితోపాటు రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో జనసేన శ్రేణులు పూజలు చేయించనున్నాయి. సైన్యం కోసం, యుద్ధ ప్రభావం ఉన్న జమ్మూ కశ్మీరు, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్, హరియాణా రాష్ట్రాల ప్రజల క్షేమాన్ని కోరుతూ ఈ పూజలు చేస్తారు. క్రైస్తవులు చర్చిల్లో, ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ సూచించారు.

వృద్ధురాలికి స్వయంగా వడ్డించి..కలిసి భోజనం చేసి


వృద్ధురాలు పేరంటాలుకు భోజనం వడ్డిస్తున్న పవన్ కల్యాణ్

ఎన్నికల్లో తన విజయాన్ని కాంక్షిస్తూ పింఛను సొమ్ముతో వేగులమ్మ అమ్మవారికి గరగ చేయించి ఇచ్చిన వృద్ధురాలు పోతుల పేరంటాలుతో కలిసి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భోజనం చేశారు. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన వృద్ధురాలు పోతుల పేరంటాలు.. ఎన్నికల సమయంలో తన మొక్కు ప్రకారం పింఛను సొమ్ము రూ.27 వేలు దాచుకుని గరగ చేయించి ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి శుక్రవారం ఆమెను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకున్నారు. ఆత్మీయంగా పలకరిస్తూ స్వయంగా వడ్డించారు. చీరను బహూకరించారు. పింఛను సొమ్ముతో మొక్కులు చెల్లించిన విషయం తెలుసుకుని ఆర్థిక సాయం అందించారు. తిరుగు ప్రయాణానికి ఏర్పాటుచేసిన వాహనం వరకు స్వయంగా వచ్చి సాగనంపారు.

'పిఠాపురం' అనాథ పిల్లలకు నా జీతం అంకితం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో నన్ను శాసన సభ్యుడిగా గెలిపించారు. ఆ నియోజకవర్గ ప్రజలిచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నా. తల్లిదండ్రులు లేని పిల్లల భవిష్యత్తు కోసం ప్రతినెలా నా జీతం ఇస్తున్నా' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు ఆయన తన వేతనం నుంచి ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.2,10,000 ఆర్థికసాయం ప్రకటించారు. జీతంలో మిగిలిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకు ఖర్చు చేస్తానని చెప్పారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందుబాటులో ఉన్న 32 మందికి స్వయంగా పవన్ కల్యాణ్ సాయం అందజేశారు. మిగిలిన 10 మందికి జిల్లా యంత్రాంగం ద్వారా అందించనున్నారు. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీతం తీసుకోకూడదని మొదట నిర్ణయించుకున్నా. కానీ, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న భావనతో తీసుకున్నా. ఆ వేతనాన్ని నియోజకవర్గంలోని అనాథ పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు చేయాలని నిశ్చయించుకున్నా' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

తెలియదు.. గుర్తులేదు..చెప్పలేను!

సీఐడీ అధికారులకు సజ్జల దాటవేత సమాధానాలు

- తెదేపా కార్యాలయంపై దాడి కేసు విచారణకు హాజరు
- ఆ ఘటనతో తనకు సంబంధం లేదన్న దేవినేని అవినాష్


గుంటూరు సీఐడీ కార్యాలయం వద్దకు వస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, దేవినేని అవినాష్, మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు శివకుమార్, అంబటి రాంబాబు తదితరులు

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి సంబంధించి తనకు ముందస్తు సమాచారం లేదని, టీవీల్లో చూసే తెలుసుకున్నానని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు, వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి సీఐడీ విచారణలో పాతపాటే పాడారు. 'కార్యాలయంపై దాడికి వెళ్లాలని నేనెవ్వరినీ ప్రేరేపించలేదు. ఆ సమయంలో ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్నా' అని చెప్పగా.. అందుకు సంబంధించిన ఆధారాలివ్వాలని పోలీసులు అడిగారు. తర్వాత ఇస్తానంటూ ఆయన దాటవేత ధోరణిలో సమాధానమిచ్చారు. తెదేపా ప్రధాన కార్యాలయంపై దాడికి సంబంధించి 120వ నిందితుడిగా ఉన్న సజ్జలను శుక్రవారం గుంటూరు సీఐడీ పోలీసులు విచారించారు. ఉదయం 11.30కి కార్యాలయం లోపలికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం 12.45 గంటలకు బయటకొచ్చారు. ఆ వ్యవధిలో సీఐడీ పోలీసులు 27 ప్రశ్నలు సంధించారు. వాటికి ఆయన నాకు తెలియదు.. నా పరిధి కాదు.. గుర్తులేదు.. నా అభిప్రాయం చెప్పలేను.. అంటూ సూటిగా స్పందించలేదని తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సజ్జలకు వేసిన ప్రశ్నలు, ఆయనిచ్చిన సమాధానాలిలా ఉన్నాయి.

ప్రశ్న: ఒక ప్రధాన రాజకీయ పార్టీ కార్యాలయంపై అంత పెద్ద దాడి జరిగితే ప్రభుత్వం విచారణ చేయించాలి కదా? నిందితులు మీ పార్టీ వారు కావటం వల్లే సైలెంట్ అయిపోయారనుకోవచ్చా?

జవాబు: ఆ విషయం నాకు తెలియదు. అది నా పరిధిలోనిది కాదు.

ప్రశ్న: ప్రభుత్వ సలహాదారుడిగా ఉంటూ ఇలాంటి కీలక విషయాలు తెలియవంటే ఎలా? కనీసం మీ అధినాయకుడితో చర్చించారా? ఘటనకు సంబంధించి ఎస్పీ నుంచి ఏమైనా ప్రత్యేక రిపోర్టు తెప్పించుకున్నారా?

జవాబు: దీనికి సంబంధించి ఎలాంటి అభిప్రాయాన్నీ వ్యక్తం చేయలేను.

ప్రశ్న: అప్పటి సీఎంను దూషించారని, అందుకు మనోభావాలు దెబ్బతిని, దాడికి వెళ్లామని కొందరు నిందితులు వాంగ్మూలమిచ్చారు. దీనిపై ఏమంటారు?

జవాబు: మా నాయకులు, కార్యకర్తలకు బాధ కలిగిందనేది వారి వ్యక్తిగత అభిప్రాయం. ఈ విషయంలో నేనేమీ చెప్పలేను.

ప్రశ్న: ప్రజాస్వామ్యంలో ఇలాంటివి తగవని కనీసం ప్రెస్‌మీట్ పెట్టి ఖండించకపోవడంపై ఏమంటారు?

జవాబు: ఖండించామో లేదో నాకైతే గుర్తులేదు. అయినా.. ఇది నాకు సంబంధించిన విషయం కాదు.

ప్రశ్న: దాడి కాదు.. ధర్నాకు వెళ్లారని అంటున్నారు కదా? దాడి చేస్తున్న చిత్రాలు, వీడియోల సాక్ష్యాధారాలు ఉన్నాయి కదా?

జవాబు: ఆ వీడియోలు, చిత్రాలు చూసి నేనేం చెప్పలేను.

ప్రశ్న: ఒక ప్రధాన పార్టీ కార్యాలయంపై అంత దాడి జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అంగీకరిస్తున్నారా?

జవాబు: ఇందులో ప్రభుత్వ వైఫల్యం ఏముంది? ఫిర్యాదు రాగానే కేసు కట్టాం కదా.. దర్యాప్తులో ఏం తేల్చారన్న పోలీసుల ప్రశ్నకు.. అది నా పరిధి కాదంటూ సజ్జల సమాధానం దాటవేశారు.

నా అనుచరులెవరూ లేరు: దేవినేని అవినాష్


ఇదే కేసులో విజయవాడకు చెందిన ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్‌ను పోలీసులు గంటకుపైగా విచారించారు. 37 ప్రశ్నలు వేయగా, ఏ ఒక్కదానికీ ఆయన నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. దాడి సమయంలో తాను లేనని, తన అనుచరులూ లేరని చెప్పుకొచ్చారు. విజయవాడలోని గుణదల నుంచి తామంతా కొన్ని వాహనాల్లో బయలుదేరి అవినాష్ ఆదేశాల మేరకు తొలుత వైకాపా కేంద్ర కార్యాలయానికి చేరుకున్నామని.. అక్కడి నుంచి పార్టీ అధినాయకుల ఆదేశాల మేరకు తెదేపా ప్రధాన కార్యాలయంపై దాడి చేశామని మీ అనుచరులు ఇచ్చిన వాంగ్మూలాలు ఉన్నాయంటూ వాటిని ఆయన ముందుంచారు. వారెవరో తనకు తెలియదని, నా అనుచరులు అని ఎలా చెబుతారని తిరిగి ప్రశ్నించారు. వారిలో కొందరు అవినాష్‌తో దిగిన ఫొటోలు చూపించి ప్రశ్నించగా.. ప్రజా జీవితంతో ఉన్నప్పుడు అనేకమంది ఫొటోలు తీసుకుంటారని, వాటిని పట్టుకుని అనుచరులు అంటే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ దాడి విషయమై మీరు ఏం చెప్పదలుచుకున్నారని ప్రశ్నిస్తే మా నాయకుడిని తిట్టినందుకే మా వాళ్ల మనోభావాలు దెబ్బతిని ధర్నా చేయటానికి వెళ్లారు. దాడి చేయమని ఎవర్నీ ప్రోత్సహించలేదని, ప్రేరేపించలేదని చెప్పారు.

వైకాపా అధికారంలోకి వస్తే.. పరిస్థితి ఏంటి?

'రాష్ట్రంలో అధికారం మారి, వైకాపా అధికారంలోకి వచ్చాక.. మేం ఇదే మొదలుపెడితే పరిస్థితి ఏంటి? జగన్ ఇలా అనుకొని ఉంటే తెలుగుదేశం ఉండేది కాదు' అని వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. రాబోయే పరిణామాలకు చంద్రబాబు బాధ్యత వహించాలంటూ వ్యాఖ్యలు చేశారు. గుంటూరు సీఐడీ కార్యాలయంలో శుక్రవారం విచారణకు హాజరైన ఆయన తరువాత మీడియాతో మాట్లాడారు. 'వైకాపా నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయటమే లక్ష్యంగా పాలన సాగుతోంది. కావలి మాజీ ఎమ్మెల్యేపై కేసు పెట్టారు. కంతేరులో మా పార్టీ ఎంపీటీసీ సభ్యురాలిని తెల్లవారుజామున అరెస్టు చేశారు. చీకట్లో అరెస్టు చేయొద్దని చట్టం చెబుతున్నా.. పోలీసుల తీరు మారటం లేదు. సాక్షి ఎడిటర్ ఇంటికి వెళ్లి తనిఖీలు చేశారు' అని పేర్కొన్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి సీఐడీ అధికారులు ప్రశ్నించారని, తనకేమీ తెలియదని చెప్పానన్నారు. సజ్జల విచారణకు రావటంతో కోర్టు రోడ్డులోని సీఐడీ కార్యాలయం, మెడికల్ కళాశాల పరిసరాల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు కార్లు, ద్విచక్ర వాహనాలతో హడావుడి చేశారు. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు.

పోలీసుల కుర్చీల్లో నేతలు

సజ్జల సీఐడీ కార్యాలయానికి రావడంతో వైకాపా నేతలు అంబటి రాంబాబు, విడదల రజిని, అన్నాబత్తుని శివకుమార్, అప్పిరెడ్డితోపాటు అంబటి మురళి అక్కడికి చేరుకున్నారు. వారిని పోలీసులు నిలువరించలేకపోయారు. విచారణ ముగిసేవరకు వారంతా సీఐడీ కార్యాలయం ఎదుటే ఉన్నారు. అయినా.. బయటకు పంపలేదు. పైగా బందోబస్తు విధుల పర్యవేక్షణకు వచ్చిన డీఎస్పీ, ఇతర పోలీసు అధికారులకు తీసుకొచ్చిన కుర్చీల్లో అంబటి రాంబాబు, శివకుమార్ కూర్చుండిపోయారు. సజ్జల వాహనాన్ని సీఐడీ కార్యాలయం వరకు అనుమతించటంతో అందులోనే రజిని, అప్పిరెడ్డి తదితరులు కూర్చున్నారు.


డీఎస్పీ, సీఐల కోసం తెచ్చిన కుర్చీల్లో అంబటి రాంబాబు, అన్నాబత్తుని శివకుమార్

వీర సైనికా.. వందనం



పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొడుతున్న భారత సైనికదళానికి మద్దతుగా జిల్లా వ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. జయహో భారత్.. జైహింద్ అంటూ జాతీయ పతాకాన్ని చేతబూని రహదారులపై ర్యాలీగా వెళ్తున్నారు. ఆయిల్ ట్యాంకర్, అమరావతి రవ్వర్స్, లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో సమైక్యస్ఫూర్తిని చాటారు.

- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే





మేమంతా సిద్ధం.. మీరంతా భద్రం

- సరిహద్దుల్లో సైన్యం... నగరంలో పోలీస్
- అంతటా అప్రమత్తం.. తనిఖీలతో భరోసా

న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు

'ఆపరేషన్ సిందూర్'తో సరిహద్దుల్లో సైన్యం తమ ప్రాణాలను పణంగా పెట్టి... శత్రువుతో పోరాడుతూ.. ప్రజారక్షణే ప్రథమ ప్రాధాన్యమని భరోసా కల్పిస్తూ ప్రజల జేజేలు అందుకుంటుంటే... నగరాలు, పట్టణాలు, పల్లెల్లో విస్తృత తనిఖీలతో మీ కోసం మేమున్నామని పోలీసులు ప్రతిన బూనుతున్నారు. విజయవాడ ఇన్‌ఛార్జి పోలీస్ కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలతో కమిషనరేట్ పరిధిలో



పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బాంబు నిర్వీర్య దళం



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్

'యాంటీ సబోటేజ్ (విధ్వంస వ్యతిరేక)' తనిఖీలు చేపట్టారు. అత్యవసర పరిస్థితిలో ఎలా స్పందించాలి? తదితర అంశాలపై పలు చోట్ల మాక్ డ్రిల్ నిర్వహించారు.

''అడ్మిన్ డీసీపీ సరిత నేతృత్వంలో బస్టేషన్, రైల్వేస్టేషన్.. లాడ్జీలు, హోటళ్లలో తనిఖీ చేశారు. గన్నవరం విమానాశ్రయంలోనూ అధికారులు భద్రతా తనిఖీలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు నిర్వహించారు. భద్రతా సెలవుల్లో భాగంగా కానిస్టేబుల్ నుంచి అధికారి స్థాయి వరకు అందరి సెలవులను రద్దు చేసి.. సెలవుల్లో ఉన్న సిబ్బందిని తక్షణం విధులకు రావాలని ఆదేశించారు.

10 రోజులు అత్యవసర పరిస్థితుల్లో ఎలా కాపాడుకోవాలి? ఆస్తులు, ప్రజల ప్రాణాలను ఎలా కాపాడాలి? తదితర అంశాలపై ప్రజలను సన్నద్ధం చేస్తున్నారు. ఈమేరకు నగరంలో 10 రోజులపాటు విస్తృత తనిఖీలు నిరంతరం చేపట్టారు. బస్టేషన్, రైల్వేస్టేషన్లలో స్నిఫర్ జాగిలాలు, బాంబ్ నిర్వీర్య దళంతో ప్రతీ అంగుళం తనిఖీ చేస్తున్నారు. సరకు పార్శిళ్లను పరిశీలిస్తున్నారు. పార్శిళ్లను బుక్ చేసే సిబ్బందికి భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తనిఖీలు ఎలా చేయాలి? తదితర విషయాలను వివరించారు. రైల్వేస్టేషన్, బస్టేషన్ పరిసరాల్లోని ఆటోడ్రైవర్లనూ అప్రమత్తం చేసి వారికి సూచనలు చేశారు.

ప్రజలకు ధైర్యం, నమ్మకం, భరోసా కల్పించేలా జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. రోజూ రాత్రి 9 - 11 గంటల వరకు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. దేశ అంతర్గత భద్రతకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. మరో వైపు నగరంలోని లాడ్జిల్లో తనిఖీలు చేపట్టి గదులు అద్దెకు తీసుకున్న వారి వివరాలను పరిశీలిస్తున్నారు. లాడ్జిల్లో అనుమానితుల కదలికలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని యాజమాన్యాలకు పోలీసులు స్పష్టంగా ఆదేశించారు.

భయపడవద్దు: సరిత, అడ్మిన్ డీసీపీ



నగరంలో ఆకస్మిక తనిఖీలు చూసి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజలకు మనోధైర్యాన్ని, భరోసా కల్పించేందుకు ఈ తనిఖీలు చేస్తున్నాం. రక్షణ కల్పించేందుకు సరిహద్దుల్లో సైన్యం, స్థానికంగా పోలీసులు ఉన్నారనే నమ్మకం ప్రజల్లో కలిగిస్తున్నాం.

భక్తులకు నాణ్యమైన సేవలు అందిస్తాం

నూతన ఈవో శీనా నాయక్



దుర్గగుడి ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తూ..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈవోగా వి.కె.శీనానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఈవోకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజ చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈఈ కోటేశ్వరరావు దుర్గమ్మ చిత్రపటాన్ని ఈవోకు అందజేశారు. దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను ఇంజినీరింగ్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులకు నాణ్యమైన సేవలు అందించడం ఉద్యోగుల బాధ్యతగా భావించాలని సూచించారు. క్యూలైన్లను పరిశీలించి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అన్నప్రసాదం, పులిహోర, లడ్డూల తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. అన్నప్రసాదానికి వినియోగించే బాయిలర్స్ మరమ్మతులు చేయించాల్సిన అవసరాన్ని గుర్తించి అధికారులకు పలు సూచనలు చేశారు. లడ్డు ప్రసాదం తయారీకి వినియోగించే దిట్ట వివరాలను ఏఈవో దుర్గారావు ఈవోకు తెలియజేశారు. దేవస్థానం చేపట్టిన ప్రసాదాల పోటు, అన్నప్రసాద కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు. దసరా ఉత్సవాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులు, ఏఈవోలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

◆ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

ఘన పయనం.. గగనమాయె!



- ఏడు అంతర్జాతీయ రూట్లకు భారీ డిమాండ్
- దేశంలో ప్రధాన నగరాలకూ విమాన సర్వీసులు కావాలి

ఈనాడు, అమరావతి

హోదా వచ్చి 8 ఏళ్లు

గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చి ఎనిమిదేళ్లు దాటుతోంది. కనీసం ఇప్పటికి ఒక్క రోజువారీ అంతర్జాతీయ సర్వీసునూ ఏ దేశానికీ నడపడం లేదు. గత ఐదేళ్లు అంతర్జాతీయం ఊసే లేదు. కొద్దికాలంగా షార్జాకు ప్రతి మంగళ, శనివారాల్లో ఒక సర్వీసు నడుస్తోంది. వాస్తవంగా.. సమీప జిల్లాల్లో అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీ ఎంతనేది కొవిడ్ వేళ స్పష్టంగా కనిపించింది. గల్ఫ్ దేశాలు.. ప్రపంచంలో పలుప్రాంతాల నుంచి వందే భారత్ మిషన్‌లో భాగంగా వందల ప్రత్యేక విమానాల్లో లక్షల మంది ఇక్కడికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి రోజువారీ సర్వీసులు లేకనే.. ఇతర నగరాలకు వెళ్లి అక్కడి నుంచి విమానాలను అందుకోవాల్సి వస్తోంది.

గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీకి లోటు లేకున్నా... రద్దీకి తగ్గట్టుగా సర్వీసులే లేవు. 2019 నాటికే ఇక్కడి నుంచి నిత్యం 32 సర్వీసులు రాకపోకలు సాగించేవి. 12 లక్షల మంది ప్రయాణికులు ఉండేవాళ్లు. కానీ.. ఐదేళ్ల వైకాపా హయాంలో విమానాశ్రయాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. అభివృద్ధి లేకపోగా.. సర్వీసులు ఒక్కొక్కటిగా ఆగిపోయాయి. ప్రయాణికులు తగ్గిపోయారు. ప్రస్తుతం కూటమి సర్కారు కొలువుదీరడం, అమరావతి రాజధాని నేపథ్యంలో.. విమానాశ్రయం అభివృద్ధి, ప్రయాణికుల రద్దీ ఊపందుకున్నాయి.

ప్రస్తుతం రోజుకు 24 సర్వీసులే ఇక్కడి నుంచి నడుస్తున్నాయి. అయినా ఏడాదిలో ప్రయాణికులు 13 లక్షలు దాటారు. ఉన్న సర్వీసుల్లో హైదరాబాద్ (7) బెంగళూరు (5), దిల్లీ (3), చెన్నై(3)... ఈ నాలుగు నగరాలకే 18 ఉన్నాయి. మిగతా ముంబయి, విశాఖ, తిరుపతి, కడపకు ఒకటి, రెండు నడుస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది ప్రయాణికులు హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లి అక్కడి నుంచి దేశంలో ఇతర నగరాలకు విమాన సర్వీసులను అందుకుంటున్నారు.

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు సహా సమీప ఆరేడు జిల్లాల విమాన ప్రయాణికులకు గన్నవరం అందుబాటులో ఉండడంతో.. దేశంలోని ఏ నగరానికి సర్వీసులను ఆరంభించినా.. ఫుల్ ఆక్యుపెన్సీ(ఓఆర్)తోనే నడుస్తుంటాయి. గతంలో సింగపూర్ సర్వీసు వేయగా.. 80-90 శాతం ఓఆర్‌తో నడిచింది. గోవా, శిర్డీ, వారణాశి, కొచ్చి సహా పలు ప్రధాన నగరాలకు గన్నవరం నుంచి సర్వీసులు నడపాలని ప్రయాణికులు నుంచి విజ్ఞప్తులొస్తున్నాయి. గతంలో వారణాశి, శిర్డీ, కొచ్చికి కొన్నాళ్లు సర్వీసులు ఆరంభించగా.. రద్దీగా నడిచినా ఆపేశారు. విజయవాడ నుంచి రైలులో కొచ్చి (యర్నాకులం జంక్షన్)కి 18-20 గంటలు పడుతోంది. కొచ్చికి తిరుపతి మీదుగా గన్నవరం నుంచి విమానం నడపగా భారీ డిమాండ్ ఉండేది. కేవలం మూడు గంటల్లో అక్కడికి వెళ్లిపోయేవాళ్లు. వారణాశి సర్వీసు కూడా 70 శాతంపైగా ఆక్యుపెన్సీతో నడిచేది. ఈ సర్వీసులు ఎందుకు ఆపేశారని.. జగన్ జమానాలో కనీసం విమానయాన సంస్థలతో సంప్రదింపులూ చేయలేదు.


ఈ రద్దీ రూట్లలో ...

విజయవాడ నుంచి దుబాయ్, కువైట్, బ్రహెయిన్, సింగపూర్, మలేషియా, కొలంబో, బ్యాంకాక్ ఈ ఏడు రూట్లకు భారీగా డిమాండ్ ఉందనీ, సర్వీసులను ఆరంభించేలా విమానయాన సంస్థలతో మాట్లాడతామని.. అనేకసార్లు అభివృద్ధి కమిటీ సమావేశాల్లో హామీలిచ్చినా ఆచరణలో చూపలేదు. కనీసం ఇక్కడి నుంచి దుబాయికి సర్వీసులు ఆరంభమైతే.. ప్రపంచంలో ఏ మూలకైనా తేలికగా చేరుకునే సౌకర్యం వస్తుంది. ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2019లో ప్రజాభిప్రాయం సేకరించగా.. దుబాయ్, సింగపూర్‌లకే నడపాలని ఏకంగా 2.5 లక్షల మంది విజ్ఞప్తి చేశారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈ నెల 13న వెలువడనున్న తీర్పు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత వల్లభనేని వంశీ మూడోసారి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. వంశీతో పాటు నిందితులు గంటా వీర్రాజు, లక్ష్మీపతి, వేల్పూరి వంశీ, ఓలుపల్లి రంగాలు బెయిల్ ఇవ్వాలని పిటిషన్లు వేసిన సంగతి తెలిసిందే. విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో శుక్రవారం ఇరుపక్షాలు న్యాయాధికారి భాస్కరరావు ఎదుట వాదనలు వినిపించాయి.



వాదనలు ముగియడంతో తుది తీర్పు కోసం ఈనెల 13వ తేదీకి వాయిదా వేశారు. * ఈ కేసులో ఇంకా అరెస్టు కాకుండా ఉన్న ఆరుగురు నిందితుల కోసం అన్వేషణ సాగుతోందనీ, దర్యాప్తు ఇంకా పురోగతిలో ఉందని ఏపీపీ కల్యాణి వాదించారు. ఈ పరిస్థితుల్లో నిందితుడికి బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని అన్నారు.

◆ నిందితుల తరఫున న్యాయవాది దేవీ సత్యశ్రీ తన వాదనలు వినిపిస్తూ.. పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయనీ, ఫిర్యాదుదారుడికి పోలీసులు రక్షణ కల్పించారన్నారు. విశాఖలో సత్యవర్ధన్ స్వేచ్ఛగా తిరుగుతున్న సీసీ కెమెరా దృశ్యాలు బయటకు వచ్చాయన్నారు.

12న ఛార్జిషీట్ దాఖలు: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60 రోజుల్లోపు విచారణ పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేయాలి. మొత్తం 12 మంది నిందితుల్లో ఇప్పటికి ఆరుగురే అరెస్టు అయ్యారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారు. దర్యాప్తు గడువును పొడిగించాలని గత నెలలో ఐఓ దామోదర్ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఈ గడువు సోమవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు సాగిన దర్యాప్తు, నిందితుల పాత్ర గురించి 12న ఎస్సీ, ఎస్టీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.



మల్లన్న కోవెలకు ముచ్చటైన రూపు



కొండ కింద వరకు గడ్డర్లు ఏర్పాటు చేసి నిర్మించిన ప్రాంగణం

రాష్ట్రంలో రెండో అతి పెద్ద దేవాలయం దుర్గామల్లేశ్వరాలయంలోని ప్రధాన ఉపాలయమైన మల్లేశ్వరాలయ అభివృద్ధికి 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దాత సంకా నరసింహారావు రూ.5 కోట్లతో మల్లేశ్వరాలయ విస్తరణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. గడ్డర్లు ఏర్పాటు చేసి ప్రాంగణాన్ని 200 మీటర్లు విస్తరించారు. రూ.4 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం ప్రారంభించారు. 2019-24 వైకాపా పాలనలో పనులు నత్తనడకన జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మల్లేశ్వరాలయ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తోంది. ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు నవగ్రహాల ఆలయం, చుట్టూ ప్రాంగణ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.



మల్లేశ్వరాలయం



ప్రస్తుతం దాత సహకారంతో..

- ఈనాడు, అమరావతి, ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాజధానికి బెజవాడే ముఖద్వారం: ఎంపీ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: అమరావతి రాజధానికి ముఖ ద్వారంగా విజయవాడ మారనుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. 9 నెలల కూటమి పాలనలో మూడో డివిజన్‌లో రూ.9 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. 3వ డివిజన్ కరెన్సీనగర్ దాసాంజనేయ ఆలయం వద్ద శుక్రవారం నాలుగు బీటీ రోడ్ల శంకుస్థాపనతోపాటు సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అమరావతికి విజయవాడ ముఖద్వారంగా మారిన నేపథ్యంలో ఎన్ని వేల కోట్లు అయినా మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు చెప్పారన్నారు. అమరావతిలో 15 వేల మంది కార్మికులు పనులు చేస్తున్నారని, వచ్చే రెండు నెలల్లో 30 వేల మందితో పనులు ముమ్మరం కానున్నాయన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ శివారు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నిడమానూరు, ఎనికేపాడు, బల్లెంవారి వీధి రహదారుల విస్తరణ, అభివృద్ధిపై చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కరెన్సీనగర్ పాతూరి వారి రోడ్డు రూ.26.61 లక్షలు, రామచంద్రనగర్ ఆయుష్ ఆస్పత్రి పక్క రోడ్డు రూ.28.81 లక్షలు, విజయలక్ష్మి కాలనీ కాటా రోడ్డు రూ.28.32 లక్షలు, మహానాడు రోడ్డు కియా షోరూమ్ వెనకాల రోడ్డు రూ.11.57 లక్షలతో నిర్మిస్తుండగా శంకుస్థాపన చేశారు. బొప్పన భవకుమార్, తూమాటి ప్రేమ్‌నాథ్, గద్దె క్రాంతి కుమార్, కార్పొరేటర్లు ప్రసాద్, అపర్ణ, సాంబశివరావు, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



నాలుగు బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

కృష్ణాజలాల సరఫరా పనులు పూర్తి చేయండి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: జిల్లాలో కిడ్నీ వ్యాధి ప్రభావితమైన ఎ.కొండూరు మండలానికి కృష్ణా జలాల సరఫరాకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధికారులను కోరారు. విజయవాడలోని ఫార్చ్యూన్ హోటల్‌లో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, ఎన్నెస్పీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో కృష్ణా జలాల సరఫరా నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలకు అతి త్వరలో నీటి విడుదల చేయడానికి పైపులైన్ పనులు, గ్రామాల్లో నీటి నిల్వకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, ఎన్నెస్పీ కాల్వలపై వంతెనలు, విద్యుత్తు పనులు సత్వరమే పూర్తి చేయాలని సదరు అధికారులకు సూచించినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన గడువు నాటికి మండల ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకునేందుకు పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు.

వయసు 28... కేసులు 28

- కరుడుగట్టిన గంజాయి స్మగ్లర్ తుమ్మల మనోజ్‌పై పీడీ యాక్ట్
- అరెస్టు చేసి జైలుకు తరలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కరుడుగట్టిన నేరస్థులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. విద్యా సంస్థల వద్ద గంజాయి విక్రయిస్తూ యువతను మత్తులో దింపడమే కాకుండా దోపిడీ, గొలుసు దొంగతనాలు చేస్తున్న వారికి గంజాయి సరఫరా చేస్తున్న కరుడుగట్టిన గంజాయి స్మగ్లర్‌పై ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే తుమ్మల మనోజ్ అలియాస్ 'మన'(28)పై పీడీ యాక్ట్ నమోదు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 28 ఏళ్ల మనోజ్‌పై వివిధ సెక్షన్ల కింద పలు జిల్లాల్లో మొత్తం 28 కేసులు నమోదయ్యాయి. తన చర్యలతో పోలీసులకు సవాల్ విసిరి శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న మనోజ్‌ను తక్షణం అరెస్టు చేసి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కటకటాల వెనుక ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మనోజ్ నేరచరిత్ర ఇదిగో.. సత్యనారాయణపురం నాగేశ్వరరావు పంతులు రోడ్డుకు చెందిన తుమ్మల మనోజ్‌పై 2011లో తొలిసారిగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసు నమోదైంది. ఆ తరువాత 2012లో మరో కేసు నమోదు కాగా అప్పటి నుంచి వరుసగా గంజాయి విక్రయిస్తూ పలుమార్లు పోలీసులకు దొరికిపోయాడు. వన్‌టౌన్, కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, భవానీపురం, కృష్ణలంక, పటమట, సత్యనారాయణపురం, మాచవరం, పట్టాభిపురం, నూజివీడు టౌన్, విశాఖపట్నం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. వీటిలో దొంగతనం, గంజాయి విక్రయం, దొంగతనం, చోరీలు, దోపిడీ కేసులు ఉన్నాయి. 2015లో ఇతడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు కాగా న్యాయస్థానంలో ఆ కేసు కొట్టివేశారు.

పోలీసులకు సవాల్: గంజాయి రవాణా, విక్రయాలతో పోలీసులకు మనోజ్ సవాల్ విసిరాడు. కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మనోజ్ తన అనుచరులతో గంజాయి విక్రయించేవాడు. విద్యార్థులకు గంజాయి అలవాటు చేసి వారితో విక్రయాలు జరిపించేవాడు. గంజాయి తాగిన అనేక మంది పలు నేరాలకు పాల్పడ్డారు. గొలుసు చోరీలు, దోపిడీలు చేస్తూ పోలీసులకు కొరకరాని కొయ్యగా మారాడు.

హద్దుమీరినందునే..: 2011 నుంచి ఇప్పటి వరకు మనోజ్‌పై వివిధ సెక్షన్ల కింద మొత్తం 28 కేసులు నమోదయ్యాయి. వీటిలో 11 కేసుల్లో శిక్షలు పడగా 3 కేసులు విచారణలో ఉన్నాయి. 8 కేసులు రాజీ చేసుకోగా 6 కేసులను కొట్టివేశారు. ఇతనిపై వరుస కేసులు ఉండడంతో 2014లో ఇతడిపై రౌడీషీట్ తెరిచి పూర్తి స్థాయిలో నిఘా ఉంచారు. దీంతో పలు కేసుల్లో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలకు మనోజ్ తీవ్ర విఘాతం కలిగిస్తుండడంతో అతడిపై పీడీ యాక్ట్ పెడుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



జిల్లాలో అకాల వర్షాలు

జి.కొండూరులో అత్యధికం, ఎ.కొండూరులో అత్యల్పం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో అకాల వర్షాలు కురిశాయి. జి.కొండూరులో అత్యధికంగా, ఎ.కొండూరులో అత్యల్పంగా వర్షపాతం నమోదైంది. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం.. జిల్లాలో మొత్తం 106.6 మిల్లీమీటర్ల వర్షం పడగా, సగటు వర్షపాతం 5.33 మి.మీ.గా ఉంది. జి.కొండూరు 26.2, రెడ్డిగూడెం 22.6, వీరులపాడు 19.2, మైలవరం 14.6, విస్సన్నపేట 12.2, ఇబ్రహీంపట్నం 6.2, తిరువూరు 2.4, గంపలగూడెం 1.8, ఎ.కొండూరులో 1.4 మి.మీ. నమోదైంది.

తెలుగు మాధ్యమ పాఠశాలలు లేకపోవడం సరికాదు



మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాద్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమ పాఠశాలలు లేకుండా చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ అన్నారు. సంఘం పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం తెలుగు మాధ్యమ పాఠశాలలను పూర్తిగా మూసివేసేందుకు ప్రయత్నం చేసిందని, కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. పాఠశాలలను మూసివేయడానికి ముందుకు వస్తున్న ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా పీఆర్సీ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు వి.రామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు మద్దినేని నాగేశ్వరరావు, తోట పూర్ణచంద్రరావు, అవని, వసరామ్, నయూమ్ అహ్మద్, షేక్ అహ్మద్, ఎ.సుందరరామారావు, దాసరి రాజకుమార్, రోహిణీదేవి, అబ్దుల్ రవూఫ్, ఎం.వెంకటేశ్వర్లు, వై.బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు కోర్టు ఏపీపీగా సత్యనారాయణ



నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక 16వ జిల్లా అదనపు న్యాయమూర్తి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా సీనియర్ న్యాయవాది కాట్ర సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నరు ఆదేశాల మేరకు ప్రభుత్వ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నందిగామకు చెందిన సత్యనారాయణ గత మూడు దశాబ్దాలుగా న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. తెదేపా రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథజనార్దనరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాట్ర నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు బొండపాటి రామకృష్ణ, మన్నెం నారాయణరావు, యర్రంరెడ్డి బాబూరావు, షేక్ దాదాసాహెబ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబువిద్యాసాగర్, ప్రధానకార్యదర్శి మణిబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు



ఏదో ఫీ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర 124 రిటైల్ ధర 140 డ్రెస్‌డ్ విత్ స్కిన్ 212, విత్ ఔట్ స్కిన్ 241. ఆమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర 130, 139, 150 డ్రెస్‌డ్ విత్ స్కిన్ 250 డ్రెస్‌డ్ స్కిన్‌లెస్ 280.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించిన ఫ్యాక్టరీ ధర ఒక్కో గుడ్డు ధర రూ. 500 (పెద్దవి & చిన్నవి సమానంగా కలిపి) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'సుభాష్ చంద్రబోస్ ఆప్దా ప్రబంధన్ పురస్కార్-2026' అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో సేవలను అందించిన వ్యక్తులు లేదా సంస్థల వారు ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ఆరంభమైనట్లు పేర్కొన్నారు. జనవరి 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందజేస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు, రేపు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలైనప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని విద్యుత్తు సంస్థ ఎన్టీఆర్ జిల్లా ఎస్‌ఈ ఎ.మురళీమోహన్ తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశం వినియోగించుకుని బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే ఏపీఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్తు సర్వీసు నంబరును యాప్‌లో రిజిస్టర్ చేసుకుని కూడా విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చన్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బీబీపీఎస్, యూపీఐ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని ఎస్‌ఈ తెలిపారు.

తిన్నోళ్లకు రూ.కోట్లు.. కొన్నోళ్లకు పాట్లు

● గుదిబండలా అనధికార లేఔట్లు ● సీఆర్డీఏ పరిధిలో తీరు ఇదండీ..

ఈనాడు - అమరావతి



సీఆర్డీఏ పరిధిలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుప్పలుతెప్పలుగా అనధికార లే ఔట్లు పుట్టుకొస్తున్నాయి. వీటిని అడ్డుకోవడంలో అధికారుల వైఫల్యంతో మధ్యతరగతి ప్రజలు నష్టపోతున్నారు. వెంచర్లు వేసిన వారి ధన దాహానికి కొనుగోలుదారులు బలవుతున్నారు. ఇలా కొన్న ప్లాట్లలో భవన నిర్మాణాలకు అనుమతి తెచ్చుకోవడం తలకు మించిన భారంగా మారుతోంది. ఎలాంటి మౌలిక వసతులు లేకుండా వెంచర్లు వేస్తున్నారు. నిబంధనల మేరకు కల్పించాల్సిన సదుపాయాలకు అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోందని.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కొనుగోలుదారులకు అంటగట్టి మోసగిస్తున్నారు.

ఇవన్నీ భారమని వెంచరు డెవలపర్లు అడ్డంగా ఉల్లంఘిస్తున్నారు. ఎకరా లే ఔట్‌లో అన్నీ పోను 50 సెంట్లు మాత్రమే ప్లాట్లకు మిగలడంతో నిబంధనలు అమలు చేయకుండా ఇష్టారీతిన ప్లాట్లు వేసి అమ్ముతున్నారు.

నున్న, అంబాపురం, పి.నైనవరం, జక్కంపూడి, పైడూరుపాడుల్లో ఇవి భారీగా వెలిశాయి. నగరానికి దగ్గర ప్రాంతాలు కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వీటిని వేశారు. ధర తక్కువని కొన్నవారు లబోదిబోమంటున్నారు. విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి వెంట కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోనూ కుప్పలుతెప్పలుగా పుట్టుకొచ్చాయి.

అనుమతి లేని లే ఔట్లలో ప్లాట్లు కొన్నవారు ఆర్థికంగా నష్టపోతున్నారు. వీరు ఆ ప్లాట్‌లో భవన నిర్మాణానికి అనుమతికి చేతిచమురు వదిలించుకోవాల్సి వస్తోంది. 14 శాతం అపరాధ రుసుం చెల్లిస్తేనే పట్టణాభివృద్ధి సంస్థ నుంచి అనుమతి లభిస్తుంది. పైసా పైసా కూడబెట్టుకుని కొన్న వారికి ఇది మరింత భారంగా మారింది. రియల్టర్ల మోసానికి మధ్యతరగతి ప్రజలు, చిరుద్యోగులు బలవుతున్నారు.

ఆసాంతం ఉల్లంఘనలే...

నిబంధనల ప్రకారం లే ఔట్ వేసినప్పుడు ప్రాథమిక ప్లాన్ సమర్పించాలి. మూడేళ్లలోపు పూర్తిగా అభివృద్ధి చేశాక తుది ప్లాన్‌ను అందించి ఆమోదముద్ర వేయించుకోవాలి. ఇందుకు లే ఔట్ విస్తీర్ణంలో 10 శాతం ఓపెన్ స్పేస్ వదలాలి. దీనిని ఉద్యానానికి ఉద్దేశించారు. ఇటీవల వరకు రోడ్లకు 40 అడుగులు వదలాలి. దీనిని రెండు నెలల కిందట సవరించి 30 అడుగులకు ప్రభుత్వం కుదించింది. లే ఔట్ విస్తీర్ణం 4 ఎకరాలు దాటితే విధిగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాలి.

జోన్ల వారీగా సీఆర్డీఏ గుర్తించిన అనధికార లే ఔట్లు

జోన్	సంఖ్య
నూజివీడు	29
నందిగామ	11
గన్నవరం	16
ఉయ్యూరు	12
సెంట్రల్ (పెనమలూరు, విజయవాడ గ్రామీణ)	05
గుంటూరు	36
తెనాలి	30

గుర్తించింది తక్కువే...

సీఆర్డీఏ పరిధిలో దాదాపు 2 వేల వరకు అనుమతి లేని లేఔట్లు ఉంటాయనేది అంచనా. కానీ ఇప్పటికి గుర్తించింది చాలా తక్కువ. అనధికార లే ఔట్లతో సీఆర్డీఏ భారీగా ఆదాయం కోల్పోతోంది. ఆదిలోనే వీటిని నియంత్రించాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులకు ఇది ఆదాయవనరుగా మారింది. అడపాదడపా తనిఖీలు చేసి వాటిని ధ్వంసం చేసి చేతులు దులుపుకొంటున్నారు.

ఎల్ఆర్ఎస్‌లో వచ్చింది తక్కువే

గత ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ కింద అనుమతి లేని లే ఔట్ల క్రమబద్ధీకరణకు 244, వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు 5,458 అర్జీలు వచ్చాయి. గతంలో వచ్చిన ఎల్ఆర్ఎస్‌లో ఆమోదం పొందిన లే ఔట్లలో ఇంకా క్రమబద్ధీకరించుకోని ప్లాట్ల అర్జీలు కూడా వచ్చాయి. ఛార్జీలు అధికమని చాలా మంది ఆసక్తి చూపలేదు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన గడువులో కొన్నే పరిష్కారానికి నోచుకున్నాయి. జీవోలో ఇచ్చిన ప్రక్రియ ప్రకారం సుదీర్ఘంగా సాగడంతో ఎక్కువ దరఖాస్తులకు ఆమోదం లభించలేదు. దీంతో అన్నివిధాలా సీఆర్డీఏ ఆదాయం కోల్పోతోంది.

ఏపీకి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ తృతీయ స్థానం

విజయవాడ క్రీడలు: బిహార్ రాష్ట్రం గయలో ఈ నెల 5 నుంచి 9 వరకు జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2025లో రాష్ట్ర పురుషుల జట్టు 64 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. కర్ణాటక 136 పాయింట్లతో ప్రథమ, మహారాష్ట్ర 65 పాయింట్లతో ద్వితీయ స్థానాలు సొంతం చేసుకున్నాయి. చివరి రోజైన శుక్రవారం జరిగిన 200 మీ.ల బటర్ ఫ్లైను ఎన్.దేవ గణేష్ నాలుగు నిమిషాల 07.50 సెకన్లలో పూర్తిచేసి రజతం కైవసం చేసుకోగా.. 4×100మీ.ల ఫ్రీ స్టైల్ రిలేలో రాష్ట్ర జట్టు రజతం సొంతం చేసుకుంది. ఎం.శరత్, ఎన్.దేవ గణేష్, జి.సంపత్‌కుమార్ యాదవ్, ఎం.తీర్థ సామదేవ్ రిలే జట్టులో తలపడ్డారు.

వైఎస్ విగ్రహం తొలగించేందుకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి, కమిషనర్ రమణబాబు

నందిగామ, న్యూస్‌టుడే: పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే గాంధీ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న మాజీ సీఎం దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహం తొలగించాలని కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థానిక బాబూజగ్జీవన్‌రామ్ పురపాలక సంఘ హాలులో శుక్రవారం ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య హాజరు కాగా ఛైర్‌పర్సన్, కమిషనర్ ఈవీ రమణబాబు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం తొలగింపుపై ఛైర్‌పర్సన్ తీర్మానం ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. గత వైకాపా ప్రభుత్వంలో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్నాయని జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాలను ప్రత్యేకంగా నిర్మించిన దిమ్మెపై ఏర్పాటు చేశారు. వైఎస్సార్ విగ్రహం మాత్రం రాజకీయ లబ్ధి కోసం మున్సిపల్ నిధులు రూ. 16 లక్షలతో గాంధీ సెంటర్‌లో ఆర్భాటంగా ప్రత్యేక దిమ్మెపై ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దిన్నిపై వైకాపా రంగులతో కూడిన ఫైలాన్ సైతం నిర్మించారు. దానిపై జగన్ చిత్రంతో నవరత్నాలు పథకాల బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అలాగే ఉంది. సౌమ్య మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహం దిమ్మె ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉండటంతో తొలగిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాల పక్కనే వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉదోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
న్యూస్ వేవ్	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కలెక్ట్ స్టైల్	సా. 5 - రా. 9
ఈ స్టార్ మీ స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొత్తరెడ్డిగూడెం గ్రామంలో కూనపరాజుపర్వ వెళ్లే రహదారి దగ్గరలో రోడ్డుపై చెత్త, వ్యర్థాలు పడేస్తుండడంతో ఇబ్బందిగా ఉంది. - **రమేష్‌రెడ్డి, స్థానికుడు**

✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? రాత్రి సమయాల్లో ఆవులను రహదారులపైకి వదిలేయడం వల్ల అవి సంచరించే అన్ని ప్రాంతాల్లో పేడ ఉంటుంది. తెల్లవారుజామున ద్విచక్ర వాహనదారులు జారి పడిపోతున్నారు. - **శ్రీకరరావు, కొండపల్లి**

✔ ఆవులను రోడ్లపైకి వదలొద్దని..అలా చేస్తే జరిమానాలు విధిస్తామని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కరిస్తాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**



తూము తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

స్పందనకు వందనం

• స్థానిక పంచాయతీలోని ఎస్సీ ఏరియాలో మురుగు కాలువలో పగిలిన తూముతో నీటి పారుదలకు ఇబ్బందిగా ఉందన్న స్థానికుల ఫిర్యాదును పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. కార్యదర్శి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు కార్మికులతో తూమును తొలగించారు. పారుదలకు ఇబ్బందులు లేకుండా కొత్త తూము ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

• దాములూరు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరించడం లేదని గృహిణులు మేమున్నాం..మీకు తోడుగాకు ఫిర్యాదు చేశారు. సమస్యను గ్రామ కార్యదర్శి వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త సేకరణ చేయించి పర్యవేక్షిస్తూ సమస్యను పరిష్కరించారు. తడి పొడి చెత్తను వేరుచేసే విధానంపై గృహిణులకు అవగాహన కల్పించారు.
- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

• పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో 19వ వార్డులో మేదర బజార్‌లో రహదారి పక్కన కాల్వలో తీసిన పూడిక మట్టి తొలగించాలని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కార్మికులతో పూడిక మట్టిని తొలగింపజేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

• పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో 7వ వార్డులో [illegible]



• పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో 14వ వార్డులో గాజుల మాలపల్లిలో మురుగు కాల్వలో తొలగించిన పూడిక మట్టి రహదారిపై అడ్డుగా ఉందని స్థానికులు చేస్తున్న ఫిర్యాదుపై ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించారు. కార్మికులతో రహదారిపై పూడిక మట్టి లేకుండా శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గణపవరం, వెల్వడం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 నుంచి ఉదయం 11 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గొల్లపూడి: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం రెండున్నర గంటల పాటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. మైలురాయి సెంటర్ ప్రాంతం, మహాత్మాగాంధీ టోకు వ్యాపార కేంద్రం, మహేంద్రనగర్ ప్రాంతం, టెలికం కాలనీ, వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9:30 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా లారీల స్వాధీనం

మైలవరం, న్యూస్‌టుడే: కృష్ణానది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీలను స్థానిక చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. గత నెలలుగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశాక 7 లారీలను పట్టుకుని, సీజ్ చేశామని తెలిపారు. మరో మూడు లారీలను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు వివరించారు. పర్మిట్లు లేకుండా, మైలవరం మీదుగా తెలంగాణకు తరలిస్తున్న వాటిని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటున్నామని వివరించారు.

అమర జవానుకు నివాళి

మైలవరం: ఉగ్రదాడిలో అశువులు బాసిన జవాన్ మురళీనాయక్‌కు శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు నివాళులు తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన త్యాగాన్ని కొనియాడారు. రాధాకృష్ణ, బాలకృష్ణ, లితీష్, శ్రీనివాసరావు, రోశాలు పాల్గొన్నారు.

వైభవంగా దీపాలంకరణ సేవ



నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు. మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు.

ఇబ్బంది పడకండి.. అవకాశం ఉందండి

• అర్హులందరికీ రేషన్ కార్డులు • సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి న్యూస్‌టుడే

ఏళ్ల తరబడి బియ్యం కార్డులు లేనివారు, ఉన్న వాటిల్లో లోపాలతో ఇబ్బంది పడుతున్న వారి సమస్యలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. [illegible] ప్రస్తుతం ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలో 11,563, కొండపల్లి అర్బన్‌లో 15,501 రేషన్ కార్డులున్నాయి. [illegible]



మూలపాడులో దరఖాస్తు తీసుకుంటున్న సచివాలయ డిజిటల్ సహాయకుడు

[illegible]

వీటికే అనుమతులు

[illegible]

ఈ పత్రాలు సమర్పిస్తే

[illegible]

ఏడు మార్పులకు

[illegible] సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. త్వరలో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పుడు ఇచ్చేది స్మార్ట్ కార్డు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. - **వెంకటేశ్వర్లు, తహసీల్దారు, ఇబ్రహీంపట్నం**

విద్యార్థులకు నగదు బహుమతులు

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో [illegible] ఈఏపీసెట్ మాక్ టెస్టులో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. పరీక్షకు మొత్తం 617 మంది హాజరుకాగా, అందులో ఉత్తమ మార్కులు సాధించిన 27 మందికి రూ.5.30 లక్షల నగదు బహుమతులను, [illegible]



ప్రతిభ చూపిన వారితో ప్రిన్సిపల్ అప్పారావు, అధ్యాపకులు

ప్రవేశాలకు అర్హత

రెడ్డిగూడెం: బాలికల గురుకుల పాఠశాలల్లో శుక్రవారం విడుదల చేసిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో రెడ్డిగూడెం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఉచిత కోచింగ్ కేంద్రంలో శిక్షణ పొందిన 25 మంది విద్యార్థినుల్లో 18 మంది ఉత్తీర్ణత సాధించి అర్హత పొందారని సంస్థ నిర్వాహకుడు సి హెచ్. విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు [illegible]



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కొలికపూడి

[illegible] అర్జీలు ఇచ్చారు. సీపీఎం మండల నాయకులు కూడా కట్లేరుపై వంతెన నిర్మాణంపై వినతిపత్రం అందజేశారు. పింఛన్లు మంజూరు, రేషన్‌కార్డులు, ఆర్థికసాయం అందించాలని పలువురు వినతులు సమర్పించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పలు సమస్యలు పరిష్కరించాలని వేదిక వద్దనే ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈవోపీఆర్డీ డి.బాబూరావు, తహసీల్దారు రాజకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకెళ్దాం

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పట్టణ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దామని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. [illegible] పట్టణ అభివృద్ధికి ఐక్యంగా వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



అఖిలపక్ష సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

అనుమతి లేకుండా చెత్త పడేయొద్దు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి సత్తెమ్మ ఆలయం వెనుక ఉన్న క్వారీ గోతులను చెత్తతో పూడ్చే ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి సేకరించిన సమాచారం ప్రకారం..విజయవాడ కార్పొరేషన్‌లో సేకరించిన చెత్త, వ్యర్థాలను కొండపల్లి శ్రామికనగర్ సత్తెమ్మ ఆలయం వెనుక ఉన్న క్వారీ గుంతల్లో వేసేందుకు చెత్తతో కూడిన లారీలు శుక్రవారం అక్కడికి చేరుకున్నాయి. దీనిని గమనించిన స్థానికులు వాటిని నిలువరించి కమిషనర్ రమ్యకీర్తనకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న ఆమె అక్కడికి వచ్చిన కార్పొరేషన్ సిబ్బందితో..ఎవరి అనుమతితో ఈ చెత్తను ఇక్కడ డంప్ చేయాలనుకున్నారని ప్రశ్నించారు. పురపాలికకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఈ పనులు చేయవద్దని వారిని హెచ్చరించి పంపించారు. అయితే క్వారీ గుంతలను ఆక్రమించే క్రమంలోనే ముందుగా వాటిని పూడ్చాలని చేసిన ప్రయత్నమే ఇది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అనేక చోట్ల ఆక్రమణలు చేసిన తెర వెనుక నాయకులు దీనిపై కన్నేశారని చెబుతున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు దీనిని కాపాడాలని కోరుతున్నారు.



కార్పొరేషన్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న కమిషనర్ రమ్యకీర్తన

కుంగిన వంతెనకు మరమ్మతులు

మండలంలోని చంద్రగూడెంలో భారీ వర్షాలకు బుడమేరు వాగుపై కుంగిన వంతెనకు ఎట్టకేలకు మరమ్మతు పనులు చేపట్టారు. రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల కిందట టెండర్లు నిర్వహించగా రూ.22 లక్షల అంచనా వ్యయంతో గుత్తేదారు సంస్థ ఇటీవల పనులు ప్రారంభించారు. గత సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో బుడమేరుకు భారీ వరద పోటెత్తడంతో ఒక పిల్లర్ దిమ్మె కుంగడంతో అప్పటినుంచి ఆ వంతెనపై బస్సులతో సహా భారీ వాహనాల రాకపోకలను నిలిపేశారు. ప్రజా రవాణాకు ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి మరమ్మతులను నిర్వహిస్తున్నారు. వర్షాలు ప్రారంభమయ్యే సమయానికి పనులను పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**



పనులు చేస్తున్న కార్మికులు

రెయిలింగ్ విరిగింది. రక్షణ కొరవడింది

స్థానిక పులివాగుపై వంతెన రెయిలింగ్ విరిగి ప్రమాదకరంగా మారింది. వంతెనపై ఇరువైపులా ఇనుముతో ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రెండువైపులా సగానికి పైగా విరిగిపడిపోయాయి. ఇరుకైన ఈ వంతెనపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళల్లో వాహనాలతో వెళ్లాలంటే ప్రమాదకరంగా ఉందని, తక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



లీకులా..సంపాదనకు మార్గాలా?

మొన్నటి వరకూ గాలిలో.. దూళిలో, నిన్న నీటిలో.. ఇప్పుడు ఇళ్లలోకి చేరింది ఎన్టీటీపీఎస్ బూడిద. ఎన్టీటీపీఎస్ ఐదో దశలో ఉత్పత్తి అనంతరం ఏర్పడిన బూడిద అక్కడి నుంచి నీటితో కలిసి పైప్‌లైన్ ద్వారా బూడిద చెరువుకు చేరుకుంటుంది. అయితే మధ్యలో ఉన్న ట్రక్ టెర్మినల్ వద్ద కొంతకాలంగా పైపులు లీకవుతున్నాయి. అలా కిందపడిపోయిన బూడిద దిగువ ప్రాంతమైన పశ్చిమ ఇబ్రహీంపట్నం పరిసరాల్లోకి చేరుకుటుంది. అయితే ఇదంతా బూడిద మాఫియా చేసే ఆగడాలేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా పడిపోయిన బూడిదను జేసీబీల సాయంతో లారీల్లోకి ఎగుమతి చేసి రాత్రికి రాత్రే దాటించే ప్రయత్నమే పైపులైన్ల లీకులని ప్రజల వాదన. బూడిద మాఫియా చేసే పనుల వల్ల బూడిదతో తామందరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**



పశ్చిమ ఇబ్రహీంపట్నం నివాసాల వద్దకు చేరిన బూడిద నీరు

రోడ్డుపైకి చేరినా పట్టించుకోరు!

గొల్లపూడి జాతీయరహదారి వెంబడి డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా మురుగు నీరు రహదారి మీదకు చేరుతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు కదిలే పరిస్థితి లేక డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించిపోతోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**



ఐదు ఆలయాల్లో చోరీలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో గురువారం రాత్రి దొంగలు చొరబడి హుండీల్లో కానుకలు అపహరించారు. ఆయా గుడుల్లోని హుండీల్లో కానుకలను ఇటీవల కమిటీ సభ్యులు బయటకు తీసి లెక్కించడంతో తక్కువ మొత్తంలో నగదు అపహరణకు గురై ఉంటుందని భావిస్తున్నారు. పెనుగొలను నుంచి ఊటుకూరు వెళ్లే రోడ్డులో ఉప్పలమ్మ గుడి, మెట్టగుట్ట శ్రీనివాస ఆలయం, సత్యాలపాడు వీరబ్రహ్మేంద్రస్వామి, తోటమూల ముత్యాలమ్మ, వినగడప సమీప పేరంటాళ్లమ్మ ఆలయాల్లో దొంగలు చోరీ చేశారు. వీటిపై కమిటీ సభ్యులు శుక్రవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. గర్భగుడి తలుపుల తాళాలు, హుండీల తాళాలు ధ్వంసం చేసి హుండీల్లో కొంత నగదు అపహరించారని పోలీసులు భావిస్తున్నారు. ఎస్సై శ్రీను ఆధ్వర్యంలో క్లూస్ టీం కూడా ఆలయాల్లో చోరీలను పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. దర్యాప్తు ప్రారంభించామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఆలయాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కన్పిస్తే సమాచారం ఇవ్వాలని కమిటీ సభ్యులు, ప్రజలను ఎస్సై కోరారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులపై ఆర్థిక భారం మోపిన ఛార్జీలను తగ్గించాలని కోరుతూ పట్టణంలోని బోసుబొమ్మ కూడలిలో శుక్రవారం సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి అధికారంలోకి రాగానే విద్యుత్తు ఛార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. విద్యుత్తు ఛార్జీలు తగ్గించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. నాయకులు ఎ.రవి, ఎస్‌వీ.భద్రం, పి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు భూముల రీసర్వే పూర్తి చేద్దాం

దుందిరాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని దుందిరాలపాడులో జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల రీసర్వే ప్రక్రియను తిరువూరు ఆర్డీవో కె.మాధురి శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామం నుంచి సర్వే జరుగుతున్న పొలాల వద్దకు ఆమె ద్విచక్ర వాహనంపై వెళ్లారు. గడువు లోపు గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సర్వేయర్లు, వీఆర్వోలను ఆదేశించారు. గత పక్షం రోజుల నుంచి దుందిరాలపాడు సాగుభూముల సర్వే చేస్తుండగా జూన్ 25 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు బృందాలతో సర్వే చేస్తున్నట్లు ఆమె తెలిపారు. భూ యజమానులు చనిపోతే వారి వారసులకు ఆ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



సిబ్బందిని ఆరా తీస్తున్న ఆర్డీవో మాధురి



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పేదలకు మెరుగైన వైద్యసాయం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం చంద్రబాబు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు అవసరమైన ఆర్థికసాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న మండలంలోని పెనుగొలనుకు చెందిన మాలపాటి శ్రీనుకు రూ.3.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని శుక్రవారం గంపలగూడెంలో ఆయన అందజేశారు. దీంతో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు లబ్ధిదారు శ్రీను, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాలతో బాలికలకు ఇబ్బందులు

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరులో అంగన్‌వాడీ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర బాలికలకు బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు యుక్త వయసు రాకుండా పెళ్లి చేయడం ద్వారా వారు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని, మానసిక పరిపక్వత లేక వైవాహిక జీవితంలో ఎదుర్కొనే ఇబ్బందులు, గర్భవతులుగా ఉన్నప్పుడు, సంతానం కలిగినప్పుడు ఎదురయ్యే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. అనంతరం కిశోర బాలికలతో కలిసి ప్రదర్శన చేశారు. కార్యకర్తలు కుమారి, ఉషాబేబి, భాగ్యలక్ష్మి, నజీమా, అరుణ, ఉషారాణి పాల్గొన్నారు.



అవగాహన ప్రదర్శనలో కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

మైలవరం, న్యూస్‌టుడే: కిశోర బాలికలకు సామాజిక అంశాలు, బాల్య వివాహాలపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.పుష్పలత పేర్కొన్నారు. కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కమ్యూనిటీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, పలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కుర్చీలాట తదితర కార్యక్రమాలను నిర్వహించి, ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక కారణాలతో యువకుడి ఆత్మహత్య

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేలకు చెందిన వెల్లంకి నవీన్ (25) శుక్రవారం ఇంట్లో చీరెతో ఉరివేసుకుని బలవన్మరణం చెందినట్లు ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు. ఆర్థిక కారణాలతో నవీన్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు చెప్పారు. తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి వద్ద జాతీయరహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం గుంటుపల్లి సెక్టారు ఎస్సై విజయలక్ష్మి తెలిపిన సమాచారం మేరకు..గుంటుపల్లి శివారు రమేష్ నగర్ వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడకు వస్తున్న వాహనం ఢీ కొట్టింది. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు సుమారు 5.6 అడుగుల ఎత్తుతో 40 నుంచి 45 ఏళ్ల వయసు మధ్యలో ఉన్నాడు. కుడి చేతిమీద రెండు స్వస్తిక్ గుర్తులు మధ్యలో ఓం గుర్తు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో అత్త, అల్లుడికి గాయాలు

భవానీపురం రోడ్డు ప్రమాదంలో అత్త, అల్లుడు గాయపడిన ఘటనపై కేసు నమోదైంది. నగరంలోని అయోధ్యనగర్‌లో సానికొమ్ము రమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం గొల్లపూడిలో ఉంటున్న అత్తయ్య రమణమ్మను ద్విచక్ర వాహనంపై రమణారెడ్డి ఎక్కించుకుని భవానీపురం ప్రియదర్శిని కాలనీకి తీసుకెళ్తున్నారు. గొల్లపూడి అంబేడ్కర్‌నగర్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణారెడ్డి చేతికి, రమణమ్మ తలకు గాయాలయ్యాయి. స్థానికులు సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండీయూ వాహనదారుడిపై కేసు

లింగాల(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని లింగాలలో ఎండీయూ వాహనం ద్వారా చేస్తున్న రేషన్ బియ్యం పంపిణీని తిరువూరు ఆర్డీవో కె.మాధురి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎండీయూ వాహనంలో 884 కిలోల బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు ఆమె గుర్తించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు ఎండీయూ వాహన డ్రైవర్ గౌస్ శ్రీరామ్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు పీడీఎస్ డీటీ బి.శివనాగరాజు తెలిపారు. శనివారం నుంచి వీఆర్వో లాగిన్ ద్వారా కార్డుదారులకు సరకులు పంపిణీ చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి మరొకరికి ఆ బాధ్యత అప్పగిస్తామన్నారు.



ఉపాధి కూలీలతో సమావేశమైన వ్య.కా.సం నాయకులు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

తిరువూరు: మండలంలోని చింతలపాడు, రోలుపడి, ముష్టికుంట్ల, ఎరుకోపాడు, మునుకుళ్ల గ్రామాల్లో శుక్రవారం వ్య.కా.సం నాయకుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఆ గ్రామాల్లో పని ప్రదేశాల్లో శ్రామికుల సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, కూలీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలు ఏటా 200 రోజులు కల్పించాలని, వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని కోరుతూ ఈ నెల 20 నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కోరారు. దేశవ్యాప్త బంద్‌కు కూలీలు మద్దతు ఇవ్వాలన్నారు. నాయకులు కె.కల్యాణ్, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఆనందరావు, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



300 మందికి ప్రాణదాతలు

10, 15, 15, 20, 40.. ఇవేమీ ఐపీఎల్‌లో క్రికెటర్ల స్కోర్లు కావు! ప్రాణాలకు తెగించి యంచ గ్రామ యువకులు కాపాడిన ప్రాణాలు. ఒక్కరి ప్రాణం కాపాడినా గొప్ప సాహసంగా లెక్కేస్తుంటాం.. మరి ఐదేళ్లలో 300 మందిని రక్షించిన వీళ్లని ఏమని పొగడాలి? ఏ పురస్కారాలతో సత్కరించాలి?



గోదావరి నది నిజామాబాద్, నిర్మల్ జిల్లాలను వేరు చేస్తూ ప్రవహిస్తుంటుంది. నిజామాబాద్ వైపు నదీ తీరంలో ఉంటుంది యంచ. ఇక్కడ రాకపోకలకు అనుగుణంగా రెండు వంతెనలు నిర్మించారు. అయితే దురదృష్టవశాత్తు ఈ వంతెనలపై నుంచి గోదావరిలో దూకి చాలామంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. క్షణికావేశం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, మనస్తాపం.. కారణాలేవైనా నెలకు సగటున అయిదారుగురు ఆత్మహత్య చేసుకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. పని నిమిత్తం బాసర, నిజామాబాద్ మార్గంలో ప్రయాణించే యంచ గ్రామ యువకులు నిత్యం నదీ తీరాన్ని ఒక కంట కనిపెడుతూ ఉంటారు. ఎవరైనా నదిలో దూకితే వెంటనే రక్షణ చర్యలకు దిగుతారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపిస్తే ఆరా తీస్తారు. పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి.. క్షేమంగా ఇళ్లకు పంపుతారు. 'గోదావరి మాకు తల్లిలాంటిది. ఆమె దయవల్లే క్షేమంగా ఉంటున్నాం. మా ప్రాంతంలో ఏ ఒక్కరూ బలవంతంగా ప్రాణాలు కోల్పోవద్దన్నదే మా అభిమతం' అంటున్నారు వాళ్లు. ఈ ప్రాణదాతల్లో ప్రైవేటు ఉద్యోగులు, వ్యవసాయదారులు, జాలర్లు, చిరు వ్యాపారులు, నిరుద్యోగులు, రైతు కూలీలు ఉన్నారు. వీళ్లు 2021 నుంచి 2025 వరకు 300 మందిని రక్షించారు. అయినా తాము చేసిన గొప్ప పనికి, గుర్తింపు కోరుకోవడాన్ని వాళ్లు ఇష్టపడటం లేదు.

ఈమధ్యే..

- మహారాష్ట్రకు చెందిన ఓ యువతి ఇంట్లో గొడవపడి గోదావరిలో దూకేందుకు వస్తే గుర్తించి రక్షించారు.
- ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో బలవన్మరణానికి ప్రయత్నించగా.. రెప్పపాటులో అక్కడికి చేరుకొని ముగ్గురినీ కాపాడారు.
- ఒక వివాహిత కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించగా రక్షించారు.
- ఓ యువకుడు వంతెన వద్ద తచ్చాడుతుండగా.. కౌన్సెలింగ్ చేసి పోలీసులకు అప్పగించారు.

ఎవరెంతమందిని కాపాడారంటే..

- వినోద్ కుమార్ - 40
- మహిపాల్ - 20
- రామకృష్ణ - 15
- దేవేందర్ - 15
- సంతోష్ - 13
- రవీందర్ - 12
- కరిపె సాయి - 10
- నగేశ్ - 8
- కల్యాణ్, ప్రశాంత్, కిశోర్, సత్యనారాయణ, భోజన్న, భూంరాజ్, కె.రాజు, యోగేష్, శ్రీకాంత్, కృష్ణ, ప్రణయ్, లింగ్‌లు ముగ్గురి నుంచి అయిదుగురికి ప్రాణదానం చేశారు.

ఒక వ్యక్తిని కోల్పోతే అతడి కుటుంబం ఎంత బాధ పడుతుందో వాళ్లకి తెలుసు. ఒక బిడ్డకి తల్లి లేకపోవడం.. ఒక కొడుక్కి చిటికెనవేలు పట్టుకొని నడిపించే నాన్న దూరమవడం.. ఎదిగొచ్చిన కొడుకుని ముసలి తల్లిదండ్రులు కోల్పోవడం.. ఎంత నరకమో వాళ్లకి తెలుసు గనకే ప్రాణాలకు తెగించి, కాపాడుతున్నారు.

– జి.శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్

యువతరం

youthpage@eenadu.in

18లక్షల యాప్‌లు గాయబ్

టెక్



మన స్మార్ట్‌ఫోన్‌లో ఏ యాప్ వేసుకోవాలన్నా గూగుల్ ప్లే స్టోర్‌కే వెళ్లి డౌన్‌లోడ్ చేసుకుంటుంటాం. మరి ప్లే స్టోర్‌లో మొత్తం ఎన్ని యాప్‌లు ఉన్నాయో మీకు తెలుసా? అక్షరాలా 34లక్షలు! ఇందులో 2024 సంవత్సరాంతం నాటికి 18 లక్షల యాప్‌లను గూగుల్.. ప్లే స్టోర్ నుంచి తొలగించింది. 'యాప్ ఫిగర్స్' ఇదేమాట చెబుతోంది. సెల్‌ఫోన్లు, సెల్‌ఫోన్లలో ఉండే సమాచార భద్రతకు ఈ యాప్‌లు ముప్పు కలగజేసే అవకాశం ఉందనే ఉద్దేశంతో ఇలా చేసిందట.

పంచుకుందాం



నీవెంటే
నేనుంటా
ఎందుకంటే..
నువ్వంటే మరో
నేనేగా!

ఊహలు, కలలు, ఆశలు
వీటన్నిటి అపురూప
కలయిక.. నువ్వు!

నడిచే
గులాబీని చూసి
చాలా రోజులైంది..
తను సెలవులకు
ఊరెళ్లింది!

- కిశోర్

నో.. నో.. నోమోఫోబియా!

క్షణంపాటు ఫోన్ కనిపించకపోతే ఎక్కడా లేని గాబరా.. అరనిమిషానికోసారి నోటిఫికేషన్స్ చెక్ చేసుకోవడం.. మన పోస్టులను ఎంతమంది చూశారోనని ఆలోచనలు.. ఇది 'నోమోఫోబియా'. ఈ ఫోబియా కొత్తేమీ కాదుగానీ ప్రతి నలుగురిలో ముగ్గురు దీని బారిన పడ్డారంటోంది తాజా అధ్యయనం.



లక్షణాలు

- ఫోన్ కనబడకపోతే తీవ్ర ఒత్తిడికి గురవుతారు.
- ఛార్జర్ అందుబాటులో ఉన్నా బ్యాటరీ ఛార్జింగ్ పదేపదే పరిశీలిస్తారు.
- ఫోన్‌లో ఏదో ముఖ్యమైన సమాచారం పోతోందని ఒకటే గాబరా.
- నెట్‌వర్క్, వై-ఫై అందుబాటులో లేకపోతే తల్లడిల్లిపోతారు.
- ఒక్కోసారి చెమటలు పడతాయి, గుండెదడగా ఉంటుంది.

బయట పడదామిలా

- భోజనం చేసేటప్పుడు, పడక ఎక్కాక ఫోన్ అస్సలు ముట్టుకోవద్దు.
- అవసరం లేని నోటిఫికేషన్లు రాకుండా యాప్‌లలో సెట్ చేసుకోవాలి.
- సెల్‌ఫోన్ కన్నా.. ఆటలు, చదవడం, ఇతర వ్యాపకాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

రోజూ మాతృదినోత్సవం



మన మెదడులో ఏ ఆలోచన మెదిలినా ఇన్‌స్టా స్టోరీగా మలిచేస్తాం.. భావోద్వేగాలు పెల్లుబికితే ఎక్స్‌లో స్పందిస్తాం.. పాత జ్ఞాపకాలు తిరగేసుకోవాలంటే 'ఫేస్‌బుక్' చూస్తాం.. అనుభవాలు పంచుకోవాలంటే స్నాప్‌చాట్‌ని ఆశ్రయిస్తాం.. ఏదైనా తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగితే యూట్యూబ్‌లో వెతికేస్తుంటాం. కానీ.. ఇవేమీ మనకు పరిచయం లేని రోజుల్లోనే మన జీవితానికి మొదటి లైక్ కొట్టింది.. మొదటి ఎమోషన్‌ను పరిచయం చేసింది.. మనకు తెలియని ఎన్నో విషయాలు నేర్పింది.. పాత జ్ఞాపకాలను పరిచయం చేసింది అమ్మ ప్రేమ మాత్రమే. అసలు అమ్మ ప్రేమలో దొరికే ఆనందం సోషల్ మీడియాలో ఉంటుందంటారా? వాట్సప్‌లో నీ లాస్ట్ సీన్ చూస్తూ.. ఎప్పుడు ఆన్‌లైన్‌లోకి వస్తాడా అని ఎదురుచూస్తుంటుంది అమ్మ. నువ్వు ఆమెను పలకరిద్దాం అనుకునేలోపే 'తిన్నావా నాన్న' అంటూ నీ బ్లూ టిక్ కోసం ఎదురుచూస్తుంటుంది.. ఇన్‌స్టా - నీ రీల్స్ చూస్తూ.. వాటికి వచ్చే కామెంట్స్ చదువుతూ ఎక్కువ మురిసిపోయేది అమ్మే. అమ్మ మనసును ఫొటో తీయగలిగితే.. నీ ఇన్‌స్టా గ్యాలరీ సరిపోదేమో! అమ్మ గొప్పతనం చెబుతూ ఒక్క రీల్ చేసి చూడు.. దానికి వచ్చే మిలియన్ల వ్యూస్ కంటే అమ్మ ముఖంలో కనిపించే విలువైన కాంతి అద్భుతంగా ఉంటుంది. 'ఫేస్‌బుక్' జ్ఞాపకాల్ని వెతుక్కుంటావేమోగానీ.. నువ్వు కడుపులో ఉన్నప్పుడు చేసిన అల్లరి తాలూకు జ్ఞాపకాలు అమ్మ మనసులో ఎప్పటికీ పదిలమే. ప్రపంచంలో నీకు తెలిసినవన్నీ ఎప్పుడూ 'ఫేస్‌బుక్' నీకు సజెస్ట్ చేస్తుందేమో.. కానీ, అమ్మకు నువ్వే ప్రపంచం. చిన్నప్పటి నీ ముద్దుముద్దు మాటల కన్నా యూట్యూబ్‌లో ఏ వీడియో కూడా ఆమెకు ఆనందాన్ని ఇవ్వలేవు. స్నాప్‌చాట్ స్టోరీలా 24 గంటల్లో మాయమయ్యే ప్రేమ కాదు అమ్మది.. తన చివరి శ్వాస వరకూ కనిపించే ప్రేమ అమ్మది. రకరకాల ఫిల్టర్లలో నువ్వు ఎలా ఉంటావో చూపు తుందేమో స్నాప్‌చాట్.. అమ్మ ప్రేమకు ఎలాంటి ఫిల్టర్లూ ఉండవు. అది ఎప్పటికీ స్వచ్ఛమైనదే. ఎక్స్ - ప్రపంచంలో ఎన్ని ట్రెండింగ్ టాపిక్స్ ఉన్నా.. అమ్మకు నీ ముచ్చట్లు మించిన టాపిక్ మరేదీ ఉండదు. అమ్మ మనసులో నువ్వే టాప్ ట్రెండింగ్. అమ్మ ప్రేమకు ఎన్ని లైక్‌లు కొట్టినా సరిపోవు. ఆమెకు తొలి లైక్ నువ్వే. అమ్మ ప్రేమ ఫాలోయింగ్ ట్రెండ్ హద్దులు ఉండవు.. అది లైఫ్‌టైమ్ ఫాలోయింగ్. అమ్మ కేరింగ్‌కు షేరింగ్ పనిలేదు.. ఎంత షేర్ చేసినా కొంత మిగిలే ఉంటుంది. అమ్మ ప్రేమను మన మనసులతో సబ్‌స్క్రైబ్ చేసుకుందాం.. ఆమె ప్రేమ వైరల్ చేసి మన హార్ట్‌లో సేవ్ చేసుకుందాం. ప్రతి రోజునూ 'మదర్స్ డే'లా జరుపుకొందాం.

– శ్రీలక్ష్మి జూపూడి

తాగునీటికి 7 టీఎంసీల వినియోగం

కృష్ణా డెల్టాలో పంట కాలువల కట్టివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా డెల్టా పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, బాపట్ల తదితర జిల్లాలకు రెండో విడత తాగునీటి విడుదల ప్రక్రియ ముగిసింది. వేసవి రీత్యా దాహార్తి కోసం గత నెల 16వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి తాగు నీటిని విడుదల చేశారు. తాగునీటి చెరువులు/రిజర్వాయర్లను నింపడంతో ఈ నెల 8వ తేదీన కాలువలకు నీటి సరఫరా నిలిపి వేశారు. తాగునీటి అవసరాల కోసం పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి నీటిని విడుదల చేశారు. ఇందుకు మొత్తం 7 టీఎంసీలు వినియోగించారు.

పులిచింతలలో నిల్వ.. తాగునీటి అవసరాలకు పోను, ప్రస్తుతం పులిచింతలలో 26 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న ఖరీఫ్ అవసరాల కోసం జూన్ 10వ తేదీన నారు మళ్లకు నీటిని విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. తొలుత విడుదల చేసిన నీటితో వరి నారు మళ్లు వేసుకుంటే.. ఆ తర్వాత నాట్లకు నీటిని ఇవ్వాల్సి ఉంటుంది. నారు మళ్ల ప్రక్రియ పూర్తయి, నాట్లు మొదలయ్యే నాటికి అప్పటి పరిస్థితిని బట్టి నీటి విడుదల ఉంటుంది. కృష్ణా నది పరివాహకంలో నీరు లభించకుంటే, పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని మళ్లించే యోచనలో అధికారులున్నారు.

'విద్యాసాగర్ నాయకత్వాన్ని బలపరుద్దాం'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న విద్యాసాగర్‌ను ఎన్నికుందామని సంఘ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో విద్యాసాగర్‌కు పూర్తి మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఎదుర్కొన్న అనేక సమస్యలను విద్యాసాగర్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ఎంతో కృషి చేశారని తెలిపారు. జిల్లా సహాధ్యక్షుడు వి.వి.ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ విద్యాసాగర్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైతే ఉద్యోగుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. సంఘ నాయకులు బి.సతీష్‌కుమార్, జి.రామకృష్ణ, ఎం.రాజుబాబు, దిలీప్‌కుమార్, బి.నాగేంద్రరావు, డి.విశ్వనాథ్, కె.శివలీల, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్, పురుషోత్తమరాజు, ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, రఘుపతి, రవికుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి, వేదికపై ప్రసాద్, రాజుబాబు, రమేష్, శివలీల తదితరులు

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు ముమ్మరం



విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. శుక్రవారం రాత్రి నార్త్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వేస్టేషన్‌ను జల్లెడ పట్టారు. రైల్వేస్టేషన్ ముఖ ద్వారం సమీపంలోని సర్క్యులేటింగ్ ఏరియాతో పాటు అన్ని ప్లాట్‌ఫారాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో విస్తృతంగా గాలించారు. ప్రయాణికులు, లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టాళ్లు, క్యాంటీన్లు, క్లోక్ రూమ్‌లు, విశ్రాంతి మందిరాలు, పార్సిల్ కార్యాలయం, తారాపేట ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ స్రవంతిరాయ్ సిబ్బందిని ఆదేశించారు. నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ, జీఆర్పీ సీఐ జేవీ రమణ, ఎస్.ఐ గోళ్ల సౌజన్య, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

శీతల గిడ్డంగి రైతులకు నగదు చెల్లింపులు నేడే

ధర నిర్ణయించాలని యాజమాన్యం వినతితో సందిగ్ధంలో బాధితులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

జగ్గయ్యపేట శీతల గిడ్డంగి అగ్ని ప్రమాద బాధిత రైతులు నగదు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత నెల 7న జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సమక్షంలో కుదిరిన ఒప్పందం మేరకు బాధిత రైతులకు మొదటి విడతగా రూ. 2 కోట్లు చెల్లించేలా ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఆ మేరకు గిడ్డంగి యాజమాన్యం డబ్బులు చెల్లిస్తోందనే ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. మార్చి 24న గిడ్డంగిలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మిర్చి, అపరాలు మొత్తంగా 31,655 బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతుల ఆందోళనతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చొరవ తీసుకొని మార్చి 29, ఏప్రిల్ 7న రెండు దఫాలుగా జరిపిన చర్చల ఫలితంగా బాధిత రైతులకు నగదు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఆ మేరకు గిడ్డంగిలో సరకు నిల్వ చేసుకొని రుణాలు పొందని 167 మంది రైతులకు బస్తా ఒక్కింటికి రూ. 2 వేలు చొప్పున మొదటి విడతగా సుమారు రూ. 2 కోట్లు చెల్లిస్తామని ఎమ్మెల్యే సమక్షంలో రైతులు, అధికారులతో ఒప్పందం కుదిరింది.

నేతల చుట్టూ ప్రదక్షిణలు

మొదటి విడత నగదు చెల్లించే గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో బాధిత రైతులు వారం రోజులుగా నేతల చుట్టు తిరుగుతున్నారు. ఒప్పందం మేరకు రుణాలు పొందని వారికి బస్తాకు రూ. 2 వేలు చెల్లించాలి. ఆ మేరకు మే 10న చెల్లింపులు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ నెల 7న గిడ్డంగి యాజమాన్యం మార్కెటింగ్ అధికారులను కలిసి గిడ్డంగిలో 2023, 2024 ఏడాదిలో నిల్వ ఉంచిన పాత మిర్చికి ధర నిర్ణయించాలని వినతిపత్రం ఇచ్చారు. దీంతో బాధిత రైతుల్లో మరోమారు ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సమక్షంలో అధికారులు, బాధిత రైతులు, గిడ్డంగి యజమానులు కలిసి ధరల విషయంలో ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ మేరకు చెల్లింపులు చేస్తామని చెప్పారు. ఇపుడు మళ్లీ పాత మిర్చికి ధర నిర్ణయించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒప్పందం మేరకు నగదు చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని పలువురు రైతులు చెబుతున్నారు.

రబీ ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ ధాన్యం సేకరణ లక్ష్యాన్ని మరో 10,000 మెట్రిక్ టన్నులకు పెంచారు. దీంతో దశల వారీగా లక్ష్యం 70,000 మెట్రిక్ టన్నులకు చేరింది. తొలుత 10,000 మెట్రిక్ టన్నులే లక్ష్యంగా ఉంది. రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 50,000 మెట్రిక్ టన్నులకు పెంచి కొనుగోళ్లను ఆరంభించారు. లక్ష్యం పూర్తి కావడంతో మరో 10,000 మెట్రిక్ టన్నులు పెంచారు. ఇది కూడా పూర్తవడంతో మళ్లీ పెంచారు.

64,741 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

జిల్లాలో 70,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండగా, శుక్రవారం నాటికి 5,501 మంది రైతుల నుంచి రూ. 143.59 కోట్ల విలువ చేసే 64,741.32 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి.సతీష్ తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు 18,70,400 గోనె సంచులను సమకూర్చినట్టు పేర్కొన్నారు. రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే విజయవాడలోని పౌరసరఫరాల సంస్థ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 77020 03571కు తెలియజేయాలని సూచించారు.

ఆఫర్లతో దోచేశాడు

వందల మంది నుంచి రూ. లక్షల్లో జిమ్ ఫీజు వసూళ్లు

పటమట, న్యూస్‌టుడే

మహిళా దినోత్సవం.. రంజాన్.. ఈస్టర్.. ఉగాది ఆఫర్ అంటూ ప్రతి పండగని వాడుకొని రకరకాల ఆఫర్లతో యువత నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేశాడు. ఏడాది ఫీజు ఒకేసారి చెల్లిస్తే 50 శాతం రాయితీ, లావుగా ఉంటే తగ్గేందుకు ప్రత్యేక కోచ్‌ను నియమిస్తామంటూ నమ్మబలికాడు. వందల మంది నుంచి రూ.10 వేల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసి తీరా జిమ్‌ను మూసేసిన ఘటన మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కొల్లిపర నిర్మల కృష్ణ కుమార్ టిక్కిల్ రోడ్డులోని మ్యాసర్ ఫుడ్ ప్లాజాకు ఎదురు రోడ్డులో 'ది స్నాప్ ఫిట్‌నెస్ సెంటర్' నిర్వహిస్తున్నాడు. కొంత కాలం నుంచి సామాజిక మాధ్యమాల ద్వారా ఆఫర్లు ప్రకటించి యువతను ఆకర్షించేవారు. ఈస్టర్ బ్లాస్టు, డండియా నైట్, స్నాప్ జిమ్ డ్యాన్స్ పార్టీ అంటూ పలు విధాలుగా ట్రాప్ చేసేవారు. మీరు ఫీజు చెల్లిస్తే మీ స్నేహితులు కూడా ఒకరు ఉచితంగా రావొచ్చంటూ మభ్యపెట్టి ఐదు నెలల్లో రూ.కోటికిపైగా వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

20 రోజులుగా 'టుడే జిమ్ క్లోజ్' బోర్డు..

గత 20 రోజులుగా జిమ్ తెరవట్లేదు. 'టుడే జిమ్ క్లోజ్' అని బోర్డు పెడుతున్నారు. మరుసటి రోజు వచ్చినా అలాగే ఉండటంతో జిమ్ నిర్వాహకుడు కొల్లిపర నిర్మల కృష్ణ కుమార్‌కు ఫోన్ చేయగా 20 రోజుల నుంచి కాలయాపన చేస్తూ వస్తున్నాడు. గట్టిగా అడిగితే మీకు చేతనైంది చేసుకోండి.. కావాలంటే జిమ్ డోర్లు పగలగొట్టి మీకు కావాల్సింది తీసుకెళ్లండంటూ సమాధానం ఇచ్చేవాడు. ఈ నేపథ్యంలో జిమ్‌ను బ్యాంకు జప్తు చేసిందనే విషయం తెలుసుకున్న బాధితులు మాచవరం పోలీసులను ఆశ్రయించారు. నాలుగు రోజులుగా తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదంటూ బాధితులు ఆరోపిస్తున్నారు.



మాచవరం పోలీసుల ఎదుట స్నాప్ జిమ్‌కు ఫీజు చెల్లించిన బాధితులు

సెక్యూరిటీ సిబ్బందిపై నిర్వాహకుల దాడి..

జిమ్ కోసం స్టేట్ బ్యాంకు నుంచి రూ.కోట్లలో రుణం తీసుకున్నారు. సక్రమంగా తిరిగి చెల్లించకపోవడంతో ఈ ఏడాది జనవరిలో జిమ్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు బ్యాంకు అధికారులు ప్రకటన జారీ చేశారు. జిమ్‌ను మూసి వేస్తారని తెలిసి కూడా రకరకాల ఆఫర్లు ప్రకటించి యువత నుంచి రూ.లక్షల ఫీజు వసూల్ చేశారు. బ్యాంకు అధికారులు పోలీసుల సహకారంతో జిమ్‌ను జప్తు చేసుకొని జిమ్ వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. ఈ నెల 2న అర్ధరాత్రి కొల్లిపర నిర్మల కృష్ణ కుమార్ తన స్నేహితుడు ప్రవీణ్ కుమార్‌తో పాటు వచ్చి సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి, జిమ్ తాళాలు ధ్వంసం చేసి లోపలకు వెళ్లారు. దీనిపై బాధితులు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జగ్గయ్యపేటలో భారీ ఇండస్ట్రియల్ హబ్

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో భారీ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో ఇక్కడ పారిశ్రామిక హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరికేందుకు వీలుంటుంది. హబ్ ఏర్పాటు కోసం జగ్గయ్యపేట పరిధిలోని వేదాద్రి, జయంతిపురం గ్రామాల్లో ఉన్న భూములను పరిశీలిస్తున్నారు. వేదాద్రిలో 700 ఎకరాలు, జయంతిపురంలో ఏపీఐఐసీకి చెందిన 498 ఎకరాల భూములను ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కలిసి శుక్రవారం పరిశీలించారు. జయంతిపురంలో ప్రభుత్వ భూములు సైతం మరో 313 ఎకరాలున్నాయి. ఈ రెండూ కలిపితే భారీ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి భూములను పరిశీలించినట్టు అధికారులు వెల్లడించారు.



జయంతిపురంలో భూములు పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

త్రివిధ దళాలకు సంఘీభావం



కొవ్వొత్తుల ప్రదర్శనలో లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సరిహద్దులో పాకిస్థాన్ సైన్యం దుశ్చర్యలను సమర్థంగా తిప్పికొడుతున్న భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా కృష్ణా జిల్లా లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. బెంజిసర్కిల్‌లోని లారీ యజమానుల సంఘం హాలు నుంచి ప్రారంభమై పీవీపీ మాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగుమోతు రాజా, రావి శరత్‌బాబు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జై జవాన్.. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

రౌడీ, సస్పెక్టు షీటర్ల షీట్ల బదిలీ

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే సమయంలో తెరిచిన రౌడీ, సస్పెక్టు షీటర్ల షీట్లను ఇటీవల పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఇతర పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. షీటు ఒక చోట నివాసం మరో చోట ఉండడంతో పర్యవేక్షణ సౌలభ్యం కోసం షీట్లు బదిలీ చేశారు. కొత్తపేట పీఎస్ నుంచి ఐదుగురి షీట్లు బదిలీ అయ్యాయి. రౌడీషీటర్ కొండా యెహోవా అలియాస్ పెద్ద చిచా, లా అండ్ ఆర్డర్ సస్పెక్టు షీటర్ రవ్వ నాగ హేమంత్ రాకేష్‌బాబు షీట్‌లను భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు, మరో రౌడీ షీటర్ సంపర క్రాంతి షీట్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, రౌడీషీటర్ చల్లగాలి బెనర్జీ షీట్ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు మార్చారు. లా అండ్ ఆర్డర్ సస్పెక్టు షీటర్ ఆకుల శ్రీకాంత్ షీట్‌ను కృష్ణలంకకు బదిలీ చేశారు. అలాగే వివిధ పోలీస్‌స్టేషన్ల నుంచి ఇద్దరు క్రైమ్ సస్పెక్టు షీటర్లు, ఐదుగురు లా అండ్ ఆర్డర్ సస్పెక్టు షీటర్ల షీట్లను కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యాయి.

రూ.20 లక్షల నష్టపరిహారం అందజేత

విజయవాడనగరపాలక సంస్థ: నగర పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుని కుటుంబ సభ్యులకు కార్పొరేషన్ నుంచి రూ.20 లక్షలు నష్టపరిహారంగా అందించారు. కార్మికుడు మేడా మాణిక్యాలరావు సీవరేజ్ పనులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి మరణించాడు. 2023 జులైలో ఈ ఘటన జరగ్గా, అతని కుటుంబ సభ్యులకు నష్టపరిహారంగా రూ.20 లక్షలు చెల్లించాలంటూ న్యాయస్థానం ఇటీవల తీర్పునిచ్చింది. దీంతో మరణించిన కార్మికుడి భార్య మేడా యశోధకు నష్టపరిహారం సొమ్మును చెక్కు రూపంలో కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం అందజేశారు. అధికారులు బి.సత్యనారాయణమూర్తి, సామ్రాజ్యం పాల్గొన్నారు.



సొమ్ము అందజేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

వసుంధర

vasundhara@eenadu.in



వారసత్వంగా రానక్కర్లేదు...

పిల్లలకు చాలా అలవాట్లు, అభిరుచులు తల్లిదండ్రుల నుంచే వస్తాయంటారు కదా! అయితే, ఆ జన్యువులు పిల్లలకు నేరుగా సంక్రమించకపోయినప్పటికీ... వారి చదువు, మానసిక ఆరోగ్యాలపై తల్లిదండ్రుల జన్యువులు ప్రభావం చూపిస్తాయని 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' పరిశోధనలు చెబుతున్నాయి. వీటినే 'జెనెటిక్ నర్చర్' లేదా 'ఇన్‌డైరెక్ట్ జెనెటిక్ ఎఫెక్ట్స్'గా అభివర్ణిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఇందుకోసం యూకే, ఆస్ట్రేలియా, యూఎస్‌ల్లోని కొన్ని వేల కుటుంబాలను అధ్యయనం చేశారు. పాలీజెనిక్ స్కోర్ అనే స్టాటిస్టికల్ టూల్ ఆధారంగా వారి జెనెటిక్ డేటాను విశ్లేషించారు. పాలీజెనిక్ స్కోర్ అధికంగా ఉన్న తల్లిదండ్రుల పిల్లల్లో ఎడ్యుకేషనల్ ఫలితాలు బాగున్నాయట. మంచి గ్రేడులు, నిర్ణీతకాలంలో చదువు పూర్తి చేయడం... వంటి వాటిల్లో ముందున్నారట. ఈ స్కోర్ బాగున్న తల్లిదండ్రులు పిల్లలకు పఠన, అధ్యయన అలవాట్లు చేయించడం, చదువుకునేందుకు తగిన వనరులను సిద్ధం చేయడం వంటివి చేస్తారట. ఇవన్నీ బిడ్డలపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తాయి. పిల్లలకు తల్లిదండ్రుల నుంచి నేరుగా ఆ జీన్స్ వచ్చినా రాకున్నా సరే... పిల్లల చదువు, మానసిక ఆరోగ్యాలపై ప్రభావం చూపిస్తాయట. భావోద్వేగ నియంత్రణ, ప్రేరణ, పట్టుదల, స్వీయ నియంత్రణ... వంటివీ అలవడతాయట. కాబట్టి, బాల్యం నుంచే ఇలాంటి వాతావరణం పిల్లలకు కల్పిస్తే, తల్లిదండ్రుల జన్యువులతో పనిలేకుండానే వారిలో మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.



బంగారం-వెండి

9న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,500	90,550	98,524
విజయవాడ	96,610	90,150	98,600
ప్రొద్దుటూరు	97,500	89,650	98,300
రాజమహేంద్రవరం	98,000	89,180	98,000
విశాఖపట్నం	97,930	90,150	1,02,000
తమిళనాడు	-----	90,150	1,10,000

"మహిళా ఉద్యోగినులు ఎక్కువగా ఉంటే ఆ సంస్థ పనితీరు మెరుగ్గా ఉంటుంది. ఆదాయమూ పెరుగుతుంది. స్త్రీలు తమకు తాము ఉన్నత లక్ష్యాలను పెట్టుకుంటారు. పట్టుదలతో వాటిని చేరుకుంటారు.

- శుభశ్రీ, ఎండీ, సీయీవో, శ్రీరామ్ క్యాపిటల్



మీకు తెలుసా

అనెటా బీటా క్రెగ్లికా... పోలండ్ మొదటి మిస్ వరల్డ్. అంతే కాదు, ఇప్పటి వరకూ ఈ టైటిల్ అందుకున్న వారిలో ఎక్కువ వయసున్న అమ్మాయి ఈమె. పోటీల్లో నెగ్గేనాటికి ఈమె వయసు 24 ఏళ్ల 244రోజులట.



ఆకాశమంత పందిరి... భూదేవంత అరుగు... ఒకప్పుడు పెళ్లిళ్లంటే ఇలాగే మాట్లాడేవారు. ఫలానావారి తోటలో కొబ్బరాకులు, అరిటాకులు, పూలంటూ పురమాయించేవారు. చేతివృత్తులకూ పని. అంతేనా, చిన్నా పెద్దా అంతా చేయి వేసేవారు. మరిప్పుడు రూ.లక్షలు, కోట్లు వెచ్చించడం గురించే చర్చ. పెళ్లి పనులన్నీ ఎవరికో ఒకరికి అప్పగించేయడమే. దీనికి భిన్నంగా ఓసారి అలా అలా వెనక్కి వెళ్లి రండి! పచ్చని పందిళ్లు, పూల నడుమ పెళ్లి వేడుక చేసుకోండి. ప్రకృతి హితం... ప్రేమ అదనం.



పచ్చాపచ్చని పెళ్లి వేడుక!

ఏటా మన భారతీయ పెళ్లిళ్ల ఖర్చెంతో తెలుసా? కొన్ని రూ.వేలకోట్లు. కళ్లు చెదిరే డెకరేషన్లు, భారీ విందులు, మిరుమిట్లు గొలిపే బాణసంచా... జాబితా రాయాలే కానీ చాంతాడంత. మరి ఖర్చు పెరగదూ? పైగా ఇది పట్టణాలకే పరిమితం అవడం లేదు... పల్లెలకీ పాకింది. ఆ ఖర్చు భరించలేక అప్పుల పాలవుతున్నవారూ లేకపోలేదు. ఈ ఆనవాళ్లు పేరుకున్న చెత్త, వృథా అయిన ఆహారం... ఇలా ఎన్నో రూపాల్లో బాధిస్తూనే ఉంటుంది. ఇవన్నీ వద్దంటే సస్టెయినబిలిటీ... అదేనండీ ప్రకృతిహిత పెళ్లికి ఓటేయండి.

పెళ్లి శుభలేఖల నుంచే ప్రయాణం మొదలుపెట్టేయండి. డిజిటల్ వాటిని ఎంచుకుంటే పేపర్ వృథా కాదు. పెళ్లన్నాక షాపింగ్ తప్పనిసరే! వీలుంటే బ్యాగులు ఇంటినుంచే తీసుకెళ్లండి. దుస్తులకు అట్టపెట్టెలు వస్తాయి కదా! వాటిని రీసైకిల్ చేస్తారు. చుట్టుపక్కల అలాంటివేమైనా ఉంటే కనుక్కొని పంపండి. పచ్చని పెళ్లి పందిరి అంటారు కదా! దాని నీడన ఒక్కటైన దంపతుల కాపురమూ కలకాలం పచ్చగా సాగాలని దాని వెనక ఉద్దేశం. కొబ్బరి ఆకుల పందిరి ప్రయత్నించండి. ఇంటి వద్ద స్థలం లేదా? అయితే ఏదైనా ఫామ్, తోటల్లో ప్లాన్ చేసుకున్నా మంచిదే. పచ్చని ప్రకృతి ఒడిలో పెళ్లి వేడుక చూడముచ్చటగా ఉంటుంది. పెళ్లి వేడుక పగలైతే కరెంటు అవసరమే ఉండదు. మరి రాత్రయితే 'కార్బన్ ఫుట్‌ప్రింట్' వదిలినట్లేగా అంటారా? సోలార్ సాయం తీసుకుంటే సరి. పోర్టబుల్ సోలార్ ప్యానెల్స్, లైట్స్ అద్దెకు దొరుకుతున్నాయేమో చూసుకుంటే సరి. కుండీల్లో మొక్కలు, తాజా పూలు, తిరిగి వాడుకునే చెక్క, వస్త్రాలు వంటివి డెకరేషన్‌కి సాయపడతాయి. వీటన్నింటితో దాదాపు 700 కేజీల వృథా తగ్గించినవారు అవుతారు.

పెళ్లండీ... ఆటా పాటా ఉండాలిగా అంటారా? దానికి డీజేలూ, పెద్ద మోతలొచ్చే డప్పులే కావాలా? శబ్ద కాలుష్యం. చక్కగా అయినవాళ్లందరినీ పాడమనండి. సౌండ్ సిస్టమ్ ఇంట్లోది తెచ్చి నచ్చిన పాటలను పెట్టి... అందరినీ కాలు కదపమన్నా సరే. అనుబంధాలను ఇంతకన్నా దగ్గర చేసేది వేరే

పెళ్లిళ్లలో ఎక్కువ వృథా జరిగేదెక్కడో తెలుసా? ఆహారం దగ్గరే! మనం వడ్డించే దాంట్లో 30% వృథాకే పోతోందని అంచనా. పెట్టేవాళ్లు ఎక్కువగా పెట్టేస్తారు. నచ్చకపోతే అది చెత్తబుట్ట పాలవ్వాల్సిందే. వడ్డన దగ్గరే కొద్దిగా వడ్డించేలా జాగ్రత్త తీసుకోవాలి. ఇంతకీ ఏ ప్లేట్లు వాడుతున్నారు? ప్లాస్టిక్, సింగిల్ యూజ్ వాటితో పోగయ్యే చెత్త వందల ఏళ్లైనా భూమిలో కలవవు. ఇలా ఓ మోస్తారు పెళ్లిలో మొత్తం వృథా దాదాపు 500 కేజీలని అంచనా! స్టీలువి తీసుకున్నా... కడగడానికి నీళ్లు కావాలి. కాబట్టి, ఆకులు, విస్తర్లను ఎంచుకోవడం మేలు. మిగిలిన ఆహారాన్ని రోడ్డుపక్కన నివసించేవారు, పొలాల్లో పనిచేసేవారు, ఆశ్రమాలకు పంపొచ్చు. నీళ్లనీ ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్ కప్పుల్లో ఇవ్వొద్దు. రీ యూజబుల్ క్యానుల్లో తెచ్చి స్టీలు గ్లాసుల్లో అందించొచ్చు. స్టీల్ బాటిళ్లను ఇవ్వండి గిఫ్ట్‌గానూ పనికొస్తుంది. ఇవన్నీ కాదంటే... శుభలేఖలోనే వెంట బాటిల్ తెచ్చుకోవడం తప్పనిసరి అని రాస్తే సరి. ఎలక్ట్రిక్ వెహికల్స్, తక్కువ నీటి ఉపయోగం వీటినీ ఆలోచించుకోవాలి. నిజానికి పెళ్లికి అంత ఖర్చుపెట్టి కొన్నా ఒకటీ రెండుసార్లకు మించి వేయడం లేదని అమ్మలు, బామ్మల చీరలు, నగలకు ప్రాధాన్యమిస్తున్నవారు ఉన్నారు. అలా అనుసరించలేకపోతే వాటిని తిరిగి ధరించే ఆలోచనలు చేసుకోండి.

ఏముంటుంది చెప్పండి? ఇక, రిటర్న్ గిఫ్ట్‌లు... ఉపయోగపడతాయి అనుకున్నవే ఇవ్వండి. స్వీట్లైనా, బహుమతులైనా క్లాత్, జ్యూట్ బ్యాగుల్లో పెట్టి ఇవ్వండి. మొక్కలు, వస్త్రంతో చేసిన క్లచ్‌లు వగైరా ఇచ్చినా మంచిదే.

అన్నీ ప్రకృతి హితమైనవే తెచ్చారు. బాగానే ఉంది... మరి వేడుక పూర్తయ్యాక వాటినేం చేస్తారు? రీసైకిలింగ్ చేసేవాటిని, కంపోస్టుగా మార్చే వాటిని విడదీయండి. ఆయా కేంద్రాలకు పంపండి లేదా తగ్గ ఏర్పాట్లు చేయండి. ఒక పెళ్లి ద్వారా దాదాపు 60 టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్ విడుదలవుతోందని అంచనా. పచ్చని పెళ్లిని ఎంచుకుంటే దాన్ని 70 శాతం వరకూ తగ్గించొచ్చు. భారీ ఖర్చు అనేది పాత మాట. 'తక్కువ వృథా... ఎక్కువ ప్రేమ' అనేది నేటి మాట. సొంతంగా కష్టమైతే ఇలాంటి పెళ్లిళ్లను నిర్వహించే సంస్థల సాయమూ తీసుకోవచ్చు. పెళ్లనే కాదు ఇతర వేడుకలకీ పర్యావరణ సూత్రాన్ని పాటించొచ్చు. ప్రయత్నిస్తారా!



జీవితం అందరికీ పూలబాట కాదు. కొంతమంది చిన్నప్పట్నుంచే పోరాటాల మధ్య ఎదుగుతారు. కోల్పోయిన జీవితాన్ని తిరిగి తెచ్చుకోవాలని శ్రమిస్తుంటారు. ప్రపంచ సుందరి దయానా హెడెన్ ఈ కోవకే చెందుతారు.

నల్లగా ఉందని వెక్కిరించారు..!



3

'మీరెందుకు ప్రపంచ సుందరి అవ్వాలనుకుంటున్నారు' అని న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నకు... 'ప్రముఖ రచయిత విలియం బట్లర్ యేట్స్ రచనలు నాకు ప్రేరణ. ఓ సందర్భంలో ఆయన 'కలలతో బాధ్యత మొదలవుతుంది' అన్నారు. ఈ కిరీటం నా కల. ఇది నాలాంటి వేల మంది కలల్ని సాకారం చేసే బాధ్యతను నాకిస్తుంది' అని చెప్పారు దయానా. ఇది కేవలం సమాధానమే కాదు. ఆమె జీవితం కూడా. ఆడుతూ పాడుతూ ఉండాల్సిన వయసు నుంచే ఆమె బతుకు పోరాటం ప్రారంభమైంది. ఒక సాధారణ హైదరాబాదీ అమ్మాయి దయానా. కానీ ఆమె జీవితం మాత్రం అసాధారణం. ఆంగ్లో-ఇండియన్ కుటుంబం ఈమెది. చిన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోయారు. కొన్నాళ్లు తల్లి దగ్గర స్టేట్స్‌లో ఉన్నా... తండ్రి ఆరోగ్యం బాలేదన్న విషయం విని ఇక్కడికి వచ్చేశారు. అండగా ఉంటాడనుకున్న తండ్రి అనారోగ్యంతో మరణించారు. బంధువులు కూడా చేరదీయలేదు. చదువుకోవాలనే కోరిక ఉన్నా.. స్తోమత లేక మానేసింది. తిరిగి వెళ్లడం ఇష్టం లేక ఇక్కడే ఉండిపోయింది. పొట్టకూటి కోసం 14 ఏళ్లకే ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో పనిచేయడం మొదలుపెట్టింది. 'నల్లగా ఉన్నావు, నీది అసలు ఈ గ్రహమేనా, ఏ దేశం' అంటూ ఎన్ని హేళనలో. తనెందుకు ఇలా ఉన్నానని ఏడవని రోజు లేదట. కానీ భవిష్యత్తు మీద ఆశ... కష్టపడేతత్వమే ఆమెని ప్రపంచ సుందరిని చేశాయి.

ఒక్కరూ మాట్లాడలేదు...

అవకాశాల్ని అందిపుచ్చుకునే తత్వం దయానాది. దానిలో భాగంగానే ముంబయిలో పీఆర్‌గా చేరింది. అక్కడే తన స్నేహితులు ప్రపంచ సుందరి పోటీల కోసం చెప్పారట. ప్రయత్నించాలనుకుంది కానీ బాడీ షేమింగ్‌ను తలుచుకుని వద్దనుకుందట. 'దేశ విదేశాల నుంచి ఎందరో పాల్గొంటారు. అందరూ తెల్లగా ఉండరు కదా' అన్న మాటలకు రాజీపడి... పోటీల కోసం పేరిచ్చింది. అక్కడేం జరుగుతుందో తెలుసుకోవాలని ప్రయత్నిస్తే... ముందు గెలిచిన వారెవరూ తనతో మాట్లాడటానికి ఇష్టపడలేదట. ఎలాంటి గైడెన్స్ లేకుండానే వేదిక ఎక్కింది. గెలుస్తాను అన్న ధైర్యం లేదు... ఆశ అంతకన్నా లేదు. ఓడిపోతే ఇదో పాఠమవుతుంది అన్న భావనే ఉంది. కఠిన పరిస్థితుల్లోనూ చెరగని చిరునవ్వే ఆమెను ప్రపంచ సుందరిగా నిలబెట్టాయి. రీతా ఫారియా, ఐశ్వర్య రాయ్ తర్వాత మిస్ వరల్డ్ టైటిల్‌ను గెలుచుకున్న మూడో వ్యక్తి దయానానే. అంతేకాదు, మిస్ ఫొటోజెనిక్, స్పెక్టాక్యులర్ స్విమ్‌వేర్, మిస్ వరల్డ్-ఆసియా అండ్ ఓషియానియా లాంటి సబ్ టైటిళ్లనీ సొంతం చేసుకున్నారు దయానా. ఈ ఘనత సాధించిన మొదటి వ్యక్తీ ఈమే. తర్వాత లైఫ్ లైన్, అలర్ట్ ఇండియా, గ్రీన్ పీస్... ఇలా పిల్లలు, మహిళా సంక్షేమ ఎన్జీఓలతో కలిసి పనిచేశారు. బ్రెస్ట్ క్యాన్సర్, హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహనా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. పోటీలో పాల్గొనడానికి తను పడిన ఇబ్బందులు ఇంకెవరికీ ఎదురుకాకూడదని... ట్రైనర్‌గానూ మారారు. మిస్ వరల్డ్ రన్నరప్ శ్రీసైనీ, ప్రియాంక చోప్రాలకు మార్గనిర్దేశం చేశారీమె. ఇప్పటికీ ఎయిర్‌హోస్టెస్‌లకు శిక్షకురాలిగా పనిచేస్తున్నారు. అందం అంటే మేకప్ మాత్రమే కాదంటూ వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన 'ఎ బ్యూటిఫుల్ ట్రూత్' పుస్తకాన్నీ రాశారు.

అమ్మ... అంజలి... కొకెడమా!






కేరళకు చెందిన అంజలికి ప్రకృతి అంటే ప్రాణం. ఆమెకు అమ్మ నుంచి వచ్చిన ఆసక్తే అది. ఓసారి అమ్మ వాళ్ల స్నేహితురాలి ఇంటికి వెళ్లింది అంజలి. అక్కడ జపనీస్ గార్డెనింగ్ పద్ధతి 'కొకెడమా'లో వాళ్లు పెంచిన మొక్కలకు ఆకర్షితురాలయ్యింది. అలా తనూ ఒక గార్డెన్ అలా తయారుచేసుకోవాలనుకుంది. ఆన్‌లైన్‌లో వీడియోలు చూసి నేర్చుకుంది. క్రమంగా దానిపై ఆసక్తి పెంచుకుని మరిన్ని మొక్కలు నాటాలని నిర్ణయించుకుంది. అప్పుడు వాళ్లమ్మ చెప్పిన 'రీసైక్లింగ్' ఆలోచన తన తోటకి మరింత అందాన్ని తేవడమేకాదు, పర్యావరణ హితంగానూ మార్చింది. పాత రంగు డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, వృథా ప్లాస్టిక్ క్యాన్లు, వస్త్రాలు, డ్రమ్ములు, పాత కుట్టు మెషీన్లు... ఇలా ప్రతి దాన్నీ ప్లాంటర్లుగా, గార్డెనింగ్ పరికరాలుగా, అలంకరణ వస్తువుల్లా వాడేవారు. అలా ఇప్పుడు అంజలి ఇల్లు ఓ 'గ్రీన్ ఒయాసిస్'లా మారిపోయింది. దీనివల్ల ఖర్చు తగ్గటమేకాదు, పర్యావరణానికీ హితం అని తెలుసుకున్న అంజలి... సామాజిక మాధ్యమాల్లో తన సస్టెయినబుల్ గార్డెనింగ్‌కి సంబంధించిన సూచనలూ ఇస్తున్నారు. వ్యర్థాలను కూడా అర్థవంతంగా మార్చేస్తోన్న అంజలి ప్రయత్నం బాగుంది కదా!





అర్ధ చంద్రాసనం

తుంటి, తొడ కండరాలను బలంగా ఉంచి పిక్క కండరాలకు శక్తిని ఇస్తుందీ ఆసనం.



చేసే విధానం: ఒకే పాదం ఒకే చేయి మీద శరీరాన్ని బ్యాలెన్స్ చేసే భంగిమ ఇది. ముందుగా మ్యాట్‌పైన ధ్యానంలో కూర్చొని శరీరాన్ని మనసును ఆసనం వేయడానికి సిద్ధం చేయండి. ఆపై నిదానంగా మ్యాట్‌పైన నిల్చొని కుడి పాదాన్ని కుడి పక్కకు తిప్పి మోకాలిని కొంచెం వంచి కుడి హస్తాన్ని కుడి పాదం ముందుగా తగిన దూరంలో ఆన్చి ఉంచండి. ఇప్పుడు నెమ్మదిగా ఎడమ పాదాన్ని నేల నుంచి సమాంతరంగా పైకి లేపండి. అదే విధంగా శరీరాన్ని బయటవైపుగా తెరిచి ఉంచి మీ ఎడమ చేతిని ఆకాశం వైపుగా పైకి చాచి ఉంచండి. ఇది పూర్తిగా బ్యాలెన్సింగ్ ఆసనం. ఈ ఆసన స్థితిలో 10-12 సెకన్లు ఉండే ప్రయత్నం చేసి యథాస్థానానికి రండి. ఆసనం బ్యాలెన్స్‌డ్‌గా ఆగాలి అంటే, కింద ఉన్న పాదం, అలాగే, పైకి చాచిన చేయి... రెండింటినీ సాగదీస్తూ శరీరాన్ని సమన్వయం చేయాలి. ఇలా ఒక పక్క చేసిన తర్వాత మరోపక్క ఆసనాన్ని పునరావృతం చేయండి.

- ఒకవేళ పాదం పక్కనే హస్తం ఆనక ఇబ్బంది పడితే యోగా బ్రిక్ సాయంతో లేదా స్టూల్ సాయంతో ఆసనాన్ని చేయొచ్చు.

జాగ్రత్తలు: తుంటి, మోకాళ్లు, మడం, మణికట్టు సర్జరీలు అయినవాళ్లు; తల తిరుగుడు సమస్య ఉన్నవారు చేయరాదు. బాగా పెద్ద వయసువాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

ఉపయోగాలు: తొడ, చీలమండలను బలపరుస్తుంది. ఫ్లెక్సిబిలిటీని పెంచుతుంది. పిరుదుల దగ్గర ఉన్న కొవ్వును కరిగిస్తుంది. పొట్ట కండరాలను బలపరుస్తుంది. శరీరాన్నీ, మనసునీ బ్యాలెన్స్ చేస్తుంది. సహనం, నిలకడ అలవాటు అవుతాయి.

సూర్య ముద్ర

రక్త ప్రసరణ మెరుగుపరిచేందుకు ఉపయోగపడే ముద్ర ఇది.



చేసే విధానం: యోగా మ్యాట్‌పైన వజ్రాసనం లేదా పద్మాసనంలో కూర్చోండి. వెన్నెముకను నిటారుగా ఉంచి శ్వాసమీద ధ్యాసపెట్టి రెండు చేతుల్నీ మోకాలిపైన ఉంచాలి. అరచేతుల్ని ఆకాశంవైపుగా తెరిచి ఉంచి... బొటనవేలి కింద భాగాన్ని తాకేలా ఉంగరం వేలిని మడవండి. ఆపై బొటనవేలిని ఉంగరం వేలిపైన ఉంచి మృదువుగా ఒత్తి ఉంచండి. ఇప్పుడు చూపుడు, మధ్య, చిటికెన వేళ్లను సాగదీసి ఉంచండి. ఈ ముద్రను భోజనం చేసిన తర్వాత 10 నిమిషాల పాటు విశ్రాంతిగా కూర్చొని వేయొచ్చు.



సూచన: ఈ ముద్రని శీతాకాలంలో ఎక్కువగా వేస్తారు. బరువు తగ్గాలి అనుకునేవాళ్లు వేసవిలోనూ చల్లని వాతావరణంలో సాధన చేయొచ్చు.

జాగ్రత్తలు: అధిక వేడి శరీరం ఉన్నవాళ్లూ, జ్వరం, అనారోగ్యంతో బాధపడుతున్నవాళ్లూ ఈ ముద్రని వేయకూడదు.

ఉపయోగాలు: జీర్ణశక్తిని పెంచుతుంది. జీవక్రియను సమతుల్యం చేస్తుంది. బరువు తగ్గడానికి బాగా పనిచేస్తుంది. కొవ్వును కరిగిస్తుంది. జలుబు, దగ్గులకు పనిచేస్తుంది.

ఆహారం: ఈ ముద్ర వేసినప్పుడు చలువచేసే సబ్జా, కొబ్బరి నీళ్లూ, మజ్జిగను తీసుకోవాలి.

- శిరీష, యోగ గురు

ఎల్లప్పుడూ... సిద్ధంగా!

బయట అడుగు పెడుతున్నామంటే ఒకటికి రెండుసార్లు అన్నీ గమనించుకుంటాం. అంతలా జాగ్రత్త తీసుకున్నా ఏదో ఒకటి మర్చిపోతుంటాం. కొన్నిసార్లు ఆ చిన్న అజాగ్రత్త మనవాళ్లని కంగారు పెట్టేస్తుంది. అందుకే, ఈ కొన్ని సాయాలను దగ్గరుంచుకోండి.

సౌలభ్యం



మందు బిళ్ల... మర్చిపోకుండా...

పీసీఓడీ, హార్మోనుల్లో అసమతుల్యత... చిన్నప్పట్నుంచే ఏదో ఒక మెడిసిన్ వేసుకోవాల్సిన పరిస్థితి. కాబట్టి, మందులు ఎప్పుడూ వెంట ఉండాల్సిందే. దూర ప్రయాణాలైతే గుర్తుంచుకుంటాం. ఒకట్రెండు రోజులు వెళ్లాల్సొస్తేనే మర్చిపోతాం. అందుకే ఈ కీ చెయిన్ పిల్ హోల్డర్‌ను దగ్గర ఉంచుకోండి. వీటిలో ట్యాబ్లెట్లను నింపుకొని బ్యాగుకు తగిలించుకుంటే సరి. ఒకటి కంటే ఎక్కువ ఉంటే భిన్న కంపార్ట్‌మెంట్లు ఉన్నవాటిని ఎంచుకోండి. పూలతో, భిన్న డిజైన్లతోనూ దొరుకుతున్నాయి కాబట్టి, బ్యాగుకు తగిలించుకున్నా అందంగా ఉంటాయి. వాటర్‌ప్రూఫ్ కాబట్టి, తడిచినా ప్రమాదముండదు.





ఆలస్యమైనా భయముండదు

కాస్త చీకటి పడి, అమ్మాయి ఫోన్ కలవకపోతే ఆ తల్లిదండ్రులు పడే భయాన్ని మాటల్లో చెప్పగలమా... పనిమీద బయటికెళ్లి ఫోన్ స్విచ్ ఆఫ్ అయితే మనకీ ఇబ్బందే. ఫోన్ ఛార్జ్ చేసుకోవడం, ఛార్జింగ్ పెట్టి స్విచ్ వేయడం మర్చిపోవడం వల్లే ఇలాంటి ఇబ్బందులు. అందుకే ఈ కీ చెయిన్ పోర్టబుల్ ఛార్జర్లను తెచ్చుకోండి. బండి లేదా ఇంటి తాళాలకో, బ్యాగుకో తగిలిస్తే సరి. కావాల్సినప్పుడు ఫోన్‌కి పెడితే చక్కగా ఛార్జింగ్ అందిస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేసుకుంటే మూడు నాలుగుసార్లకు పనికొస్తుందట.









అత్యవసరానికో కిట్

అనుకోకుండా ఏవో గీరుకోవడం, చిన్న చిన్న ప్రమాదాలు... రోజూ బస్సుల్లో ప్రయాణించేవారికి ఇవి పరిచయాలే. ఆసుపత్రులకు వెళ్లేంత పెద్దవి కాదు, అలాగని ఊరుకుంటే ఇన్‌ఫెక్షన్ ప్రమాదం. అందుకే ట్రావెల్ ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను దగ్గరుంచుకోవాలి. పిన్నులు, కత్తెర, కాటన్, బ్యాండ్ ఎయిడ్లు, యాంటీ సెప్టిక్ లిక్విడ్, బర్న్ క్రీమ్... ఇలా అన్నీ కొన్ని చొప్పున దానిలో ఉంటాయి. బ్యాగులో ఉంచుకుంటే సరి. తగిలించుకోవచ్చు కూడా. అమ్మాయిల కోసం ప్రత్యేక బ్యాగుల్లోనూ వస్తున్నాయి. అత్యవసర సమయాల్లో ఈ కిట్ చాలా ఉపయోగపడుతుంది. కొని బ్యాగులో ఉంచుకుంటే సరి.



ఛాంపియన్

ఐపీఎల్ ఆగిపోయింది. భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో లీగ్‌ను వారం పాటు సస్పెండ్ చేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది.

లీగ్‌ను సస్పెండ్ చేసిన బీసీసీఐ

ఐపీఎల్ వాయిదా





దిల్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. పాకిస్థాన్ ఉగ్రదాడులు, భారత్ స్పందనతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో బీసీసీఐ లీగ్‌ను వారం రోజుల పాటు సస్పెండ్ చేసింది. అన్నింటికన్నా జాతీయ ప్రయోజనాలను ముఖ్యమని చెప్పింది. పొరుగు నగరాలు జమ్ము, పఠాన్‌కోట్‌లో వాయు దాడి హెచ్చరికల కారణంగా గురువారం ధర్మశాలలో పంజాబ్, దిల్లీ జట్ల మధ్య మ్యాచ్ అర్ధంతరంగా నిలిచిపోవడంతో టోర్నీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్న సంగతి తెలిసిందే. "మిగిలిన ఐపీఎల్‌ను వెంటనే వారం రోజుల పాటు సస్పెండ్ చేయాలని బీసీసీఐ నిర్ణయించింది" అని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. "సంబంధిత అధికారులు, భాగస్వాములను సంప్రదించి, పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించి కొత్త షెడ్యూలు, వేదికలకు సంబంధించి తదుపరి వివరాలను వెల్లడిస్తాం" అని చెప్పాడు. వాస్తవ షెడ్యూలు ప్రకారం ఐపీఎల్ ఈ నెల 25న కోల్‌కతాలో ముగియాల్సివుంది. శుక్రవారం జరగాల్సిన లఖ్‌నవూ, బెంగళూరు మ్యాచ్ సహా టోర్నీలో ఇంకా 16 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. "భారత ప్రభుత్వం, సాయుధ దళాలు, దేశ ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాం" అని ప్రకటనలో బీసీసీఐ పేర్కొంది. ఈ దేశానికి క్రికెట్ అంటే ఎంత ఇష్టమున్నా.. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, భద్రత కన్నా ఆట ఎక్కువ కాదని బోర్డు అభిప్రాయపడింది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడిలో 26 మంది మరణించడంతో తీవ్రంగా స్పందించిన భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మిసైల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. రెండు దేశాల మధ్య పరిణామాల నేపథ్యంలో ఐపీఎల్‌లో ఆడుతోన్న విదేశీ ఆటగాళ్లు ఆందోళనకు గురయ్యారు. వచ్చే కొన్ని రోజుల్లో వాళ్లు స్వదేశానికి వెళ్లిపోనున్నట్లు సమాచారం. నిరుడు వేలంలో 10 ఫ్రాంఛైజీలు మొత్తం 62 మంది విదేశీ ఆటగాళ్లను కొనుక్కున్నాయి. "ముందు దేశం" అని లీగ్ సస్పెన్షన్ అనంతరం లఖ్‌నవూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

ఇదే తొలిసారి కాదు: [illegible] కారణాల వల్ల ఐపీఎల్‌కు ఆటంకం కలగడం ఇదే తొలిసారి కాదు. వివిధ కారణాల వల్ల గతంలో నాలుగుసార్లు లీగ్‌ను విదేశాల్లో నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల వల్ల 2009లో మొత్తం టోర్నీని దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. 2014లోనూ కొన్ని మ్యాచ్‌లను యూఏఈలో ఆడించారు. 2020లో కరోనా కారణంగా టోర్నీని యూఏఈకి తరలించారు. ఆ తర్వాతి సంవత్సరం టోర్నీ భారత్‌లో బయో బబుల్‌లో ప్రారంభమైంది. కానీ ఆటగాళ్లు కరోనా బారిన పడడంతో లీగ్ ఆగిపోయింది. మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో ఆడించారు.

టికెట్ల డబ్బులు వెనక్కి: ఐపీఎల్ వాయిదా నేపథ్యంలో టిక్కెట్లు కొనుక్కున్న అభిమానులకు ఫ్రాంఛైజీలు డబ్బులు వాపస్ ఇవ్వనున్నాయి. శనివారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ టికెట్ల డబ్బులు ప్రేక్షకులకు తిరిగి చెల్లిస్తామని ఫ్రాంఛైజీ ప్రకటించింది. మిగతా వేదికల్లో కూడా ఇప్పటికే బుక్ చేసుకున్న టిక్కెట్ల డబ్బులు ఆయా ఫ్రాంఛైజీలు రీఫండ్ చేయనున్నాయి.

మళ్లీ ఎప్పుడు?

ఐపీఎల్ వాయిదా వారం రోజులని బీసీసీఐ ప్రకటించింది కానీ.. ఆ వెంటనే టోర్నీ మళ్లీ మొదలు కావడం కష్టమే. మిగతా 16 మ్యాచ్‌ల నిర్వహణకు 10-12 రోజులు అవసరం. సెప్టెంబరులో ఆసియాకప్‌ను రద్దు చేసి ఆ సమయంలో ఐపీఎల్‌ను నిర్వహించడమే ఇప్పుడు బీసీసీఐ ముందున్న ఉత్తమ మార్గం. కశ్మీర్‌లో ఉగ్రదాడుల దాడుల నేపథ్యంలో ఆసియాకప్ జరగడంపై ఇప్పటికే అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీకి తటస్థ వేదికలో భారత్ ఆతిథ్యమివ్వాల్సివుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్‌తో ఏ స్థాయిలోనూ క్రీడా సంబంధాలను భారత్ పునరుద్ధరించే అవకాశం లేదు. ఆసియా కప్‌నకు సెప్టెంబరులో 19 రోజుల విండోను కేటయించారు. "దుష్ట దేశం (పాకిస్థాన్)తో యుద్ధం జరిగే అవకాశమున్న నేపథ్యంలో క్రికెట్ కొనసాగడం సరి కాదు. సాధారణ పరిస్థితులు నెలకొన్నాక ఆటలను కొనసాగించవచ్చు. పైగా విదేశీ ఆటగాళ్లు, కోచ్‌లు ఆందోళన చెందడం, స్వదేశానికి వెళ్లిపోవాలనుకోవడం సహజం" అని లీగ్ సస్పెన్షన్ అనంతరం ఓ సీనియర్ బీసీసీఐ అధికారి అన్నాడు. బాగా ఆలోచించాకే లీగ్ సస్పెన్షన్‌పై బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లీగ్ తిరిగి ఎప్పుడు పెట్టినా ఎక్కువ డబుల్ హెడర్‌లతో పది రోజుల్లోపు ముగించే అవకాశముంది.

ఆగస్టులో కుదరదా?: టీమ్ఇండియా జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు మొదటి వారం వరకు ఇంగ్లాండ్‌లో పర్యటించాల్సివుంది. ఆ షెడ్యూలును మార్చడం కుదరదు. ఇక ఆగస్టులో బంగ్లాదేశ్‌తో ఆరు మ్యాచ్‌ల పరిమిత ఓవర్ల సిరీస్ ఉంది. ఐపీఎల్ కోసం దాన్ని ఆపొచ్చు. కానీ అదే సమయంలో ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు.. 'ద హండ్రెడ్' లీగ్‌ను నిర్వహించనుంది. ఆగస్టు 5 నుంచి 31 వరకు జరిగే ఈ టీ20 లీగ్‌లో ఐపీఎల్‌లో ఆడే అగ్రశ్రేణి క్రికెటర్లు బరిలో దిగుతారు. చాలా ఐపీఎల్ జట్ల యజమానులు ఆ టోర్నీ ఫ్రాంఛైజీలకు సహ యజమానులుగా ఉన్నారు. ఆ నెలలోనే ఆస్ట్రేలియాలో దక్షిణాఫ్రికా ఆరు మ్యాచ్‌ల వైట్‌బాల్ సిరీస్ ఆడుతుంది. కాబట్టి ఆ రెండు దేశాల ఆటగాళ్లు అందుబాటులో ఉండరు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌కు అవకాశమున్నది సెప్టెంబరులోనే. అయితే ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 22 వరకు కరీబియన్ ప్రీమియర్ లీగ్ ఉంటుంది. కానీ సెప్టెంబరు రెండో వారం నుంచి చాలా మంది వెస్టిండీస్ ఆటగాళ్లు తమ తమ ఐపీఎల్ ఫ్రాంచైజీలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. సెప్టెంబరు 2 నుంచి 14 వరకు ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా మధ్య ఆరు మ్యాచ్‌ల పరిమిత ఓవర్ల సిరీస్ ఉంది. అయితే రెండు దేశాల బోర్డులతో బీసీసీఐకి మంచి సంబంధాలు ఉన్నందున.. ఐపీఎల్ జట్లకు అవసరమైన ఆ దేశాల ఆటగాళ్లను విడుదల చేయమని విజ్ఞప్తి చేయొచ్చు. అక్టోబరు 2న వెస్టిండీస్‌తో భారత్ టెస్టు సిరీస్ మొదలవుతుంది.

సెమీస్‌లో దీపిక, పార్థ్

ఆర్చరీ ప్రపంచకప్


దీపిక

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ రికర్వ్‌లో భారత ఆర్చర్లు దీపిక కుమారి, పార్థ్ సుశాంత్ సాలుంఖె సెమీఫైనల్లో ప్రవేశించారు. మహిళల వ్యక్తిగత విభాగం క్వార్టర్‌ఫైనల్లో దీపిక 6-2తో లి జియామన్ (చైనా)పై గెలిచింది. పురుషుల క్వార్టర్స్‌లో పార్థ్ 6-2తో కిమ్ జి దియోక్ (దక్షిణ కొరియా)ను ఓడించాడు. కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో మధుర, అభిషేక్ వర్మలతో కూడిన భారత జట్టు 156-158తో బ్రిటన్‌కు చెందిన ఎలా గిబ్సన్, అజయ్ స్కాట్‌ల చేతిలో ఓడిపోయింది. భారత జంట కాంస్య పతకం కోసం శనివారం మలేసియా జోడీతో తలపడుతుంది. కాంపౌండ్ పురుషులు, మహిళల జట్లు ఫైనల్లో పోటీ పడతాయి.

సాయుధ దళాలకు భారత క్రీడాకారుల మద్దతు

దిల్లీ: పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తున్న సాయుధ దళాలకు భారత క్రీడాకారులు గట్టి మద్దతు ప్రకటించారు. సైన్యం భారత్ ఆత్మ అంటూ సామాజిక మాధ్యమం వేదికగా విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ, నీరజ్ చోప్రా, పి.వి.సింధు సహా భారత క్రీడారంగం కొనియాడింది. "గడిచే ప్రతిక్షణం.. తీసుకున్న ప్రతి నిర్ణయంతో భారత సైన్యం, వాయుసేన, నావికాదళం పట్ల చాలా గర్వపడుతున్నా. మన యోధులు దేశ గౌరవానికి అండగా నిలుస్తున్నారు" అని రోహిత్ పేర్కొన్నాడు. "ఈ క్లిష్ట సమయాల్లో దేశాన్ని రక్షిస్తున్న సాయుధ దళాలకు సంఘీభావంగా నిలుస్తాం. వారికి సెల్యూట్ చేస్తాం. మన హీరోల ధైర్య సాహసాలు, దేశం కోసం వారి కుటుంబాల త్యాగాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటాం" అని కోహ్లి తెలిపాడు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం కోసం పోరాడుతున్న ధైర్యవంతులైన భారత సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాం. ఈ సమయంలో అందరి భద్రత కోసం మన వంతు కృషి చేద్దాం. మార్గదర్శకాలను పాటిద్దాం" అని నీరజ్ చోప్రా వెల్లడించాడు. వీరేందర్ సెహ్వాగ్, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, పార్థివ్ పటేల్‌తో పాటు మరి కొందరు భారత సైన్యానికి అండగా నిలిచారు.

ఉన్నతి, ఆయుష్ ముందంజ


ఉన్నతి

తైపీ: బీడబ్ల్యూఎఫ్ తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నీలో భారత యువ షట్లర్లు ఉన్నతి హుడా, ఆయుష్ శెట్టి సత్తాచాటుతున్నారు. ఈ టోర్నీలో ఉన్నతి, ఆయుష్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఉన్నతి 21-8, 19-21, 21-19తో హూంగ్ టింగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆయుష్ 16-21, 21-19, 21-14తో ఏడో సీడ్ బ్రయాన్ యాంగ్ (కెనడా)పై గెలుపొందాడు. సెమీస్‌లో టాప్ సీడ్ తొమొక మియజకి (జపాన్)తో ఉన్నతి, తీన్ చెన్ (చైనీస్ తైపీ)తో ఆయుష్ తలపడతారు.

నీరజ్ చోప్రా క్లాసిక్ వాయిదా


నీరజ్

దిల్లీ: పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నీరజ్ చోప్రా (ఎన్‌సీ) క్లాసిక్ జావెలిన్ టోర్నీ నిరవధికంగా వాయిదా పడింది. ప్రపంచంలో అత్యుత్తమ జావెలిన్ త్రోయర్లు పోటీపడే ఈ టోర్నీ ఈ నెల 24న బెంగళూరులో జరగాల్సివుంది. "ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్‌సీ క్లాసిక్‌ను వాయిదా వేస్తున్నా. బాగా ఆలోచించి అథ్లెట్ల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ఓ ప్రకటనలో నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్, భారత అథ్లెటిక్స్ సమాఖ్యతో కలిసి నీరజ్ చోప్రా ఈ టోర్నీని నిర్వహిస్తున్నాడు. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్లు పోటీపడనున్న ఎన్‌సీ క్లాసిక్‌కు ప్రపంచ అథ్లెటిక్స్ 'ఏ' హోదా లభించింది.

భారత్‌లో 2027 డబ్ల్యూటీసీ ఫైనల్!

దిల్లీ: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ (2025-2027)కు ఆతిథ్యమిచ్చే అంశాన్ని బీసీసీఐ పరిశీలిస్తోంది. ఈ మేరకు ఓ ప్రతిపాదనను సిద్ధం చేయనుంది. ఇప్పటివరకు జరిగిన రెండు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చింది. జూన్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య ఫైనల్ కూడా అక్కడే జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత్ ఆతిథ్యమిచ్చే విషయంపై ఇటీవల జింబాబ్వేలో జరిగిన ఐసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. "కొత్తగా ఆరంభమయ్యే డబ్ల్యూటీసీలో భారత్ ఫైనల్ చేరితే అభిమానులకు పండగే. ఏ ఇతర రెండు జట్లు ఫైనల్ చేరినా ఆసక్తి బాగానే ఉంటుంది" అని ఓ బీసీసీఐ అధికారి అన్నాడు.

800 మీ. జాతీయ రికార్డు బద్దలు



అఫ్జల్

దుబాయ్: ఆసియా క్రీడల రజత విజేత మహమ్మద్ అఫ్జల్.. 800 మీటర్ల పరుగులో జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. యూఏఈ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో 800 మీ రేసును అఫ్జల్.. 1 నిమిషం 45.61 సెకన్లలో పూర్తి చేసి రజతం సాధించాడు. ఈ క్రమంలో జిన్సన్ జాన్సన్ 2018లో 1 నిమిషం 45.65 సెకన్లతో నెలకొల్పిన రికార్డును అధిగమించాడు.

ముంబయికే ఆడతా


యశస్వి

ముంబయి: భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ మనసు మార్చుకున్నాడు. దేశవాళీ క్రికెట్లో ముంబయి నుంచి గోవాకు తరలి వెళ్లిన అతడు నెల రోజుల్లోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. దేశవాళీలో గోవాకు ఆడేందుకు అనుమతివ్వాలంటూ ఏప్రిల్‌లో అతడు ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ)కు లేఖ రాయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. జైస్వాల్ విజ్ఞప్తికి ఎంసీఏ తక్షణమే ఆమోదం తెలిపింది. అయితే వచ్చే సీజన్‌లో ముంబయి తరఫున కొనసాగాలనుకుంటున్నట్లు శుక్రవారం ఎంసీఏకు జైస్వాల్ ఈమెయిల్ చేశాడు. "గోవాకు మారాలన్న కుటుంబ ప్రణాళికకు తెరపడింది. ముంబయి వీడేందుకు ఇచ్చిన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఉపసంహరణకు ఆమోదం తెలపాలని కోరుతున్నా. ఈ సీజన్‌లో ముంబయి తరఫున ఆడేందుకు అనుమతివ్వాలని ఎంసీఏను అభ్యర్థిస్తున్నా. బీసీసీఐ లేదా గోవాకు నేను ఇప్పటివరకు ఎన్‌ఓసీని సమర్పించలేదు" అని ఈమెయిల్‌లో జైస్వాల్ పేర్కొన్నాడు.

వందే భారత్‌లో దిల్లీకి క్రికెటర్లు

ధర్మశాల నుంచి జలంధర్ మీదుగా పంజాబ్, డీసీ జట్ల ప్రయాణం


దిల్లీ రైల్వేస్టేషన్‌లో మోహిత్, కుల్‌దీప్

ధర్మశాల: ధర్మశాలలో గురువారం పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ ఆగిపోయిన నేపథ్యంలో తర్వాతి రోజు ఈ రెండు జట్ల ఆటగాళ్లు, సిబ్బందిని వందే భారత్ ప్రత్యేక రైలులో దిల్లీకి తీసుకెళ్లారు. భారత్, పాక్ మధ్య దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో ధర్మశాల సహా పలు విమానాశ్రయాలను మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో పంజాబ్, దిల్లీ ఆటగాళ్లను రైల్లో దిల్లీకి తీసుకెళ్లాల్సి వచ్చింది. మ్యాచ్ ఆగిపోయాక కాసేపటికే భారీ భద్రత మధ్య ఆటగాళ్లను వారు బస చేస్తున్న హోటళ్లకు తీసుకెళ్లిన పోలీసులు.. తర్వాతి రోజు ఉదయం దిల్లీ ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ముందు జాగ్రత్తగా ఎక్కువ మందితో బస్సుల్లో ప్రయాణించడాన్ని కూడా నివారించారు. దాదాపు 50 వాహనాలను వినియోగించి చిన్న చిన్న బృందాలుగా రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆటగాళ్లకు భద్రతగా పెద్ద సంఖ్యలో పోలీసు వాహనాలు కూడా వెంట వెళ్లినట్లు కంగ్రా జిల్లా ఎస్పీ వెల్లడించారు. అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో జలంధర్ మీదుగా పంజాబ్, డీసీ ఆటగాళ్లు, సిబ్బంది దిల్లీకి చేరుకున్నారు.

తొక్కిసలాట జరగకుండా.. పకడ్బందీగా: గురువారం రాత్రి ధర్మశాలలో గురువారం రాత్రి దిల్లీ, పంజాబ్ మధ్య మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోవడానికి కారణం ఫ్లడ్ లైట్ల వైఫల్యమే అని ముందు అనుకున్నారంతా. కానీ జమ్ము సహా పలు నగరాలపై పాకిస్థాన్ సైన్యం డ్రోన్ దాడులకు పాల్పడిన నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లోని అనేక నగరాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలోనే ధర్మశాలలోనూ ఫ్లడ్ లైట్లు ఆగిపోయాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా మ్యాచ్‌ను కొనసాగించడం మంచిది కాదని ఐపీఎల్ అధికారులకు ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం వచ్చింది. అయితే భద్రత కారణాలతో మ్యాచ్ ఆపేస్తున్నట్లు చెబితే ప్రేక్షకులు ఆందోళనకు గురై, తొక్కిసలాట జరిగే ప్రమాదం ఉందని ఐపీఎల్ అధికారులు, పోలీసులు భావించారు. ఆ సమయంలో స్టేడియంలోనే ఉన్న ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్.. పోలీసులతో సమన్వయం చేసుకుని గందరగోళానికి తావివ్వకుండా ప్రేక్షకులను బయటికి పంపే ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్ లైట్ల వైఫల్యం వల్లే మ్యాచ్ ఆగిందని, అవి మళ్లీ వెలగవని చెప్పి అభిమానులతో స్టేడియం ఖాళీ చేయించారు. "ముందు ఫ్లడ్‌లైట్ల వైఫల్యం గురించి చెబితే ప్రేక్షకులు స్టేడియాన్ని వీడలేదు. అయినా వారిని ఒత్తిడికి గురి చేయకుండా, తొక్కిసలాటకు ఆస్కారం ఇవ్వకుండా అందరినీ బయటికి పంపాం. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం అధికారులు, పోలీసుల వల్లే అరగంటలోనే 25 వేల మంది ప్రేక్షకులను ఖాళీ చేయించగలిగాం" అని ధూమల్ తెలిపాడు.

పీఎస్‌ఎల్ కూడా..

లాహోర్: భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వాయిదా వేసింది. టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే పీసీబీ ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ సలహా మేరకు టోర్నమెంట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. కానీ అసలు కారణం.. పీఎస్‌ఎల్ మిగతా మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వడానికి యూఏఈ సిద్ధంగా లేకపోవడమే అని సమాచారం. మ్యాచ్‌ల నిర్వహణకు పీసీబీ ప్రతిపాదిస్తే యూఏఈ తిరస్కరించే అవకాశముంది. "గత కొన్నేళ్లుగా బీసీసీఐతో ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు బలమైన సంబంధాల్ని కొనసాగిస్తోంది. 2021లో భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను, అదే ఏడాది ఐపీఎల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా మ్యాచ్‌లను నిర్వహించింది" అని యూఏఈ బోర్డు వర్గాలు తెలిపాయి. ఐసీసీ ప్రధాన కార్యాలయం కూడా దుబాయ్‌లోనే ఉంది. ప్రస్తుతం ఐసీసీకి జై షా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు.

శ్రీలంకపై దక్షిణాఫ్రికా విజయం

మహిళల వన్డే ముక్కోణపు సిరీస్

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికాకు కాస్త ఊరట. శుక్రవారం నామమాత్రమైన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆ జట్టు 76 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. అనెరీ డెర్క్‌సన్ (104; 84 బంతుల్లో 8×4, 5×6), క్లో ట్రయాన్ (74; 51 బంతుల్లో 4×4, 5×6) చెలరేగడంతో మొదట దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 315 పరుగులు చేసింది. తజిమ్ బ్రిట్స్ (38), నడైన్ డిక్లెర్క్ (32 నాటౌట్), వోల్వార్ట్ (33) రాణించారు. దెవ్మీ విహంగ అయిదు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో శ్రీలంక 42.5 ఓవర్లలో 239 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (52) టాప్ స్కోరర్. అనుష్క సంజీవని (43 నాటౌట్), హర్షిత (33) రాణించారు. ట్రయాన్ (5/34) హ్యాట్రిక్ సహా అయిదు వికెట్లతో లంక పతనాన్ని శాసించింది. దక్షిణాఫ్రికా ఈ టోర్నీలో తన తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయి ఫైనల్‌కు దూరమైంది. ఆదివారం జరిగే తుది పోరులో భారత్, శ్రీలంక తలపడనున్నాయి.

జెనీవా ఓపెన్ బరిలో జకోవిచ్


జకోవిచ్

జెనీవా: ఫ్రెంచ్ ఓపెన్ ముంగిట మట్టి కోర్టులో సత్తా చాటాలని చూస్తున్న అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాడు నొవాక్ జకోవిచ్.. జెనీవా ఓపెన్‌లో బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో విజయం సాధించడం ద్వారా అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు (25 టైటిళ్లు) సొంతం చేసుకోవాలని జకోవిచ్ ఆశిస్తున్నాడు. అయితే ఈ సీజన్లో క్లే కోర్టులో ఒక్క విజయం కూడా నమోదు చేయలేదు. మాంటెకార్లో, మాడ్రిడ్ ఓపెన్‌లలో తొలి రౌండ్లోనే ఓటమి పాలయ్యాడు. జెనీవా ఓపెన్‌లో అయినా సత్తా చాటి.. ఈ నెల 17న మొదలయ్యే ఫ్రెంచ్ ఓపెన్ ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావాలని నొవాక్ చూస్తున్నాడు.

మెక్‌గిల్‌కు తప్పిన జైలు శిక్ష



మెక్‌గిల్

సిడ్నీ: మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా కేసులో దోషిగా తేలిన ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ స్టువర్ట్ మెక్‌గిల్.. జైలు శిక్ష తప్పించుకున్నాడు. మెక్‌గిల్ 22 నెలల పాటు తన ప్రవర్తనను మార్చుకునే ప్రక్రియలో భాగం కావాలి. అంతే కాక 495 గంటల పాటు సేవా కార్యక్రమాలు చేయాలి. దీంతో పాటు మాదక ద్రవ్యాల పరీక్షలకూ హాజరు కావాలి. 54 ఏళ్ల మెక్‌గిల్ 2008లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇంకో నాలుగేళ్లకు మొత్తంగా క్రికెట్ నుంచి తప్పుకొన్నాడు. ఆ తర్వాత అతను మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. 2021లో తన బావమరిదికి, మాదక ద్రవ్యాల సరఫరాదారుకు ఒప్పందం కుదర్చడంలో మెక్‌గిల్ కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అప్పట్నుంచి కొనసాగుతున్న కేసులో కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది.

కార్యదర్శిగా ఆంజనేయులును చేరనివ్వను

- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మంకుపట్టు
- అయినా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సమాచార హక్కు కమిషనరేట్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. వి.ఆంజనేయులు అనే అధికారిని ప్రభుత్వం కమిషన్ కార్యదర్శిగా నియమించగా, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సీఐసీ) ఆర్.మహబూబ్ బాషా ఆయనను అడ్డుకున్నారు. 'ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ (ఏపీఐసీ) స్వతంత్రతను కాపాడేందుకే ఆంజనేయులును ఆ బాధ్యతలు చేపట్టకుండా నిరోధిస్తున్నాం. అంతేకాదు, అలాంటి అధికారులను కమిషన్‌లో నియమించవద్దని ప్రభుత్వానికి గట్టిగా చెబుతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. 'మమ్మల్ని సంప్రదించకుండా ఒక అధికారికి ఎస్ఏసీ బాధ్యతలు ఎలా అప్పగిస్తారు? ఆయన్ను విధుల్లో చేరనివ్వం' అని ప్రభుత్వాన్నే ప్రశ్నిస్తూ ఎస్‌సీఐసీ అధికారికంగా ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వం వైపు నుంచి స్పందన లేదు! అసలు ఆయనకు ఆ అధికారాలు న్నాయా అని కూడా ప్రభుత్వం ఆరా తీయకపోవడం గమనార్హం. కార్యదర్శిగా అదనపు బాధ్యతలు తీసుకునేందుకు ఏపీఐసీ కేంద్ర కార్యాలయానికి ఈ నెల 5న ఆంజనేయులు వెళ్లగా, ఆయన కూర్చోవాల్సిన గదికి ఎస్‌సీఐసీ కార్యాలయం సిబ్బంది తాళం వేశారు. లోపలికి అనుమతించకపోవడంతో పక్కనే ఉన్న కమిషన్ న్యాయ కార్యదర్శి ఛాంబర్‌లో కాసేపు కూర్చొని ఆయన వెనుదిరిగారు. మర్నాడు ఆంజనేయులు వచ్చి న్యాయ కార్యదర్శి ఛాంబర్‌లో కూర్చుంటారేమోనని దానికి కూడా తాళం వేశారు. ఆంజనేయులుకు ఎలాంటి సహకారం అందివ్వరాదని ఏపీఐసీ కార్యాలయ అధికారులు, సిబ్బందితోపాటు తన సహచర సమాచార కమిషనర్లకు కూడా బాషా తాజాగా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. తన నుంచి రాతపూర్వక అనుమతి లేకుండా ఆంజనేయులు ఏపీఐసీ ప్రాంగణంలోకి ప్రవేశించాలని చూస్తే ఆయన్ను అడ్డుకోవాలని ఏపీఐసీ భద్రతాధికారులను ఆదేశించారు. దీంతో ఆంజనేయులు సీఎస్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. తాను నియమించిన అధికారిని లోపలికి రానివ్వబోమన్నట్లుగా ఎస్‌సీఐసీ వ్యవహరిస్తున్నా ప్రభుత్వం కిమ్మనకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.



నేటిని ఆస్వాదించడం నేర్చుకోండి

భవిష్యత్తు గురించి ఆలోచించడం మంచిదే. కానీ చాలామంది రేపటి గురించి తీవ్రంగా ఆలోచిస్తూ నేటిని ఆస్వాదించడం విస్మరిస్తున్నారు. నేటి ఈ మెరుగైన పరిస్థితిలో ఉండటం కోసం కొన్నేళ్ల కిందట మీరెంతగా ఆరాటపడ్డారో గుర్తుతెచ్చుకోండి. వర్తమానంలో ఆనందంగా జీవించడం నేర్చుకోండి.

– స్టీవ్ హార్వీ, టెలివిజన్ దిగ్గజం

గిరిజన ప్రాంతాల్లో మండలానికో జూనియర్ కళాశాల

గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: గిరిజన ప్రాంతాల్లోని ప్రతి మండలంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి 5 ఏకలవ్య పాఠశాలల భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో ఐటీడీఏ పీవోలతో శుక్రవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. 'గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు యూత్ ట్రైనింగ్ సెంటర్లను(వైటీసీ) మళ్లీ ప్రారంభిస్తాం. భోగాపురం విమానాశ్రయం త్వరలో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.156 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. డోలీ మోతలు లేకుండా చేసేందుకు గర్భిణులకు ఉపయోగపడేలా బర్త్ వెయిటింగ్ హాళ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నాం' అని మంత్రి వివరించారు.

అదృశ్యమైన ఉద్యోగి భార్యకు కారుణ్య నియామకం

ఈనాడు, అమరావతి: కనిపించకుండా పోయిన ఉద్యోగి భార్యకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు. ప్రత్యేక విన్నపంగా గుర్తించి గరిష్ఠ వయోపరిమితి 45 ఏళ్ల నిబంధనలకు సడలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే నూకరాజు అదృశ్యం కావడంతో ఆయన భార్యకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వం అవకాశం కల్పించింది.

డిప్లొమా విద్యార్థులకు 17 నుంచి ఇంటర్న్‌షిప్

ఈనాడు, అమరావతి: డిప్లొమా విద్యార్థులకు ఈనెల 17 నుంచి జూన్ 16 వరకు ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తెలిపింది. ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 40 గంటలపాటు తరగతి బోధన, 20 గంటల ప్రాక్టికల్స్, రోజుకు రెండు గంటల ఆన్‌లైన్ శిక్షణ ఉంటాయని పేర్కొంది. పైథాన్, ఆటోక్యాడ్ తదితర కోర్సులపై ఈ శిక్షణ ఇవ్వనున్నారు. డిప్లొమా మొదటి, రెండు, మూడో సంవత్సరం విద్యార్థులు దీనికి అర్హులు. రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 99888 53335, 87126 55686 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపింది.

ఏపీఐఐసీకి భూముల బదిలీకి అనుమతి

ఈనాడు, అమరావతి: రామాయపట్నం దగ్గర ఏర్పాటు చేయనున్న బీపీసీఎల్ ప్రాజెక్టు కోసం 6 వేల ఎకరాలను ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు ఏపీ మారిటైం బోర్డుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూముల బదిలీకి స్టాంపు డ్యూటీ మినహాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.





వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మన్మథరావు. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు ★ జస్టిస్ మన్మథరావు, సునీత దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం. చిత్రంలో కార్యవర్గ సభ్యులు

జస్టిస్ మన్మథరావుకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు

- న్యాయసేవలను కొనియాడిన సీజే

ఈనాడు, అమరావతి: కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళుతున్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావుకు ఏపీ హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులు అందరూ మొదటి కోర్టు హాలులో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) చల్లా ధనుంజయ, అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం.. జస్టిస్ మన్మథరావు అందించిన న్యాయసేవలను కొనియాడారు. పలు కేసుల్లో కీలక తీర్పులిచ్చారన్నారు. స్వల్ప వ్యవధిలో 11,972 కేసులను పరిష్కరించారని గుర్తుచేశారు. తెలుగులో తొలిసారి తీర్పులిచ్చి ప్రాంతీయ భాషపై అభిమానం చాటుకున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా జస్టిస్ వండేశ్వర్ చేతుల మీదుగా అంబేడ్కర్ ఫ్లోరెన్స్ అవార్డు-2014 అందుకున్నారని గుర్తుచేశారు. జస్టిస్ మన్మథరావు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సకాలంలో న్యాయం అందించడమే లక్ష్యంగా..

జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయమూర్తిగా నియమితులైనప్పటి నుంచి 727 రోజుల్లో 11,972 కేసులను పరిష్కరించడం సంతోషకరమన్నారు. కేసుల పరిష్కారం వెనుక ఎంతో కృషి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సహకారం ఉందన్నారు. సకాలంలో సహేతుకమైన న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేశానని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ మన్మథరావు కుటుంబ సభ్యులు, అదనపు ఏజీ సాంబశివప్రతాప్, పీపీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు, హైకోర్టు న్యాయవాదులు, రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బంది హాజరయ్యారు.

న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో జస్టిస్ కె.మన్మథరావు, సునీత దంపతులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. హైకోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోనూ జస్టిస్ మన్మథరావును సన్మానించారు.

డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావుకు డిమోషన్

- తహసీల్దార్ స్థాయికి పంపిన సుప్రీంకోర్టు
- కోర్టు ధిక్కరణ కేసులో ఆదేశాలు
- కుటుంబం వీధిన పడకూడదనే జైలుశిక్ష విధించలేదు
- జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యలు



ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో పనిచేస్తున్న తాతా మోహన్‌రావును తహసీల్దార్ స్థాయికి డిమోట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2013లో తహసీల్దార్‌గా పనిచేస్తున్నప్పుడు ఆయన హైకోర్టు హెచ్చరికలను బేఖాతరు చేస్తూ గుంటూరు జిల్లా అడవితక్కెళ్లపాడులో గుడిసెలను తొలగించడాన్ని కోర్టు ధిక్కరణ కింద పరిగణనలోకి తీసుకొని ఈ శిక్ష విధించింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశించింది. హైకోర్టు ఆయనకు 2 నెలల జైలు శిక్ష విధించినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు మించి జైల్లో ఉంటే ఉద్యోగం పోయే అవకాశం ఉందని.. కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మీరు విధించే ఏ శిక్షకైనా అంగీకరిస్తారని ఆయన తరఫు న్యాయవాదులు చెప్పడంతో న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆయన్ను డిప్యూటీ కలెక్టర్ నుంచి తహసీల్దార్ స్థాయికి డిమోట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు హైకోర్టు పిటిషనర్‌కు 2 నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ 2015 మార్చి 27న తీర్పిచ్చింది. దీంతో మోహనరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ భూమిని రక్షించడానికే తాను చట్టబద్ధంగా చర్యలు తీసుకున్నట్లు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్యమం జరుగుతున్న ఆ రోజుల్లో సరిహద్దు ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు ఉండేవని, అందువల్ల కొందరు రాత్రికి రాత్రి వేసుకున్న గుడిసెలను మాత్రమే తొలగించామని చెప్పారు. 48 గంటలకు మించి జైల్లో ఉంటే ఉద్యోగం పోతుందని, దాని వల్ల పిటిషనర్ కుటుంబం రోడ్డున పడుతుందని, పిల్లల చదువులు దెబ్బతింటాయని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. 'గుడిసెలను తొలగించి.. అందులో నివాసం ఉంటున్నవారిని రోడ్డు మీదికి తోసేసినప్పుడు ఇవన్నీ ఆలోచించి ఉండాల్సింది. పిటిషనర్‌ను జైలుకు పంపితే ఆయన ఉద్యోగం పోతుంది. ఆయన మొండితనం, నిర్లక్ష్య వైఖరి వల్ల కుటుంబసభ్యులు జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల జైలుశిక్షపై ఉదార వైఖరి తీసుకున్నాం. అయితే ఎంతటివారైనా చట్టానికి అతీతులు కాదన్న సందేశం ఇవ్వాలనుకుంటున్నాం. అందుకే హైకోర్టు మోహన్‌రావుకు విధించిన శిక్షను సవరించి.. డిప్యూటీ కలెక్టర్ పదవి నుంచి తహసీల్దార్ పోస్టుకు డిమోట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాం. ఆయన పేదల ఇళ్ల నిర్మాణం కోసం నాలుగు వారాల్లోపు రూ.లక్ష జరిమానా చెల్లించి, రసీదు కూడా కోర్టుకు సమర్పించాలి. తదుపరి పదోన్నతుల కోసం ఆయన సీనియారిటీని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి' అని జస్టిస్ బీఆర్ గవాయ్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జైలు శిక్ష తప్పించుకోవాలంటే డిప్యూటీ కలెక్టర్ స్థాయి నుంచి తగ్గి తహసీల్దార్ పదవి చేపట్టడానికి అంగీకరిస్తూ అండర్‌టేకింగ్ లెటర్ ఇవ్వాలని గత వాయిదాల్లోనే సూచించినా పిటిషనర్ అంగీకరించకపోవడంతో జస్టిస్ గవాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అప్పుడైతే ఇంక్రిమెంట్ కోతతో ఆపేసేవాళ్లం

జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ 'పిటిషనర్ తొలిరోజే ఇందుకు అంగీకరిస్తే మేం 2, 3 ఇంక్రిమెంట్ల కోతతో ఆపేసేవాళ్లం. కానీ నాలుగు వాయిదాల వరకు తీసుకొచ్చారు. ఈ రోజు కూడా మా సూచనను అంగీకరించకపోతే మేం ఏ ప్రభుత్వం సాహసించలేని ఉత్తర్వులిచ్చేవాళ్లం. ఇలాంటి ఉత్తర్వులిచ్చేటప్పుడు మాకూ బాధ ఉంటుంది. కానీ నిస్సహాయులం' అని వ్యాఖ్యానించారు.

మహిళా పోలీసులకు ఐసీపీఎస్, మిషన్‌శక్తి బాధ్యతలు?

- నాలుగైదు రోజుల్లో వారి నుంచి ఐచ్ఛికాల సేకరణ

ఈనాడు, అమరావతి: మహిళా శిశు సంక్షేమ శాఖను ఎంపిక చేసుకునే మహిళా పోలీసులకు ఆ శాఖ పరిధిలోని సమీకృత బాలల రక్షణ పథకం (ఐసీపీఎస్), మిషన్‌శక్తి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఐసీపీఎస్ పరిధిలో శిశుగృహాలు, జువైనల్ హోమ్‌లు తదితరాలు ఉంటాయి. మిషన్‌శక్తి కింద బాల్య వివాహాలను అరికట్టడం, పనిచేసే ప్రదేశంలో చిన్నారుల సంరక్షణ కేంద్రాల పర్యవేక్షణ తదితర బాధ్యతలు అప్పగించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హోం, మహిళా శిశు సంక్షేమ శాఖల్లో.. ఏదైనా ఒకదాన్ని ఎంపిక చేసుకునే అవకాశాన్ని మహిళా పోలీసులకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా వారి నుంచి ఐచ్ఛికాలు తీసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కసరత్తు పూర్తి చేసింది.

నాలుగు అంచెలుగా పదోన్నతులు: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 13,912 మంది మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ఏ శాఖ పరిధిలో చేరాలన్నా.. ముందుగా పదోన్నతుల విధానాన్ని ఖరారు చేయాలి. హోం శాఖ పరిధిలో కొనసాగాలనుకునే వారికి న్యాయపరమైన ఇబ్బందుల తలెత్తకుండా ఫిజికల్ టెస్ట్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో, మిగతా వారిని మినిస్టీరియల్ పోస్టుల్లో నియమించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. మహిళా శిశు సంక్షేమ శాఖను ఎంచుకునే వారి పదోన్నతుల ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చింది. కొత్తగా ఐసీడీఎస్ ప్రాజెక్టు క్లస్టర్ విధానాన్ని ప్రతిపాదించారు. తొలుత క్లస్టర్ స్థాయిలో మహిళా పోలీసుగా తీసుకుని, తర్వాత మండల స్థాయిలో.. పిమ్మట డివిజినల్ స్థాయిలో పదోన్నతులుండేలా నివేదిక రూపొందించారు. తర్వాత జిల్లాస్థాయి పోస్టును సృష్టించి.. పదోన్నతి కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి నివేదించారు.

శాస్త్రీయసాగు, మార్కెటింగ్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలి

- వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఈనాడు, అమరావతి: రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. మిరపలో రసాయనాల వాడకం తగ్గించి.. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తే, గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో మిరప, టమాటా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. విత్తన నాణ్యత, మొక్కల ఎంపిక, పోషణపై శాస్త్రీయ విధానాలు పాటించాలని రాజశేఖర్ వివరించారు. 'మిరప, టమాటాల ధరల్లో ఒడుదొడుకులు అధికంగా ఉన్నాయి. అగ్రివాచ్ ద్వారా వచ్చే సీజన్‌లో ఎంత ధర ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. వాతావరణ పరిస్థితుల్ని ముందే అంచనా వేసే పరిజ్ఞానం ఉన్నా.. రైతులు నష్టపోతున్నారు. ఈదురుగాలుల తీవ్రత నుంచి పంటను రక్షించుకునేందుకు విండ్ బ్రేకర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం' అని రాజశేఖర్ పేర్కొన్నారు. రైతులు బహుళ పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. '2021 నుంచి మిరపలో నల్లతామర నివారించేందుకు రైతులు మూడు, నాలుగు రోజులకోసారి పిచికారీ చేస్తున్నారు. దీంతో పురుగుమందుల అవశేషాల కారణంగా ఎగుమతుల్లో ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ధర తగ్గుతోంది. రైతులు పురుగు, తెగుళ్ల మందులు, కలుపు మందుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి. తద్వారా ఖర్చు తగ్గించుకోవడంతోపాటు నాణ్యమైన ఉత్పత్తిని పొందవచ్చు' అని శాస్త్రవేత్త శిరీష వివరించారు. టమాటా పండించినా గిట్టుబాటు ధర రావడం లేదని ఈ సందర్భంగా రైతులు వివరించారు. ప్రభుత్వం రాయితీపై పరికరాలు, విత్తనాలు అందించేలా చూడాలని కోరారు. మిరపలో నల్లతామర కారణంగా నష్టపోతున్నామని, ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్లొస్తున్న పరిస్థితులున్నాయని కొందరు వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, ఉద్యానశాఖ అదనపు సంచాలకులు వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకే షోరూంలో ఆప్కో, లేపాక్షి ఉత్పత్తులు

ఈనాడు, అమరావతి: అవసరం మేరకు ఆప్కో, లేపాక్షి ఉత్పత్తులను ఒకే షోరూంలో అందుబాటులో ఉంచేలా సమాఖ్య పద్ధతిలో వాటిని అభివృద్ధి చేయాలని చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా అధికారులను ఆదేశించారు. తద్వారా బ్రాండ్ గుర్తింపు పెరుగుతుందన్నారు. మార్కెటింగ్‌ను పెంచేందుకు ప్రత్యేక యాప్, వాట్సప్ ద్వారా విక్రయాలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. ఇతర ఆదాయ మార్గాల కోసం షోరూంలలో కొంతస్థలాన్ని ప్రైవేటు ప్రకటనలకు అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడలోని ఆప్కో కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'సంస్థ ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఒకే బ్యాంకు భాగస్వామిని ఎంపిక చేయాలి. ఆ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీ రేట్లు, ఉచిత సాఫ్ట్‌వేర్ సేవలు లభించేలా చూడాలి. విక్రయాలను పెంచేందుకు ఉత్పత్తులపై విభిన్న మార్జిన్లు, డైనమిక్ ధరలు, ప్రత్యేక తగ్గింపులు అమలు చేయాలి' అని ఆదేశించారు.

ఖరీఫ్‌కు ముందే అత్యవసర నిర్వహణ పనులు!

- బడ్జెట్ కేటాయింపులు లేకున్నా ప్రత్యేక అనుమతి
- నీటిపారుదల నిర్వహణకు ప్రాధాన్యం

ఈనాడు,అమరావతి: రాష్ట్రంలోని భారీ, మధ్య, చిన్న తరహా నీటిపారుదల వ్యవస్థలో రానున్న ఖరీఫ్ లోపు నిర్వహణ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఈ పనులకు ఆర్థికశాఖ బడ్జెట్ కేటాయింపులు చాలకపోవడంతో అధికారులు ప్రత్యేకంగా రాష్ట్ర మంత్రిమండలి ముందు ఈ విషయం ఉంచి పాలనా మోదం తీసుకున్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నాతో పాటు అనేక నదులు, కాలువల కింద ఆయకట్టుకు నీళ్లందించే వ్యవస్థలో ఏటా నిర్వహణ పనులు ముఖ్యం. రాష్ట్రంలోని 11 మంది నీటిపారుదల చీఫ్ ఇంజినీర్ల పరిధిలో ఈ ఏడాది 7,174 పనులను రూ.344.39 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. తక్షణమే స్వల్ప కాలిక టెండర్లు పిలిచి ఈ పనులు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని భారీ, మధ్య తరహా నీటిపారుదల వ్యవస్థలో మొత్తం 72.54 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. చిన్న నీటి వనరుల కింద 25.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత కొన్నేళ్లుగా ఆయా నీటి వనరులకు సంబంధించి నిర్వహణ పనులు నీరుగారిపోయాయి. దాదాపు కోటి ఎకరాలకు నీళ్లు ఇవ్వాల్సిన చోట కాలువలు పూడిపోయి, తూడు పెరిగిపోయి, షట్టర్లు తుప్పు పట్టి, అనేక ఇతర ఇబ్బందులతో నీటిపారుదల వ్యవస్థ ఏళ్ల తరబడి అస్తవ్యస్తంగా తయారైంది. ఆయా పనులు పూర్తి చేస్తేనే ఖరీఫ్‌లో నీటి నిర్వహణ సులభమవుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్లతో మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావులు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి అత్యవసర నిర్వహణ పనులపై ప్రతిపాదనలు ఆహ్వానించారు. అందులో 2025 ఖరీఫ్ లోపు చేయాల్సిన పనులకు ప్రాధాన్యం ఇస్తూ రూ.344.39 కోట్లతో ఆర్థికశాఖకు ప్రతిపాదన పంపితే...నిధులు లేవంటూ అంగీకరించలేదు

బడ్జెట్‌లో రూ.200 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జలవనరుల నిర్వహణ పనులకు రూ.200 కోట్లే కేటాయించారు. సాధారణంగా నిర్వహణ పనులు నీటి పన్ను నిధులతో చేపడుతుంటారు. 2025 ఫిబ్రవరి వరకు రాష్ట్రంలో వసూలు చేసిన నీటి పన్ను మొత్తం రూ.32.82 కోట్లే ఉన్నాయి. మరోవైపు గతంలో నిర్వహణ పనులు చేసిన గుత్తేదారులకు సొమ్ములు చెల్లించలేదు. ఈ బిల్లుల మొత్తం రూ.390 కోట్ల వరకు ఉంది. బడ్జెట్ కేటాయింపులు పాత బిల్లులకు కూడా సరిపెట్టలేని పరిస్థితి. జలవనరులశాఖ ఈ పనులన్నీ అత్యవసరం అని పేర్కొనడంతో ఆర్థికశాఖ రెండు విడతలుగా చేసుకోవాలని సలహా ఇచ్చింది. వచ్చే ఖరీఫ్‌కు ముందు కొన్ని, 2026 ఖరీఫ్‌కు ముందు మరికొన్ని పనులు చేపట్టాలని సూచించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర మంత్రిమండలి నుంచి ప్రత్యేకంగా అనుమతి తీసుకుని నిధులు మంజూరు చేసేందుకు అంగీకరించారు.

రాజధానిలో బిట్స్‌కు 70 ఎకరాలు

భూకేటాయింపులపై ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) క్యాంపస్ ఏర్పాటుకు ఎకరం రూ.50 లక్షల చొప్పున 70 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధానిలోని మందడం, వెంకటపాలెం గ్రామాల పరిధిలో ఈ భూమిని కేటాయించింది. రాజధానిలో వివిధ సంస్థలకు కొత్తగా భూ కేటాయింపులు, కొన్ని సంస్థలకు గతంలో చేసిన కేటాయింపులు రద్దు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈఎస్ఐ కార్పొరేషన్‌కు ఎకరం రూ.50 లక్షలు చొప్పున నెక్కల్లులో 25 ఎకరాలు ఇచ్చారు. హడ్కో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు ఎకరం భూమి రూ.4 కోట్లు చొప్పున 8 ఎకరాలు కేటాయించింది. భారతీయ రిజర్వు బ్యాంకుకు నేలపాడు వద్ద గతంలో ఎకరం రూ.4 కోట్లు చొప్పున 2 ఎకరాలు కేటాయించగా, దాన్ని ఇప్పుడు 3 ఎకరాలకు పెంచింది.

- ◆ లా యూనివర్సిటీకి 55 ఎకరాలు, క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు, బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు అదనంగా 6 ఎకరాలు, ఐఆర్‌సీటీసీ హోటల్‌కు ఎకరం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78, కోస్టల్ బ్యాంక్‌కు 0.40 ఎకరాలు చొప్పున కేటాయించింది.
- ◆ ఎల్ఐసీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్), సెంట్రల్ చిన్మయ మిషన్ ట్రస్ట్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ, జీఎస్ఐ, రామకృష్ణ మిషన్‌లకు గతంలో మొత్తం 23.805 ఎకరాలు కేటాయించగా.. దాన్ని ఇప్పుడు 8.85 ఎకరాలకు తగ్గించింది. కాగ్‌కు గతంలో 14.05 ఎకరాలు కేటాయించగా, దాన్ని 2.05 ఎకరాలకు తగ్గించింది.
- ◆ 2014-19 మధ్య 22 సంస్థలకు చేసిన 99.61 ఎకరాల భూ కేటాయింపులను రద్దు చేసింది.
- ◆ రాజధానిలో హోటళ్ల ఏర్పాటుకు గతంలో 'వరుణ్ హాస్పిటాలిటీ అండ్ ఇట్స్ కన్సార్షియం'తో సీఆర్‌డీఏ చేసుకున్న భూ విక్రయ ఒప్పందాన్ని మార్పుచేసి వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌తో చేసుకునేందుకు అనుమతిచ్చింది.
- ◆ ఓం శ్రీ భావనసాయి అసోసియేట్స్‌తో గతంలో చేసుకున్న ఒప్పందానికి కాలం చెల్లినందున, మళ్లీ ఒప్పందం చేసుకునేందుకు అనుమతిచ్చింది. ఇప్పుడు ఆ సంస్థ హయత్ గ్రూప్‌తో కలిసి హోటల్ ఏర్పాటు చేయబోతోంది.

అవి నా సొంత డబ్బుతో పంచిన కుట్టుమిషన్లు

అప్పటి ఫొటోలతో వైకాపా ఫేక్ ప్రచారం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి : తన సొంత డబ్బుతో మంగళగిరి నియోజకవర్గంలో 'స్త్రీశక్తి' కింద మహిళలకు శిక్షణ ఇప్పించి, తాను పంపిణీ చేసిన కుట్టు మిషన్లపై వైకాపా వాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ ధనంతో పార్టీ రంగులు వేసుకోవడానికి మీ నాయకుడిలా కక్కుర్తి మనిషిని కానంటూ ఎక్స్ వేదికగా వైకాపా నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "2022లో అధికారంలో ఉన్న చేతకాని పాలకులు మహిళల బాగోగులు పట్టించుకోలేదు. ప్రతిపక్షంలో ఉన్న నేను..సొంత డబ్బుతో వారికి శిక్షణ ఇప్పించి నా పార్టీ రంగులతో ఉన్న మిషన్లను ఇచ్చాను. ఆ ఫొటోను తీసుకుని ఇది ప్రభుత్వ కార్యక్రమమని, దీనికి పార్టీ రంగులు వేసుకున్నామని ఫేక్ ప్రచారం మొదలుపెట్టారు" అని లోకేశ్ దుయ్యబట్టారు.

విద్యార్థులకు ఉచిత ఇంటర్న్‌షిప్‌లు

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యా మండలి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ)తో కలిసి ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు ఈ నెల 18 లోపు సంబంధిత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సాధారణ ఇంటర్న్‌షిప్‌లతోపాటు ఉపకార వేతనాలు వచ్చేవీ అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర గ్రాడ్యుయేషన్ విద్యార్థులు https://internship.aicte-india.org/dasboard/state/andhra-pradesh పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆయా విద్యా సంస్థల మెంటార్లు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈనెల 25లోపు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కేటాయిస్తారు. ఈ సమయంలో కొన్ని సంస్థలు రూ.5 వేల నుంచి రూ.25 వేల స్టైపెండ్ కూడా ఇస్తాయి.

మస్కట్‌లో చిక్కుకున్న కార్మికులకు విముక్తి

స్వస్థలాలకు చేరేలా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారం



శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న కార్మికులు

శ్రీకాకుళం (కలెక్టరేట్), న్యూస్‌టుడే: మస్కట్‌లో చిక్కుకున్న తొమ్మిది మంది శ్రీకాకుళం జిల్లా వాసులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో స్వస్థలాలకు చేరుకున్నారు. ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన 9 మంది ఉపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడి కంపెనీ నిర్వాకంతో మోసపోయారు. వారు అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితుల కుటుంబ సభ్యులు ఇటీవల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కార్మికులతో వీడియోకాల్‌లో మాట్లాడి క్షేమంగా తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. విదేశాంగశాఖ, మస్కట్‌లోని భారత దౌత్య కార్యాలయం, తెదేపా ఎన్ఆర్ఐ విభాగాన్ని సమన్వయం చేసి కార్మికులకు వసతి, ఆహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ముంబయి విమానాశ్రయం అధికారులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రావడానికి ప్రయాణ, ఇతర ఖర్చులను రామ్మోహన్‌నాయుడు భరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారమే తనకు ముఖ్యమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

పోస్టుల బ్లాక్ లేకుండా టీచర్ల బదిలీలు

మొదట హేతుబద్ధీకరణ, ఆ తర్వాత బదిలీలు, పదోన్నతులు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల్లో ఈసారి పోస్టులను బ్లాక్ చేయకూడదని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గత ప్రభుత్వంలో కొన్ని పోస్టులను బ్లాక్ చేయడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. దాంతో ఈసారి పోస్టుల హేతుబద్ధీకరణ, బదిలీలు, పదోన్నతులను ఒక దాని తర్వాత మరొకటి నిర్వహిస్తారు. ఇప్పటికే సీనియారిటీ జాబితాలను సిద్ధం చేశారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు విద్యాశాఖ కసరత్తు సైతం చేపట్టింది. తొలుత పోస్టుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను ఇవ్వనుంది. ఆ తర్వాత పదోన్నతులకు 1:2 విధానంలో జాబితా విడుదల చేసి, అభిప్రాయాలు తీసుకోనుంది. ఏదైనా పాఠశాలలో బదిలీ, పదోన్నతులతో 50% కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు రిలీవ్ కావాల్సి వస్తే నూతన డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకు 50%పైన ఉన్న వారిని నిలిపివేస్తారు. మరోవైపు జూన్ 5 నుంచి 11 వరకు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. పాఠశాలల పునఃప్రారంభమైన వెంటనే వారం రోజులపాటు విద్యార్థుల ప్రవేశాలకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారు. జూన్ 28న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేస్తారు.

పీఆర్‌సీ కమిషన్‌పై జాప్యం తగదు

ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు



అనంతపురం (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన 12వ వేతన సవరణ కమిషన్‌ను (పీఆర్‌సీ) నియమించడంలో జాప్యం చోటుచేసుకోవడం తగదని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బొప్పరాజు మాట్లాడారు.

శ్రీవారి సేవలో వంద మంది అంధులు

తిరుమల, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని అమరావతికి చెందిన దాదాపు వంద మంది అంధులు శుక్రవారం శ్రీవారి సేవలో తరించారు. దర్శనం కోసం వారు తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డిని సంప్రదించగా ఆయన ఆన్‌లైన్‌లో శ్రీవారి కల్యాణం టికెట్లను బుక్ చేయించారు. శుక్రవారం దగ్గరుండి వారికి దర్శనం చేయించారు. ఆలయంలో వేదమంత్రాల ఘోష, ఆలయ స్పర్శతో తాము దివ్యానుభూతిని పొందామని అంధులు సంతోషం వ్యక్తం చేశారు.



ఆలయం ఎదుట అంధులతో తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

కాణిపాకంలో సిఫార్సు దర్శనానికి టికెట్లు తప్పనిసరి

కాణిపాకం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి వచ్చే ప్రొటోకాల్, ఉభయదారులు, వారి కుటుంబ సభ్యులు మినహా సిఫార్సులపై వచ్చే ప్రతి ఒక్కరూ విధిగా టికెట్లు తీసుకోవాలని ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 'సిఫార్సులపై కాణిపాకం వచ్చే భక్తులు స్వామివారి దర్శనానికి ఉచితంగా వెళ్తున్నారు. ఇకపై ఆలయ ఉద్యోగులు కూడా వారికి కావాల్సిన వారు వస్తే విధిగా టికెట్లు కొనుగోలు చేసి దర్శనానికి తీసుకెళ్లాలి. శనివారం నుంచే ఈ విధానం అమలు చేస్తాం' అని వివరించారు.

జయలక్ష్మి సొసైటీ ఆస్తుల జప్తు

ఈనాడు, కాకినాడ: అధిక వడ్డీల ఆశ చూపి ప్రజల నుంచి రూ.457.48 కోట్ల మేర డిపాజిట్లు సేకరించి, తిరిగి చెల్లించకుండా బోర్డు తిప్పేసిన కాకినాడలోని జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ మార్కెట్ విలువ ప్రకారం రూ.7.53 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను జప్తు చేస్తున్నట్లు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖలో రూ.7.10 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయగా, వాటిలో చందూరి శివసూర్యవెంకట శ్రీనివాస్‌కు చెందిన రామాటాకీస్ రోడ్డులోని 237.89 చదరపు గజాల స్థలం, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో వేర్వేరు చోట్ల 19.61 ఎకరాలు భూములున్నాయి. కోనసీమ జిల్లాలో రూ.42.65 లక్షల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటే. . అందులో కాకినాడ గ్రామీణం చీడిగలో సొసైటీ పూర్వ వైస్ ఛైర్మన్ ఆర్టీ విశాలాక్షి, కొమరగిరి వద్ద పూర్వ డైరెక్టర్ ములస సత్యనారాయణకు చెందిన ఎకరం చొప్పున భూములున్నాయి. తిమ్మాపురం వద్ద పూర్వ ఛైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన 178.75 చదరపు గజాల స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

ఐఐటీ తిరుపతితో కియా ఒప్పందం

- ఐదేళ్లలో రూ.35 కోట్ల పెట్టుబడికి అంగీకారం



ఎంఓయూలో పాల్గొన్న ఐఐటీ ఆచార్యులు, కియా సంస్థ ప్రతినిధులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: పారిశ్రామిక రంగంలో సమర్థ పురోగతిని సాధించడానికి అత్యంత నైపుణ్యం గల ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులను తయారు చేయడమే తమ లక్ష్యమని కియా ఇండియా కార్ల తయారీ సంస్థ ఎండీ, సీఈవో గ్వాంగ్ గులీ తెలిపారు. సాంకేతిక పరిశోధనలు పెంపొందించడమే లక్ష్యంగా ఐఐటీ తిరుపతితో శుక్రవారం కియా ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు ఒప్పందం దోహదపడుతుందన్నారు. మేకర్స్ ల్యాబరేటరీ ఏర్పాటుతోపాటు ఐదేళ్లలో విద్యామౌలిక సదుపాయాలు, సహకార పరిశోధన కార్యక్రమాలకు మద్దతుగా రూ.35 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపామన్నారు. విద్యార్థుల కోసం ప్రీప్లేస్‌మెంట్ ఆఫర్ (పీపీవో) ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడంతో పాటు ఎంటెక్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఆర్థిక సాయంతో పరిశోధనలకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, కియా సంస్థ ప్రతినిధులు జాంగ్వాన్ సియో, కబ్‌డాంగ్‌లీ, ఐఐటీ ఆచార్యులు శశిధర్ గుమ్మా, వెంకటరమణ, వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.



బాలుడు రోడ్డు దాటుతూ ప్రమాదం నుంచి బయటపడిన సీసీటీవీ దృశ్యాలు

మృత్యుంజయుడు.. ఆ బాలుడు!


కృష్ణా జిల్లా కంకిపాడు సినిమాహాల్ కూడలిలో గురువారం మధ్యాహ్నం జరిగిన సంఘటనను చూసినవారు ఉలికిపాటుకు గురయ్యారు. విజయవాడ నుంచి కంకిపాడు బస్టాండ్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును చూసుకోకుండా ఓ ఆరేళ్ల బాలుడు రహదారి దాటేందుకు ప్రయత్నించాడు. డ్రైవర్ అప్రమత్తమై సడన్‌బ్రేక్ వేశారు. బస్సు ముందు భాగం బాలుడిని వెంట్రుకవాసిలో తాకేలా సమీపించడం.. బాలుడు టైరు చక్రంపై తూలడం.. అదృష్టవశాత్తు కుడి వైపునకు పడడం క్షణాల్లో జరిగాయి. ప్రత్యక్షంగా చూసినవారు మాత్రం బాలుడు బస్సు చక్రం కింద పడిపోయాడని ఆందోళన చెందుతుండగానే లేచి నడుచుకుంటూ బంధువుల వద్దకు వచ్చాడు. వారు స్థానికులు కాకపోవడంతో బాలుడి ఊరు, పేరు తదితర వివరాలు తెలియరాలేదు.

–కంకిపాడు, న్యూస్‌టుడే

EENADU Vol: 51, Issue: 270 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఇమ్రాన్‌ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలి

ఇస్లామాబాద్ హైకోర్టులో పీటీఐ పార్టీ పిటిషన్



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ (పీటీఐ) అధినేత ఇమ్రాన్‌ఖాన్‌ను జైలు నుంచి వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆ పార్టీ ఇస్లామాబాద్ హైకోర్టులో శుక్రవారం పిటిషన్ వేసింది. చాలా రోజుల నుంచి జైలులో ఉండటంతో పాటు భారత్-పాక్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని అందులో పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ నేత, ఖైబర్‌పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమిన్ గండాపుర్ హైకోర్టు ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడారు. "దేశంలోని శాంతిభద్రతలపై మాకు ఆందోళన ఉంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఇమ్రాన్‌ఖాన్ ప్రాణాలకు ముప్పు ఉంది. అడియాలా జైలు ప్రాంగణంలో డ్రోన్ దాడి జరిగే అవకాశం ఉంది. అందువల్ల ఇమ్రాన్‌ఖాన్‌ను పెరోల్‌పై విడుదల చేయాలి" అని అన్నారు. అయితే దీనిపై ఎప్పుడు విచారణ చేపడతామనే విషయాన్ని కోర్టు వెల్లడించలేదు. కాగా.. 72 ఏళ్ల ఇమ్రాన్‌ఖాన్ వివిధ కేసుల్లో అరెస్టై 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే.

రష్యా యుద్ధ నేరాల విచారణకు ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం

ఉక్రెయిన్ విదేశాంగ శాఖ వెల్లడి

కీవ్: తమ దేశంలో యుద్ధ నేరాలకు పాల్పడినందుకు గాను రష్యా నేతలను విచారించేందుకు ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఉక్రెయిన్ విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. వచ్చే వారం లగ్జెంబర్గ్‌లో జరిగే కౌన్సిల్ ఆఫ్ యూరప్ కమిటీ ఆఫ్ మినిస్టర్స్ భేటీ అనంతరం ట్రైబ్యునల్‌ను లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపింది. ఇందుకు అవసరమైన సాంకేతిక, న్యాయపరమైన పనులు పూర్తయ్యాయని పేర్కొంది. 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్ ఆక్రమణకు బాధ్యులైన రష్యా నేతలను విచారించడంపై ఈ ట్రైబ్యునల్ దృష్టిసారిస్తుందని స్పష్టం చేసింది. శుక్రవారం 40 దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో సమావేశయ్యారు. అనంతరం వీరి సంయుక్త ప్రకటనను ఉక్రెయిన్ విదేశాంగ శాఖ విడుదల చేసింది.

ఉత్తర కొరియా అణుదాడి అభ్యాసాలు

సియోల్: అమెరికా, దక్షిణ కొరియాలపై అణ్వస్త్ర దాడి జరిపినట్లుగా గురువారం స్వల్పదూర క్షిపణులతో చేసిన అభ్యాసాలను ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ పర్యవేక్షించారని ఆ దేశ అధికార వార్తాసంస్థ కేసీఎన్ఏ తెలిపింది. దూరంలోని నగరాలు, స్థావరాలపై కాకుండా యుద్ధభూమిలో ఎదురుగా నిలిచిన శత్రుసేనలపై అణుదాడి జరుపుతున్నట్లుగా ఈ అభ్యాసాలను చేపట్టారు. రష్యన్ సంచార క్షిపణి వ్యవస్థ ఇస్కందర్, 600 మి.మీ. బహుళ రాకెట్ లాంచర్ సిస్టమ్స్‌తో ఈ ప్రయోగం జరిగింది. దక్షిణ కొరియా, అమెరికాలు సంయుక్తంగా జరిపే అభ్యాసాలు తమపై గురిపెట్టినవేనని ఉత్తర కొరియా భావిస్తోంది. నిజంగా సంఘర్షణే తలెత్తితే.. ఆ రెండు దేశాల సేనలపై అణ్వస్త్రదాడి జరిపే సత్తా తమకుందని చాటుకోవడమే గురువారం నాటి అభ్యాసాల ఉద్దేశం. తద్వారా ప్రత్యర్థులు అణుదాడి జరపకుండా ఒత్తిడి తేవచ్చు. ఉక్రెయిన్‌పై సుదీర్ఘ యుద్ధం చేస్తున్న రష్యాకు క్షిపణులు ఎగుమతి చేసేముందు వాటి సత్తా పరీక్షించడం కూడా ఈ ప్రయోగాల లక్ష్యమని దక్షిణ కొరియా భావిస్తోంది.

ట్రంప్ వ్యతిరేకులపై వరుసగా వేటు



కార్లా హేడెన్

వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) గ్రంథాలయ ప్రధానాధికారిణి కార్లా హేడెన్‌కు డొనాల్డ్ ట్రంప్ సర్కారు గురువారం హఠాత్తుగా ఉద్వాసన పలికింది. ట్రంప్‌నూ, ఆయన ఎజెండానూ వ్యతిరేకించేవారిలో హేడెన్ ఒకరనే భావనే ఆమెను సాగనంపడానికి మూలం. 2016 నుంచి 2026 వరకు ఆ పదవిలో ఉండాల్సిన హేడెన్‌కు ముందుగానే శ్రీముఖం అందింది. కాంగ్రెస్ గ్రంథాలయ అధికారిగా నియమితులైన మొట్టమొదటి మహిళ, తొలి నల్లజాతి వ్యక్తి కార్లా హేడెన్. ట్రంప్ ప్రత్యర్థులు రాసిన గ్రంథాలను ఆమె లైబ్రరీలో ఉంచారని, తీవ్రవాద భావజాలంతో కూడిన బాలల పుస్తకాలను ప్రచారం చేస్తున్నారని మితవాద సంస్థ అమెరికన్ ఎకౌంటబిలిటీ ఫౌండేషను ఆరోపించింది. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలతో రంగంలోకి దిగే ఫెమా సంస్థ ప్రధానాధికారినీ గురువారం సాగనంపారు. ఫెమాను రద్దు చేసి, విపత్తుల సమయంలో సేవలను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలనే ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకించడమే ఈయన చేసిన నేరం. అమెరికా రక్షణ విభాగం పెంటగాన్‌లోనూ జనవరి నుంచి అరడజను మందికి పైగా ఉన్నత సైన్యాధికారులతో రాజీనామా చేయించారు.

క్యాన్సర్ చికిత్సకు ముఖగుర్తింపు సాధనం

దిల్లీ: సాధారణంగా క్యాన్సర్ పీడితులు తమ అసలు వయసుకన్నా కనీసం అయిదేళ్లు ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తారు. అసలుకన్నా తక్కువ వయసున్నట్లు కనిపించే రోగులు క్యాన్సర్ చికిత్స తరవాత బాగా కోలుకొంటారు. క్యాన్సర్ రోగుల అసలు వయసును వారి ముఖచిత్రాలను చూసి కనిపెట్టడానికి 'ఫేస్ ఏజ్' అనే కృత్రిమమేధా సాధనాన్ని పరిశోధకులు ఆవిష్కరించారు. ఈ వివరాలు లాన్సెట్ డిజిటల్ హెల్త్ పత్రికలో ప్రచురితమయ్యాయి. 59,000 మంది ఆరోగ్యవంతుల ఫొటోలను, 6,200 మంది క్యాన్సర్ రోగుల చిత్రాలను ఉపయోగించి అసలు వయసు కనిపెట్టడంలో 'ఫేస్ ఏజ్'కు తర్ఫీదు ఇచ్చారు. రేడియేషను చికిత్స ప్రారంభించే ముందు క్యాన్సర్ రోగుల ఫొటోలు తీసి ఈ ఏఐ సాధనానికి ఇచ్చారు. అసలు కన్నా ఎక్కువ వయసున్నట్లు కనిపించిన రోగులు చికిత్స తరవాత సరిగా కోలుకోలేకపోయారు. చికిత్సకు లొంగని క్యాన్సర్లతో బాధపడుతున్న రోగులకు ఉపశమన చికిత్స చేయడానికి 'ఫేస్ ఏజ్' తోడ్పడుతుంది. దీన్ని ఉపయోగించి వ్యక్తుల ఆరోగ్యం, వ్యాధులు, ఆయుష్షును సరిగా అంచనా వేయడానికి ప్రయోగాలు జరుగుతున్నాయి.



పాకిస్థాన్ సైన్యం శతఘ్నులు, మోర్టార్లతో కాల్పులు జరపడంతో జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖకు సమీపంలోని ఓ గ్రామంలో ధ్వంసమైన ద్విచక్ర వాహనం



జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరీ సెక్టార్‌లో పాక్ కాల్పుల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతిని శుక్రవారం పరామర్శిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా



విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో శుక్రవారం రాత్రి శ్రీనగర్‌లో చీకటిమయమైన రహదారి

పోరు కొనసాగితే... పాక్ గుల్లే!

- ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలతో సతమతం
- యుద్ధంతో పూర్తిగా దివాలా తీయనున్న దాయాది

> ఓ వైపు అంతర్గత పోరు...
> మరో వైపు ఆర్థిక బేజారు..
> బయట నుంచి ఆదుకునే వారూ లేరు.
> ఈ పరిస్థితుల్లో పాక్ మనదేశంతో
> ఎంత కాలం యుద్ధం చేయగలదు..?

భారత్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త వాతావరణం పాకిస్థాన్‌ను ఆర్థికంగా కుదేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ ఆర్థిక రేటింగ్స్ ఏజెన్సీ మూడీ అంచనాల ప్రకారం యుద్ధాన్ని భరించే పరిస్థితి పాక్‌కు ఏ మాత్రం లేదు. అంతర్గత ఖజానా పూర్తిగా ఖాళీఅయి చాలాకాలమైంది. ఆహార పదార్థాల నుంచి పెట్రోలు వరకూ అనేక నిత్యావసరాలకు దిగుమతులపైనే ఆధార పడే ఆ దేశానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు చాలా అవసరం. అవిప్పుడు దాదాపు నిండుకున్నాయి. ప్రస్తుతమున్న నిల్వలు మూడు నెలల దిగుమతులకు మాత్రమే సరిపోతాయి. యుద్ధం నేపథ్యంలో అదనపు వనరులు సమకూర్చుకోవాలి. కానీ పాక్‌ను ఆర్థికంగా ఆదుకోవటానికి ఎవ్వరూ ఇప్పుడు ముందుకు వచ్చేలా లేరు. అంతర్జాతీయ ఆర్థిక వివరాలు అందించే సీఈఐసీ ప్రకారం... డిసెంబరు 2024 నాటికి పాకిస్థాన్ అప్పు 131 బిలియన్ డాలర్లు! తాజాగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) ముందు మరోసారి సహాయం కోసం చేయి చాచింది.



ఆర్థికంగా దివాలా..

పాక్ జీడీపీలో అప్పుల వాటా ఇప్పటికే 75శాతానికి చేరుకుంది. అప్పుల కుప్పగా ప్రపంచదేశాల్లో ముద్ర పడింది. పేదరికం, నిరుద్యోగం, ఆరోగ్య సేవల లోపం వంటి సామాజిక సమస్యలు ఆ దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. వీటిని ఎదుర్కోవడమే కష్టమైన తరుణంలో యుద్ధ సన్నాహాలు పాక్‌కు అసాధ్యంగా మారనున్నాయి. మరోవైపు బయట నుంచి నిధులు వచ్చే మార్గాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికే ఇతర దేశాల నుంచి తీసుకున్న అప్పులు కొండలా పేరుకుపోవడంతో వాటిని తీర్చేందుకు సతమతమవుతున్న దాయాది దేశం.. యుద్ధం సృష్టించే భారాన్ని మోసే పరిస్థితి లేదు. పరిమిత ఘర్షణలతో కూడిన సైనిక ప్రతిష్టంభన సైతం పాకిస్థాన్‌కు అంతులేని నష్టాన్ని కలిగిస్తుందని అంచనా వేస్తున్నారు. తీవ్ర ద్రవ్యోల్బణంతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్థాన్‌కు ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి రేటుతో దూసుకెళుతున్న భారత్‌తో యుద్ధం ఏమాత్రం శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు.

అటు ఇంటిపోరు...

అటు ఆర్థిక ఇబ్బందులకు తోడు... రాజకీయంగా, సామాజికంగా కూడా పాక్‌లో పరిస్థితి అదుపు తప్పుతోంది. బలూచిస్థాన్‌లో జరుగుతున్న వేర్పాటువాద ఉద్యమం ప్రభుత్వానికే కాదు, సైన్యానికీ సవాలు విసురుతోంది. తరచూ జరుగుతున్న దాడులతో అక్కడ అదనపు బలగాలను మోహరించాల్సి వస్తోంది. పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని అక్కడ వెచ్చిస్తోంది. ఇటీవల జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్‌తో ఆ ప్రాంతంపై పట్టుకోల్పోయినట్లయింది. అఫ్గానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతోనూ పాక్‌కు పొసగటం లేదు. ఇంకోవైపు సింధ్‌లో ఇండస్ నదిపై కొత్త కాలువల నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి. ఒకరకంగా అంతర్యుద్ధ పరిస్థితులను పాకిస్థాన్ ఎదుర్కొంటోంది.

సైనికులకూ అంతంతే...



దేశ భద్రతలో కీలకమైన రక్షణవ్యవస్థ కూడా బలోపేతంగా ఏమీ లేదు. ఆర్థిక, సామాజిక పరిస్థితుల ప్రభావం సైన్యంపైనా పడుతోంది. ఇప్పటికే సరిహద్దుల్లో ఉన్న సైనికులకు సరైన ఆహారం అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. కిరోసిన్, పెట్రోలు వంటి వాటినీ అవసరాలకు అందించలేకపోతున్నారు. అరకొర సౌకర్యాలతో భారత్ వంటి శక్తిమంతమైన దేశాన్ని ఎక్కువ రోజులు ఎదుర్కోలేమని పాక్ రక్షణ నిపుణులు తేల్చి చెబుతున్నారు. 14 రోజుల పాటు యుద్ధం కొనసాగిస్తే భారత్ రూ.2.50 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని... పాకిస్థాన్ కూడా ఇదే స్థాయిలో ఆర్థిక వనరులు వినియోగించాల్సి ఉంటుందని ముంబయికి చెందిన థింక్ ట్యాంక్ స్ట్రాటజిక్ ఫోర్‌సైట్ గ్రూప్ విశ్లేషించింది. ఇదే జరిగితే పాక్‌పై కోలుకోలేని భారం పడుతుంది. మరోవైపు ఉద్రికత్తలు పెరిగే కొద్దీ భారత్ కూడా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల దేశ ఆర్థిక సామర్థ్యానికి 3 శాతం నష్టం కలుగుతుందని అంచనా వేస్తున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఉగ్రవాదం నివారణపై పాకిస్థాన్ దృష్టి పెట్టాలి

- జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా



జమ్మూ: 1971 యుద్ధం తరువాత జమ్మూ నగరంపై గురువారం రాత్రి అత్యంత తీవ్రమైన దాడులు జరిగాయని ఆ రాష్ట్ర సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కొనసాగుతున్న సైనిక సంఘర్షణ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని నివారించడంపై పాకిస్థాన్ దృష్టి పెట్టాలన్నారు. అలాగే ఒక్క డ్రోన్ కూడా దానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకుండా సాయుధ దళాలు వేగంగా స్పందించి నేలకూల్చాయని సీఎం ప్రశంసించారు. విజయ్‌పుర్‌లోని శరణార్థ శిబిరాలను, జమ్మూ, సాంబా జిల్లాల్లోని ఆసుపత్రులను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. "జమ్మూ, పూంచ్ జిల్లాల్లో ఇటీవల డ్రోన్లు, క్షిపణులు, షెల్లింగ్‌లతో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. వారు జమ్మూలోని అనేక ప్రదేశాలతోపాటు అనంతనాగ్‌లోని ఒక మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పటికీ భారత సైన్యం అన్నింటినీ విఫలం చేసింది. సరిహద్దు అవతల నుంచి నిరంతరం ఉగ్రదాడి చేయడం వల్ల పాకిస్థాన్‌కు హాని కలిగిస్తుంది. వారు తుపాకులు వదిలి, ఇక్కడి పరిస్థితిని సాధారణీకరించడంలో సహాయపడాలి. ఉగ్ర తగ్గింపుపై దృష్టి పెట్టాలి. పూంచ్‌లో పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. ఈ నగరంలో భారీ నష్టం జరిగింది'' అని ఒమర్ పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్ సైనికులకు తక్షణం ఉద్వాసన

- పెంటగాన్ వెల్లడి

వాషింగ్టన్: తాము ట్రాన్స్‌జెండర్లమని ప్రకటించిన సైనిక సిబ్బందిని తక్షణం సాగనంపుతామని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ స్పష్టం చేసింది. ఇంతకాలం తమ లింగభేదాన్ని బయటపెట్టనివారు 30 రోజుల్లో ఆ పని చేయాలని ఆదేశించింది. సాయుధ దళాల్లో ట్రాన్స్‌జెండర్లకు చోటులేదన్న డొనాల్డ్ ట్రంప్ సర్కారు విధానాన్ని అమెరికన్ సుప్రీంకోర్టు ఇటీవల సమర్థించడంతో పెంటగాన్ వెంటనే రంగంలోకి దిగింది. అమెరికా సాయుధ దళాల్లో మొత్తం 21 లక్షలమంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 1,000 మంది తాము ట్రాన్స్‌జెండర్లమని ఈ ఏడాది మొదట్లోనే వెల్లడించారు. ముందుగా వీరికి వీడ్కోలు ప్రక్రియ ప్రారంభం కానుంది. సైన్యం, నౌకా, వాయుసేనల్లోని ట్రాన్స్‌జెండర్లు తమ లింగభేదాన్ని జూన్ 6 లోగా వెల్లడించాలనీ.. సైన్య అనుబంధ విభాగాలైన నేషనల్ గార్డ్, రిజర్వు దళాల సిబ్బంది జూలై 7కల్లా ఆ పని చేయాలని పెంటగాన్ ఆదేశించింది. త్రివిధ సాయుధ దళాల్లో మొత్తం ఎంతమంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారో స్పష్టత లేదు. అయితే, జెండర్ డిస్ఫోరియా లక్షణాలతో బాధపడుతూ చికిత్స తీసుకొంటున్నవారిని సైన్య ఆరోగ్య రికార్డుల ద్వారా గుర్తించవచ్చు. శారీరకంగా పురుషుడు లేదా స్త్రీ శరీర ఆకృతితో జన్మించినా మానసికంగా దానికి భిన్నమైన లింగ భావనతో అనుభవించే వేదనను జెండర్ డిస్ఫోరియా అంటారు. ఈ రకమైన వేదనకు మానసిక, హార్మోన్ చికిత్స చేయించుకుంటున్న సైనికులను రికార్డులు పట్టిస్తాయి. 2024 డిసెంబరు 9 నాటికి సాధికార రికార్డుల ప్రకారం 4,240 మంది అమెరికా సైనిక సిబ్బంది జెండర్ డిస్ఫోరియాతో బాధపడుతున్నారు. వీరిని ఇప్పుడు సైనిక దళాల నుంచి సాగనంపుతారు.

తూర్పు భారతంలో నేటి నుంచి తాజా వేడిగాలులు

- ఐఎండీ హెచ్చరిక



దిల్లీ: తూర్పు భారతదేశంలో శనివారం నుంచి తాజా వేడిగాలులు మొదలవుతాయని.. రాబోయే నాలుగైదు రోజులు వాయవ్య, మధ్య భారత ప్రాంతాల్లో వర్షపాతం, ఉరుములతో కూడిన వర్షాలు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. శనివారం నుంచి మే 13 దాకా ఈశాన్యంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షాలు ఉంటాయని హెచ్చరించింది. హిమాలయాలకు దిగువన పశ్చిమ బెంగాల్, సిక్కింలలో విడిగా ఉన్న ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో వేడిగాలులు తీవ్రంగా ఉండే అవకాశముంది. మే 10 - 14 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లోని గంగాతీరంలో, 11 - 14 తేదీల నడుమ బిహార్, ఒడిశాలలో, 12 - 14 తేదీల్లో ఝార్ఖండ్‌లో, 14 - 15 తేదీల్లో తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ వేడిగాలులు ఎక్కువగా ఉంటాయి. మే నెల దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని ఐఎండీ ఇదివరకే పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, తరచూ వచ్చే ఉరుములతో కూడిన వర్షాలు వేడి తీవ్రతను కొంత తగ్గిస్తాయని తాజాగా పేర్కొంది. వాయవ్య, ఈశాన్య, మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాలు మినహాయిస్తే దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం నుంచి అంతకంటే ఎక్కువ వర్షపాతాలు నమోదయ్యే అవకాశముందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. దేశంలో ఏప్రిల్ నెల మొత్తం 72 వేడిగాలుల సందర్భాలు నమోదయ్యాయన్నారు. ఏప్రిల్ నెల రాజస్థాన్, గుజరాత్‌లలో 6 నుంచి 11 రోజులు. . తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ ప్రాంతాల్లో 4 నుంచి 6 రోజులు సాధారణం కంటే ఎక్కువగా వేడిగాలులు వీచాయి. తూర్పు - మధ్య భారతదేశంలో, మహారాష్ట్రతోపాటు ఉత్తర ద్వీపకల్ప భారతంలోని పరిసర ప్రాంతాల్లో ఒకటి నుంచి మూడు రోజులు వేడిగాలులు నమోదయ్యాయి. ఇది రెండు మూడు రోజుల సాధారణం కంటే కొంచెం తక్కువ.

టెహ్రాన్ అణు కార్యక్రమంపై మరిన్ని చర్చలకు రేపు భేటీ

వచ్చేవారం అరబ్ దేశాల పర్యటనకు ట్రంప్

దుబాయ్: శరవేగంగా ముందుకు సాగుతున్న టెహ్రాన్ అణు కార్యక్రమంపై మరిన్ని చర్చలకు ఈ వారాంతంలో ఇరాన్, అమెరికా ప్రతినిధులు ఒమన్ వేదికగా భేటీ కానున్నారు. గతంలో మూడు విడతలుగా జరిగిన చర్చలకు కొనసాగింపుగా ఆదివారం ఒమన్‌లో ఈ సమావేశం జరగనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తెలిపారు. అబ్బాస్‌తో అమెరికా మధ్యప్రాచ్య రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ సమావేశమవుతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఇద్దరి మధ్య పరోక్ష, ప్రత్యక్ష చర్చలు ఉంటాయని చెప్పాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే వారం సౌదీ అరేబియా, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు రానున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ చర్చల వివరాలను తక్షణం వెల్లడించేందుకు ఇరాన్ సుముఖత చూపలేదు. తన గరిష్ఠ ఒత్తిడి కార్యక్రమంలో భాగంగా ట్రంప్ ఇరాన్‌పైనా కొత్త ఆంక్షలు విధించారు. ఇరాన్‌పై సైనికచర్య గురించి కూడా పదే పదే మాట్లాడారు. అయినా ఇరాన్ సుప్రీం నేత ఆయతొల్లా ఖమేనీ (86)కి రాసిన లేఖతో కొత్త ఒప్పందం కుదిరే అవకాశం లేకపోలేదన్న ఆశాభావంతో ఉన్నారు.

మారిన వాతావరణం.. నవతరాలకు శాపం

- 2020లో జన్మించిన వారిలో 52 శాతం మందికి వడగాడ్పుల ముప్పు
- అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: 2020లో జన్మించిన వారిలో 52 శాతం మంది వడగాడ్పుల వంటి తీవ్ర వాతావరణ ప్రతికూలతల బారిన పడే పరిస్థితి ఉందని ఒక అధ్యయనంలో తేలింది. 1960లో పుట్టినవారిలో ఈ ముప్పు 16 శాతం మందికి ఉందని వైజ్ఞానిక పత్రిక "నేచర్"లో ప్రచురించిన నివేదిక తెలియజేసింది. జనాభా గణాంకాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. వయసులో ఎంత చిన్నవారైతే అంత ఎక్కువగా వడగాడ్పులు, వరదలు, కరవులు వంటి ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొనే ముప్పు ఉన్నట్లు ఆ నివేదిక తెలిపింది. వాతావరణ పరిస్థితుల్లో మార్పు లేకపోతే ఇలాంటి వైపరీత్యాలను ఎదుర్కొనే అవకాశాలు పదివేలలో ఒక వంతు మాత్రమే ఉంటాయని అధ్యయనకర్త అయిన బెల్జియంకు చెందిన వాతావరణ శాస్త్రవేత్త ల్యూక్ గ్రాంట్ అన్నారు. 2020లో జన్మించిన వారిలో 52 శాతం మంది భూతాపం 1.5 డిగ్రీల మేరకు పెరిగిన కారణంగా అత్యధిక సంఖ్యలో వడగాడ్పుల పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. భూతాపం 3.5 డిగ్రీల మేరకు పెరిగితే 90 శాతం మంది వాతావరణ ప్రతికూలతల్ని ఎదుర్కోక తప్పదని ఆయన అన్నారు. నిరుపేద దేశాల్లో జన్మించిన పిల్లల్లో అత్యధికులు తీవ్ర వాతావరణ పరిస్థితుల్ని చవిచూస్తారని 2021లో నిర్వహించిన ఒక అధ్యయనం తెలియజేసింది.

మనల్ని సవాల్ చేసినప్పుడల్లా గట్టిగా బదులిచ్చాం

సైనికులకు మద్దతుగా 'జైహింద్ యాత్ర': కాంగ్రెస్

దిల్లీ: దేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసినప్పుడల్లా శత్రువులకు మనం తగిన విధంగా బదులిచ్చినట్లు చరిత్ర సాక్ష్యంగా ఉందని కాంగ్రెస్ పేర్కొంది. సైనికులకు మద్దతుగా దేశ వ్యాప్తంగా శుక్రవారం తమ పార్టీ 'జైహింద్ యాత్ర' నిర్వహించినట్లు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "నిర్దాక్షిణ్యంగా అమాయకుల ప్రాణాలు తీసి, ఉగ్రవాదులు మన సహనాన్ని మళ్లీ పరీక్షించారు. దానికి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారు. గతంలో కూడా మన ఓపికను పరీక్షించిన వారికి మనదేశం గట్టిగా బదులిచ్చింది. దేశాన్ని రక్షించడానికి సైనికులు చూపుతున్న తెగువను చూసి శత్రువులు వణుకుతున్నారు. మన సైనికుల పట్ల గర్వంగా ఉంది. వారికి మద్దతుగా దేశవ్యాప్తంగా శుక్రవారం జై హింద్ యాత్ర నిర్వహించాం. క్లిష్ట సమయంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త వారికి మద్దతుగా నిలిచారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాగిణి నాయక్ దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమ పార్టీ కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా మద్దతుగా నిలుస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారని చెప్పారు.

ప్రభుత్వానికి ముస్లిం పర్సనల్ లా బోర్డు మద్దతు

దిల్లీ: ఉగ్రవాదుల చేతుల్లో అమాయక పౌరులు హతం కావడం ఆందోళనకరమని, ఇస్లామిక్ ఉద్బోధల్లో ఉగ్రవాదానికి తావే లేదని అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు స్పష్టం చేసింది. యుద్ధం ఏ సమస్యకూ పరిష్కారం కాదని, దేశాలు దౌత్య సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని శుక్రవారం పేర్కొంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే దేశాన్ని, దేశ ప్రజలను సంరక్షించేందుకు ఉద్దేశించిన ప్రతి చర్యనూ బోర్డు సమర్థిస్తుందని స్పష్టం చేసింది. ఈ క్లిష్ట సమయంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, సాయుధ బలగాలు, ప్రభుత్వం సమైక్యంగా నిలవాలని పేర్కొంది. ''వక్ఫ్'' పరిరక్షణ కోసం తలపెట్టిన ఉద్యమాన్ని కొనసాగిస్తానని స్పష్టీకరించింది. ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఇందుకు సంబంధించిన బహిరంగ సభలు, సమావేశాల్ని ఈనెల 16 వరకూ వాయిదా వేస్తున్నామని బోర్డు ప్రకటించింది.

పశుసంపదను ధ్వంసం చేసిన పాక్ ఆగడం

ఈటీవీ భారత్: జమ్ముకశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి, కుప్వారా జిల్లాల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పులకు సాధారణ పౌరులతో పాటు మూగజీవాలు కూడా బలవుతున్నాయి. పాక్ సైన్యం కాల్పుల్లో పెద్ద సంఖ్యలో జంతువులు ప్రాణాలొదిలాయి. వందలాది జీవాలు గాయాలపాలయ్యాయి. దీంతో ఓ వైపు ఇళ్లు ధ్వంసం కావడంతో పాటు, తమ జీవనాధారమైన పశుసంపద కూడా నష్టపోయి అక్కడి ప్రజలు గొల్లుమంటున్నారు.

'గేదెలే నాకు జీవనాధారం'

కొన్ని గంటల్లోనే తమ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయని వాపోయాడు పూంచ్ నివాసి షాబుదీన్ ఖతానా. "పాక్ సైనికుల కాల్పుల్లో రెండు గేదెలు నష్టపోయాను. వాటి ఆధారంగానే జీవనం సాగించేవాణ్ని. మా జంతువులకు ఎవరు పరిహారం ఇస్తారు. మేము పేదలం. నా బంధువులు నన్ను మరో ప్రదేశానికి వెళ్లిపోవాలని హెచ్చరించినా వెళ్లలేదు'' అంటూ వాపోయాడు.

భయంతోనే బతుకున్నాం

పాకిస్థాన్ సైనికుల కాల్పుల్లో రెండు గేదెలను కోల్పోయానని పూంచ్‌కు చెందిన రైతు షఫీ మన్హాస్ తెలిపాడు. "మేము ప్రతిరోజూ భయంతో జీవిస్తున్నాం. నేను రెండు గేదెలతో పాటు కోళ్లనూ కోల్పోయాను'' అని గద్గద స్వరంతో చెప్పాడు.

రూహ్ అఫ్జాపై ప్రతికూల వ్యాఖ్యలు చేయను

దిల్లీ హైకోర్టుకు తెలిపిన రామ్‌దేవ్... కేసు మూసివేత



దిల్లీ: హమ్‌దర్ద్ సంస్థ తయారీ 'రూహ్ అఫ్జా' పానీయంపై ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలు చేయబోనని యోగా గురువు రామ్‌దేవ్ దిల్లీ హైకోర్టుకు తెలియజేయడంతో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం శుక్రవారం మూసివేసింది. ఈ వ్యాజ్యంలో 'హమ్‌దర్ద్ నేషనల్ ఫౌండేషన్ ఇండియా'కు అనుకూలంగా తీర్పు వెలువరిస్తున్నామని, అఫిడవిట్లలో చేసిన వాగ్దానాలకు రామ్‌దేవ్, పతంజలి పుడ్స్ లిమిటెడ్ కట్టుబడి ఉండాలని జస్టిస్ అమిత్ బన్సల్ స్పష్టం చేశారు. 'రూహ్ అఫ్జా'పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఆన్‌లైన్ నుంచి తొలగించాలని అంతకుముందు రామ్‌దేవ్, పతంజలి పుడ్స్ లిమిటెడ్‌ను ధర్మాసనం ఆదేశించింది. ప్రమాణ పత్రం దాఖలు చేయడానికి ముందే ఈ పని చేయాలని స్పష్టం చేసింది.

న్యాయ విద్యా కమిషన్ కోసం సుప్రీంలో పిటిషన్

దిల్లీ: దేశంలో ఐదేళ్ల న్యాయ విద్య కోర్సులను సమీక్షించడానికి నిపుణుల కమిటీ లేదా న్యాయ విద్యా కమిషన్‌ను నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. నూతన విద్యా విధానం-2020 దేశంలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రోత్సహిస్తోందన్నారు. అయితే, న్యాయ విద్యకు సంబంధించిన కోర్సుల సిలబస్, పాఠ్యప్రణాళికలను సమీక్షించే చర్యలను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీసుకోవడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. తాజా పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయబోమని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం స్పష్టం చేసింది. పెండింగ్‌లో ఉన్న ఇదే తరహా అభ్యర్థనలతో జత చేస్తామని తెలిపింది.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రివైజ్డ్ జాబ్ క్యాలెండర్ విడుదల


దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలోని పలు విభాగాల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) రివైజ్డ్ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. 2025-26 సంవత్సరంలో నిర్వహించే ఉద్యోగ నియామక పరీక్షల వివరాలను ప్రకటించింది. ఈ ఏడాది నిర్వహించే పరీక్షలు, నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ తేదీలతో సవరించిన క్యాలెండర్‌ను శుక్రవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో శుక్రవారం భారత భద్రతా బలగాలకు మద్దతుగా పలువురి ర్యాలీ

ఈనాడు సినిమా

కొత్త పాన్ ఇండియా కథతో!



విజయ్ దేవరకొండ ఈ నెలలోనే 'కింగ్‌డమ్' సినిమాతో సందడి చేయనున్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాలు ఇప్పటికే ఖరారైన సంగతి తెలిసిందే. రెండు సినిమాలూ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ దేవరకొండ పుట్టినరోజుని పురస్కరించుకుని శుక్రవారం ఆయా సినిమాలకి సంబంధించిన పోస్టర్లని విడుదల చేశాయి చిత్రబృందాలు.

బ్రిటిష్ కాలంలో

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్, టి. సిరీస్ సంస్థలు కలిసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలు. ఇందులో విజయ్ సరసన రష్మిక కథానాయిక. బ్రిటిష్‌పాలన కాలం నేపథ్యంలో, 1854 - 1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. విజయ్ ధ్యాన ముద్రలో ఉన్న లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని కథాంశంతో వస్తున్న ఓ శక్తిమంతమైన సినిమా ఇదని చిత్రవర్గాలు తెలిపాయి.


గ్రామీణ నేపథ్యంలో...

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రవికిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు - శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టుగా ప్రకటిస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం.

దేశం కోసం...

భారతీయ సైన్యానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందజేయనున్నట్టు తెలిపారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. రానున్న కొన్ని వారాలపాటు తన క్లాత్ బ్రాండింగ్ రౌడీ వేర్ అమ్మకాలతో వచ్చే లాభాల్లో కొంత వాటాని భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు, మేడ్ ఫర్ ఇండియా కూడా అంటూ తన సామాజిక మాధ్యమాల ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు విజయ్.

మన సైనికుల ఫొటోలను తీయొద్దు - రాజమౌళి



ఎస్ఎస్ రాజమౌళి

ప్రస్తుతం భారత్ పాకిస్థాన్ ఉద్రిక్త పరిస్థితుల మధ్య అప్రమత్తంగా, ప్రశాంతంగా ఉండండి.. విజయం మనదే అంటూ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. "భారత సైన్యంలోని ఏదైనా కదలికను మీరు చూసినట్లయితే.. ఫొటోలు, వీడియోలు తీయొద్దు. వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు. ఇలా చేస్తే మీరు శత్రువుకు సహాయం చేసినట్లే అవుతుంది. ధృవీకరించని ప్రకటనలు, అసత్య ప్రచారాన్ని నమ్మకండి" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

దేశాన్ని ప్రశ్నించొద్దు



అన్యాయానికి బదులు తీర్చుకునే దేశాన్ని ప్రశ్నించొద్దని అంటోంది కథానాయిక రష్మిక. ఇటీవలే 'ఆపరేషన్ సిందూర్' మెరుపు దాడితో దేశంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టిందామె. "ఉగ్రవాదం నుంచి మనల్ని రక్షించుకునేందుకు చేసే పోరాటం యుద్ధం కాదు. ఈ పోరాటానికి మద్దతిచ్చే వారిని యుద్ధాన్ని కాంక్షించే వారిగా పేర్కొనొద్దు. దేశ భద్రత, న్యాయం కోసం ఆరాటపడే పౌరులు వారు. దూకుడు ధోరణి, అత్యవసర ఆత్మరక్షణకు మధ్య చాలా నైతిక భేదం ఉంటుంది. కుట్రపూరితంగా జరిగిన ఉగ్రవాద చర్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు.. దానికి ప్రతీకారం తీర్చుకోవడం బాధ్యతే అవుతుంది తప్ప అవకాశం కాదు. శాంతిని కోరుకోవడమంటే అర్థం.. జరిగిన హింసను మౌనంగా అంగీకరించడం కాదు. మనకు జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకుంటున్న దేశాన్ని ప్రశ్నించొద్దు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారిని ప్రశ్నించండ"ని ఆ పోస్ట్‌లో పేర్కొంది రష్మిక.

వ్యక్తి నిజస్వరూపం తెలిసేది అప్పుడే!



వివేక్ అగ్నిహోత్రి

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొంటున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై పలువురు సినీ ప్రముఖులు భారత సాయుధ దళాలకు మద్దతు ప్రకటిస్తున్నారు. తాజాగా ఈ విషయంపై దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి స్పందిస్తూ.. మహాభారతంలోని ఓ సందేశాన్ని పంచుకున్నారు. "అగ్ని బంగారాన్ని శుద్ధి చేసినట్లే.. సేవ రాజును శుద్ధి చేసినట్లే.. యుద్ధ సమయాల్లో వ్యక్తి నిజస్వరూపం తెలుస్తుంది" అంటూ ఎక్స్ వేదికగా పోస్టును పంచుకున్నారు.

చిన్ననాటి జ్ఞాపకాలతో అమ్మమ్మ ఇంటికి!

చిత్రం	: 'ఎ రియల్ పెయిన్'
జానర్	: కామెడీ డ్రామా
ప్లాట్‌ఫామ్	: జియో హాట్‌స్టార్ (ఇంగ్లిష్ సబ్‌టైటిల్స్)



అమ్మమ్మ ఇల్లు అంటే గుర్తొచ్చేది చిన్నప్పుడు మనం ఆ ఇంట్లో ఆడిన ఆటలు, అమ్మమ్మ ప్రేమగా తినిపించిన గోరు ముద్దలు.. ఈ ప్రపంచంలో ఏదీ ఆశించకుండా తన మనవళ్లు, మనవరాళ్లపై అమితంగా ప్రేమ చూపించే వ్యక్తి ఆమె. వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నామంటే ఆ సంతోషమే వేరు కదా. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ ఆ ఊరు వెళ్తున్నామంటే ఆ ఊహ ఎంత బాగుంటుందో. అమ్మమ్మ ఇంట్లో తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆ ఇంటికి వెళ్లాలని ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఇద్దరి కజిన్స్ కథను తెరపై ఆవిష్కరించిన చిత్రమే 'ఎ రియల్ పెయిన్'.

◆ డేవిడ్ కప్లాన్ (జెస్సీ ఐసెన్‌బర్గ్), బెంజిమన్ (కీరన్ కల్కిన్) ఈ ఇద్దరూ కజిన్స్. తాము పెరిగిన వాతావరణాన్ని చూడాలనే ఉద్దేశంతో ఓ రోజు అమ్మమ్మ ఇంటికి వెళ్లాలనుకుంటారు. ఈ క్రమంలో వాళ్ల అమ్మమ్మ గడిపిన జీవితం గురించి తెలుసుకోవాలని.. ఆమె జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు పోలండ్ విహార యాత్రకు వెళ్లాలనుకుంటారు. ఈ ట్రిప్‌లో హోలోకాస్ట్ చరిత్రతో పాటుగా అప్పట్లో హిట్లర్ యూదులను ఎలాంటి ఇబ్బందులు పెట్టారు. వారు ఎలాంటి బాధ అనుభవించారు అనే విషయాలను తెలుసుకుంటారు. మరి ఈ పర్యటన తర్వాత వారిద్దరూ తమ అమ్మమ్మ ఇంటికి చేరుకున్నారా? భిన్నమైన మనస్తత్వాలు ఉన్న ఈ కజిన్స్ ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు? అనేది తెలియాలంటే 'ఎ రియల్ పెయిన్' సినిమా చూడాల్సిందే.

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!

కామెడీ డ్రామా నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. హాలీవుడ్ నటుడు జెస్సీ ఐసెన్‌బర్గ్ ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రమిది. కీరన్ కల్కిన్ ముఖ్య పాత్ర పోషించారు. గతేడాది విడుదలై హిట్టు బొమ్మ అనిపించుకున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ జియో హాట్‌స్టార్ వేదికగా ఇంగ్లిష్ సబ్‌టైటిల్స్‌తో ప్రసారం అవుతోంది. ఇందులో జెన్నీఫర్ గ్రే, విష్ షార్, ఎల్లోరా టోర్చియా తదితరులు కీలకపాత్రలు పోషించారు.

◆ మనసులో ఏదీ దాచుకోకుండా ఉన్నది ఉన్నట్టు నిక్కచ్చిగా మాట్లాడే బెంజి పాత్రలో కీరన్ కల్కిన్ ఒదిగిపోయారు. ఈ సినిమాలో ఈయన నటనకుగానూ 97వ ఆస్కార్ అవార్డుల్లో ఉత్తమ సహాయ నటుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. చాలాకాలం తర్వాత ఇద్దరు అన్నదమ్ములు కలిస్తే వారిద్దరి మధ్య అనుబంధం ఎలా ఉంటుందనే విషయాన్ని కళ్లకు కట్టినట్టు చూపించిన చిత్రమిది. ఇందులో స్వేచ్ఛగా ఉంటూ నచ్చిన పని చేస్తూ మనసులోని బాధను ముఖంపై కనిపించకుండా చిరునవ్వుతో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు బెంజి.

నాన్నకు చోటిస్తే భయం ఉండదు



"రామ్ నీ మనసులో భయానికి చోటిస్తే ఈ నాన్న ఉండడు.. నాన్నకు చోటిస్తే భయం ఉండదు" అంటూ తన కుమారుడికి చెప్తున్నాడు ఓ తండ్రి. మరి ఈ తండ్రీకొడుకుల కథేంటో తెలుసుకోవాలంటే 'అనగనగా' సినిమా చూడాల్సిందే. సుమంత్, కాజల్ చౌదరి, విహర్ష్ ప్రధాన పాత్రలు పోషించారు. సన్నీ సంజయ్ దర్శకత్వం వహించారు. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను హీరో నాగచైతన్య సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేశారు. క్రిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న ఈటీవీ విన్‌లో విడుదల కానుంది.

విడుదల ఖరారు



నారా రోహిత్, బెల్లంకొండ శ్రీనివాస్, మనోజ్

'భైరవం'తో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్. ఈ ముగ్గురు కలిసి నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కనకమేడల తెరకెక్కించారు. కె.కె.రాధామోహన్ నిర్మించారు. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. బెల్లకొండ శ్రీనివాస్, నారా రోహిత్, మనోజ్ మును పెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రల్లో కనువిందు చేయనున్నారు. ఈ సినిమాకి సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం: హరి కె.వేదాంతం.

ఆ సంతృప్తిని పాక్‌కు మిగల్చకూడదనే..!



శ్రీనిధి శెట్టి, నాని, అడివిశేష్, శైలేశ్ కొలను

తమ వల్ల భారత్‌లోని ఓ ప్రాంతంలో సినిమా విజయోత్సవ వేడుక రద్దయింది అన్న సంతృప్తిని కూడా పాక్‌కు మనం మిగల్చకూడదు అనే ఉద్దేశంతోనే ఈ సక్సెస్ మీట్‌ని నిర్వహించాం అన్నారు కథానాయకుడు నాని. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన 'హిట్ 3' వేడుకలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మన సైనికుల గొప్పతనాన్ని ప్రశంసిస్తూ సెల్యూట్ చేశారు. అనంతరం చిత్రం కోసం పనిచేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అడివిశేష్, శ్రీనిధి శెట్టి, ప్రశాంతితో పాటు ఇతర చిత్ర బృందం పాల్గొంది. నాని ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మించిన చిత్రమే 'హిట్ 3'. శైలేశ్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది.


కె-ర్యాంప్ షురూ



కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా జైన్స్ నాని తెరకెక్కిస్తున్న చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా కథానాయిక. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ సినిమా శుక్రవారం నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. త్వరలో ఫస్ట్‌లుక్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇదొక విభిన్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: సతీష్ రెడ్డి మాసం.

భారత సైన్యానికి 'సింగిల్' చిత్ర బృందం విరాళం



మన దేశం కోసం పోరాడుతున్న సైనికులకు అండగా నిలిచేందుకు '#సింగిల్' చిత్ర వసూళ్లలో కొంత భాగం విరాళం ఇవ్వనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ ప్రకటించారు. భారత సైన్యానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆయన సమర్పణలో శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా నాయకానాయికలుగా నటించిన చిత్రమే '#సింగిల్'. కార్తీక్ రాజు తెరకెక్కించారు. విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ.. "మన సైనికులు దేశం కోసం పోరాడుతుంటే.. సినిమా వేడుకలు చేసుకోవడం సరికాదనిపించింది. కేవలం ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశాం. ఈ ఉద్రిక్త పరిస్థితులకు ముందే మేము ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించాం. దీన్ని వాయిదా వేయడం మంచిదా, కాదా అనే దానిపైనా చర్చించాం. సినిమా కోసం వందల మంది పని చేయడమే కాదు.. థియేటర్లపైనా వందల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. అందుకే ఎవరూ తప్పుగా అర్థం చేసుకోరనే ధైర్యంతో ఈ చిత్రాన్ని విడుదల చేశాం" అన్నారు. "ప్రేక్షకుల్ని నవ్వించాలనే ఉద్దేశంతో ఈ చిత్రం తీశాం. కుటుంబంతో కలిసి థియేటర్లకు రండి. మిమ్మల్ని నవ్వించే బాధ్యత నాది" అన్నారు హీరో శ్రీవిష్ణు. ఈ కార్యక్రమంలో వెన్నెల కిశోర్, కేతిక, ఇవానా, కార్తీక్ రాజు, విద్య తదితరులు పాల్గొన్నారు.

హాలీవుడ్‌లో తొలి అడుగు



'ఎమర్జెన్సీ' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్. దర్శకురాలిగా, నటిగా వైవిధ్యమైన కథలతో ఇప్పటికే బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈమె.. ఇప్పుడు హాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆమె ప్రధాన పాత్రలో 'బ్లెస్డ్ బి ది ఈవిల్' అనే ఇంగ్లిష్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. "కంగన కోసం లయన్ మూవీస్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్న చిత్రమిది. గర్భస్రావం తర్వాత బిడ్డను కోల్పోయిన బాధలో ఉంటుంది ఓ జంట. మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకుంటున్న వారిని ఓ దుష్ట శక్తి ఎలాంటి తిప్పలు పెట్టిందనే కథాంశం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. అతీంద్రియ శక్తులు.. జానపద కథల నేపథ్యంలో అనురాగ్ రుద్ర దీన్ని తీర్చిదిద్దుతున్నారు. టైలర్ పోసీ, స్కార్లెట్ రోజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమెరికాలో చిత్ర నిర్మాణాలకు ట్రంప్ విధించిన టారిఫ్‌కు సంబంధించిన పనుల్ని పూర్తి చేసిన తర్వాత ఈ వేసవిలో న్యూయార్క్‌లో చిత్రీకరణను మొదలు పెట్టనున్నార"ని కంగన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'మహారాజ'.. సీక్వెల్ సన్నాహాలు



విజయ్ సేతుపతి 50వ సినిమాగా బాక్సాఫీస్ బరిలో నిలిచి.. భారీ విజయాన్ని అందుకుంది 'మహారాజ'. నిథిలన్ సామినాథన్ తెరకెక్కించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు ఇప్పుడు సీక్వెల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విషయమై విజయ్‌తో కథా చర్చలు పూర్తయ్యాయని.. ఆయన నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని తెలిసింది. ప్రస్తుతం సామినాథన్ ఈ సీక్వెల్ కోసం పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నారని.. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఇది సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని తెలుస్తోంది. దీన్ని ది రూట్, థింక్ స్టూడియోస్, ప్యాషన్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ప్రస్తుతం విజయ్ తెలుగులో పూరి జగన్నాథ్‌తో ఓ సినిమా చేయనున్నారు.

'థగ్ లైఫ్' వేడుక వాయిదా



కమల్‌హాసన్

దేశ సరిహద్దుల్లో పరిణామాల్ని... అక్కడ చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని 'థగ్ లైఫ్' పాటల విడుదల వేడుకని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు అగ్ర నటుడు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా.. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'థగ్ లైఫ్'. జూన్ 5న రానుంది. ఈ నెల 16న భారీ స్థాయిలో పాటల విడుదల వేడుకని నిర్వహించాలనుకున్నారు. అయితే భారత్ - పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా వేడుకని వాయిదా వేసింది చిత్ర బృందం. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ "ఇది వేడుకలకి సమయం కాదని భావిస్తున్నాం. దేశాన్ని రక్షించడం కోసం మన సైన్యం అప్రతిహత ధైర్యం ప్రదర్శిస్తోంది. పౌరులుగా మనం సంయమనంతో, సంఘీభావంతో స్పందించాల్సిన సమయం ఇది. వేడుకని మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనేది సరైన సమయంలో ప్రకటిస్తాం. దేశమే ముందు, ఆ తర్వాతే కళ" అన్నారు.

ఇకపై అలాంటి పాత్రల్లోనే!



అన్యాయాన్ని ఎదిరించే న్యాయవాదిగా 'కేసరి ఛాప్టర్ 2' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న కథానాయిక అనన్యపాండే. ఇప్పుడామె సవాలుతో కూడిన పాత్రల్లో నటించాలంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య తన కథల ఎంపిక గురించిన పలు విషయాలను పంచుకుంది. "'బ్యాడ్ న్యూజ్', 'కాల్ మీ బే'లాంటి సినిమాల్లో ఇప్పటి వరకూ నేను చేసిన పాత్రలన్నీ కామెడీ నేపథ్యంలో రూపొందినవే. గ్లామరస్ పాత్రల్లో నటిస్తే మంచి అనుభూతి వస్తుంది అనుకున్నా.. కానీ 'కేసరి ఛాప్టర్ 2' చేసిన తర్వాతే తెలిసింది. సవాలుతో కూడిన పాత్రల్లో నటిస్తే వచ్చే ఆ అనుభూతి వేరు. ఇప్పుడు నేను ఆ అనుభూతిని రుచి చూశాను. ఇకపై అలాంటి శక్తిమంతమైన పాత్రల్లో నటించాలి అనుకుంటున్నా"అంటూ చెప్పుకొచ్చిందామె.

యెస్ బ్యాంక్‌లో 20% వాటా జపాన్ సంస్థకు

ఈనాడు బిజినెస్

- రూ.13,483 కోట్లకు అమ్ముతున్న ఎస్‌బీఐ సహా 8 బ్యాంకులు
- 12 నెలల్లో లావాదేవీ పూర్తయ్యే అవకాశం



దిల్లీ: యెస్ బ్యాంక్‌లో తమకున్న వాటాలో 20 శాతాన్ని జపాన్ సంస్థ సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ)కు విక్రయిస్తున్నామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో పాటు మరో 7 బ్యాంకులు శుక్రవారం వెల్లడించాయి. ఈ విక్రయ లావాదేవీ విలువ రూ.13,483 కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి లావాదేవీ. ఈ విక్రయ లావాదేవీ అనంతరం యెస్ బ్యాంక్‌లో అతిపెద్ద వాటాదారుగా ఎస్ఎంబీసీ నిలుస్తుంది.

- ఈ 20 శాతంలో 13.19% వాటాను రూ.8889 కోట్లకు ఎస్‌బీఐ విక్రయిస్తోంది. మిగిలిన 6.81% వాటాను 7 బ్యాంకులు- యాక్సిస్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంకులు రూ.4,594 కోట్లకు విక్రయించనున్నాయి.
- సంక్షోభంలో కూరుకున్న యెస్ బ్యాంక్ పునర్వ్యవస్థీకరణ పథకం కింద 2020 మార్చిలో ఎస్‌బీఐ సహా ఈ 8 బ్యాంకులు పెట్టుబడులు పెట్టాయి. అప్పట్లో ఎస్‌బీఐ ఒక్కటే రూ.6,050 కోట్లతో 49% వాటా కొంది.
- 'యెస్ బ్యాంక్‌లో 13.19% వాటాకు సమానమైన 413.44 కోట్ల షేర్లను రూ.8,888.97 కోట్లకు విక్రయించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆఫ్ ద సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపింద'ని ఎస్‌బీఐ వెల్లడించింది. ఒక్కో షేరు రూ.21.50 ధర వద్ద ఈ విక్రయ లావాదేవీ జరగనుందని తెలిపింది.
- బీఎస్ఈ వద్ద ఉన్న గణాంకాల ప్రకారం.. 2025 మార్చి చివరకు యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐకి 24% వాటా ఉంది. ఈ లావాదేవీ అనంతరం ఎస్‌బీఐ వాటా 10.81 శాతానికి తగ్గుతుంది.
- 2025 మార్చి 31 నాటికి యెస్ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.75%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.39%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.21%, యాక్సిస్ బ్యాంక్ 1.1 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 0.92%, ఫెడరల్ బ్యాంక్ 0.76%, బంధన్ బ్యాంక్ 0.7% చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి.
- ప్రతిపాదిత వాటా విక్రయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా లాంటి నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఈ అనుమతులు లభిస్తే 12 నెలల్లో ఈ విక్రయ లావాదేవీ పూర్తయ్యే అవకాశం ఉందని ఎస్‌బీఐ పేర్కొంది.
- ఎస్ఎంబీసీ పెట్టుబడుల వల్ల యెస్ బ్యాంక్ మలివిడత వృద్ధి దిశగా అడుగులు వేస్తుందనే ఆశాభావాన్ని యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ వ్యక్తం చేశారు.
- జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ)నకు పూర్తి స్థాయి అనుబంధ సంస్థగా ఎస్ఎంబీసీ ఉంది. జపాన్‌లో రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్ ఎస్ఎంఎఫ్‌జీనే. ఈ గ్రూప్ ఆస్తుల విలువ గత డిసెంబరు ఆఖరుకు 2 లక్షల కోట్ల డాలర్లు.

వాట్సప్ బాట్‌లో ప్రీమియం చెల్లింపు: ఎల్ఐసీ

ఈనాడు, హైదరాబాద్: పాలసీదారులు సులభంగా ప్రీమియం చెల్లించేందుకు వీలుగా సరికొత్త సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ నంబరు 8976862090 కేటాయించినట్లు పేర్కొంది. ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పాలసీదారులు, ఈ నంబరుకు సందేశం పంపించడం ద్వారా తమ పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. నేరుగా యూపీఐ, నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా వాట్సప్ బాట్‌లోనే చెల్లింపులు పూర్తి చేయొచ్చు. పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం నుంచి, చెల్లించిన తర్వాత రశీదు కూడా ఈ వాట్సప్ బాట్‌లోనే అందిస్తామని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతి తెలిపారు. పాలసీదారులు ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ప్రీమియం చెల్లించేందుకు ఇది సౌకర్యంగా ఉంటుందన్నారు. దాదాపు 2.2 కోట్ల మంది ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేవల కోసం రోజుకు 3 లక్షల మందికి పైగా పాలసీదారులు పోర్టల్‌ను సందర్శిస్తుంటారని తెలిపారు.

- ఎల్ఐసీ కేటాయించిన వాట్సప్ నంబరుకు 'హాయ్' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత తెరపై పలు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో మీకు కావాల్సింది ఎంపిక చేసుకుని, తదుపరి సూచనల ప్రకారం కొనసాగొచ్చు.

సైనిక బలగాలకు అంబానీ, అదానీ మద్దతు

దిల్లీ: పాకిస్థాన్ డ్రోన్ల దాడులు, తుపాకుల పేలుళ్లను సమర్థంగా నిలువరిస్తూ దేశ రక్షణలో నిమగ్నమైన భారత సైనిక బలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని కుబేరులు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ విడివిడిగా తెలిపారు. 'మన సైనిక దళాలు నిర్వహిస్తున్న ఆపరేషన్ సిందూర్ పట్ల మేమెంతో గర్వంగా ఉన్నాం. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని అణిచివేయాలనే లక్ష్యంతో భారతదేశమంతా ఏకం అయ్యింది. దేశ సరిహద్దుల్లో శత్రువు చేస్తున్న దాడులకు ప్రధాని నరేంద్ర మోదీ లాంటి ధైర్యవంత నాయకుడి సారథ్యంలో భారత సైన్యం దీటైన జవాబు ఇస్తోంద'ని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ తెలిపారు. 'మన ఐక్యత బలాన్ని, మన దేశ అసలు సత్తాను ప్రపంచానికి చాటి చెబుతున్న సమయం ఇది. మన మాతృభూమి, మన ఆదర్శాల స్ఫూర్తికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత సైనిక దళాలకు మద్దతు ఇవ్వడానికి ఎప్పుడూ మేం ముందుంటామ'ని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. భారత సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడే విషయంలో ప్రభుత్వానికి, సైనిక దళాలకు మా పూర్తి మద్దతు ఉంటుందని షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ తెలిపింది.

సువెన్ ఫార్మా.. ఇకపై కోహాన్స్ లైఫ్‌సైన్సెస్

ఈనాడు, హైదరాబాద్: సువెన్ ఫార్మాస్యూటికల్స్ పేరు కోహాన్స్ లైఫ్‌సైన్సెస్‌గా మారిపోతోంది. ఈ రెండు కంపెనీల విలీనానికి ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) అనుమతి లభించింది. ఈ విలీన ప్రక్రియలో భాగంగా కోహాన్స్ లైఫ్‌సైన్సెస్ వాటాదార్లకు 12.80 కోట్ల సువెన్ ఫార్మా షేర్లు కేటాయిస్తారు. ఈ విలీనం తర్వాత సువెన్ ఫార్మా పేరును కోహాన్స్ లైఫ్‌సైన్సెస్‌గా మారుస్తారు. దీనికి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతి తీసుకుంటున్నట్లు సువెన్ ఫార్మా వెల్లడించింది.

సీఏ పరీక్షలు వాయిదా

దిల్లీ: ఈనెల 9 నుంచి 14 వరకు జరగాల్సిన ఫైనల్, ఇంటర్మీడియెట్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలను వాయిదా వేసినట్లు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తెలిపింది. పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. మళ్లీ ఈ పరీక్షలు ఎప్పుడు నిర్వహించేదీ తదుపరి ప్రకటిస్తామంది. ఫైనల్ పరీక్షలకు 55,666 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1,02,378 మంది హాజరు కావాల్సి ఉందని సంస్థ తెలిపింది.


3% వరకు పెరగనున్న మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరలు



దిల్లీ: ఈ ఏడాదిలో రెండు దఫాల్లో కార్ల ధరలను పెంచనున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ప్రకటించింది. వచ్చే జూన్, సెప్టెంబరుల్లో చేపట్టబోయే ధరల మార్పుల్లో.. మెర్సిడెస్ సి-క్లాస్ ధర రూ.90000, మెర్సిడెస్ మేబాక్ ఎస్ 680 ధర రూ.12.2 లక్షల మేర పెరగనుంది. జూన్ 1 నుంచి కార్ల ధరలను 1-2%, సెప్టెంబరు 1 నుంచి 1.5% పెంచనున్నట్లు మెర్సిడెస్ బెంజ్ సన్నాహాలు చేస్తోంది. విదేశీ మారకపు ద్రవ్య హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. రెండు దశల్లో కార్ల ధరలను దాదాపు 3% పెంచనున్నామని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు. గత నాలుగు నెలల్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా క్షీణించిందని, యూరోతో పోలిస్తే రూపాయి విలువ 10% తగ్గిందని, దీంతో కార్యకలాపాలపై వ్యయ ఒత్తిళ్లు పడుతున్నాయని వెల్లడించారు. కొనుగోలుదార్లకు సాధ్యమైనంత తక్కువ భారాన్నే బదిలీ చేయనున్నట్లు వివరించారు.

డాక్టర్ రెడ్డీస్‌కు రూ.1,593 కోట్ల లాభం

తుది డివిడెండ్ రూ.8



జీవీ ప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి రూ.8,506 కోట్ల ఆదాయంపై రూ.1,593 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదేకాలంతో పోల్చితే ఆదాయం 20%, నికరలాభం 22% పెరిగాయి. త్రైమాసిక ఈపీఎస్ రూ.19.11గా ఉంది. 2024-25లో ఈ సంస్థ రూ.32,553 కోట్ల ఆదాయాన్ని, రూ.5,654 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24తో పోలిస్తే వార్షికాదాయం 17%, నికరలాభం 2% పెరిగాయి.

ప్రాంతాల వారీగా: గత ఆర్థిక సంవత్సరంలో ఉత్తర అమెరికా ఆదాయాలు 12% పెరిగినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఐరోపా ఆదాయాలు ఎంతో అధికంగా 75% పెరగడం ప్రత్యేకత. కొత్త ఔషధాలు విడుదల చేయటం వల్ల రష్యా ఆదాయాలు కూడా ఆకర్షణీయంగా పెరిగాయి.

అన్ని విభాగాల్లో రెండంకెల వృద్ధి

దాదాపు అన్ని వ్యాపార విభాగాల్లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ కో-ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ వివరించారు. కొత్త ఔషధాలు విడుదల చేయడం, అమెరికా అమ్మకాలు పెరగడం వల్ల ఆకర్షణీయ వృద్ధి సాధ్యమైనట్లు తెలిపారు. సమీప భవిష్యత్తులో ఇదేవిధంగా మెరుగైన వృద్ధి సాధిస్తామనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

డివిడెండుకు రికార్డు తేదీ జులై 10

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ యాజమాన్యం వాటాదార్లకు ఒక్కో షేరుకు రూ.8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు ఈ ఏడాది జులై 10ని రికార్డు తేదీగా నిర్ణయించారు. కంపెనీ ప్రస్తుత కో-ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మరో అయిదేళ్ల కాలానికి అదే హోదాలో తిరిగి నియమితులయ్యారు. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని (ఏజీఎం) ఈ ఏడాది జులై 24న నిర్వహించాలని నిర్ణయించారు.

ఏటీఎంలన్నీ పనిచేస్తున్నాయి

వదంతులు నమ్మొద్దు: బ్యాంకులు



ఈనాడు, హైదరాబాద్: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో, 'బ్యాంకుల ఏటీఎంలు మూతపడతాయంటూ' సామాజిక మాధ్యమ వేదికల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని బ్యాంకులు స్పష్టం చేశాయి. బ్యాంకులు అధికారికంగా వెల్లడించే సమాచారాన్ని మాత్రమే ఖాతాదారులు నమ్మాలని సూచించాయి. అవసరమైతే వినియోగదారుల సేవా కేంద్రాన్ని లేదా బ్యాంకు శాఖను సంప్రదించాలని తెలిపాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా పలు బ్యాంకులు 'తమ ఏటీఎంలు, నగదు డిపాజిట్ యంత్రాలు, డిజిటల్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేస్తున్నట్లు' 'ఎక్స్' వేదికగా ప్రకటించాయి. కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఎస్‌బీఐ కోరింది. తమ అన్ని ఏటీఎంలలో వినియోగదారుల కోసం నగదు కావాల్సినంత ఉందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ తెలిపింది. ఏటీఎం, డిజిటల్ ఛానల్స్‌లో ఎలాంటి అంతరాయమూ లేదని బీఓబీ పేర్కొంది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు యథాతథంగా పనిచేస్తున్నాయని యూనియన్ బ్యాంక్ పేర్కొంది.

పీఐబీ ఫ్యాక్ట్‌చెక్..: పాకిస్థాన్ చేసిన రాన్సమ్‌వేర్ సైబర్ దాడి ఫలితంగా మనదేశంలో ఏటీఎంలు 2-3 రోజుల పాటు పనిచేయవని, బీబీసీ రేడియో ఈ విషయాన్ని చెప్పిందంటూ జరుగుతున్న ప్రచారం అంతా 'అవాస్తవం' అని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ తేల్చి చెప్పింది.

పాక్‌కు ఐఎంఎఫ్ 1 బి.డా.: పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 2.3 బి.డా. సాయం చేసేందుకు నిర్వహించిన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. తమకు 1 బి.డా. సాయాన్ని అందించేందుకు ఐఎంఎఫ్ అంగీకరించిందని పాక్ ప్రధాని కార్యాలయం తెలిపింది.

2 బి.డాలర్లు తగ్గిన ఫారెక్స్ నిల్వలు



ముంబయి: మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు మే 2తో ముగిసిన వారానికి 2 బి.డాలర్లు (దాదాపు రూ.17,000 కోట్లు) తగ్గి 686.064 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.58.31 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 1.983 బి.డాలర్లు పెరిగి 688.129 బి.డాలర్లుగా ఉన్నాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 514 మి.డాలర్లు అధికమై 581.177 బి.డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి నిల్వలు 2.545 బి.డాలర్లు తగ్గి 81.82 బిలియన్ డాలర్లకు చేరాయి.

అమెరికాతో చైనా వాణిజ్య మిగులు 20 బి.డా.

బీజింగ్: ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో, ఏప్రిల్‌లో అమెరికాకు చైనా ఎగుమతులు భారీగా తగ్గాయి. ఇదే సమయంలో ఇతర దేశాలకు మాత్రం పెరిగాయి. గత నెలలో చైనా మొత్తం ఎగుమతులు 8.1% పెరిగాయి. ఆర్థికవేత్తల అంచనా కంటే ఇది 2% ఎక్కువ. మార్చిలో నమోదైన 12.4% వృద్ధితో పోలిస్తే మాత్రం తగ్గాయి. ఏప్రిల్‌లో దిగుమతులు 0.2% పడిపోయాయి. డాలర్ ప్రాతిపదికన చూస్తే.. అమెరికాకు చైనా సరఫరాలు 21% క్షీణించాయి. ఎక్కువ శాతం చైనా ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లు 145 శాతానికి చేరడమే ఇందుకు కారణం. అమెరికా నుంచి చైనాకు దిగుమతులు 13 శాతానికి పైగా తగ్గాయి. అమెరికాతో వాణిజ్య మిగులు 27.2 బి.డాలర్ల నుంచి 20.5 బి.డాలర్లకు పరిమితమైంది.

చైనాపై టారిఫ్‌లు 80 శాతానికి తగ్గిద్దాం: ట్రంప్

వాషింగ్టన్: చైనాపై విధించిన టారిఫ్‌లను 145% నుంచి 80 శాతానికి తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. ఈ వారాంతంలో అమెరికా, చైనా వాణిజ్య అధికారుల మధ్య సమావేశానికి ముందు ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం. చైనా ఉత్పత్తులపై ట్రంప్ భారీగా టారిఫ్‌లను విధించాక, ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు పెరిగాయి. ఆ తర్వాత మొదటిసారిగా స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాల అధికారులు చర్చలు జరపనున్నారు. చైనాపై 80 శాతం టారిఫ్ సరైనదని ట్రంప్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాపై అమెరికా టారిఫ్‌లు 145 శాతం, అమెరికాపై చైనా టారిఫ్‌లు 125 శాతంగా ఉన్నాయి.

టెల్ అవివ్‌కు ఎయిరిండియా విమానాల రద్దు

దిల్లీ: ఇజ్రాయెల్‌లోని టెల్ అవివ్‌కు ఈనెల 25 వరకు తమ విమానాల రద్దును కొనసాగిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఈనెల 4న టెల్ అవివ్ విమానాశ్రయ సమీపంలో మిసైల్ దాడి తర్వాత, అక్కడకు తమ విమాన సర్వీసులను 6 వరకు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా తొలుత ప్రకటించింది. తదుపరి సేవల రద్దును 8 వరకు, ఇప్పుడు 25 వరకు పొడిగించింది.

కోడి గుడ్లు

10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495	గోదావరి	500
వరంగల్	497	విశాఖపట్నం	505
విజయవాడ	500	చిత్తూరు	573

రూ.70 లక్షల కోట్లకు చేరువలో మ్యూచువల్ ఫండ్ల ఏయూఎం

యాంఫీ నివేదిక



ఈనాడు, హైదరాబాద్: అమెరికా సుంకాల ఫలితంగా స్టాక్‌మార్కెట్ కదలికలపై ఆందోళనల నేపథ్యంలో.. డెట్, హైబ్రిడ్ పెట్టుబడి పథకాల వైపు పెట్టుబడిదారులు దృష్టి సారించారు. అందువల్లే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 3.24% తగ్గి, రూ.24,269 కోట్లకు పరిమితమయ్యాయి. వరుసగా నాలుగో నెలా, ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు తగ్గడం గమనార్హం. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలూ ఉపకరించాయి. అయినా కూడా వరుసగా 50 నెలా ఈక్విటీ ఫండ్లలోకి నికర పెట్టుబడులు పెరిగాయి. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా రూ.26,632 కోట్లు వచ్చాయి. మార్చిలో ఈ మొత్తం రూ.25,926 కోట్లుగా ఉందని భారతీయ మ్యూచువల్‌ఫండ్ల సంఘం (యాంఫీ) శుక్రవారం తెలిపింది. సిప్ ఖాతాలు 8.38 కోట్లుగా ఉన్నాయి. దీర్ఘకాలిక పెట్టుబడి సాధనాలుగా మ్యూచువల్ ఫండ్లలో క్రమశిక్షణతో మదుపు చేస్తున్న వారు పెరుగుతున్నారని యాంఫీ సీఈఓ వెంకట్ చలసాని తెలిపారు. ఈక్విటీ ఫండ్లతోపాటు డెట్ ఫండ్లలోకి ఏప్రిల్‌లో రూ.2.19 లక్షల కోట్లు వచ్చాయి. మొత్తంగా మ్యూచువల్ ఫండ్లలోకి గత నెలలో రూ.2.77 లక్షల కోట్లు వచ్చాయి. వీటన్నింటితో కలిసి ఏప్రిల్ చివరికి మ్యూచువల్ ఫండ్ల నిర్వహణలో ఉన్న ఆస్తులు విలువ (ఏయూఎం) రూ.69,99,837.94 కోట్లకు చేరింది. మార్చిలో ఈ విలువ రూ.65,74,287.20 కోట్లుగా ఉంది.

స్థూల ఆదాయంలో 4 శాతాన్ని స్పెక్ట్రమ్ రుసుముగా చెల్లించాలి

శాటిలైట్ సంస్థలపై ట్రాయ్ ప్రతిపాదన



దిల్లీ: స్టార్‌లింక్ లాంటి శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థలు, సర్దుబాటు చేసిన స్థూల ఆదాయంలో (ఏజీఆర్) 4 శాతాన్ని స్పెక్ట్రమ్ రుసుముల కింద భారత ప్రభుత్వానికి చెల్లించాలని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫారసు చేసింది. పట్టణ ప్రాంతాల్లోని ఒక్కో చందాదారుపై అదనంగా ఏడాదికి రూ.500 చొప్పున శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలు అందించే సంస్థలు, చెల్లించాల్సి ఉంటుంది. గ్రామీణ చందాదారులకు ఈ అదనపు రుసుములు వర్తించవని టెలికాం విభాగానికి పంపిన సిఫారసుల్లో ట్రాయ్ పేర్కొంది. మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌కు వార్షిక కనీస రుసుము అయిన రూ.3,500కు లోబడే 4% ఏజీఆర్ స్పెక్ట్రమ్ రుసుము ఉంటుందని ట్రాయ్ తెలిపింది. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ స్పెక్ట్రమ్‌ను అయిదేళ్ల కాలానికి కేటాయించాలని, ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించొచ్చని ట్రాయ్ సిఫారసు చేసింది. ట్రాయ్ సిఫారసులను టెలికాం విభాగం పరిశీలించి, వాటిని కేంద్ర మంత్రి వర్గం ఆమోదానికి పంపిస్తుంది. ఈ ఆమోదం లభించాక శాటిలైట్ కంపెనీలు లైసెన్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కంపెనీల అంచనాలకు మించి

శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థలు అంచనా వేసిన మొత్తం కంటే, ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చేలా ట్రాయ్ సిఫారసులు ఉన్నాయి. స్పెక్ట్రమ్ రుసుము కింద ఏజీఆర్‌లో 1 శాతం లోపే వసూలు చేయాలని.. అంతకుమించి ఎటువంటి అదనపు ఛార్జీలు ఉండకూడదని ట్రాయ్‌తో సంప్రదింపుల సమయంలో ఎలాన్‌మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్, అమెజాన్ అనుబంధ సంస్థ కూపర్ సిస్టమ్స్ కోరాయి.

ఆ ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులకు ఇంటి నుంచి పని

దేశ, విదేశీ ప్రయాణాల రద్దు



దిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో.. చండీగఢ్, గురుగ్రామ్, నోయిడా, దిల్లీ, జయపుర్, అహ్మదాబాద్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న తమ ఐటీ సిబ్బంది, ఇంటి నుంచే పని (డబ్ల్యూఎఫ్‌హెచ్) చేసేందుకు పలు కంపెనీలు అనుమతులు ఇచ్చాయి. హెచ్‌సీఎల్ టెక్, ఈవై, కేపీఎంజీ, డెలాయిట్ వంటి కంపెనీలు ఈ అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. సమీప కాలంలో కార్యాలయ విధుల నిమిత్తం దేశ, విదేశీ గమ్యాలకు వెళ్లడంపైనా ఆంక్షలు విధించినట్లు తెలిసింది. 'ఇంటి నుంచి పని'కి ఇచ్చిన అనుమతులు శుక్రవారానికి వర్తిస్తాయని, సోమవారం నుంచి తమ ఉద్యోగులు ఏం చేయాలనే అంశాన్ని ఆదివారం ప్రకటిస్తామని హెచ్‌సీఎల్ టెక్, ఈవై తెలిపాయి. అత్యవసరం కాని దేశ, విదేశీ ప్రయాణాలు విరమించుకోవాలని తమ సిబ్బందికి అకౌంటింగ్-టెక్ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఇండియా సూచించింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలపై సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేయొద్దనీ, కస్టమర్లతో సంభాషణల్లోనూ ప్రస్తావించొద్దని తమ ఉద్యోగులను టెక్ మహీంద్రా కోరింది. ఇల్లు లేదా కార్యాలయం నుంచి పనిచేసుకునే వీలు కల్పిస్తున్నట్లు కేపీఎంజీ ఇండియా తెలిపింది. ఇందుకోసం బిజినెస్ మేనేజర్లను సంప్రదించాలని కోరింది.

తుర్కియే, అజర్‌బైజాన్‌కు బుకింగ్‌ల నిలిపివేత

దిల్లీ: పాకిస్థాన్‌తో యుద్ధ పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో, తుర్కియే, అజర్‌బైజాన్ సహా కొన్ని దేశాలకు బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ఆన్‌లైన్ పోర్టళ్లు ప్రకటించాయి. అక్కడకు తప్పనిసరైతేనే ప్రయాణించాలని భారతీయులకు ఆయా సంస్థలు సూచించాయి. ఆయా దేశాలు పాకిస్థాన్‌కు మద్దతుగా నిలవడమే ఇందుకు కారణం.

- అజర్‌బైజాన్, ఉజ్‌బెకిస్థాన్, తుర్కియేలకు కొత్త పర్యాటక ఆఫర్లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు కాక్స్ అండ్ కింగ్స్, ఈజ్‌మైట్రిప్ తెలిపాయి. ఈ దేశాలకు పర్యాటక ప్యాకేజీలు నిలిపి వేశామని ట్రావోమింట్ వివరించింది.
- రాజస్థాన్, పంజాబ్, జమ్ముకశ్మీర్‌లలో హోటల్ బుకింగ్‌లు రద్దవుతున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ శెట్టి తెలిపారు.

టెలికాం సేవలకు అంతరాయం లేకుండా

పాకిస్థాన్‌తో యుద్ధ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో.. టెలికాం సేవల్లో ఎటువంటి అంతరాయం కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు టెలికాం సంస్థల నిర్వాహకులు తెలిపారు. ఇంట్రా సర్కిల్ రోమింగ్ ఏర్పాట్లు, నిశిత పరిశీలనకు కంట్రోల్ సెంటర్లతో పాటు, టెలికాం టవర్లకు విద్యుత్తు అంతరాయం లేకుండా జనరేటర్లతో పనిచేయించేందుకు డీజిల్ నిల్వలు పెంచినట్లు సమాచారం. టెలికాం సేవల్లో ఎటువంటి అంతరాయం కలుగకుండా చూడాలని అధికారులు సూచించినట్లు తెలిసింది.

మార్కెట్లపై యుద్ధ మేఘాలు

- మళ్లీ 80,000 దిగువకు సెన్సెక్స్
- 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,779 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.7,278 కోట్లు



సెన్సెక్స్ ▼880 79454

నిఫ్టీ ▼266 24008

దేశీయ స్టాక్ మార్కెట్లపై యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమై, యుద్ధంగా మారుతోందని మదుపర్లు కలవరపడ్డారు. స్థిరాస్తి, ఫైనాన్స్, యుటిలిటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సెన్సెక్స్ 80,000 పాయింట్లకు దిగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 22 పైసలు పెరిగి 85.36 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.53% లాభంతో 63.80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి. పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజీ ప్రామాణిక కేఎస్ఈ-100 సూచీ 4014 పాయింట్లు పెరిగి 1,07,541 వద్ద ముగిసింది.

- బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం రూ.2.10 లక్షల కోట్లు తగ్గి రూ.416.40 లక్షల కోట్లు (4.86 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. గత రెండు రోజుల్లో మదుపర్ల సంపద రూ.7.09 లక్షల కోట్లు ఆవిరైంది.
- సెన్సెక్స్ ఉదయం 1366 పాయింట్ల (క్రితం ముగింపు 80,334.81) నష్టంతో 78,968.34 వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు కొనసాగడంతో రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, చివరకు కాస్త కోలుకుని 880.34 పాయింట్ల నష్టంతో 79,454.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 265.80 పాయింట్లు తగ్గి 24,008 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,935.75- 24,164.25 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 25 నీరసించాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 3.16%, పవర్‌గ్రిడ్ 2.70%, అల్ట్రాటెక్ 2.15%, బజాజ్ ఫైనాన్స్ 2.02%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.93%, రిలయన్స్ 1.93%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.77%, అదానీ పోర్ట్స్ 1.73%, ఎం అండ్ ఎం 1.59%, ఎన్‌టీపీసీ 1.52%, ఐటీసీ 1.50%, యాక్సిస్ బ్యాంక్ 1.44% నష్టపోయాయి. టైటన్ 4.38%, టాటా మోటార్స్ 3.90%, ఎల్ అండ్ టీ 3.77%, ఎస్‌బీఐ 1.39% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 2.08%, యుటిలిటీస్ 1.50 %%, ఆర్థిక సేవలు 1.40%, విద్యుత్ 1.11%, బ్యాంకింగ్ 1.04%, ఎఫ్ఎమ్‌సీజీ 0.65%, సేవలు 0.63% పడ్డాయి. యంత్ర పరికరాలు, పరిశ్రమలు, మన్నికైన వినిమయ వస్తువులు, లోహ మెరిశాయి. బీఎస్ఈలో 2522 షేర్లు నష్టాల్లో ముగియగా, 1343 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 145 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.
- **రక్షణ షేర్లు కళకళ:** రక్షణ రంగ షేర్లు పరుగులు తీశాయి. పరాస్ డిఫెన్స్ 7.18%, భారత్ డైనమిక్స్ 5.34%, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.92%, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ 1.84%, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ 1.38% రాణించాయి. డ్రోన్ తయారీ సంస్థలు ఐడియాఫోర్జ్ 20%, డ్రోన్‌ఆచార్య ఏరియల్ 4.99% దూసుకెళ్లాయి.
- మార్చి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించడంతో ఎల్ అండ్ టీ షేరు 3.77% లాభపడి రూ.3,445.70 వద్ద; టైటన్ షేరు 4.38% పెరిగి రూ.3,510.80 దగ్గర స్థిరపడ్డాయి.
- వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఎస్ఎమ్ఎల్ ఇసుజులో మెజారిటీ వాటా కొనుగోలు చేయడానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతిని మహీంద్రా అండ్ మహీంద్రా కోరింది. ఎస్ఎంఎల్ ఇసుజులో 58.96% వాటాను రూ.555 కోట్లకు మహీంద్రా కొనుగోలు చేయనుంది.
- తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద నిర్మాణ కంపెనీ రవి ఇన్‌ఫ్రాబిల్డ్ ప్రాజెక్ట్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఐపీఓ పూర్తి ఆఫర్ సేల్‌గా రానుంది.

జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2024-25	2023-24	2024-25	2023-24
థెర్మాక్స్1	206	188	3085	2764
ఏబీబీ ఇండియా	474	460	3160	3080
స్విగ్గీ	(1081)	(555)	4410	3045
మదర్సన్‌సుమి	165	191	2509	2233
హెస్టర్‌బయో2	28.83	21.17	311	305
బ్రిటానియా ఇండస్ట్రీస్3	559.13	536.61	4432	4069
రిలయన్స్ పవర్	126	398	2066	2194

1) డివిడెండ్ రూ.14 2) డివిడెండ్ రూ.7 3) రూ.75 డివిడెండ్

కరెంట్ అఫైర్స్



■ ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఏ రాష్ట్రంలోని జామ్‌నగర్‌లో ఆధునిక జంతు రక్షణ, సంరక్షణ, పునరావాస కేంద్రం 'వన్‌తారా'ను ప్రారంభించారు? **జ:** గుజరాత్

■ దేశంలోనే మొదటి ప్రపంచ శాంతి కేంద్రాన్ని

మాదిరి ప్రశ్నలు

ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? (జైన ఆచార్యుడు లోకేశ్ ఆధ్వర్యంలో అహింస విశ్వభారతి స్థాపించిన ఈ కేంద్రం అహింస, ఆధ్యాత్మిక అవగాహన, మానవ విలువలు, సార్వత్రిక సోదర భావాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.) **జ:** గురుగ్రామ్ (హరియాణా)

■ వరల్డ్ వైల్డ్ లైఫ్ డే (ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ ఫైనాన్స్: ఇన్వెస్టింగ్ ఇన్ పీపుల్ అండ్ ప్లానెట్' అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.) **జ:** మార్చి 3

■ దేశంలోనే తొలిసారిగా 'ప్రాజెక్ట్ డాల్ఫిన్'లో భాగంగా నిర్వహించిన నదీతీర డాల్ఫిన్ల మొదటి జనాభా అంచనాల ప్రకారం దేశంలో మొత్తం ఎన్ని డాల్ఫిన్లు ఉన్నాయి? (గంగా, బ్రహ్మపుత్ర, సింధునదీ వ్యవస్థల్లో కలిపి డాల్ఫిన్ల సంఖ్య ఇంత ఉన్నట్లు వెల్లడైంది.) **జ:** 6,327


మరింత సమాచారం

సామాజిక సంబంధాల అధ్యయనం!

సాంఘిక శాస్త్రం స్వభావం - పరిధి

మానవుడికి పరిసరాలతో ఉన్న సంబంధాన్ని తెలియజేయడంతోపాటు గత, వర్తమాన కాలాలకు ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ విషయాలతో ఉండే అనుబంధాన్ని వివరించేదే సాంఘిక శాస్త్రం.

✪ సాంఘిక శాస్త్రం అంటే సమాజ అధ్యయనం-జె.ఎఫ్. ఫారెస్టర్ ✪ చారిత్రక, భౌగోళిక, సాంఘిక విషయాల సంబంధ, అంతర సంబంధాల అధ్యయనమే సాంఘిక శాస్త్రం - జేమ్స్ హేమింగ్స్ ✪ మనిషికి, అతడి సాంఘిక, భౌతిక పర్యావరణాల మధ్య జరిగే చర్యలు, ప్రతిచర్యలకు సంబంధించిందే సాంఘిక శాస్త్రం - జాన్ వి.మైకేల్స్ ✪ విద్యార్థికి కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు విషయ జ్ఞానం, అవగాహన, వినియోగం, నైపుణ్యం, సోదరతత్వం పట్ల అభిరుచి పెంపొందించడమే సాంఘిక శాస్త్రం - డి.ఎస్.కొఠారి



ట్రై మెథడాలజీ సోషల్ స్టడీస్

సాంఘిక శాస్త్రంలోని విభాగాలు: 1) భూగోళశాస్త్రం (Geography). ఇది గ్రీకు భాషకు చెందిన Geo, Graphia పదాల నుంచి ఏర్పడింది. భూమి గురించి వర్ణన అని అర్థం. 2) చరిత్ర (History). గ్రీకు భాషకు చెందిన Historia నుంచి పుట్టింది. నూతన విషయాల అన్వేషణ ద్వారా అభ్యసనం అని అర్థం. 3) పౌరశాస్త్రం (Civics). ఇది Civitas అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. పురం లేదా నగరం అని అర్థం. 4) అర్థశాస్త్రం (Economics). ఇది Okio Narnas అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. గృహ నిర్వహణాధికారం అనేది మౌలికమైన అర్థం.

సాంఘిక శాస్త్రం - స్వభావం: ✪ ఇది విద్యార్థులకు సామాజిక అనుభవాన్ని కలిగిస్తుంది. ✪ సామాజిక జ్ఞానాన్ని ఇస్తుంది. ✪ సామాజిక ప్రమాణాలను తెలియజేస్తుంది. ✪ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతుంది. ✪ సామాజిక, రాజ్యాంగ విలువలను వారిలో పెంపొందిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. సాంఘిక శాస్త్రం అనే పదం ఏ సంవత్సరంలో ఉద్భవించింది?
   1) 1921 2) 1905
   3) 1930 4) 1888
2. మానవుడికి పరిసరాలతో ఉన్న సంబంధాన్ని సమగ్రంగా పరిశీలించి తెలిపే శాస్త్రం?
   1) సాంఘిక శాస్త్రం
   2) రసాయన శాస్త్రం
   3) తత్వ శాస్త్రం 4) భౌతికశాస్త్రం
3. కిందివాటిలో స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న అధ్యయనం?
   1) విజ్ఞానశాస్త్రం 2) గణితశాస్త్రం
   3) సాంఘికశాస్త్రం 4) ఖగోళశాస్త్రం

సమాధానాలు: 1-2; 2-1; 3-3.


రచయిత: యలవర్తి జగదీష్

మరిన్ని వివరాలు

రాశుల్లో మార్పులు పద్ధతిగా జరిగితే..!



నలుగురికి వంట చేయాలంటే కొంత పరిమాణంలో వస్తువులు సరిపోతాయి. అదే నలభై మందికి చేయాలంటే అదే పరిమాణాన్ని పదింతలు పెంచాల్సి ఉంటుంది. ఈ విధంగా రెండు లేదా అంతకంటే ఎక్కువ పరిమాణాలను పోల్చడానికి ఉపయోగించే పద్ధతినే నిష్పత్తి అంటారు. రెండు ఊర్ల మధ్య ఉండే వాస్తవ దూరాన్ని, మ్యాప్‌లో సూచించే దూరంతో పోల్చడానికి ఆ రెండు నిష్పత్తులను సమానమని నిరూపించడమే అనుపాతం. అంటే రెండు పరిమాణాల మధ్య సంబంధం ఒకేలా ఉంటే అనుపాతం ఏర్పడుతుందని అర్థం చేసుకోవచ్చు. గణితంలో అనేక రకాలుగా ఉపయోగపడే ఈ అధ్యాయంపై పట్టు పెంచుకోవాలంటే అభ్యర్థులు నిష్పత్తులను గుర్తించడం, సరళీకరించడం నేర్చుకోవాలి. అనుపాత సమస్యలను పరిష్కరించడం తెలుసుకోవాలి.

నిష్పత్తి - అనుపాతం

★ ఒక వస్తువు విలువను కనుక్కుని దాని ద్వారా కావాల్సిన వస్తువుల విలువను కనుక్కునే పద్ధతిని ఏక వస్తుపద్ధతి అంటారు లేదా మొదటి ప్రమాణం విలువను ముందుగా లెక్కించి, దాని ద్వారా ఇతర ప్రమాణాల విలువలను లెక్కించడాన్ని "ప్రామాణిక పద్ధతి" అంటారు.

★ ఒకే ప్రమాణం ఉన్న రెండు రాశులను సరిపోల్చడాన్ని 'నిష్పత్తి' అంటారు.

★ a, b $(b \neq 0)$ అనే రెండు రాశుల నిష్పత్తి $a \div b$ లేదా $\frac{a}{b}$, a : b గా సూచించవచ్చు.

★ a : b లో 'a' ను పూర్వపదం, bని పరపదం అని అంటారు.

★ ఒక భిన్నంలోని లవ, హారాలను ఒకే సంఖ్యతో గుణించినా లేదా భాగించినా వాటి విలువ మారదు.

★ నిష్పత్తి పూర్వ, పర పదాలను ఒకే శూన్యేతర సంఖ్యతో గుణించినా లేదా భాగించినా ఏర్పడిన నిష్పత్తులను 'సమాన నిష్పత్తులు' లేదా 'సమ నిష్పత్తులు' అంటారు.

★ a : b అనే నిష్పత్తి సామాన్య రూపంలో ఉండాలంటే పూర్వపదం 'a' కు, b కు 1 తప్ప మరే ఉమ్మడి కారణాంకాలు లేకపోతే ఆ నిష్పత్తి కనిష్ఠ రూపంలో ఉందని అంటారు.

★ నిష్పత్తిలో పదాల వరుస ముఖ్యమైంది. 4 : 5, 5 : 4 విభిన్నాలు.

అనుపాతం (Proportion)

★ నిష్పత్తుల సమానత్వాన్ని 'అనుపాతం' అంటారు.

★ రెండు నిష్పత్తులు a : b, c : d సమానమైతే a : b :: c : d లేదా a : b = c : d గా రాస్తాం.

★ a : b = c : d అయితే a, b, c, d లు అనుపాతంలో ఉన్నాయని అంటారు.

a : b = c : d

అంత్యముల లబ్ధం = మధ్యముల లబ్ధం

$ad = bc$

$d = \frac{bc}{a}$ (d ను 4వ అనుపాతం అంటారు)

★ a : b = b : c అయితే a, b, c లు అనుపాతంలో ఉన్నాయని అర్థం.

$b^2 = ac$

$b = \sqrt{ac}$ (b ను అనుపాత మధ్యమం అంటారు)

a, b, c లు అనుపాతంలో ఉంటే c ను 'తృతీయ అనుపాతం' అంటారు.

$c = \frac{b^2}{a}$

నోట్: అనుపాతాన్ని : : (is as to) అనే గుర్తుతో సూచిస్తారు. : : ను మొదటగా సూచించింది - ఆట్రాడ్ (1628).

అనులోమానుపాతం (Directly Proportional)

★ ఏవైనా రెండు రాశుల్లో ఒక రాశిలోని పెరుగుదల లేదా తగ్గుదల రెండో రాశిలోని పెరుగుదల లేదా తగ్గుదలను ఒక నిర్ణీత పద్ధతిలో పరిణమిస్తే ఆ రెండు రాశులు క్రమంగా అనులోమానుపాతంలో ఉన్నాయని అంటారు.

★ రెండు రాశుల మధ్య నిష్పత్తి ఎల్లప్పుడూ ఒక స్థిరాంకం అయితే ఆ రెండు రాశులు అనులోమానుపాతంలో ఉంటాయి. ★ రెండు రాశులు x, y లు అనులోమానుపాతంలో ఉంటే $x \propto y$ గా రాస్తాం.

★ x, y లు అనులోమానుపాతంలో ఉంటే $\frac{x}{y} = K$ అవుతుంది.

మరిన్ని వివరాలు

విలోమానుపాతం (Inversely Proportional): ★ ఏవైనా రెండు రాశుల్లో ఒక రాశిలోని పెరుగుదల రెండో రాశిలోని తగ్గుదలకు, ఒక రాశిలోని తగ్గుదల రెండో రాశిలోని పెరుగుదలకు ఒక నిర్ణీత పద్ధతిలో పరిణమిస్తే ఆ రెండు రాశులు క్రమంగా విలోమానుపాతంలో ఉంటాయి.

★ రెండు రాశుల మధ్య లబ్ధం ఎల్లప్పుడూ ఒక స్థిరాంకం అయితే ఆ రెండు రాశులు విలోమానుపాతంలో ఉంటాయి.

2025 మెగా డీఎస్సీ
కంటెంట్ - గణితం



★ రెండు రాశులు x, y లు విలోమానుపాతంలో ఉంటే $x \propto \frac{1}{y}$ గా రాస్తాం

★ x, y లు విలోమానుపాతంలో ఉంటే $xy = K$ అవుతుంది.

మిశ్రమ అనుపాతం (Compound Proportional)

★ కొన్ని సందర్భాల్లో ఒక రాశిలో మార్పు రెండు లేదా అంతకంటే ఎక్కువ రాశుల్లోని మార్పులతో ఏదో ఒక అనుపాతంలో ఉంటే దాన్ని మిశ్రమ అనుపాతం అంటారు.

నోట్: $M_1D_1T_1W_2 = M_2D_2T_2W_1$

నోట్: 1 డజను = 12 వస్తువులు

1 స్కోరు = 20 వస్తువులు

1 దస్తా = 24 వస్తువులు (2 డజన్లు)

1 గ్రోసు = 144 వస్తువులు (12 డజన్లు)

1 రీము = 480 కాగితాలు (20 దస్తాలు)

మాదిరి ప్రశ్నలు

1. 16 కుర్చీల ధర రూ.3,600 అయితే రూ.4,500లకు ఎన్ని కుర్చీలు వస్తాయి?
   1) 15 2) 18 3) 22 4) 20
2. స్థిరవేగంతో వెళుతున్న కారు 3 గంటల్లో 180 కి.మీ. ప్రయాణిస్తుంది. అదే కారు అంతే వేగంతో 420 కి.మీ. దూరాన్ని ప్రయాణించడానికి ఎంత సమయం పడుతుంది?
   1) 4 2) 7 3) 6 4) 8
3. ఒక కట్టలో 8 రీముల కాగితాలున్నాయి. వాటి బరువు 96 కేజీలు, అయితే 10 దస్తాల కాగితాల బరువు ఎంత?
   1) 4 2) 6 3) 5 4) 8
4. 8, 10, 11, 14 అనే సంఖ్యల నుంచి ఏ కనిష్ఠ సంఖ్యను తీసివేస్తే అవి అనుపాతంలోకి వస్తాయి?
   1) 4 2) 3 3) 2 4) 1
5. $3\frac{1}{5}$, x, $7\frac{1}{2}$, $12\frac{1}{2}$ సంఖ్యలు అనుపాతంలో ఉంటే x విలువ ఎంత?
   1) $3\frac{1}{5}$ 2) $5\frac{1}{3}$ 3) $6\frac{1}{5}$ 4) $5\frac{1}{6}$
6. x : y = 2 : 3 అయితే (5x + 2y) : (4x + 7y) కి సమానమైంది?
   1) 16 : 29 2) 29 : 16
   3) 63 : 61 4) 39 : 61
7. 5 : 6 వర్గాల నిష్పత్తి, 25 : 42 యొక్క విలోమ నిష్పత్తుల బహుళ నిష్పత్తి ఎంత?
   1) 5 : 7 2) 6 : 7 3) 7 : 5 4) 7 : 6
8. a : b = 3 : 4, b : c = 7 : 8, c : d = 5 : 6 అయితే a : c విలువ?
   1) 21 : 28 2) 21 : 32
   3) 32 : 21 4) 28 : 35
9. కుమార్ 3 నెలలకు రూ.15000 లు సంపాదిస్తున్నాడు. ప్రతి నెల సంపాదన సమానమైతే ఎన్ని నెలల్లో అతడు రూ.95000 లు సంపాదిస్తాడు?
   1) 17 2) 18 3) 19 4) 21
10. ఒక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 1200 మంది సైనికులకు 28 రోజులకు సరిపోయే ఆహార పదార్థాలున్నాయి. 4 రోజుల తర్వాత కొంతమంది సైనికులు వేరొక చెక్‌పోస్టుకు బదిలీ కాగా, మిగిలిన వారికి 32 రోజులకు ఆహారపదార్థాలు సరిపోతాయి. అయితే ఎంతమంది సైనికులు బదిలీ అయ్యారు?
    1) 150 2) 200 3) 250 4) 300
11. x = 6y అయితే x, y లు ఒకదానికొకటి
    1) అనులోమానుపాతంలో ఉంటాయి
    2) విలోమానుపాతంలో ఉంటాయి
    3) అనులోమానుపాతం, విలోమానుపాతంలో ఉంటాయి
    4) కొన్నిసార్లు అనులోమానుపాతంలో, కొన్నిసార్లు విలోమానుపాతంలో ఉంటాయి.
12. (x − 3) మంది పురుషులు (2x + 1) రోజుల్లో చేసే పని, (2x + 1) మంది పురుషులు (x + 4) రోజుల్లో చేసే పని నిష్పత్తి 3 : 10 అయితే x విలువ ఎంత?
    1) 12 2) 9 3) 3 4) 6
13. 195 మంది పురుషులు రోజుకు 10 గంటలు చొప్పున పనిచేస్తే, 20 రోజుల్లో ఒక పనిని పూర్తిచేస్తారు. అదే పనిని రోజుకు 13 గంటల చొప్పున పనిచేస్తూ 15 రోజుల్లో పూర్తిచేయడానికి ఎంత మంది పురుషులు అవసరమవుతారు?
    1) 150 2) 200 3) 250 4) 280

సమాధానాలు: 1-4; 2-2; 3-2; 4-3; 5-2; 6-1; 7-4; 8-2; 9-3; 10-4; 11-1; 12-4; 13-2.



రచయిత: సి. మధు

పరిశోధనలకు.. పురోగతికి పునాది!

దేశ అభివృద్ధికి సహజ వనరులు, మానవ వనరులతోపాటు శాస్త్ర, సాంకేతికతలు కూడా ఎంతో అవసరం. వ్యవసాయం నుంచి రక్షణ, అంతరిక్షం వరకు టెక్నాలజీలో ముందున్న దేశాలే అన్ని రంగాల్లో శక్తిమంతంగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం నుంచే భారతదేశం శాస్త్ర సాంకేతికతలకు ప్రాధాన్యమిస్తూ వస్తోంది. గత యాభై ఏళ్లలో ఎన్నో ప్రయోగశాలలు, పరిశోధనా, విద్యా, సాంకేతిక సంస్థలను స్థాపించి గణనీయ ప్రగతి సాధించింది. అందుకు దోహదపడేలా క్రమానుగతంగా రూపొందించిన శాస్త్ర, సాంకేతిక విధానాలు, టెక్నాలజీ మిషన్‌ల గురించి అభ్యర్థులు పోటీ పరీక్షల కోణంలో చదువుకోవాలి. ఒక్కో విధానంలోని ముఖ్యాంశాలను, దేశ వ్యాప్తంగా నెలకొన్న పలు పరిశోధనా సంస్థల వివరాలు, ప్రాంతాలను తెలుసుకోవాలి.

భారతదేశంలో శాస్త్ర సాంకేతికత అభివృద్ధి

1. భారతదేశం ప్రతిపాదించిన అనేక సాంకేతిక విధానాలు ఏవిధంగా ఉపయోగపడతాయి?
   ఎ) ఆర్థికాభివృద్ధికి బి) పరిశోధనకు
   సి) నూతన ఆవిష్కరణలకు డి) నైపుణ్యాభివృద్ధికి
   1) ఎ, బి, సి 2) బి, సి
   3) ఎ, బి, సి, డి 4) బి, డి
2. 1958 నుంచి 2013 వరకు ప్రకటించిన సాంకేతిక విధానాలను, వాటి సంవత్సరాలతో జతపరచండి.
   ఎ) సైంటిఫిక్ పాలసీ రెజల్యూషన్ 1) 1983
   బి) టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్ 2) 1958
   సి) సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ 3) 2013
   డి) సైన్స్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ పాలసీ 4) 2003
   1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-3, బి-2, సి-4, డి-1
3. సాంకేతిక విధాన తీర్మానం (సైంటిఫిక్ పాలసీ రెజల్యూషన్) గురించి కింది వాటిలో సరికాని వాటిని గుర్తించండి.
   ఎ) దీన్ని 2013లో ప్రతిపాదించారు.
   బి) ఇది నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రారంభించారు.
   సి) దేశాభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రధానమని దీనిలో భావించారు.
   1) ఎ, బి 2) ఎ
   3) బి 4) సి
4. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) భారతదేశ మొదటి సాంకేతిక విధానం - సైంటిఫిక్ పాలసీ రెజల్యూషన్.
   బి) సాంకేతిక విధాన ప్రకటనను 1983లో ప్రతిపాదించారు.
   సి) నూతన సాంకేతిక విధానాన్ని ఇటీవల 2025 లో ప్రతిపాదించారు.
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) సి
5. కింది వాక్యాలను పరిశీలించండి.
   ఎ) సాంకేతిక విధాన తీర్మానాన్ని 1958లో ప్రతిపాదించారు.
   బి) సాంకేతిక విధాన ప్రకటన - 1983లో స్వదేశీ సాంకేతికత అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.
   సి) స్వదేశీ సాంకేతికత అభివృద్ధి వల్ల స్థానిక వనరులు, మానవ వనరులు సమర్థంగా ఉపయోగపడతాయి.
   పై వాక్యాల్లో శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి సంబంధించి సరైన వాటిని గుర్తించండి.
   1) ఎ 2) బి
   3) బి, సి 4) ఎ, బి, సి
6. 1958 సాంకేతిక విధాన తీర్మానం వల్ల భారతదేశంలో కింది ఏ అనుకూల ప్రభావాలు కలిగాయి?
   ఎ) దేశంలో వివిధ శాస్త్రీయ సంస్థలు, జాతీయ ప్రయోగశాలలు ఏర్పడ్డాయి.
   బి) ఉన్నత విద్య, పరిశోధన అభివృద్ధిలో గట్టి పునాది ఏర్పడింది.
   సి) అణుబాంబులు తయారుచేసే సామర్థ్యం పెరిగింది.
   డి) సమాచార సాంకేతిక రంగంలో గణనీయమైన పురోగతి సాధ్యమైంది.
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) బి, డి
7. 1983 సాంకేతిక విధాన ప్రకటన గురించి కింది వాక్యాల్లో సరైంది?
   ఎ) దీనిలో బయోటెక్నాలజీ, సమాచార సాంకేతికతకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు.
   బి) ఈ విధానం ఫలితంగా సాంకేతిక అభివృద్ధి నిధి ఏర్పాటైంది.
   సి) 'టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ ఫోర్‌కాస్టింగ్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (టీఐఎఫ్ఏసీ)' ఏర్పడింది.
   1) బి, సి 2) ఎ, బి
   3) ఎ, బి, సి 4) ఏదీకాదు
8. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) శాస్త్ర, సాంకేతిక విధానం అనేది భారతదేశ మొదటి సాంకేతిక విధానం.
   బి) 2010 - 2020 ను నూతన ఆవిష్కరణల దశాబ్దంగా ప్రకటించారు.
   సి) శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణల విధానాన్ని 2013లో ప్రకటించారు.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) బి, సి 4) ఎ, సి
9. శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణల విధానం – 2013 గురించి కింది వాటిలో సరైనవి?
   ఎ) దీనిలో మొదటగా ఆవిష్కరణ (ఇన్నోవేషన్) అనే పదాన్ని చేర్చారు.
   బి) సాంకేతికత అభివృద్ధిలో భారత్ ప్రపంచంలో తొలి ఐదు స్థానాల్లో ఒకటిగా ఉండాలని నిర్ణయించారు.
   సి) ఈ విధానం వల్ల భారతదేశం అనేక అంతర్జాతీయ శాస్త్రీయ ప్రయోగాల్లో పాలుపంచుకుంది.
   1) ఎ, బి, సి 2) బి, సి
   3) ఎ 4) బి
10. భారతదేశంలో అమలవుతున్న వివిధ టెక్నాలజీ మిషన్‌ల ప్రాముఖ్యత ఏమిటి?



సైన్స్ అండ్ టెక్నాలజీ

   ఎ) నిర్ణీత రంగంలో సాంకేతికత అభివృద్ధి
   బి) దేశ ఆర్థికాభివృద్ధి
   సి) ఆరోగ్యం, వ్యవసాయం లాంటి వాటిలో పురోగతి సాధించడం
   డి) సమాచార సాంకేతికత, వ్యవసాయరంగ ఉత్పత్తులను ఎగుమతి చేయడం
   1) ఎ, డి 2) ఎ, బి, సి
   3) సి, డి 4) బి, డి
11. కింది వాటిలో ఏ టెక్నాలజీ మిషన్లు ప్రస్తుతం అమలవుతున్నాయి?
    ఎ) టెక్నాలజీ మిషన్ ఆన్ కాటన్
    బి) టెక్నాలజీ మిషన్ ఆన్ ఆయిల్ సీడ్స్
    సి) డిజిటల్ ఇండియా మిషన్
    డి) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్
    ఇ) అటల్ ఇన్నోవేషన్ మిషన్
    1) ఎ, బి 2) ఎ, సి
    3) సి, డి, ఇ 4) ఎ, డి, ఇ
12. భారతదేశంలో అనేక రంగాల్లో పరిశోధన చేస్తున్న కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) సంస్థకు ఎవరు అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు?
    ఎ) రాష్ట్రపతి బి) ఉపరాష్ట్రపతి
    సి) ప్రధానమంత్రి
    డి) కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి
    ఇ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ డైరెక్టర్
    1) ఎ, బి 2) ఎ, ఇ 3) సి, డి 4) బి, సి
13. సీఎస్ఐఆర్ సంస్థకు చెందిన కింది పరిశోధనశాలలు, అవి ఉన్న ప్రదేశాలను సరైన క్రమంలో అమర్చండి.
    ఎ) సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 1) మైసూర్
    బి) సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 2) లఖ్‌నవూ
    సి) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రిసెర్చ్ 3) చెన్నై
    డి) సెంట్రల్ లెదర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 4) ధన్‌బాద్
    ఇ) సెంట్రల్ రోడ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - 5) న్యూదిల్లీ
    1) ఎ-2, బి-1, సి-3, డి-4, ఇ-5
    2) ఎ-5, బి-3, సి-4, డి-2, ఇ-1
    3) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
    4) ఎ-1, బి-3, సి-4, డి-2, ఇ-5
14. సీఎస్ఐఆర్‌కు చెందిన ఏ పరిశోధనా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి?
    ఎ) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ
    బి) సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
    సి) నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి



15. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్‌కు సంబంధించిన ఏ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, పెదవేగిలో ఉన్నాయి?
    ఎ) కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రం
    బి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రిసెర్చ్
    సి) సెంట్రల్ సిట్రస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
    డి) సెంట్రల్ ఆగ్రోఫారెస్ట్రీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, డి
16. కింది పరిశోధనా సంస్థలు అవి ఉన్న నగరాలను సరైన క్రమంలో అమర్చండి.
    ఎ) నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 1) సిమ్లా
    బి) సెంట్రల్ పొటాటో రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 2) కటక్
    సి) సెంట్రల్ ఎరిడ్ జోన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 3) భోపాల్
    డి) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ 4) జోధ్‌పుర్
    ఇ) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రిసెర్చ్ 5) నాగ్‌పుర్
    1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
    2) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-5
    3) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
    4) ఎ-5, బి-3, సి-2, డి-1 ఇ-4
17. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్‌కు చెందిన ఏ పరిశోధనా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి?
    ఎ) సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ)
    బి) నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం)
    సి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్
    డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రిసెర్చ్
    ఇ) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్
    1) ఎ, బి, సి 2) బి, సి, డి
    3) సి, డి, ఇ 4) ఎ, బి, సి, డి, ఇ
18. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) కు చెందిన ఏ సంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఉంది?
    ఎ) ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) - న్యూదిల్లీ
    బి) నేషనల్ డెయిరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ) - కర్నాల్ (హరియాణా)
    సి) సెంట్రల్ వెటర్నిటీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - ఇజత్ నగర్ (ఉత్తర్‌ప్రదేశ్)
    డి) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ - ముంబయి
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
    3) సి, డి 4) ఎ, సి
19. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) కు చెందిన ఏ సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి?
    ఎ) నేషనల్ ఎనిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రిసెర్చ్ (ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్)
    బి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్- ఎన్ఐఎన్
    సి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ ట్యుబర్‌క్యులోసిస్ (ఎన్ఐఆర్‌టీ)
    డి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రిసెర్చ్ (ఎన్ఐసీపీఆర్)
    1) సి, డి 2) బి, సి
    3) ఎ, బి 4) సి, డి


రచయిత: డాక్టర్ బి. నరేష్

సమాధానాలు

1-3; 2-1; 3-2; 4-1; 5-4; 6-1; 7-3; 8-2; 9-1; 10-2; 11-3; 12-3; 13-1; 14-4; 15-1; 16-2; 17-4; 18-1; 19-3.

గ్రీకుల ప్రాబల్యం తగ్గించి...
అఖండ భారతాన్ని ఆవిష్కరించి!


జునాగఢ్ శాసనం

భారతదేశంలో తొలి మహాసామ్రాజ్యాన్ని నెలకొల్పిన వారు మౌర్యులు. వీరు సమస్త భారత ఉపఖండాన్ని పరిపాలించారు. గ్రీకుల ప్రాబల్యాన్ని తగ్గించి, వారి ప్రాంతాలను స్వాధీనం చేసుకుని సువిశాల భారతాన్ని ఏకీకృతం చేశారు. అనేక పాలనా సంస్కరణలు వీరితోనే మొదలయ్యాయి. వీరి పాలన గురించి తెలుసుకోవడానికి ఇండికా, అర్థశాస్త్రం లాంటి గ్రంథాలతో పాటు పలువురి ఇతర రచనలు ఉపయోగపడ్డాయి. వీరి చరిత్రకు సంబంధించిన ఆధారాలు పలు శాసనాల్లో లభించాయి. పోటీపరీక్షార్థులు మౌర్య సామ్రాజ్యానికి సంబంధించిన చారిత్రక ఆధారాలు, సాహిత్యం, శాసనాలపై అవగాహన కలిగి ఉండాలి.


సోపార శాసనం

మౌర్య సామ్రాజ్యం

పోటీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

మౌర్యుల చరిత్రకు ఆధారాలు

మౌర్యుల చరిత్రను అధ్యయనం చేసేందుకు అనేక ఆధారాలు ఉన్నప్పటికీ, వాటిలో విదేశీ, స్వదేశీ సాహిత్యం, అశోకుడి శాసనాలు అత్యంత ముఖ్యమైనవి.

విదేశీ సాహిత్యం

అలెగ్జాండర్ సేనాని నియార్కస్ భారతదేశంలో ధర్మశాస్త్రాలను గ్రంథస్తం చేయలేదని, వాటిని స్మృతిపథంలో భద్రపరిచారని తెలియజేశాడు. కాబట్టి భారతదేశంలోని ధర్మశాస్త్రాలను స్మృతులు అంటారు.

ఉదా: యజ్ఞవల్క్యస్మృతి, మనుస్మృతి

- గ్రీకు, రోమన్, సింహళ, టిబెటన్, చైనీయుల గ్రంథాలు మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి ఎంతగానో సహకరిస్తాయి.
- మెగస్తనీస్ గ్రీకులో రాసిన ఇండికా (క్రీ.పూ.300) మౌర్యుల సమాచారాన్ని తెలియజేస్తుంది. సిరియా పాలకుడు సెల్యూసిడ్ వంశస్థుడైన సెల్యూకస్ నికెటర్ తన రాయబారిగా మెగస్తనీస్‌ను చంద్రగుప్తుడి ఆస్థానానికి పంపాడు. ఆ కాలంలో మౌర్యుల సైనిక, గ్రామ, పట్టణ పాలన పరిస్థితులను తన గ్రంథంలో వివరించాడు. కానీ ఇందులో కొన్ని అసంబద్ధ వ్యాఖ్యానాలు ఉన్నట్లు చరిత్రకారుల అభిప్రాయం.
- స్ట్రాబో గ్రీకులో రాసిన 'Geographica' మౌర్యుల గురించి కొంత సమాచారాన్ని తెలియజేస్తుంది. సెల్యూకస్ నికెటర్ కుమార్తె హెలెనాను చంద్రగుప్త మౌర్యుడు వివాహం చేసుకున్నట్లు ఈ గ్రంథం తెలుపుతుంది.
- జస్టిన్ గ్రీకు భాషలో రాసిన 'An Epitome' అనే గ్రంథంలో సాంద్రకోటస్ (గ్రీకు గ్రంథాల్లో చంద్రగుప్తుడిని సాంద్రకోటస్ అని పిలిచేవారు) వాయవ్య భారతదేశాన్ని జయించి, అలెగ్జాండర్ నియమించిన గ్రీకు గవర్నర్లను అంతమొందించాడనే సమాచారముంది.
- అరైన్ గ్రీకులో మరొక Indica అనే గ్రంథాన్ని రచించాడు. దీనిలో మౌర్యుల ప్రస్తావన తీసుకువచ్చాడు.
- రోమ్ నగరవాసి ప్లినీ లాటిన్‌లో రాసిన 'Natural History' అనే గ్రంథంలో మౌర్యులకు 6,00,000 కాల్బలం, 30,000 అశ్విక దళం, 9000 గజదళం, 8,000 రథబలం ఉండేవని వివరించాడు.
- శ్రీలంక బౌద్ధగ్రంథాలైన మహావంశ, దీపవంశ, కులవంశ, వంశతపకాసిని అనే పాళీ గ్రంథాలు మౌర్యుల సమాచారాన్ని తెలియజేస్తాయి. మహావంశ గ్రంథం ప్రకారం అశోకుడి కుమారుడు మహేంద్ర, కుమార్తె సంఘమిత్ర శ్రీలంకలో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టి ప్రచారం చేశారు.
- ప్రాచీన కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికులు మౌర్యుల గురించి కొంత సమాచారమిచ్చారు. క్రీ.శ. 5వ శతాబ్దంలో వచ్చిన ఫాహియాన్ మౌర్యుల కట్టడాల గొప్పదనాన్ని వివరిస్తూ రాశాడు. క్రీ.శ. 7వ శతాబ్దంలో వచ్చిన హుయాన్‌త్సాంగ్ రాసిన సి-యు-కి గ్రంథంలో ఉపగుప్త అనే ఎనిమిదేళ్ల బాలసన్యాసి ప్రభావంతో అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించాడని తెలియజేశాడు. అయితే ఆ బాలుడి పేరు నిగ్రోద అని మహావంశ గ్రంథం తెలియజేస్తుంది.


రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

స్వదేశీ సాహిత్యం

కౌటిల్యుడి అర్థశాస్త్రం మౌర్యుల పరిపాలనను తెలియజేస్తుంది. ఇతడిని 'ఇండియన్ మాకియవెల్లి' అని పిలుస్తారు. 1905లో మైసూరులోని ఒక ప్రాచీన గ్రంథాలయంలో ఆర్. శ్యామశాస్త్రి అనే పండితుడు అర్థశాస్త్ర కావ్యాన్ని కనుక్కున్నాడు. ఇది సంస్కృత భాష, గ్రంథ లిపిలో లభించింది.

- అర్థశాస్త్రంలో 15 అధికరణాలుండగా, ఒక్కొక్క అధికరణ ఒక్కొక్క పరిపాలనా అంశాన్ని వివరిస్తుంది. అయితే ఈ గ్రంథంలో ఎక్కడా మౌర్యుల ప్రస్తావన లేకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది.
- క్రీ.శ. 5వ శతాబ్దంలో విశాఖదత్తుడు రాసిన ముద్రారాక్షసం మౌర్య సామ్రాజ్య స్థాపనను తెలియజేస్తుంది. చాణుక్యుడు, చంద్రగుప్తుడు కలిసి ధననందుడిని ఓడించి, నందవంశాన్ని నిర్మూలించి, మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించారని ఈ గ్రంథం తెలియజేస్తోంది. ఇదే సమాచారం విష్ణుపురాణం, మహావంశ, పరిశిష్టపర్వన్ అనే గ్రంథాల్లోనూ ఉంది.
- భట్టబాణుడి హర్షచరిత మౌర్య సామ్రాజ్య పతనాన్ని వివరిస్తుంది. చివరి మౌర్య చక్రవర్తి బృహద్రదుడిని అతడి సేనాపతి పుష్యమిత్రశుంగుడు చంపి మౌర్యవంశాన్ని అంతం చేశాడని తెలుపుతోంది. విష్ణుపురాణంలో కూడా ఇదే విషయం ఉంది.
- 12వ శతాబ్దంలో కల్హణుడు రాసిన రాజతరంగిణి కశ్మీర్ చరిత్రను తెలియజేస్తూ, మౌర్యులను కూడా ప్రస్తావిస్తుంది. దీని ప్రకారం శ్రీనగర్ అనే నగరాన్ని అశోకుడు నిర్మించాడని, అశోకుడి తర్వాత సింహాసనం అధిష్ఠించిన అతడి కుమారుడు జలౌక శైవమతస్థుడని వివరిస్తోంది.
- జైన కవి హేమచంద్రుడు రాసిన పరిశిష్టపర్వన్ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడు శ్రావణబెళగొళలో సల్లేఖన వ్రతాన్ని ఆచరించి మరణించినట్లు సమాచారముంది.

అశోకుడి శాసనాలు

అశోకుడు తన ఆజ్ఞలను శిలలపై చెక్కించి, వాటిని అనుసరించాల్సిందిగా ప్రజలను ఆదేశించేవాడు. వీటిని రాజాజ్ఞలు అనేవారు. మౌర్యుల చరిత్ర అధ్యయనానికి ఈ శాసనాలే అత్యంత కీలకం.

- ఇప్పటివరకు భారత ఉపఖండంలోని 47 ప్రాంతాల్లో 181 శాసనాలు లభించాయి. ఈ శాసనాల్లో అశోకుడు మూడు భాషలు (ప్రాకృతం, గ్రీకు, అరబిక్), నాలుగు లిపులు (బ్రాహ్మి, ఖరోష్ఠి, గ్రీకు, అరబిక్) ఉపయోగించారు. అశోకుడి శాసనాల్లో అతడి బిరుదులు దేవానాంప్రియ, ప్రియదర్శి అని కనిపిస్తుంది. కానీ మస్కి (కర్ణాటక), నిత్తూరు (కర్ణాటక), ఉడెగోళం (కర్ణాటక), గుజ్జర (మధ్యప్రదేశ్)లో దొరికిన శాసనాల్లో మాత్రమే 'అశోక మహారాజ' అనే పూర్తిపేరు ఉంటుంది. అశోకుడి శాసనాలను 3 రకాలుగా విభజించారు. అవి:

1) శిలా శాసనాలు: కొండలపై నేరుగా లిఖించిన శాసనాలను శిలాశాసనాలు అంటారు. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఇవి లభ్యమయ్యాయి.

- పశ్చిమ్ బెంగాల్‌లోని 'భబ్రు' శిలాశాసనంలో అశోకుడు బౌద్ధమతంపై తన విశ్వాసాన్ని ప్రకటించాడు. ఇందులో 'బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి' అనే త్రిశరణ్యాలను ప్రస్తావించాడు.
- అశోకుడి శిలాశాసనాల్లో 14 ప్రధాన శిలాశాసనాలు ముఖ్యమైనవి. ఈయన ఒకే శిలపైన 14 శాసనాలను లిఖించారు. ఎర్రగుడి (కర్నూలు - ఆంధ్రప్రదేశ్), సోపార (మహారాష్ట్ర), గిర్నార్/జునాగఢ్ (గుజరాత్), కల్సి (ఉత్తరాఖండ్), ధౌలి (ఒడిశా), జౌగడ (ఒడిశా), మన్సేర, షాబాజ్‌గిర్ (పాకిస్థాన్) ప్రాంతాల్లో ఇవి లభ్యమయ్యాయి.

2) స్తంభ శాసనాలు: అశోకుడు భారీ కొండరాళ్లను గుండ్రటి స్తంభాలుగా తొలిచి, వాటిని నగరాల మధ్యలో ఏర్పాటు చేసి, వాటిపై శాసనాలు చెక్కించాడు.

- రాంపూర్వ (బిహార్), లారియనందనఘర్ (బిహార్), లౌరియ అరరాజ్ (బిహార్), కౌశాంబి (అలహాబాద్), రుమ్మిందై (లుంబిని), ఢిల్లీ-మీరట్, ఢిల్లీ-తోప్రా మొదలైన ప్రాంతాల్లో అశోకుడి స్తంభ శాసనాలు లభించాయి.
- అలహాబాద్‌లో అశోకుడు వేసిన స్తంభ శాసనంపైనే సముద్రగుప్తుడు, మొగల్ చక్రవర్తి జహంగీర్ వారి శాసనాలను వేయడం విశేషం.
- అశోకుడు మీరట్ (ఉత్తర్‌ప్రదేశ్), తోప్రా (హరియాణా)లో వేసిన స్తంభ శాసనాలను 14వ శతాబ్దంలో సుల్తాన్ ఫిరోజ్ తుగ్లక్ ఢిల్లీకి తరలించాడు.
- రుమ్మిందై (బుద్ధుడి జన్మస్థలమైన లుంబిని) స్తంభ శాసనంలో అశోకుడు లుంబిని వాసులకు గౌరవసూచకంగా పన్నుల్లో రాయితీలు కల్పించినట్లు సమాచారముంది. మౌర్యుల పన్నుల వ్యవస్థ గురించి తెలుసుకోవడానికి ఈ శాసనం ఉపయోగపడుతుంది.

3) గుహాలయ శాసనాలు: అశోకుడి ఏకైక గుహాలయ శాసనం గయ సమీపంలో బారబర అనే ప్రాంతంలో లభించింది.

- ఈ శాసనం ప్రకారం అశోకుడు బారబరలో 4 గుహలు నిర్మించి అజీవకులకు దానం చేశాడు. ఇవి భారతదేశంలో నిర్మించిన తొలి గుహాలయాలు. వీటి పేర్లు సుదామ, లోమసరుషి, కర్ణచౌపార, గోపిక.

645 Word of the Day

Withhold

Telugu meaning: అట్టిపెట్టుకోవడం, తిరిగి ఇవ్వకపోవడం

English meaning: The word withhold (విత్‌హోల్డ్) is a verb that describes holding back or refusing to give something.

Synonyms: Retain, Hold

Antonyms: Release, Grant

Usage: **1.** The company decided to withhold bonuses until the project was completed successfully.

2. She chose to withhold her true feelings during the meeting to maintain professionalism.

కరెంట్ అఫైర్స్



పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైషే మహమ్మద్, లష్కరే తయ్యిబా ఉగ్రస్థావరాలపై భారత సైన్యం 2025 మే 7న (మంగళవారం అర్ధరాత్రి దాటాక) 'ఆపరేషన్ సిందూర్' అనే పేరుతో దాడులు నిర్వహించింది. పాక్, పీఓకేలోని మొత్తం 9 ఉగ్రస్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసి వాటిని ధ్వంసం చేసింది.

- ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీతో పాటు ఆర్మీ సిగ్నల్ కోర్‌కు చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ, వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాకు తెలిపారు. చరిత్రలో మొదటిసారిగా సైనిక ఆపరేషన్ వివరాలను మహిళా అధికారులు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి ప్రతిదాడిగా భారత సైన్యం పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఈ దాడులు నిర్వహించింది.



భారత వన్డే, టెస్ట్ క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మ మే 7, 2025న టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గతేడాది భారత్ టీ 20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఆ ఫార్మాట్‌కూ గుడ్‌బై చెప్పాడు. రెండు ఫార్మాట్ల నుంచి రిటైర్‌మెంట్ పలికిన హిట్‌మాన్ ఇకపై వన్డేల్లో మాత్రమే ఆడనున్నాడు. టెస్ట్ అరంగ్రేట మ్యాచ్‌లోనే (వెస్టిండీస్‌పై) సెంచరీ చేసిన ఆటగాళ్లలో రోహిత్ ఒకరు. ఈయన సారథ్యంలో టీమిండియా టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచింది

మూడీస్ రేటింగ్స్ భారత జీడీపీ వృద్ధి అంచనాలను 2025కు గానూ 6.5% నుంచి 6.3%కి తగ్గించింది. అమెరికా వాణిజ్య విధానాల్లో అనిశ్చితి, టారిఫ్‌ల ప్రభావం, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో వృద్ధిపై ప్రభావం ఉండొచ్చని తెలిపింది. అయితే 2026 వృద్ధి అంచనా మాత్రం 6.5% గానే ఉంటుందని అభిప్రాయపడింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఎంబీఏ ప్రవేశాలు

ఉత్తర్‌ప్రదేశ్, అలహాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 2025-26 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. దరఖాస్తు ఫీజు రూ.1200. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 18 మే 2025.

పీహెచ్‌డీ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్- 2025 విద్యా సంవత్సరానికి ఫుల్‌టైం, పార్ట్‌టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ 4 జూన్ 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులు/ ప్రవేశాలకు నేడే (మే 10) చివరి తేదీ

- ఎన్ఐ-ఎంఎస్ఎంఈ హైదరాబాద్‌లో 66 మేనేజర్ పోస్టులు. మేనేజ్‌మెంట్/ కామర్స్ లేదా ఇంజినీరింగ్ విభాగాల్లో డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో 18 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు. డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో 200 టెక్నీషియన్ పోస్టులు. మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత, అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారు అర్హులు.
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 35 పోస్టులు. పీజీ, బీఈ/బీటెక్, డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మెగా డీఎస్సీ 2025 ప్రత్యేకం

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం

వికాసంపై అనువంశికత, పరిసరాల ప్రభావం

1. కింది వాటిలో 'ప్రజ్ఞా స్థాయి' తక్కువగా ఉండటం అనేది దేనికి సంబంధించింది?
1) పూర్వ బాల్యదశలో తప్పించుకోవాల్సిన విపత్తు
2) పూర్వ బాల్యదశలో సాధించాల్సిన కృత్యం
3) ఉత్తర బాల్యదశలో తప్పించుకోవాల్సిన విపత్తు
4) ఉత్తర బాల్యదశలో సాధించాల్సిన కృత్యం

2. మిల్డ్రెడ్, రూత్ అనే కవలల్లో కూడా ప్రజ్ఞాపాటవాల్లో తేడాలు ఉన్నట్లు కనుక్కున్న శాస్త్రవేత ఎవరు?
1) డబ్ల్యూ.సి. బాగ్లే 2) గోర్డాన్
3) ఫ్రీమన్ 4) జె.బి.వాట్సన్

3. పూర్వ బాల్యదశలో అధిగమించాల్సిన కృత్యాలకు సంబంధించి సరికానిది గుర్తించండి.
1) పఠన సంసిద్ధతలను కలిగి ఉండటం
2) సహచరులతో సఖ్యతగా మెలగటం
3) తప్పొప్పుల మధ్య భేదాలను అవగాహన చేసుకోవడం
4) ఘన ఆహారం తీసుకోవడం

4. కింది వాటిలో విశ్లేషించడం అనేది దేనికి సంబంధించింది?
1) బహిర్గత ప్రవర్తన 2) అంతర్గత ప్రవర్తన
3) ధారణ 4) అవధానం

5. పడవ నడిపే చిన్నారులను, జిప్సీ పిల్లలను గమనించి వారిలో చిన్న వయసులో ఉన్నప్పుడు ప్రజ్ఞాలబ్ధి ఎక్కువగా, పెరిగేకొద్దీ తక్కువగా ఉందని తెలిపింది ఎవరు?
1) వాట్సన్ 2) ఫ్రాన్సిస్ గాల్టన్
3) గోర్డాన్ 4) డబ్ల్యూ.సి. బాగ్లే

6. ఆత్మభావన అనేది?
1) ఉత్తర బాల్యదశ చివరినాటికి ప్రారంభం అవుతుంది.
2) పూర్వ బాల్యదశ చివరినాటికి ప్రారంభం అవుతుంది.
3) పూర్వ కౌమారదశలో ప్రారంభం అవుతుంది.
4) ఉత్తర కౌమారదశలో ప్రారంభం అవుతుంది.

7. ఎలిజబెత్ హర్లాక్ ప్రకారం మానవ వికాస దశల సంఖ్య?
1) 10 2) 8 3) 12 4) 14

8. ప్రవర్తనకు సంబంధించి కింది వాటిలో విభిన్నమైన దాన్ని గుర్తించండి.
1) గీయడం 2) రాయడం
3) పాడటం 4) ఊహించడం

9. జీవితకాలాన్ని దశలుగా విభజించి, అధ్యయనం చేసే మనో విజ్ఞానశాస్త్రం ఏది?
1) సాంఘిక మనో విజ్ఞానశాస్త్రం
2) సామాన్య మనో విజ్ఞానశాస్త్రం
3) అపసామాన్య మనో విజ్ఞానశాస్త్రం
4) వికాసాత్మక మనో విజ్ఞానశాస్త్రం

10. 'సాంఘిక పాత్రలు నిర్వహించేందుకు సంసిద్ధులుగా ఉండటం' అనేది.......
1) ఉత్తర బాల్యదశలో అధిగమించాల్సిన కృత్యం
2) పూర్వ బాల్యదశలో అధిగమించాల్సిన కృత్యం
3) పూర్వ బాల్యదశ విపత్తు
4) ఉత్తర బాల్యదశ విపత్తు

11. వ్యక్తుల సుఖదుఃఖాలకు, వారి మధ్య వైవిధ్యానికి పరిసరాలు కారకం కాదని, జన్యువుల ప్రభావమే అధికమని తెలిపినవారు?
1) డబ్ల్యూ.సి.బాగ్లే 2) ఫ్రీమన్
3) ఫ్రాన్సిస్ గాల్టన్ 4) ఆల్‌పోర్ట్

12. ప్రతి మానవ వికాస దశలోనూ నిర్వహించాల్సిన కృత్యాలను నిర్దేశించినవారు?
1) డబ్ల్యూ.సి. బాగ్లే 2) హావింగ్ హార్స్ట్
3) ఆల్‌పోర్ట్ 4) ఎలిజబెత్ హర్లాక్

13. కింది వాటిలో మానవ ప్రవర్తన అనేది దేనికి సంబంధించింది?
1) కేవలం అంతర్గతం 2) కేవలం బహిర్గతం
3) 1, 2 4) ఏదీకాదు

14. పాఠశాల వసతులకు, వ్యక్తుల వికాసానికి సహసంబంధ గుణకం ఎక్కువని తెలిపినవారు?
1) డబ్ల్యూ.సి. బాగ్లే 2) ఫ్రీమన్
3) ఆల్‌పోర్ట్ 4) గోడార్డ్

15. పూర్వముఠాదశ, అన్వేషణ, అనుకరణ, సృజనాత్మక వయసులు అనేవి ఏ దశకు సంబంధించినవి?
1) పూర్వబాల్య దశ 2) ఉత్తర బాల్యదశ
3) పూర్వ కౌమారదశ 4) ఉత్తర కౌమారదశ

16. ఎలిజబెత్ హర్లాక్ పేర్కొన్న దశలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
1) జనన పూర్వ, పూర్వ కౌమార, నవజాత శిశువు, వయోజన
2) జనన పూర్వ, నవజాత శిశువు, పూర్వ కౌమార, వయోజన
3) జనన పూర్వ, నవజాత శిశువు, వయోజన, పూర్వ కౌమార
4) నవజాత శిశువు, జనన పూర్వ, పూర్వ కౌమార, వయోజన

17. 15 నుంచి 18 సంవత్సరాల వరకు ఉండే దశ?
1) పూర్వ కౌమార దశ
2) వయోజన దశ 3) ఉత్తర బాల్యదశ
4) ఉత్తర కౌమార దశ


18. శైశవ దశ కాలం?
1) రెండో రోజు నుంచి రెండో సంవత్సరం చివరి వరకు
2) రెండో వారం నుంచి రెండో సంవత్సరం చివరి వరకు
3) రెండో వారం నుంచి రెండు నెలల చివరి వరకు
4) రెండో నెల నుంచి రెండో సంవత్సరం చివరి వరకు

సమాధానాల కోసం క్యూఆర్ స్కాన్ చేయండి

రచయిత: ఉమ్మడి వెంకటరమణ

స్టడీ జోన్

వివిధ దేశాలతో భారత సైన్యం జరిపే ప్రధాన విన్యాసాలు



భారతదేశ త్రివిధ దళాలు వివిధ రకాల విన్యాసాలు చేస్తుంటాయి. ఇవి యుద్ధ క్షేత్రంలో జరగని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సైనిక విన్యాసాలు. స్వదేశీ సాయుధ దళాల బలోపేతానికి, ఇతర దేశాలతో స్నేహ సంబంధాలు మెరుగుపరుచుకునే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తారు. ఇవి వివిధ మిలటరీ వ్యవస్థల సమన్వయానికి కూడా దోహదపడతాయి.


- భారత్ ఇతర దేశాలతో కలిసి నిర్వహించే వాటిని ద్వైపాక్షిక విన్యాసాలు అంటారు. భారత్ సహా వివిధ దేశాలు ఉమ్మడిగా పాల్గొని నిర్వహించేవి బహుపాక్షిక విన్యాసాలు.
- భారతదేశ ద్వైపాక్షిక, బహుపాక్షిక విన్యాసాలు వివిధ దేశాల యుద్ధ తంత్రాలను పరిశీలించడానికి, నూతన సాంకేతికతలను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. ఆయా దేశాలు అనుసరిస్తున్న మెరుగైన యుద్ధ నైపుణ్యాల్లో సాయుధ దళ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు దోహదపడతాయి.
- విపత్తు సమయాల్లో సత్వర ప్రతిస్పందనకు, ఆయా సందర్భాల్లో పౌర సమాజంలో మానవ విలువలు పెంపొందించడానికి కూడా ఇవి తోడ్పడతాయి.

విన్యాసం పేరు	పాల్గొనే దేశాలు	పాల్గొనే దళం
ఎ) సంప్రీతి బి) బోంగోసాగర్	భారత్ - బంగ్లాదేశ్	ఎ) ఆర్మీ బి) నేవీ
నొమాడిక్ ఎలిఫెంట్	భారత్, మంగోలియా	ఆర్మీ
ధర్మ గార్డియన్	భారత్, జపాన్	ఆర్మీ
అజేయ వారియర్	భారత్, బ్రిటన్	ఆర్మీ
ఎ) శక్తి బి) వరుణ	భారత్, ఫ్రాన్స్	ఎ) ఆర్మీ బి) నేవీ
ఎస్ఐఎంబీఈఎక్స్ (సింబెక్స్)	భారత్, సింగపూర్	నేవీ
ఎ) యుద్ధ్ అభ్యాస్, వజ్రప్రహార్ బి) టైగర్ ట్రయంఫ్	భారత్, అమెరికా	ఎ) ఆర్మీ బి) నేవీ
డెసర్ట్ ఈగల్	భారత్, యూఏఈ	ఎయిర్‌ఫోర్స్
సంవేదన	భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏఈ, నేపాల్	ఎయిర్‌ఫోర్స్
మలబార్	ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా, భారత్	నేవీ

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

కార్బన్ కలిగిన సమ్మేళనాల నిర్మాణం, లక్షణాలు, కూర్పు, ప్రతిచర్యలు, తయారీని అధ్యయనం చేయడాన్ని కర్బన రసాయనశాస్త్రం అంటారు. అనేక సేంద్రియ సమ్మేళనాలు హైడ్రోజన్, కార్బన్‌ను కలిగి ఉంటాయి.

కర్బన రసాయనశాస్త్రం



అసంతృప్త కర్బన సమ్మేళనాలు

కార్బన్ పరమాణువుల మధ్య కనీసం ఒక ద్విబంధం లేదా త్రికబంధం కలిగిన హైడ్రోకార్బన్‌లను అసంతృప్త హైడ్రోకార్బన్‌లు (Unsaturated Hydrocarbons) అంటారు.

- అసంతృప్త హైడ్రోకార్బన్‌లు రెండు రకాలు. అవి: 1. ఆల్కీన్‌లు 2. ఆల్కైన్‌లు

ఆల్కీన్‌లు (Alkenes)

కార్బన్ పరమాణువుల మధ్య కనీసం ఒక ద్విబంధం (C = C) ఉండే అసంతృప్త కర్బన సమ్మేళనాలను ఆల్కీన్‌లు అంటారు.

సాధారణ అణుఫార్ములా: C_nH_{2n} $(n \geq 2)$

ఆల్కైన్‌లు (Alkynes)

కార్బన్ పరమాణువుల మధ్య కనీసం ఒక త్రికబంధం (C ≡ C) ఉండే హైడ్రోకార్బన్‌లను ఆల్కైన్‌లు అంటారు.

ఆల్కైన్‌ల సాధారణ అణు ఫార్ములా: C_nH_{2n-2} $(n \geq 2)$

కర్బన సమ్మేళనాల పూర్తి వివరాలు; ఆల్కీన్‌లు - ఆల్కైన్‌లకు సంబంధించిన ఉదాహరణలు, అణుఫార్ములాలు, వివిధ సమ్మేళనాల్లో కార్బన్ పరమాణువులు ఒకదానితో మరొకటి ఏర్పర్చే వలయాలు, శృంఖల సామర్థ్యం, సాదృశ్యం మొదలైన అంశాలు, మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సౌదీ అరేబియాలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలు

ఈనాడు, అమరావతి: సౌదీ అరేబియాలోని తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఆ దేశంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణను సత్కరించారు. ఎన్టీఆర్ అనే పేరు మూడక్షరాల శక్తి అని సినీ నటి ప్రభ అన్నారు. ఆయన చరిత్ర భావితరాలకు అందజేయడానికి అసెంబ్లీలో ఎన్టీఆర్ చేసిన ప్రసంగాలు, నట జీవితంలో ఇచ్చిన ఇంటర్వ్యూలను పుస్తక రూపంలో తీసుకువచ్చినట్లు మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

108 ఈఎంటీలకు ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం

ఈనాడు, అమరావతి: 108 అంబులెన్సుల ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ)లకు భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది. 2021 మే 8న జారీ చేసిన జీవో 211లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా ఈఎంటీలకు అవకాశాన్ని కల్పిస్తూ శుక్రవారం జీవో 276 జారీ చేసింది.

రెండు నెలలుగా జీతాలకు నోచుకోని 'ఉపాధి' సిబ్బంది

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో జాప్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు గత రెండు నెలలుగా జీతాలకు నోచుకోలేదు. మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన జీతాల చెల్లింపులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. అరకొర వేతనాలతో జీవనం సాగించడం కష్టమవుతున్న కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఉపాధి పథకంలో దాదాపు 20 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్నారు. వీరికి కేంద్రం కేటాయించే 5 శాతం పరిపాలన నిధుల్లో నుంచి (అడ్మిన్ కాస్ట్) ప్రతినెలా జీతాలు చెల్లిస్తుంటారు. ఇందుకోసం నెలకు దాదాపు రూ.40 కోట్లు అవసరం. నిధులు విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో మురళీనాయక్‌కు నివాళి

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో దేశ రక్షణలో అమరుడైన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వర్ల రామయ్య, దారునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ ఆపకపోతే పేల్చేస్తాం

శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

ఈనాడు- హైదరాబాద్, శంషాబాద్-న్యూస్‌టుడే: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ శంషాబాద్ విమానాశ్రయానికి గుర్తు తెలియని ఆగంతకుల నుంచి వచ్చిన బాంబు బెదిరింపు హెచ్చరిక కలకలం రేపింది. ఆపరేషన్ సిందూర్ ఆపకపోతే విమానాశ్రయాన్ని బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం విమానాశ్రయ అధికారిక ఈ-మెయిల్‌కు ఈ సందేశం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఈ-మెయిల్ ఉద్దేశపూర్వకంగా పంపారా? లేక నకిలీదా అని ఆరా తీస్తున్నారు. దేశంలోని ఇతర విమానాశ్రయాలకు ఇదే తరహాలో ఆగంతకులు మెయిల్స్ పంపినట్లు గుర్తించారు. ఈ ఘటనపై విమానాశ్రయ అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టు పరిసరాల్లో హై అలర్ట్

దేశ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులు.. ఆగంతకుల నుంచి బెదిరింపుల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో భద్రతాధికారులు శుక్రవారం హై అలర్ట్ ప్రకటించారు. విమానాశ్రయ భద్రత పూర్తిగా సీఐఎస్ఎఫ్ పర్యవేక్షిస్తోంది. అదనంగా ఆక్టోపస్ బృందాలను రంగంలోకి దింపారు. జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులు తమ విమానం బయలుదేరే నిర్ణీత సమయానికి 3 గంటల ముందే విమానాశ్రయంలో విధిగా రిపోర్ట్ చేయాలని ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రకటించాయి. భద్రతా కారణాల దృష్ట్యా విమానాల రాకపోకలు ఆలస్యం కావొచ్చని ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నాయి.

తగ్గిన విమాన సర్వీసులు

శంషాబాద్‌కు ప్రతిరోజూ విమాన సర్వీసుల రాకపోకలు 595 ఉండగా.. ప్రయాణికుల నిష్క్రమణ, ఆగమనాల సంఖ్య లక్షకు చేరువలో ఉండేది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలతో ఉత్తర భారతదేశంలోని విమానాశ్రయాలను కేంద్ర ప్రభుత్వం మూసివేయడంతో ఆ ప్రభావం శంషాబాద్ విమానాశ్రయంపై కనిపించింది. బుధవారం అర్ధరాత్రి 12 నుంచి గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకూ శంషాబాద్‌కు రాకపోకలు సాగించిన జాతీయ, అంతర్జాతీయ విమానాల సంఖ్య 509గా నమోదైంది. వీటిలో 62,557 మంది ప్రయాణించినట్లు విమానాశ్రయం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

13న అండమాన్‌లోకి నైరుతి ఆగమనం: ఐఎండీ

ఈనాడు, హైదరాబాద్: భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందజేసింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు అంచనాల కన్నా ముందుగానే తెలంగాణలోకి ప్రవేశించనున్నాయి. శుక్రవారం ఐఎండీ విడుదల చేసిన బులిటెన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడయ్యాయి. ఈ నెల 13న అండమాన్ ప్రాంతంలోకి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. దీంతో ఈసారి మే నెలాఖరు కల్లా తెలంగాణను తాకుతాయని అంచనాలు ఉన్నాయి. గతేడాది మే 31న అండమాన్‌లోకి రాగా.. జూన్ రెండో వారంలో తెలంగాణలో విస్తరించాయి. నైరుతికి సంబంధించిన మరింత సమాచారాన్ని వచ్చే వారం విడుదల చేయనున్నట్లు ఐఎండీ పేర్కొంది.

అందాల ప్రపంచం అరుదెంచు తరుణం

- నేడు హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల ప్రారంభం
- ఈ నెల 31 వరకు రాష్ట్రంలో సుందరీమణుల సందడి



శంషాబాద్ విమానాశ్రయంలో 2024 మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా(చెక్ రిపబ్లిక్)

ఈనాడు, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాల మేళవింపుతో జరగనున్న 72వ ప్రపంచ సుందరి వేడుకలకు 110కి పైగా దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటున్నారు. ఈ నెల 31 వరకు జరగనున్న పోటీలకు హైదరాబాద్‌లోని వేదికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 2024 ప్రపంచ సుందరి చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిజ్కోవాతోపాటు మిస్ మాంటి నీగ్రో ఆండ్రియో నికోలిక్, మిస్ అల్బేనియా ఎలోనా డ్రికాజ్ శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో వారికి సంప్రదాయ విధానంలో స్వాగతం పలికారు.

150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం

ప్రారంభ వేడుకలకు వేదికైన గచ్చిబౌలి స్టేడియాన్ని అలంకరించారు. హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తున్న మిస్‌వరల్డ్ పోటీలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. తెలంగాణకు చెందిన జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాదీ కళారూపాలను సమ్మిళితం చేసి రాష్ట్ర ఖ్యాతి, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేలా ప్రణాళిక రచించారు. పోటీల ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం కూడా గచ్చిబౌలి స్టేడియంలో కొన్ని దేశాలకు చెందిన సుందరీమణులు రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. సాంస్కృతిక బృందాలు రిహార్సల్స్‌ను నిర్వహించాయి. శనివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రపంచ సుందరి పోటీల ఛైర్‌పర్సన్ జూలియా మోర్లే, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా సహా పలువురు పాల్గొననున్నారు. ప్రారంభ కార్యక్రమాల అనంతరం ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణులను ఖండాల వారీగా పరిచయం చేస్తారు. ఈ వేడుకలు 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమాలు ఇలా..

- సాయంత్రం 6.30గంటలకు ప్రారంభం
- 50 మందితో తెలంగాణ రాష్ట్రగీతం ఆలాపన: 2.50 నిమిషాలు
- 250 మందితో పేరిణి నృత్యం: 9.10 నిమిషాలు
- కొమ్ముకోయ నృత్యం: 2.10నిమిషాలు
- గుస్సాడి నృత్యం: 3.05 నిమిషాలు
- లంబాడి నృత్యం: 3.10 నిమిషాలు
- ఒగ్గుడోలు: 4.00 నిమిషాలు
- మిస్‌వరల్డ్ గీతం ఆలాపన: 3.30 నిమిషాలు
- రాత్రి 8.30 గంటలకు ముగింపు

ప్రభుత్వ ఆర్భాటం లేకుండా పోటీలు



మిస్ అల్బేనియా ఎలోనాకు సంప్రదాయ స్వాగతం

దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని కోణాల్లో చర్చించింది. ప్రభుత్వ పరంగా ఎక్కువ ఆర్భాటం చేయకూడదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. వివిధ దేశాల నుంచి పోటీదారులు ఇప్పటికే వచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొద్దిగంటల సమయమే ఉంది. ప్రభుత్వవర్గాలు, ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవానికి పరిమితమై మిగతా కార్యక్రమాలు మిస్‌వరల్డ్ నిర్వాహకులు ప్రైవేటు కార్యక్రమంలా నిర్వహించుకునేలా చూడాలన్న నిర్ణయానికి సర్కారు వచ్చినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈనెల 13న చౌమహల్లా ప్యాలెస్‌ను సందర్శించనున్న మిస్‌వరల్డ్ పోటీదారులకు ఇచ్చే డిన్నర్‌ను రద్దు చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే కార్యక్రమాల కుదింపు, అవుట్‌డోర్ పర్యటనల తగ్గింపు వంటివి ఉంటాయని ప్రభుత్వవర్గాల సమాచారం. అనూహ్య పరిణామాలు జరిగితే మాత్రం పోటీల రద్దుపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

ఐపీఎస్ అధికారి జాషువాకు హైకోర్టులో ఊరట

- నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి
- ఏసీబీ అధికారులకు కోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించి లంచం వసూలు చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పి.జాషువాకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఏసీబీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని, కేసుకు సంబంధించిన వివరాలను బహిరంగంగా మాట్లాడవద్దని, నివాస వివరాలను అఫిడవిట్ రూపంలో దర్యాప్తు అధికారికి అందజేయాలని జాషువాకు షరతులు విధించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు.

● వైకాపా ప్రభుత్వ హయాంలో విజిలెన్స్ తనిఖీల పేరుతో తమను బెదిరించి రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారంటూ పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ మేనేజింగ్ భాగస్వామి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీమంత్రి విడదల రజిని తదితరులపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో రెండో నిందితుడు జాషువా ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ వేశారు.

గోపి విచారణలో కొత్త విషయాలు వెలుగులోకి: పీపీ లక్ష్మీనారాయణ

పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ పిటిషనర్ రూ.10 లక్షలు తీసుకున్నారనే అభియోగాలు ఉన్నాయన్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న విడదల గోపిని పోలీసులు అరెస్ట్ చేశారని, విచారణలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్నవేనన్నారు. ఇదే కేసులో ఇద్దరు నిందితుల విషయంలో నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఇటీవల ఉత్తర్వులు ఇచ్చామని గుర్తుచేశారు. జాషువా విషయంలోనూ అదే ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టంచేశారు.

● మరోవైపు ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న విడదల గోపి బెయిలు కోసం హైకోర్టులో వేసిన పిటిషన్ను ఉపసంహరించుకున్నారు. బెయిలు కోసం కింది కోర్టును ఆశ్రయించనున్నామని, అందువల్ల హైకోర్టులో వేసి బెయిలు పిటిషన్ను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని గోపి తరఫు న్యాయవాది కోరారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు రేపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం ఫలితాలు ఈనెల 11వ తేదీన విడుదల కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఫలితాలను విడుదల చేయనున్నారని కన్వీనర్ ఆచార్య బి.డీన్‌కుమార్, కో కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూహెచ్‌లో శుక్రవారం సెట్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ఆచార్య టి.కిషన్‌కుమార్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి అధికారులు హాజరయ్యారు. ఫలితాల విడుదలకు తాము సిద్ధంగా ఉన్నామని ఎప్‌సెట్ అధికారులు స్పష్టం చేయడంతో... బాలకిష్టారెడ్డి సీఎం కార్యాలయ అధికారులతో సంప్రదించారు. వెంటనే ఫలితాల విడుదలకు విద్యాశాఖ మంత్రిగా సీఎం పచ్చజెండా ఊపారు. దాంతో పరీక్షలు ముగిసిన వారంలోపే ఫలితాలు విడుదల చేస్తున్నట్లయ్యింది.

ఏప్రిల్ 29, 30 తేదీల్లో మూడు విడతల్లో జరిగిన ఎప్‌సెట్ అగ్రికల్చర్ విభాగానికి 81,198 మంది, మే 2, 3, 4 తేదీల్లో ఆరు విడతల్లో నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగానికి 2,07,190 మంది హాజరయ్యారు.

● ఫలితాలను https://eapcet.tgche.ac.in/, www.eenadu.net, www.eenadupratibha.net వెబ్‌సైట్ల ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు.

భూభౌతిక పరీక్షల తరువాతే ముందుకు..

- 'ఎస్సెల్బీసీ సొరంగం'పై ఉప కమిటీ నిర్ణయం
- డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో తవ్వకం అనుకూలం
- సహాయక చర్యలపై నిపుణుల కీలక సూచనలు

ఈనాడు, హైదరాబాద్: భూభౌతిక పరీక్షల ఫలితాలు వచ్చిన తరువాతే శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్సెల్బీసీ) సొరంగం నిర్మాణం విషయంలో ముందుకెళ్లాలని నిపుణుల ఉప కమిటీ సూచించింది. ఎస్సెల్బీసీపై రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో జాతీయ సంస్థలతో నిపుణుల కమిటీని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ భూ భౌతిక స్ట్రాటా, ఇతర అంశాలపై అధ్యయనానికి ఉప కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఓ సారి సమావేశమైన ఉపకమిటీ తాజాగా శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కన్వీనర్, నల్గొండ సీఈ అజయ్‌కుమార్ అధ్యక్షతన మరోసారి భేటీ అయింది. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్సీ అనిల్‌కుమార్, రాక్ మెకానిక్ నిపుణుడు నైతాని, సొరంగాల తవ్వకాల్లో నిపుణుడు మోరె రాములు, జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్ఐ) తదితర సంస్థల ప్రతినిధులు ప్రత్యక్షంగా, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ నుంచి కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. సొరంగం తవ్వకానికి ప్రత్యామ్నాయ మార్గాలు, సవాళ్లపై ఈ సందర్భంగా వారు చర్చించారు. 'నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్సెల్బీసీ సొరంగం ప్రవేశ మార్గంలో చోటుచేసుకున్న ప్రమాదంలో టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) బురద మట్టిలో కూరుకుపోయింది. సహాయక చర్యల సందర్భంగా ఈ యంత్రాన్ని ముక్కలుగా కత్తిరించి తొలగించిన దృష్ట్యా.. తిరిగి టీబీఎంతో తవ్వకాలు జరపడం అసాధ్యం. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతి (డీబీఎం) మాత్రమే తవ్వకాలకు అనుకూలం. అయితే, భూ ఉపరితలం నుంచి షాఫ్ట్ (ప్రత్యేక మార్గం) నిర్మాణానికి పర్యావరణ అనుమతులు రావడం క్లిష్టమైన విషయం. దీనికి బదులుగా సొరంగం మార్గంలోని నిర్మాణ వ్యర్థాలను వెనక్కి తరలించడానికి నిర్మాణ సంస్థ సానుకూలంగా ఉంది. డీబీఎం విధానంలో సొరంగాన్ని తవ్వడానికి 30 మీటర్లు ఎత్తు, 20 మీటర్ల పొడవుతో భూమి పొరల సమగ్ర డాటా అవసరం. ఎన్జీఆర్ఐ దీనిపై పరిశోధన చేసి ఆ సమాచారం అందించాలి. రెండు నెలల్లో ఈ సమాచారం అందగానే పనులు ఎలా మొదలుపెట్టాలన్న అంశంపై చర్చించి ప్రభుత్వానికి నివేదించుదాం' అని సమావేశంలో చర్చించినట్లు సమాచారం.



సొరంగం చివరి భాగంలో మట్టి, బురద కింద కూరుకుపోయిన ఆరుగురి ఆనవాళ్ల వెలికితీతకు సంబంధించిన ప్రణాళికపైనా చర్చించారు. రాక్ మెకానిక్ నిపుణుడు నైతాని బురద, మట్టి తొలగింపుపై కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. ఒకేసారి మట్టిని తొలగిస్తే మళ్లీ ప్రమాదం చోటుచేసుకునే అవకాశాలున్నాయని, దానికి బదులు సొరంగంలో ఒకవైపు కొంత, మధ్యలో మరికొంత తవ్వుతూ ముందుకెళ్లాలని నైతాని సూచించినట్లు సమాచారం.

మట్టి గూళ్ల గేటెడ్ కాలనీ!

స్వాలో పక్షుల అద్భుత పనితనం



ఇక్కడ పక్షులన్నీ కలిసి ఓ కాలనీ ఏర్పాటు చేసుకున్నట్లు ఉంది కదూ. నిజమే అవి కాలనీ లాంటి మట్టి గూళ్లే. స్వాలో అనే పక్షులు ఆకులు, గడ్డి పరకలతో కాకుండా.. మట్టితో గూళ్లను కట్టుకుంటాయి. చెరువులు, నదులు, కుంటల నుంచి మట్టిని తీసుకెళ్లి ఇలా నిర్మించుకుంటాయి. "మట్టితో గూళ్లను నిర్మించుకునే ఏకైక పక్షి స్వాలో. ఇవి పంటలకు కీడు చేసే కీటకాలను ఆహారంగా తీసుకొని రైతులకు మేలు చేస్తాయి" అని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల (మహబూబ్‌నగర్) జంతుశాస్త్ర అధ్యాపకుడు డా.బి.రవీందర్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని లాండస్సాంగి వాగులో వంతెన కింద స్వాలో పక్షులు మట్టి గూళ్ల కాలనీ సృష్టిస్తుండగా 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

– ఈనాడు, ఆదిలాబాద్

పిల్లవాడిని రక్షించే యత్నంలో మహిళ మృతి

కోడేరు, న్యూస్‌టుడే: వ్యవసాయ బావిలో బాలుడికి ఈత నేర్పేందుకు వెళ్లిన మహిళ.. అతడు నీట మునుగుతుండటాన్ని గమనించి ఒడ్డుకు తోసింది. కానీ ఆమె బయటకు రాలేక మృతిచెందింది. ఈ విషాద ఘటన తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో చోటు చేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన దానమ్మ తన తొమ్మిదేళ్ల కుమారుడు భానుప్రకాశ్‌కు ఈత నేర్పించేందుకు గురువారం గ్రామ శివారులోని కుమ్మరోని బావి వద్దకు తీసుకెళ్లారు. ఆమెకు ఈత రాకపోవడంతో తన వెంటరమ్మని పరిచయస్థురాలైన పల్లె చంద్రమ్మ (35)ను పిలవడంతో వెళ్లారు. దానమ్మ భానుప్రకాశ్‌కు రెండు ప్లాస్టిక్ నీటి డబ్బాలు కట్టి బావిలోకి దింపారు. డబ్బాలకు కట్టిన తాడు ఊడిపోయి బాలుడు నీటిలో మునిగిపోతుండగా కాపాడాలని దానమ్మ కేకలు వేశారు. అక్కడే ఉన్న చంద్రమ్మ వెంటనే బావిలోకి దూకి బాలుడిని ఒడ్డుపైకి నెట్టడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. తరువాత చంద్రమ్మ బయటకు వచ్చే క్రమంలో ఆమె చీర కాళ్లకు, నీళ్ల డబ్బా తాడు చేతికి చుట్టుకొని నీట మునిగిపోయారు. గ్రామస్థులు చేరుకొని గాలించగా మృతదేహం బయటపడింది. చంద్రమ్మకు భర్త, కుమార్తె ఉన్నారు.

విజయవాడ హైవేపై

శాటిలైట్‌తో టోల్ వసూలు!

- ఫాస్టాగ్ లేకున్నా.. కొత్త విధానంలో చెల్లింపులు



పంతంగి టోల్‌ప్లాజా

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: టోల్ రుసుము చెల్లింపు ఒకప్పుడు నగదుతోనే జరిగేది. ఆ తర్వాత 2019 డిసెంబరు 15న కేంద్ర ప్రభుత్వం ఫాస్టాగ్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. తాజాగా ప్రయాణికులకు ఆ ఇబ్బంది కూడా లేకుండా, ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా, మరింత సులభంగా టోల్ వసూలయ్యేలా శాటిలైట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై..తెలంగాణలో పంతంగి(చౌటుప్పల్), కొర్లపహాడ్(కేతేపల్లి), ఏపీలో చిల్లకల్లు(నందిగామ) టోల్ ప్లాజాల వద్ద ప్రస్తుతం శాటిలైట్ ద్వారా టోల్ వసూలు జరుగుతోంది. వాహనం ఆగనవసరం లేకుండానే శాటిలైట్ విధానం ద్వారా టోల్ దానికదే వసూలవుతోంది. దీంతో తమ వాహనాలకు ఫాస్టాగ్ లేకున్నా టోల్ చెల్లింపు ఎలా జరిగిందా! అని వాహనదారులు ఆశ్చర్యపోతున్నారు.

● జాతీయ రహదారులపై వాహనదారులు ప్రయాణించిన దూరం మేరకే టోల్ వసూలు చేసేలా జీపీఎస్ ఆధారిత వ్యవస్థను తీసుకొస్తామని గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ విధానం అమలుకు కేంద్ర ప్రభుత్వం దిల్లీలో ట్రయల్ రన్ చేపట్టే యోచనలో ఉంది. త్వరలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కూడా ఈ ట్రయల్‌రన్ చేపట్టనున్నారని ఎన్‌హెచ్ఏఐకి చెందిన ఓ అధికారి 'న్యూస్‌టుడే'కు వివరించారు.

జగన్ జడ్ ప్లస్ భద్రత వ్యాజ్యంలో

కౌంటర్ వేయండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- వేసవి సెలవుల తర్వాత విచారణ

ఈనాడు, అమరావతి: సీఆర్‌పీఎఫ్ లేదా ఎన్ఎస్‌జీతో తనకు జడ్ ప్లస్ క్యాటగిరీ భద్రత కల్పించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దాఖలు చేసిన వ్యాజ్యంలో కౌంటర్ వేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్, సీఆర్‌పీఎఫ్ డీజీ, సీఆర్‌పీఎఫ్ డీజీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ) డీజీ, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. వేసవి సెలవుల తర్వాత విచారణ చేపడతామని పేర్కొంటూ వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు.

● శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు తగినంత భద్రత కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్రప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు స్పందిస్తూ.. పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు కొంత సమయం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. భద్రత విషయంలో పిటిషనర్ గతంలో వ్యాజ్యం వేశారన్నారు. అందులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా పేర్కొన్నారని తెలిపారు. ఆ వ్యాజ్యంపై విచారణ పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఇరువైపు వాదనలూ విన్న న్యాయమూర్తి కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ ప్రతివాదులకు నోటీసులిచ్చారు.

యాదగిరీశుడి జయంత్యుత్సవాలు ఆరంభం



తిరు వేంకటపతి అవతారంలో స్వామివారు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో నరసింహస్వామి వార్షిక జయంతి మహోత్సవాలు శుక్రవారం ఆరంభమయ్యాయి. ఉదయం స్వస్తివాచనం, సాయంత్రం అంకురార్పణతో పూజారులు, యాజ్ఞికులు ఉత్సవాల క్రతువును ప్రారంభించారు. అనంతరం లక్ష కుంకుమార్చన జరిపారు. స్వామివారు శ్రీవేంకటేశ్వరస్వామి రూపంలో ఉదయం గరుడ వాహనంపై, రాత్రి పరవాసుదేవుడిగా తీర్థజనులకు దర్శనమిచ్చారు. హవనం పర్వాలను ప్రత్యేక యాగశాలల్లో నిర్వహించారు. ఉత్సవ తొలి పూజల్లో ఆలయ ఈవో వెంకట్రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.

గైనకాలజీ విభాగంలో వెయ్యి రోబోటిక్ సర్జరీలు


దేశంలోనే తొలి మహిళా సర్జన్‌గా అపోలో వైద్యురాలికి గుర్తింపు



సర్జరీల గురించి వివరిస్తున్న అపోలో జేఎండీ సంగీతారెడ్డి. పక్కన డాక్టర్ రుమా సిన్హా

ఈనాడు, హైదరాబాద్: గైనకాలజీ విభాగంలో వెయ్యి రోబోటిక్ సర్జరీలు పూర్తిచేసిన అపోలోకు చెందిన గైనకాలజీ, రోబోటిక్ వైద్యురాలు డాక్టర్ రుమా సిన్హా రికార్డు సృష్టించారు. దేశంలో ఓ వైద్యురాలు వెయ్యి రోబోటిక్ సర్జరీలు చేయడం ఇదే తొలిసారని అపోలో జేఎండీ సంగీతారెడ్డి తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో డాక్టర్ రుమాసిన్హాను ఆమె అభినందించారు. మహిళల్లో సాధారణంగా కనిపించే సంక్లిష్టమైన ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్ సమస్యలకు రోబోటిక్స్ చికిత్సలు అందిస్తూ డాక్టర్ రుమాసిన్హా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం గొప్ప విషయమన్నారు. డాక్టర్ రుమాసిన్హా మాట్లాడుతూ మహిళా జనాభాలో 20-30 శాతం మంది ఫైబ్రాయిడ్లతో, మరో 10 శాతం మంది ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతున్నారని, పర్యవసానంగా చాలామంది మహిళలు సంతాన యోగ్యతకు దూరమవుతున్నారని వివరించారు.

లంచం డబ్బును టీషర్ట్‌లో చుట్టి బయట పడేశాడు!



అమరేందర్‌రెడ్డి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: అనిశా అధికారులు వస్తారని ముందు జాగ్రత్తగా తన కుమారుని టీషర్ట్‌లో లంచం డబ్బులను చుట్టి బయటపడేసి ఏమి తెలియనట్లు నటించాడు రాజన్న సిరిసిల్ల నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. అయినా అతడి పన్నాగం ఫలించలేదు. తెలంగాణలోని కరీంనగర్ రేంజ్ అనిశా డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండకు చెందిన ఓ గుత్తేదారు రెండేళ్ల కింద సిరిసిల్ల జిల్లాలోని అవునూరు, అగ్రహారం గ్రామాల మధ్య చెక్‌డ్యాం నిర్మాణానికి మొత్తం రూ.8 కోట్లకుగాను పని చేపట్టేందుకు అనుమతి తీసుకొని పూర్తి చేశారు. ఏడాది కింద మొదటి విడతగా రూ.5 కోట్ల బిల్లు చెల్లింపు కోసం గుత్తేదారు సిరిసిల్ల నీటిపారుదల శాఖ డివిజన్-7 ఈఈగా పని చేస్తున్న అమరేందర్‌రెడ్డికి దరఖాస్తు చేసుకొని బిల్లులు సమర్పించారు. ఆ బిల్లు చెల్లింపు సందర్భంగా అమరేందర్ రూ.4 లక్షలు లంచం తీసుకున్నాడు. మరో రూ.50 లక్షల బిల్లు గుత్తేదారుకి రావాల్సి ఉంది. వారం కింద రూ.లక్ష లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని చెప్పగా.. చివరకు రూ.75 వేలు ఇవ్వాలన్నాడు. శుక్రవారం రాత్రి కరీంనగర్ విద్యారణ్యపురిలోని తన నివాసంలో గుత్తేదారు నుంచి రూ.60 వేల లంచం తీసుకున్నాడు. అనిశా అధికారులు తనను పట్టుకుంటారనే సమాచారంతో అమరేందర్ ఆ డబ్బును తన కుమారుడి టీషర్ట్‌లో చుట్టి ఇంటి వెనుక వైపు బహిరంగ ప్రదేశంలో పడేశాడు. అనిశా అధికారులు వచ్చి అతణ్ని అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. శనివారం కరీంనగర్ అనిశా కోర్టులో అమరేందర్‌రెడ్డిని హాజరుపరుస్తామని డీఎస్పీ రమణామూర్తి తెలిపారు.